శ్రీ

ఆంధ్రమహాభారతము

(సభాపర్వము)

సంపాదకులు :

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

ప్రచురణ :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్ – సైఫాబాద్ – హైదరాబాదు-4.

తొలి పలుకు

ఆంధ్రప్రదేశ్ మాజీ-మంత్రి-వర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి తెలుగు భాషలోని ప్రాచీన సాహిత్యము అందరికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటింపవలె నని నిశ్చయించినది. తెలుగు భాషలోని పూర్వ గ్రంథ సముదాయము ఈ నాడు పాఠకునకు సక్రమముగా సరసమైన ధరకు లభ్యమగుట లేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయమును విడివిడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమి ఒక ప్రణాళికను సిద్ధము చేసినది. ఈ ప్రణాళిక ప్రకారము యీ కార్యక్రమము మూడు తరగతులుగా విభజించనైనది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన ; రెండవది మహాభారతము ప్రచురణ ; మూడవది హరివంశము, భాస్కర రామాయణము, బసవపురాణము, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట. పై ప్రణాళిక ప్రకారము ప్రచురింపబడు ప్రతి గ్రంథములో గ్రంథ కర్తనుగూర్చి, గ్రంథప్రాశస్త్యమునుగూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలెనని నిశ్చయించనైనది.

ఈ కార్యక్రమములో ప్రాచీన ప్రబంధాల ప్రకటనము పూర్తియైనది. సంక్షిప్త గ్రంథ ప్రచురణ కార్యక్రమములో బసవపురాణ, భాస్కర రామాయణ, హరివంశ, భోజరాజీయములు ప్రచురింపబడినవి. ప్రస్తుతము ఆంధ్రమహాభారత ప్రకటనము చేపట్టనైనది. ప్రసిద్ధులైన విద్వాంసులచే మహాభారత సంపుటముల పరిష్కారము నిర్వహింపబడుచున్నది.

ఆంధ్రమహాభారత సంపుటములలో రెండవదైన సభా పర్వమును పరిష్కరించి, పీఠిక వెలయించి మా కందజేసిన డా. దివాకర్ల వేంకటావధానిగారికి అకాడమి పక్షాన కృతజ్ఞతలు.

పైన పేర్కొనబడిన గ్రంథసంపుటాల వ్రాతప్రతులను సిద్ధముచేసి ముద్రించుటకు అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమీకి యిచ్చుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి అందులో చాలమట్టుకు డబ్బును విడుదలకూడ చేసినవి. అందుకు అకాడమి పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. సాధ్యమైనంత త్వరలో మహాభారత సంపుటముల నన్నింటిని సిద్ధముచేసి, ఆంధ్ర పాఠకలోకానికి అందజేయుట జరుగగలదని విశ్వసించుచున్నాను.

హైదరాబాదు,
24-12-1970.

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి.

ఉపోద్ఘాతము

కృష్ణద్వైపాయన వ్యాసుఁడు సంస్కృతమున రచించిన మహాభారతమును గవిత్రయమువా రాంధ్రీకరించి యుండిరి. వారిలో మొదటివాఁడు నన్నయభట్టారకుఁడు. ఇతఁడు క్రీ. శ. 1022 నుండి 1061 వఱకును రాజమహేంద్రవరము ముఖ్యపట్టణముగా వేంగీదేశమును బాలించినవాఁడును, పూర్వచాళుక్యవంశ చూడామణియునైన రాజరాజనరేంద్రున కనురక్తుఁడును కులబ్రాహ్మణుఁడునై యాతనియాస్థానమునందుండిన మహాకవి. తనకు మిత్రుఁడును బ్రభువునైన యారాజు ప్రేరణచే నతఁడు మహాభారతమును 'దెనుఁగున రచియించుట' కారంభించి, యందు మూఁడవదియైన అరణ్యపర్వమున మూఁడాశ్వాసములపై నూటనలువది రెండుపద్యములు రచించి దివంగతుఁడయ్యెను. తరువాత క్రీ. శ. 13వ శతాబ్దిలో నెల్లూరు రాజ్యమును బాలించిన మనుమసిద్ధికి మంత్రియు నాస్థానకవియునైన తిక్కనసోమయాజి నాల్గవదియైన విరాటపర్వ మాదిగాఁ బదునైదు పర్వములను రచించెను. పిమ్మట క్రీ.శ.14వ శతాబ్దిలో శంభుదాస బిరుదాంకితుఁడైన ఎఱ్ఱాప్రెగ్గడ నన్నయ వ్రాయఁగా మిగిలిన అరణ్యపర్వశేషమును బూరించెను. ఈ విధముగాఁ దెనుఁగునఁ బంచమవేదమైన మహాభారతము నాంధ్రీకరించిన యీ మూగురు కవులును గవిత్రయ మనుపేరఁ బ్రశస్తిగాంచి యనంతర కవులెల్లరికి నొజ్జబంతులై యుల్లసిల్లిరి.

వ్యాసమహర్షి భారతమును శతపర్వ సమన్వితముగా రచించి తరువాత నావందపర్వములను పదునెన్మిది పర్వములుగా సంగ్రహించినట్లు "తతోఽష్టాదశభిః పర్వైః సంగృహీతం మహర్షిణా" అను శ్లోక భాగమువలనఁ దెలియుచున్నది. కాని పర్వ సంగ్రహపర్వము నందలి

"ఏతత్పర్వశతం పూర్ణం వ్యాసేనోక్తం మహాత్మనా
యథావత్సూతపుత్త్రేణ లోమహర్షణినా పునః
కథితం నైమిశారణ్యే పర్వాణ్యష్టాదశైవ చ" 1–2–70

అను శ్లోకమువలన నష్టాదశ పర్వవిభజనమును సౌతి కావించెనేమో యని

యూహించుట కవకాశము కలుగుచున్నది. కొన్ని దాక్షిణాత్య ప్రతులలో సంస్కృత భారతము పదునెన్మిది ప్రధాన పర్వములుగాఁ గాక యిరువది నాలుగు ప్రధాన పర్వములుగా విభజింపఁబడినట్లు కనవచ్చుచున్నది. ఒక్క ఆదిపర్వమే యందు ఆది, ఆస్తీక, సంభవ పర్వములను మూఁడు పర్వములుగా విభక్తమైయున్నది. నన్నయభట్టు పర్వానుక్రమణికా పర్వసంగ్రహములందు వంద యుపపర్వములను బదునెన్మిది ప్రధాన పర్వములను బేర్కొని యుండెను. ఆంధ్రభారతమున నష్టాదశ ప్రధానపర్వ విభజనమే కనవచ్చు చున్నది. ఆ అష్టాదశ పర్వములలో రెండవది సభాపర్వము. పర్వసంగ్రహమున నన్నయభట్టు దాని నిట్లు వర్ణించియుండెను.

"మఱియు ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ, గింకర దర్శనంబును, నారదువలన లోకపాల సభాశ్రవణంబును, రాజసూయ మహాధ్వరారంభంబును, జరాసంధవధయును, గిరివ్రజ నిరుద్ధులైన రాజులఁ గృష్ణుండు విడిపించుటయును, దిగ్విజయంబును, రాజసూయంబు, నర్ఘ్యాభిహరణంబును, శిశుపాల వధయును, రాజసూయ విభూతికి దుఃఖితుండై సభాస్ఖలితుండై యున్న దుర్యోధనుం జూచి ద్రౌపదీ భీమసేనులు నగుటయును, దత్కారణంబున జూదంబాడుటయు, నందు శకుని కైతవంబున ధర్మరాజపరాజయంబును, ద్యూతదుఃఖార్ణవ మగ్నులైన పాండవులం బాంచాలి యుద్ధరించుటయును, బునర్ద్యూత పరాజితులై పాండవులు వనవాసగతు లగుటయు నను వృత్తాంతంబుల నొప్పి నాలుగువేలున్ మున్నూటపదునొకండు శ్లోకంబులు గలిగి

"పర్విసభా ప్రభృతిగ నవ, పర్వములను విస్తరిల్లి పండితచేతో
నిర్వృతిఁ జేయుచు రెండవ, పర్వము నారమ్యమగు సభాపర్వమిలన్"

1. సభాపర్వము, 2 మంత్రపర్వము, 3. జరాసంధవధ పర్వము, 4. దిగ్విజయ పర్వము, 5. రాజసూయ పర్వము, 6 అర్ఘ్యాభిహరణ పర్వము, 7. శిశుపాల వధపర్వము, 8. ద్యూతపర్వము, 9. అనుద్యూత పర్వము అను తొమ్మిదియు నిందలి ఉపపర్వములు.

పర్వసంగ్రహ కథనమునుబట్టి నన్నయ యుపయోగించిన సంస్కృత సభాపర్వపు ప్రతిలో 4311 శ్లోకము లున్నట్లు తెలియుచున్నది. శ్రీ పి.పి.యస్. శాస్త్రిగారిచే సంపాదితమై వావిళ్ళ వారిచే ముద్రింపఁబడిన ప్రతిలో సభాపర్వ

శ్లోక సంఖ్య 4511గా నీయఁబడినది. పూనా యందలి భండార్కరు ప్రాచ్య పరిశోధన సంస్థవారు ప్రకటించిన ప్రతిలో ఈసంఖ్య 2511గా చెప్పఁబడినది. ఇందు మొదటిది దాక్షిణాత్య ప్రతులకును, రెండవది ఔత్తరాహ ప్రతులకును ప్రతినిధులని భావింపవచ్చును, సభాపర్వ శ్లోకసంఖ్య విషయమున నీరెండింటికిని రెండువేల శ్లోకముల వ్యత్యాసము కానవచ్చుచున్నది. ఈ వ్యత్యాసమునకు దక్షిణ ప్రతులలో నతిదీర్ఘములైన మూఁడు నాలుగధిక పాఠములును గొన్ని పునరుక్తులును నుండుట కారణము. అధిక పాఠములలోఁ బ్రధానమైనది శిశుపాలవధ ఘట్టమున 35, 36 అధ్యాయముల నడుమ నున్నది. ఇది శ్రీ పి పి. యస్. శాస్త్రిగారి ప్రతిలో నేడధ్యాయములుగ విభజింపఁబడి యున్నది. భండార్కరు పరిశోధన సంస్థవారి ప్రతి యందలి అనుబంధము ననుసరించి యిందు 806 శ్లోకములున్నవి. భీష్ముఁడు శ్రీకృష్ణుని మహత్త్వమును శిశుపాలునికి వివరించుట యిందలి విషయము. ఇట్లే 20వ అధ్యాయమున జరాసంధుఁడు భీమార్జునులను నిరసించి వారిని జంపెదనని పల్కు సందర్భమున 10 శ్లోకములతోఁ గూడినదియు, కృష్ణబలరాములు పుట్టి కంసుని సంహరించుటను వర్ణించు సందర్భమున 39 శ్లోకములతోఁ గూడినదియు రెండధిక పాఠములు కనవచ్చుచున్నవి. 23వ అధ్యాయమున సహదేవుఁడు దక్షిణ దిగ్జైతయాత్ర యొనరించుచు ఘటోత్కచుని లంక కరిగి విభీషణుని నుండి కప్పము తెమ్మని పంచుట, యాతఁ డరిగి విభీషణ సత్కృతుఁడై యతఁ డిచ్చిన కానుకలు తెచ్చుట మున్నగు విషయములతోఁ గూడిన 135 శ్లోకములుగల మఱియొక యధికపాఠ మున్నది. ఈ యధిక పాఠము లేవియు నుత్తర ప్రతులలోఁ గానరావు. వీనికిఁ దోడు దక్షిణ ప్రతులందుఁగల కొన్ని పునరుక్తులును శ్లోక సంఖ్యయందలి వ్యత్యాసమునకుఁ గారణములైనవి.

ఖాండవవన దహన సమయమున రక్షితులైన యార్గురిలో నముచి దనుజు ననుజుఁడును శిల్పకలాకుశలుఁడు నైన మయుఁ డొకఁడు. ఇతఁడు తన్నర్జునుం డగ్నినుండి రక్షించిన మహోపకారమునకుఁ గృతజ్ఞతాబద్ధుఁడై కృష్ణుని ప్రేరణమున యుధిష్ఠిరున కపూర్వమైన యొక సభ నిర్మించి యిచ్చుటతో సభాపర్వ మారంభించు చున్నది. ధర్మజుఁ డంపొక శుభ ముహూర్తమునఁ బ్రవేశము కావించి యా సమయమున కరుదెంచిన మహా మునుల వలన ధర్మకథలు వినుచు సుఖముగాఁ గాలము పుచ్చుచుండ నొక

నాఁడు నారద మహర్షి యరుదెంచి, యాతని వలన రాజనీతి విషయము లడిగి తెలిసికొని, యిట్టిసభ నెందైనఁ జూచి యెఱుంగుదురే యని యడిగిన యాతని కింద్ర యమ వరుణ కుబేరులయు బ్రహ్మ యొక్కయు సభలను వర్ణించి చెప్పెను. ప్రసంగవశమున నాతఁడు యమసభాగతుఁడైన పాండు రాజు ధర్మజుని రాజసూయ యాగము చేయుమని కోరుట నెఱింగించెను. ధర్మరాజు రాజసూయయాగము చేయ నిశ్చయించెను. కృష్ణ ప్రేరణమున భీముఁడు జరాసంధుని సంహరించెను. భీమ పార్థ నకుల సహదేవులు పూర్వో త్తర దక్షిణ పశ్చిమ దిగ్విజయము కావించి యాయా దిక్కులనేలు రాజుల నుండి కప్పములు గొనివచ్చిరి. రాజసూయయాగానంతరము ధర్మరాజు భీష్మోపదిష్టుఁడై మయసభాభవనముననే శ్రీకృష్ణున కర్ఘ్యమొసంగెను శిశు పాలుఁడు శ్రీకృష్ణు నధిక్షేపించి యాతనిచే నిహతుఁడయ్యెను. రాజసూయ యాగము చూడ నరుదెంచిన దుర్యోధనుఁడు సభావిభవము చూచు వేడుక నా యాయి ప్రదేశములఁ గ్రుమ్మరుచు వివృతద్వారము సంవృతముగా వగచి చొరనొల్లకయు, సంవృతద్వారము వివృతముగా వగచి చొరఁబోయి లలాట ఘట్టిత గృహద్వారుఁడయియు, సమప్రదేశ మున్నతముగా వగచి యెక్కసమకట్టియు, నీలాశ్మరశ్మిస్థగితమైన విమలమణి స్థలము జలాశయ ముగా వగచి పరిధాన మెగఁద్రోచికొనియు, స్ఫటికదీప్తి జాల పరివృతమైన జలాశయము స్థలముగా వగచి కట్టిన పుట్టము తడియం జొచ్చియుఁ గ్రమ్మ ఱిన నాతనిఁ జూచి పాంచాలియుఁ బాండుకుమారులును నవ్విరి. అది యెఱిఁగి ధర్మరాజు భీమునిచే నతనికి దివ్యవస్త్రములును దివ్యభూషణము లును బంపించెను దుర్యోధనుఁ డట్లు సభాప్రలంభమునకు లజ్జితుఁడై పాండ వులను వీడ్కొని హస్తినాపురమున కరిగి సకలజన మనోనయనోత్సవమైన తత్సభాలక్ష్మి తన మనోనయనముల కగ్నిజ్వాలలై మహా దాహముచేయ సంతప్తుఁడై శరీరకార్శ్యమునొందెను. శకుని యాతని నోదార్చి మాయా దురోదర వ్యాజమునఁ బాండవుల సంపద యంతయు నపహరించి యిత్తు ననియు, నందుకు ధృతరాష్ట్రు ననుజ్ఞానము వడయు మనియుఁ బలికెను. దుర్యోధనుఁడు పాండవుల వైభవమును దన మనస్సంతాపమును దండ్రి కెఱింగించి శకుని యుపాయమున కనుజ్ఞ యీ వలసినదని తండ్రిని బ్రార్థిం చెను. ధృతరాష్ట్రుఁడు తొలుత జూదమున కంగీకరింపకయుఁ గుమారుని మనస్తాప మపనయింప రమ్యమైన యొక సభ నిర్మింపఁజేసి యందు జూదమా

డుటకై ధర్మజుని దోడ్కొని రమ్మని విదురుని బంపెను. ధర్మరాజు దైవ నియోగమున విదురునితో హస్తినాపురమునకేగి యా సభయందే శకునితో జూదమాడి రాజ్యసంపదలతోపాటు తమ్ములను ద్రౌపదిని నందొడ్డి యోడి పోయెను. ఆ సభయందే దుశ్శాసనుఁడు ద్రౌపదిని గట్టినపుట్టంబు లొలిచి యవమానించెను. తరువాత ధర్మరాజా సభయందే శకునితో రెండవమాఱు జూదమాడి యోడి యప్పుడు చేసికొన్న సమయము ననుసరించి భార్యానుజ సహితుఁడై యడవికేగెను. ఈ విధముగా సభాపర్వమునందలి కథ యంతయు నాద్యంతము సభాసంబంధియై యున్నది. ఇందుఁ బ్రసక్తములైన సభలేవు— మయసభ, ఇంద్ర యమ వరుణ కుబేరుల సభలు, బ్రహ్మసభ, ధృతరాష్ట్రుఁడు నిర్మింపఁజేసిన సభ. దిక్పాలభాన్య సభల వర్ణన ప్రసంగము ధర్మజ రాజ సూయ యాగాచరణమునకు హేతువయ్యెను. రాజసూయము దుర్యోధనుఁ డింద్రప్రస్థమున కరుదెంచి సభను దర్శించి మనస్తాపమునకు గుఱియగుటకుఁ గారణమయ్యెను. ఆ మనస్తాపము జూదమునకుఁ గారణమయ్యెను. జూదము ద్రౌపదీ పరాభవమునకుఁ గారణమయ్యెను, అది ధృతరాష్ట్రుఁ డామెకు వరము లిచ్చుటకును బాండవు లామెమూలమున రాజ్యము సంపాదించుట కును గారణమయ్యెను. అది అపూర్వపణముతోఁ గూడిన అనుద్యూతమునకుఁ గారణమయ్యెను, అనుద్యూతము పాండవ వన గమనమునకుఁ గారణ మయ్యెను. ఇట్లిందలి కథా సన్నివేశము లన్నియు సభాసంబద్ధములై యుండు టచే నీ పర్వమునకు సభాపర్వమను పేరెంతయు నుచితమై యలరారు చున్నది.

మహాభారతమున సభాపర్వము మిక్కిలి ప్రధానమైనది. రామా యణమునందలి రామరావణ యుద్ధమునకు అరణ్యకాండమందలి సీతాప హరణ వృత్తాంతముపలెనే భారతమందలి కురుక్షేత్ర సంగ్రామమునకు సభా పర్వమందలి ద్రౌపదీ పరాభవ ద్యూతానుద్యూత వృత్తాంతములు ముఖ్య కారణములు. అందుచే భారతేతివృత్తమునకు సభాపర్వ వృత్తాంతము కేంద్రమని చెప్పవచ్చును, ఆదిపర్వ షష్ఠాశ్వాసమునందలి కుమారాస్త్ర విద్యా సందర్శన ఘట్టముననే భీమ దుర్యోధనుల గదా కౌశల ప్రదర్శనము "భావి పాండవ కౌరవ్య రణాభిసూచన పటిష్ఠంబయ్యె ఘోరాకృతి" నని నన్నయ భట్టు భారత సంగ్రామమును సూచ్యము కావించియుండెను. ఆ సూచన

సభాపర్వమున మఱింత స్పష్టతరముగా చేయంబడినది. నారదుఁడు పాండు రాజు రాజసూయయాగము చేయవలెనని ధర్మజుని గోరిన వృత్తాంత మెఱింగించి "రాజసూయయాగ మొనరించి నీ పితరులను సురగణపూజ్యుల నొనరింపుము. మఱి రాజసూయము బహువిఘ్నము. బ్రహ్మరాక్షసులు దానరంధ్రంబ రోయుచుందురు. అదియును నిర్విఘ్నముగా సమాప్తమైనచో నఖిల ప్రజాప్రళయ కారణమైన రణమగు"నని హెచ్చరించి యుండెను. ధర్మజుఁడును నారద గమనానంతరము

పితృగణ హితార్థముగ స, త్క్రతు వొనరింపంగ బుద్ధిగలదు ప్రజాసం
హృతితత్క్రతువున నగునని, మతినాశంకయును గలదు మానుగనాకున్.

అని డోలాయమానమానసుండై ధౌమ్యాదులు ప్రోత్సహింప ననుజానుమతమున రాజసూయము చేయ సమకట్టెను. భీమాదుల పరాక్రమము కతమునను, శ్రీకృష్ణుని అనుగ్రహము కతమునను రాజసూయము నిర్విఘ్నముగా జరిగిపోయెను. ఇది నారదుఁడు చెప్పినట్లు నిఖిల ప్రజాప్రళయ కారణమైన రణము జరుగుటను సూచించుచున్నది. ఆ రణము కురుక్షేత్ర సంగ్రామమే.

శకుని ప్రేరితుఁడై దుర్యోధనుఁడు ద్యూతమునకు ధర్మరాజును రావింపుమని ధృతరాష్ట్రుని గోరినప్పు డాతఁడు జూదమున కొడఁబడనొల్లక "ఏను విదురు శాసనంబున వర్తిల్లుచున్నవాఁడ నాతం డర్థానర్థ విదుండు సకలకార్య సమర్థుండు జూదంబున విగ్రహంబగు ననియె. బలవంతులతోడి విగ్రహంబు పరిహరించుట ల"గ్గని బోధించెను. దుర్యోధనుఁడు పట్టుపట్టెను. ధృతరాష్ట్రుఁ డెట్టకేల కంగీకరించి ధర్మజుని గొనివచ్చుటకై విదురుని నియోగించెను. విదురుఁడు విషణ్ణహృదయుఁడయి మాయా దురోదరము దురర్థముగాఁ జింతించియు ధృతరాష్ట్ర విధాతృ నియోగమున కొడఁబడి యింద్రప్రస్థపురమునకు బయలుదేఱెను. విదురునివలన ద్యూతవృత్తాంతమువిని ధర్మజుఁడు "లాలితాపూర్వ సభాలోకనంబునయందు జూదంబు కార్యంబె చెపుమ జూదంబు కతమున భేదంబుగాకుండ నేరదు మాలోన" అని పలికియు విదురుని నియోగమలంఘ్య మగుటచే విధినియుక్తుఁడై హస్తినాపురమునకు విదురునితో నరిగెను. ఇచ్చటఁ గూడ విదుర ధర్మజుల మాటలయందు నన్నయ భవిష్యద్విగ్రహ విభేదములను లెస్సగా సూచించి యుండెను.

ప్రథమ ద్యూతానంతరము దుర్యోధనుఁడు వరవుళ్ళఁ గలసి తనయిల్లు తుడుచుటకు పంచు నుద్దేశముతో ద్రౌపదిని దోడ్కొనిరమ్మని విదురు నాదేశించెను. విదురుఁ డంత దుర్యోధనుని యధర్మారంభము విరసించి తుదిసారి "జూదంబున నెగ్గు వుట్టు. దీనన య్యెడు ఫలంబు వేణు ఫలంబునుంబోలె సహామూల వినాశనంబునకు నిమిత్త" మగునని హెచ్చరించెను. దుర్యోధనుఁడు వినక విదురుని నిందించుచు ద్రౌపదిని దోడ్కొనివచ్చుటకై ప్రాతికామిని బంపెను.

దుశ్శాసనుఁడు నిండుసభలో ద్రౌపది కట్టిన పుట్టములొల్చు సమయంబున భీముఁడు కోపమున నంతకాకారుఁడై "దుశ్శాసనున్ లోక భీకర లీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ నిర్ఝర ముర్వీపతి చూచుచుండ నని నా స్వాదింతు నుగ్రాకృతి" (౨-౨౩౩)నని శపథముకావించెను తరువాత దుర్యోధనుఁ డామెను దన కుఱువు నెక్కరమ్మని సన్న చేసినప్పు డాతఁడు లయసమయ దండధర నిర్దయుఁడై "ఇద్దురాత్ము దుర్వార మదీయబాహు పరివర్తిత చండ గదాభిఘాత భగ్నోరు తరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్" అని ప్రతినచేసి యాయుధములున్న వలనికి దృష్టులు సారించెను. ఈ రెండు శపథములందలి "అని, ఉగ్రరణాంతరము" అను పదములు భవిష్యన్మహా సంగ్రామమును సూచించుచున్నవి.

ధర్మరాజువెంట భీమ పార్థ నకుల సహదేవు లరణ్యమున కరుగుచు సంభృతక్రోధులై పరుష భాషణములు పలికి యుండిరి. "దుర్యోధనాదులగు రిపుల జగద్ద్రోహులఁ జంపుదు నత్యుగ్రాహవమున" నని భీముఁడును, "చతుర్దశాబ్దమున మాత్రై పోరు కర్ణాది దుర్జనసంఘంబుల మార్తురం దును ముదున్ సంగ్రామరంగంబున" నని యర్జునుఁడును, "శకుని నస్మత్ప్రాయక జితహస్తుఁ జేసి చంపుదు మాజి" నని నకుల సహదేవులును బలికిన పలుకులలోఁగూడ యుద్ధ ప్రస్తావము కలదు. నిజమున కప్పటికి యుద్ధపుఁ జిన్నెలేమియు లేవు, అయినను వారు యుద్ధమున నిట్లు చేసెద మట్లుచేసెద మని పల్కుట ముందు జరుగఁబోవు యుద్ధమును సూచించుచున్నది. అరణ్యమునకేగుచుఁ ద్రౌపదీ పాండవులును ధౌమ్యుండును వహించిన యాకృతి విశేషములను జేష్టలను ధృతరాష్ట్రునకు విదురుఁడు వివరించు సందర్భమునఁగూడ భవిష్యత్సంగ్రామ సూచన కనఁబడుచున్నది.

నన్నయ యనువదించిన భారత ప్రతి : వ్యాసరచిత సంస్కృత భారతము ననుసరించియే నన్నయ తెనుఁగున భారతము రచించిన మాట నిజమేయైనను ఇప్పుడు లభించుచున్న యేదో యొక సంస్కృత భారత ప్రతితో నతని రచనను బోల్చి యతఁడు మూలమునకు వన్నె పెట్టెననియో లేక మూల సౌందర్యమునకు భంగము కలిగించెననియో చెప్పుట యుక్తము కాదు. ఏలయన సంస్కృత భారతము వ్యాసుఁడు రచించినప్పు డుండిన రూపముతోడనే తరువాత లోకమునఁ బ్రచారము పొందియుండలేదు. అనేక కారణములచేఁ గాలక్రమమున నం దనేక ప్రక్షేప విక్షేపములు ప్రవేశించినవి. అందుచే నన్నయ తెనుఁగుసేతనుగూర్చి యేదైనఁ జెప్ప నుంకించుటకు ముం దాతఁ డనుసరించిన ప్రతి యెట్టిదో తెలిసికొనవలసిన యావశ్యకమెంతైన నున్నది.

సంస్కృత భారతము మొదట మౌఖికముగనే ప్రచారము నొందినను తరువాత పెక్కు లిపులలో లిఖితరూపమును బొందినది. ఆ లిఖిత ప్రతులను ఉత్తర వర్గము, దక్షిణ వర్గము అని ప్రధానముగా రెండు వర్గములుగా విభజింపవచ్చును. దక్షిణవర్గమునందలి ప్రతులలో తెలుఁగు, గ్రంథ, మలయాళ లిపులలో వ్రాయఁబడినవి ముఖ్యములైనవి. నన్నయభట్టు దక్షిణమున నాంధ్రదేశమందు రాజమహేంద్రవరములో నివసించి యుండుటచే దాక్షిణాత్య వర్గమున తెలుఁగు లిపిలో వ్రాయఁబడిన సంస్కృత భారతమును జదివియుండు ననుట సహజముగా నుండును. ఆతఁడు పర్వ సంగ్రహమున సభాపర్వమున నున్నవని చెప్పిన శ్లోకముల సంఖ్య దాక్షిణాత్య ప్రతులందలి సంఖ్యతోడనే కొంచె మించు మించుగా సరిపోవుచున్నది. కాని యతని సభా పర్వ రచనా క్రమమును బట్టిచూడ నతఁ డౌత్తరాహ ప్రతినే యనుసరించెనని తోఁపక మానదు. ఏలయన దాక్షిణాత్య ప్రతులలో మాత్రమే కానవచ్చునవియు, నుత్తర ప్రతులలో లేనివియు నగు నధిక పాఠములను గాని పునరుక్తులనుగాని యాతఁ డించుకయైన స్పృశించియుండలేదు. భీష్ముఁడు కృష్ణుని మాహాత్మ్యమును శిశుపాలుని కెఱింగించు సందర్భమునఁ గల యతి దీర్ఘమైన యధిక పాఠమునం దాధ్యాత్మిక విషయ మెక్కువగా నుండుటచే నాతఁడు దానిని విడిచివైచెనని చెప్పవచ్చును గాని మిగిలినవాని విషయమున నట్లు చెప్పుటకు వీలులేదు. అందుచే నాతఁడు సభాపర్వానువాద

సందర్భమున గ్రహించినది దాక్షిణాత్యపాఠము కాదని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. అగుచో నాతఁడు సభాపర్వమున 4311 శ్లోకము లుండెనని చెప్పనేల యను ప్రశ్న ముదయించును. దాక్షిణాత్యవర్గమునకుఁ జెందిన ప్రతులలోఁ దప్ప నుత్తర వర్గమునకుఁ జెందిన యే ప్రతిలోఁ గాని యన్ని శ్లోకములు గాన రావు. దీనిని బట్టి నన్నయపర్వ సంగ్రహమున 2311 శ్లోకములే కలవని వ్రాసినను దాక్షిణాత్యప్రతుల శ్లోక సంఖ్య నెఱిఁగిన వారెవ్వరో రెండును నాలుగుగా మార్చి క్రొత్త పాఠమును గల్పించి యుందురని తోఁచుచున్నది. లేని యెడల నన్నయ పర్వ సంగ్రహమున దాక్షిణాత్య ప్రతులందలి శ్లోక సంఖ్యను జెప్పి యనువాద మొనరించు నప్పు డుత్తరప్రతి ననుసరించెనని చెప్పవలసి వచ్చును.

నన్నయకు తెలుఁగు లిపియు దేవ నాగరీ లిపియు తెలిసియుండునని మన మూహింపవచ్చును. అతఁ డుత్తర ప్రతులను బరిశీలింపవలసి నప్పుడు దేవనాగరీప్రతులనే చూచియుండు ననుట యసమంజసముగా నుండదు. దేవ నాగరీ లిపిలో వ్రాయఁబడిన ప్రతులలో నతఁడు కాశ్మీర ప్రతి ననుసరించి వ్రాయఁబడిన ప్రతుల మాతృకనే యనుసరించి యుండునని చెప్పుట కాధారములున్నవి. అతని రచన పెక్కువిధముల భండార్కరు పరిశోధన సంస్థ వారు ప్రధానముగా గ్రహించిన శారదా ప్రతికిఁగూడ సన్నిహితముగానే యున్నది. శారదాప్రతి సంప్రదాయమును కాశ్మీరప్రతుల సంప్రదాయమును అభిన్నములే.

నన్నయ ఉత్తర ప్రతులనే ప్రధానముగా ననుసరించినమాట సత్యమే యైనను దక్షిణప్రతుల నసలు చూచియుండకపోలేదు. దక్షిణ దేశములో నుండి యతఁడు దాక్షిణాత్య పాఠమును జూచియుండలేదనుట హాస్యాస్పదముగా నుండును. దక్షిణ ప్రతులలో నధిక పాఠములును బునరుక్తులును హెచ్చుగా నుండుటచేతను, నుత్తరప్రతులందలి రచన సంక్షిప్తమయ్యు లోపరహితమై సక్రమముగా సాగిపోవుటచేతను అతఁడు దానినే ప్రధానముగా గ్రహించియుండును. అట్లుగాక యతఁడు దక్షిణప్రతినే యనుసరించెనని చెప్పినచో దాక్షిణాత్య ప్రతులలోఁ గానవచ్చు నధిక పాఠాదులన్నియు నాతని కాలమునకుఁ దరువాతఁ జేరినవని చెప్పవలసివచ్చును.

క్రీ. శ. 17వ శతాబ్దిలో నివసించిన నీలకంఠుఁడు భారతమునకు వ్యాఖ్యానము రచించుచుఁ బాఠ నిర్ణయ విషయమునఁ దాను బొందిన క్లేశము నచ్చటచ్చట సూచించి యున్నాఁడు. అతఁడెన్నో ప్రతులను, దనకుఁ బూర్వమున్న వ్యాఖ్యానములను బరిశీలించి పాఠ నిర్ణయము కావించు కొన్నట్లు

బహూన్ సమాహృత్య విభిన్నదేశ్యాన్-కోశాన్ వినిశ్చిత్యచపాఠమగ్ర్యం
ప్రాచీం గురూణా మనుసృత్య వాచ. మారభ్యతే భారత భావదీపః.

అను శ్లోకమువలనఁ దెలియుచున్నది. అతఁ డుద్యోగపర్వమునందలి సనత్సుజాతీయమునకు వ్యాఖ్యానము రచించుచు "ఉద్యోగపర్వణి సనత్సుజాతీయే భాష్యకారాదిభి ర్వ్యాఖ్యాతాన్ సంప్రతితన పుస్తకేషు చ స్థితాన్ పాఠాంశ్చ గుణోపసంహార న్యాయే నైకీకృత్య వ్యాఖ్యాయతే" యని యాతఁడు చెప్పిన మాట యితర భాగముల విషయమునఁ గూడ నన్వయించును. దీనినిబట్టి యాతఁడు భారతమునందలి భాగములను బెంపుచేయుటకే యత్నించెనని స్పష్టమగును. సాధారణముగా భారతవిషయమునఁ బూర్వుల దృష్టి యంతయు నట్టిదే. వారు వీలైనంతవఱకెల్ల లభ్యములైన యధిక పాఠముల నన్నిటిని జేర్చి తాము సంపాదించిన ప్రతిని పాఠక కామధేనువుగాఁ జేయుటకే యత్నించి యుండిరి. నన్నయయు తన నాఁటికి లభ్యములగుచున్న ముఖ్య పాఠముల నన్నిటిని జూచి తన పాఠమును దాను నిర్మించుకొనెనని కాని యన్నిటినుండియు విచక్షణతతో నుచితములైన భావములను భాగములను గ్రహించెనని కాని చెప్పవచ్చును. అతఁడేదో యొక ప్రతిని బ్రధానముగా గ్రహించి ప్రత్యంతర సాహాయ్యమున దానికిఁ గొన్ని చేర్పు మార్పులు చేసికొనియుండును. సభాపర్వ విషయమున నట్లాతఁడు సమకూర్చుకొన్న ప్రతి దాక్షిణాత్య ప్రతులకంటె నౌత్తరాహ ప్రతులకే సన్నిహిత తరమై యున్నది.

నన్నయ యనువాద పద్ధతి : ఆంధ్రభారతము సంస్కృత భారతమున కనువాదమని పలువురు చెప్పుచుందురు. కాని యది మక్కికి మక్కిగాఁ జేయఁబడిన సన్నిహితానువాదము మాత్రము కాదు. కవిత్రయమువారు మూలభారతమును లెస్సగాఁ బఠించి, యం దనవసరములని తోఁచిన భాగము

లను దగ్గించియు, నవసరములని తోఁచినచోట్ల వర్ణనాదులను బెంచియు, ననుచితములని తోఁచినచోట్ల నన్యథాకరించియు మూలగ్రంథము నందలి కథాక్రమమును సన్నివేశములను మాత్రము విడువక, వర్ణనాదులను రస పోషణమును దమ యిచ్చవచ్చిన ట్లొనరించుచు స్వతంత్రముగా రచన సాగించిరి. ఈ పద్ధతి నొక విధముగాఁ గథానువాద పద్ధతి యని చెప్ప వచ్చును. దీనికి మార్గదర్శకుఁడు నన్నయభట్టే. పదమునకుఁ బదముగాఁ గాని శ్లోకమునకుఁ బద్యముగాఁగాని భారతము ననువదింపవలెనను నభిప్రాయ మాతనికి లేదు. రాజరాజుకూడ నాతనిని "కృష్ణద్వైపాయనమునివృషభాభి హిత మహాభారతబద్ధ నిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపు" మని కోరెనేకాని భారతమును యథామూలముగా ననువదింపుమని కోరియుండ లేదు. నన్నయ్యయుఁ బ్రభుని యభీష్టము నెఱింగి తదనుగుణముగా వ్యాసుఁడు నిరూపించిన యర్థమునకు భంగము రాకుండ భారతాంధ్రీకరణము నకుఁ బూనుకొనెను. నన్నయ్యయేకాదు. తిక్కన యెఱ్ఱనలుకూడ వ్యాస భారతమునందలి యర్థమును వెల్లడించుటకే ప్రయత్నించియుండిరి. వారిది స్వతంత్రమైన యనువాదము. అనువాదమయ్యు స్వతంత్రతాగుణశోభితమై యుండుట వారి రచనయందలి వైశిష్ట్యము.

వ్యాసుని కాలమునకును నన్నయ కాలమునకును నడుమఁ బెక్కు వందల సంవత్సరములు గడచినవి. ఇట్లు కాలమునందే కాక వారు నివసిం చిన దేశమునందుఁ గూడ భేదమున్నది. దేశకాలభేదముచే సాంఘికాది సంప్రదాయములందును, ఆచార వ్యవహారములందును, ఆహార విహారము లందును వ్యత్యాస మేర్పడుచుండుట సహజము. ఈ వ్యత్యాసము ననుస రించి నన్నయాదులు తమ రచనలోఁ గొన్ని మార్పులు ప్రవేశపెట్టియుండిరి. ఇది వారి వివేకమునకును ఔచిత్య దృష్టికిని దార్కాణము. మఱియు భారత రచనమున వ్యాసుని దృష్టికిని కవిత్రయము వారి దృష్టికిని గొంత భేదమున్నది. వ్యాసునిది పౌరాణిక నైతిక దృష్టి. అవఁ డవకాశము లభించినప్పుడెల్ల భారతమున ధర్మ తత్త్వ నీతి విషయములను బ్రపంచించు చుండును. కవిత్రయము వారికిఁగూడ ధార్మిక నైతిక దృష్టి యున్నను దానికంటెఁ గావ్యదృష్టి యెక్కువ. ఆ కారణముచే వారు కథాగమనమున కాటంకము కలిగించు ధర్మనీతి తత్త్వ ప్రసంగములను సంగ్రహించుటయో

వర్జించుటయో కావించుచుందురు. దీనివలన వారికి వ్యాసమహర్షి యెడ గౌరవము లేదని భావింపరాదు. ఆ మహనీయుని యనుగ్రహమువలననే తాము కవులమైతి మని భావించి వారాతనిని గావ్యారంభముల భక్తిమైఁ బ్రస్తుతించి యుండిరి.

(అ) నన్నయ విడిచివేసిన భాగములు : భీష్ముఁడు శ్రీకృష్ణుని మహత్త్వమును శిశుపాలున కెఱింగించు సందర్భమున దక్షిణ ప్రతులలోఁగల 803 శ్లోకములతోఁ గూడిన భాగమును నన్నయ స్పృశింపక విడిచెనని యిదివఱకు చెప్పఁబడినది. తత్త్వ విషయమయ మగుటచేతను, అతి దీర్ఘమగుటచేతను ప్రధానకథ కాటంకముగా నుండునని యాతఁడు దానిని విడిచివైచెనో తాను జూచిన ప్రతిలో నది లేకపోవుటచే విడిచివైచెనో చెప్పఁజాలము. ఉత్తర దక్షిణ ప్రతులు రెండింట నుండియు నన్నయచే విడువఁబడినవి మాత్రమే యిట సూచింపఁబడును.

i. నారదుఁడు బ్రహ్మ సభను వర్ణించుచు "దేవో నారాయణస్తస్యాం తథా దేవర్షయశ్చ యే" (11 - 32) అని నారాయణుఁడు కూడ నందుండెనని చెప్పినట్లు మూలమం దున్నది. ఇది యుచితము కాకపోవుటచే నన్నయ విడిచివైచెను.

ii. మూలమున 14, 15 అధ్యాయముల యారంభమున ధర్మరాజు

శమమేవ వరం మన్యే నతు మోక్షా ద్భవే చ్ఛమః
ఆరంభే పారమేష్ఠ్యం తు న ప్రాప్య మితి మే మనః (14–5)

సన్న్యాసం రోచయే సాధు కార్యస్యాస్య జనార్దన
ప్రతిహంతి మనో మేఽద్య రాజసూయో దురాసదః (15–5)

అని తనకు రాజసూయయాగ మొనరించుటకు సామర్థ్యము కాని అభిలాష కాని లేదని చెప్పినట్లు గలదు. తెలుఁగున నతఁడు రాజసూయయాగమునఁ బ్రజాసంహృతి యగునని విచారించెనే కాని తన కట్టి శక్తి లేదని తలంచియుండలేదు. అది దురాసదమను నభిప్రాయమే నిజముగా నతని కుండినచో నాతఁడు దానిని జేయకయే యుండును.

iii. సహదేవుఁడు జయించిన రాజుల పట్టికలో మూలమున నంధ్రులు కూడఁ బేర్కొనఁబడి యున్నారు. నన్నయ యంధ్రులను విడిచి పెట్టెను. ఇందు శాతనికిఁగల యాంధ్రాభిమానము కారణమని చెప్ప వచ్చును.

iv. భూలింగ పక్షి 'మాసాహస' మని యెల్లప్పుడును బలుకుచుఁ దాను మాత్రము సాహసమాచరించుచుండుననియు, సింహదంతాంతర్గతమైన మాంసార్గలమును దిని జీవించుచుండుననియుఁ జెప్పుదురు. మూలమున రెండుచోట్ల శిశుపాలుఁడు భీష్ముని నాభూలింగ పక్షితోఁ బోల్చుటయే కాక " యుక్తమేతత్తృతీయాయాం ప్రకృతౌ వర్తతా త్వయా " యనియు నధిక్షేపించి యుండెను. అసభ్యములని తోఁచుటచే నన్నయ యుపమానమును అధిక్షేపమును విడిచివైచెను.

v. మూలమున దుర్యోధనుఁడు పాండవ సభా వైభవమును జూచి యీర్ష్యవహించినప్పుడు శకుని "వత్సా ! ధర్మజునిగూర్చి నీ వీసు వహించుట తగదు. పాండవులు పైతృకమైన యంశమును బొంది స్వతేజముచే నభివృద్ధి నొందించినారు. నీవు శోకింపనేల ? నీవును సోదరులయు ద్రోణాదులయు సాయమున సర్వవసుంధరను జయింపు" మని నీతి సహితమైన యుపదేశము కావించినట్లున్నది. అట్టి నీతి శకుని సహజ ప్రకృతికి విరుద్ధ మగుటచే నన్నయ దానిని విడిచి "జూదమునకు ధృతరాష్ట్రు నను జ్ఞానము వడయుము దానివలన మన కఖిలైశ్వర్యములు కలుగు"నని యాతఁడు చెప్పినట్లు రచించెను.

vi మూలమున దుర్యోధనుఁడు తన మనస్తాపమును దండ్రి కెఱింగించుట (46-49) నాలుగధ్యాయములలో వివరింపఁబడినది. అందుఁ బాండవులకు రాజులు తెచ్చియిచ్చిన కానుకల వివరములు పునరుక్తులు చాలఁ గలవు నన్నయ యందలి పునరుక్తులను అనావశ్యక విషయములను దొలఁగించి దుర్యోధనుని మానసికావేదనను మాత్రము చక్కఁగా వెల్లడించెను.

vii. ద్యూతమున ధర్మజుఁ డోడిపోవుచుండ విదురుఁడు ధృతరాష్ట్రునితో "త్యజేత్కులార్థే పురుష" మిత్యాదిగాఁగల శుక్రనీతిని జెప్పి పిమ్మట

సువర్ణష్ఠీవులగు పక్షుల వృత్తాంతము వివరించెను. (152-11-14) ఆ వృత్తాంతమున నొక రాజు ధనాశచే సువర్ణష్ఠీవులను జంపినట్లున్నది. ఈ యుపమానమున ధృతరాష్ట్రునకుఁ బాండవులను జంపు నుద్దేశమున్నట్లు ధ్వనించుచుండుటచే నన్నయ దానిని విడిచివైచెను పైసంవర్భము ననే మూలమున దుర్యోధనుఁడు విదురుని "మార్జారవత్పోషకం చోప హంసి" "సుసాన్త్వితాపి హ్యసతీ స్త్రీ జహాతి" మున్నగు వాక్యములచే నిందించెను. దుర్యోధనునివంటివాఁడు కూడ ధర్మమూర్తియైన విదురునట్లు దూషించుట సభ్యతాదూరముగా నుండుటచే నన్నయ యా వాక్యములను విడిచివైచెను.

viii. పాండవు లడవి కరుగుచుండ దుశ్శాసనుఁడు వారిని దూలనాడుచు ద్రౌపదిని దమలో నెవ్వరినైన భర్తగాఁ గోరుకొమ్మని హెచ్చరించినట్లును, భీముఁడంతఁ గుపితుఁడై పరుషోక్తు లాడినట్లును, దుశ్శాసనుఁడపుడు "గౌర్గౌః" అని యధిక్షేపించుచు నాతని చుట్టు నాట్యము చేయ మొదలిడినట్లును, దుర్యోధనుఁడు గూడ భీముని గమనమును స్వగతిచే ననుకరింప మొదలిడినట్లును మూలమునందున్నది. ఆ వర్తనము దుర్యోధన దుశ్శాసనుల గరువ తనమునకుఁ దగినట్లు లేక బాలోచితముగా నుండుటచే నన్నయ విడిచివైచెను.

ix. పాండవ వన గమనానంతరము దుర్యోధనాదులు ద్రోణునే తమ కాశ్రయముగా భావించి రాజ్యమునంతను ఆతనికి నివేదించినట్లును ద్రోణుఁడు ధృష్టద్యుమ్నుని వలనఁ దనకు మరణము గలుగుటను దెల్పి యజ్ఞాదు లొనరింపుఁడని వారి కుపదేశించినట్లును మూలమునఁ గల విషయమును (71) దుర్యోధనాదులకు ద్రోణునెడ నంత విశ్వాసము లేకుండెనని యెంచుటచేఁ గాఁబోలు నన్నయ విడిచివైచెను.

(ఆ) నన్నయ సంక్షేపించిన భాగములు ; సంస్కృత భారతముతోఁ బోల్చి చూచినచో తెలుఁగు భారతము సగమునకుఁ బైగాఁ దగ్గింపఁబడినట్లు తోఁచును. మూలమునందలి వర్ణనలను, సంభాషణలను, ప్రశ్నోత్తరములను నన్నయ చాలవఱకు సంక్షేపించుటయే యిందుకుఁ గారణమ్ము.

i. మూలమునందలి 2వ అధ్యాయమున మయుఁ డుండఁగనే కృష్ణుఁడు ధర్మరాజాదులను వీడ్కొని ద్వారక కరిగెనని చెప్పఁబడినది. నన్నయ యీ యధ్యాయమునంతను "అంత నారాయణుండును పాండవులను వీడ్కొని పితృదర్శన లాలసుండై ద్వారవతీపురంబున కరిగె" నని యొక్క వాక్యమున సంగ్రహించెను రాజసూయయాగానంతరము కృష్ణుఁడు పాండవులను వీడ్కొని యేగు వృత్తాంతము మరల వచ్చును. అది ముఖ్యమగుటచే నచ్చట పాండవులు కృష్ణుని సాగ నంపుటను నన్నయ రెండు మూఁడు పద్యములలో వర్ణించెను.

ii. 4వ అధ్యాయమున 18వ శ్లోకమునుండి 27వ శ్లోకము వఱకు నే యే రాజులు వచ్చి ధర్మజుని సేవించిరో తెల్పఁబడినది. దాని నంతను నన్నయ " అయ్యుదయాస్తాచలసేతుశీతనగమధ్యోర్వీపతు " (౧-18) లని చక్కగా సంగ్రహించెను. ఇట్లనుటలో ధర్మజుని గొల్చుటకు వచ్చిన రాజుల అపరిమితత్వముకూడ వెల్లడియగుచున్నది.

iii. మూలమున నారదుఁడు ధర్మజు నడిగిన ప్రశ్నలు సుమారు వంద శ్లోకముల నాక్రమించియున్నవి. నన్నయ యందలి పెక్కు శ్లోకము లను విడిచివైచెను. కొన్నిటిని పెంచెను. కొన్ని పద్యములను స్వయ ముగా కల్పించెను. నారదుఁడు కావించిన సభావర్ణనలు విని ధర్మ రాజు వానినన్నిటిని మరల సింహావలోకనము కావించి హరిశ్చంద్రుని మహిమాతిశయములను గూర్చి యడిగినట్లు మూలమున నున్నది. నన్నయ యీ సింహావలోకనమును వగ్గించివైచెను

iv. రాజసూయయాగాచరణమున ధర్మజున కుత్సాహము కలిగించుచు నర్జునుఁడు పరాక్రమ గుణమును విస్తృతముగా వర్ణించినట్లు మూల మునను న్నది. (15-11-16) నన్నయ ఈ క్రింది పద్య మొక్కటి మాత్రము వ్రాసెను.

కులరూపగుణ ద్రవ్యంబులు విక్రమవంతునందు భూ విదితములై
నిలుచు నవిక్రమునకు నవి, గలిగియు లేని క్రియ న ప్రకాశంబు
లగున్ (౧-128)

v. 54 వ అధ్యాయమున ధర్మరాజొక్కొక్క వస్తువునే యొడ్డి దానిని వర్ణించి "తేన దీవ్యామ్యహం త్వయా" అనుచుండుటయు శకుని జయించితినని "జితమిత్యేవ శకుని ర్యుధిష్ఠిర మభాషత" అని పల్కుచుండుటయుఁ బెక్కుసార్లు కాననగును. నన్నయ ధర్మజుఁ డొడ్డిన వస్తువుల నన్నిటిని (177 వ) వచనమున సంగ్రహముగా వర్ణించి "ఒక్కొక్క యొడ్డునన యొడ్డి యోటువడె" నని మూలమునందలి పునరుక్తిని దగ్గించెను.

vi జూదమున ధర్మరా జొక్కొక్క యొడ్డునే యోడుచుండుట గాంచి విదురుఁడు దుర్యోధనుని బహిష్కరించి కౌరవవంశమును గాపాడుమని ధృతరాష్ట్రుని ప్రబోధించెను. పిమ్మట 56 వ అధ్యాయమున నాతఁడు శకుని నాతని రాజ్యమునకుఁ బంపివేయుమని చెప్పి నట్లు మూలమందున్నది. నన్నయ యీ యధ్యాయమునంత "ఇంకనైన నుపేక్షింపక యీ దుష్టద్యూతము వారింపు"మను వాక్యముతో సంగ్రహించెను. తరువాత విదురుఁడు దుర్యోధనునికూడ మందలింప నతఁడు కుపితుఁడై "మార్జారవత్పోషకం చోపహంసి" ఇత్యాదిగా విదురు ననేకవిధముల దూషించెనని మూలమున నున్నది. నన్నయ యా దూషణమునంత నొక సీసమున సంగ్రహించెను.

vii సభవారు పాంచాలీ ప్రశ్నమును విచారింపవలెనని హెచ్చరించు సందర్భమున విదురుఁడు సభాధర్మములను విస్తరించి చెప్పినట్లు మూలమందున్నది. నన్నయ ఆ విషయము నొక్క పద్యములో సంగ్రహించి చెప్పెను.

ఈ విధముగా నన్నయ పెక్కుచోట్ల మూలభాగములను సంగ్రహించెను. పుర, నదీ, యుద్ధ, రాజగుణ, రాజ్యపాలనములును, ధర్మతత్త్వ నీతివిషయ కోపన్యాసములును, వ్యక్తివస్తు నామముల పట్టికలును అతఁడు సంక్షేపించిన యంశములలో ముఖ్యములైనవి. మూలమున నధ్యాయము మాఱినప్పుడెల్ల జనమేజయుఁ డేదో ప్రశ్నించుచుండుటయు వైశంపాయనుఁడా ప్రశ్నలకు సమాధానము చెప్పుచుండుటయు గానవచ్చును నన్నయ పెక్కు చోట్ల నా ప్రశ్నలను దొలఁగించి తానే కథను సక్రమముగా

సాగించెను. నన్నయ కావించిన యీ సంగ్రహీకరణములవలనఁ బ్రధాన కథా గమనమున కంతరాయము కలుగకపోవుటయే కాక యప్రసక్త విషయ వివరణము తగ్గుటచే దానికిఁ బ్రసన్నత యేర్పడినదని చెప్పవచ్చును.

(ఇ) **నన్నయ మూలమును పెంచి వ్రాసిన భాగములు :** అచ్చటచ్చట నన్నయ మూలమునకుఁ బెంపుగలిగించిన పట్లు కూడఁ గొన్ని గలవు. ఈ పెంపు మూలమునలేని వర్ణనములను. భావములను జొప్పించుట, మూలస్థమైన పదమునో, పదసమూహామునో గ్రహించి యందలిభావమును విపులీకరించుట, అలంకారములను బ్రవేశపెట్టుట. వ్యక్తిగుణశీల ప్రదర్శనమునకై విశేషణములను వాడుట మున్నగు రూపముల గానవచ్చును.

i. కృష్ణుఁడు భీమార్జునులతో మగధదేశమును జేరినపిమ్మట నన్నయ గిరివ్రజపురమును "ఉరుతర హార్మ్యమాలికల" ౧-172 అను పద్యమునఁ జక్కగా వర్ణించెను. మూలమున వనపర్వత వర్ణనమే కాని పురవర్ణనము కానరాదు. జరాసంధ వధానంతరము కృష్ణుఁడు భీమార్జునులతో నింద్రప్రస్థమున కరుదెంచినప్పుడు ప్రజలు పొందిన సంతోషమును నన్నయ మూఁడు పద్యములతో వెల్లడించెను. మూలమునఁ బ్రజల ప్రసక్తియే లేదు.

ii తమ్ములు నాలుగుదిక్కులను జయించి వచ్చినపిమ్మట ధర్మరాజు "యజ్ఞాయైవ మనో దధే"యని యజ్ఞముచేయ నిచ్చించినట్లుమాత్రము మూలమునయున్నది. నన్నయ యిచ్చట మంత్రుల ముఖమున వైభవ సమృద్ధి (౧-272) నొక వచనమున మనోహరముగా వర్ణించెను,

iii. నారదుఁడు ధర్మజునకు హరిశ్చంద్రుని మహిమాతిశయమును వర్ణించుచుఁ జెప్పిన పద్యమును (౧-౯౭) ఇంద్రసభావర్ణన సందర్భమునందలి "వదలక యేలిన వాని ప్రస్తవమునఁ బోరిలో నీల్గిన వీరభటు" లిత్యాది సీసమును, శిశుపాలుఁడు కృష్ణు నాక్షేపించు సందర్భమునందలి "అతనికిఁ గూర్తురేని"(౨-19) అను పద్యమును అమూలకములైనట్టివే.

iv భీముఁడు కృష్ణుని యర్ఘ్యగ్రహణార్హతను సమర్థించుచు

వృద్ధు లోకలక్ష యున్నను,బుద్ధియె యెవ్వరికి వారిఁబూజింపంగా
నిద్ధరణీశులలోగుణ,వృద్ధిని పూజించితిమి త్రివిక్రము భక్తిన్
పూజితుల తృప్తులగుదురు, భూజను లొరులచ్యుతుండు పూజితుఁ
డగుడున్
దేజమున జగత్త్రితయము, పూజితమయి తృప్తిపొందుఁ బుణ్య
సమృద్ధిన్ ౨-27, 28

అనిచెప్పిన పద్యములలోని కారణములు నన్నయ కల్పించినవే. రెండవ పద్యమందలి భావము కృష్ణుని జగత్త్రిత యాత్మకత్వమును సూచించుచు మిక్కిలి గంభీరముగా నున్నది.

v వరుణుని గొల్చు నదులను జేర్కొను సందర్భమున మూలములో "ఏతాశ్చాన్యాశ్చ సరిత స్తీర్థానిచ సరాంసిచ" యని యున్నది.అన్యాశ్చ అనుదానిలో నాంధ్రదేశమందలి పెన్ననుగూడఁ జేర్చి నన్నయ తన యాంధ్రాభిమానమును వెల్లడించెను

vi జర పుత్త్రశకలములను రెండిటిని గూర్చి బృహద్రథుని కర్పించినప్పు డాతఁ డామెను "కాత్వం కమల గర్భాభే మమ పుత్త్రి ప్రదాయినీ, కామయా బ్రూహి కల్యాణి దేవతాప్రతిభాసి మే" అని యడిగి నట్లున్నది. నన్నయ దానిని బెంచి

ఇచ్చకు వచ్చు పూజనల నెంతయు సంతసమొంది తొల్లి నా
కిచ్చె మునీశ్వరుండు దయ ని త్తనయున్ మఱియిప్డు నెమ్మితో
నిచ్చితి వీవు రాక్షసివె యిక్కల మెల్లను నుద్ధరింపఁగా
వచ్చిన పుణ్యదేవతవు వారిరుహోయతుచారులోచనా! ౧-'52

అను చక్కని పద్యమును రచించెను.

vii శిశుపాలుఁడు కోపమున సపుత్త్రిబలుఁడై సభవీడి యరుగునప్పుడు ధర్మజుఁ డాతని వెంటఁజని యనునయించుచు"వేన కృష్ణం హిత త్త్వేన భీష్మశ్చేదిపతేః భృశమ్" (35-5) అని చెప్పినట్లు మూలమందున్నది. నన్నయ కృష్ణతత్త్వమును వివరించుచుఁ గ్రింది పద్యమును వ్రాసెను.

ఆదిజుఁడైన బ్రహ్మయుదయంబున కాస్పదమైనవాఁడు, వే
దాది సమస్త వాఙ్మయములందుఁ బ్రశంసితుఁడైనవాఁడు, లో
కాది, త్రిలోకపూజ్యుఁడని యాత్మనెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁడని యుక్తమ కాకిది యేమిదోసమే?
(౨-18)

viii సునీథుఁడు క్షత్త్రియుల నెల్లఁ జేర్చుకొని యుద్ధసన్నద్ధుఁడైన సంద
ర్భమున మూలమున "తతః సాగర సంకాశం దృష్ట్వాన్నృపతి సాగరం,
రోషాత్ప్ర చలితం సర్వ మిద మాహ యుధిష్ఠిరః" (57-1) అని
యున్నది. నన్నయ యప్పుడు జరిగిన సంక్షోభమును "రయవిచల
త్తురంగమ తరంగములన్" (౨-౩౩) అను పద్యమున నాలంకారిక
ముగా వర్ణించెను.

ix నారదుఁ డింద్రసభను వర్ణించుచు

తత్రైవాప్సరసో రాజన్ గంధర్వాశ్చ మనోరమాః
నృత్యవాదిత్ర గీతైశ్చ హాస్యైశ్చ వివిధైరపి
రమయన్తి స్మనృపతే! దేవరాజ శతక్రతుమ్ (7-21)

అని గంధర్వులును నప్సరసలును నృత్యవాదిత్రగీతములచేతను వివిధ
హాస్యములచేతను దేవేంద్రుని రంజింతురని చెప్పియుండెను. నన్నయ
యిచ్చట

అతుల విభూతితో మణిమయాభరణద్యుతు లొప్పఁగా శత
క్రతుఁడు శచీసమేతుఁడయి కాంచనచారు విమానమాలికా
గత దివిజోత్తముల్ గొలువఁగాఁ గొలువుండు వరాప్సరోంగనా
యత విలస త్కటాక్షకుసుమార్చిత సుందరవక్త్ర చంద్రుఁడై ౧-63

అని రూపకాలంకారమును గూర్చి భావమునకు వన్నె పెట్టెను.

x పాండవులు ద్యూతార్థమై ద్రౌపదితోఁ గూడ హస్తినాపురమున
కరిగినపుడు "యాజ్ఞసేన్యాః పరామృద్ధిం దృష్ట్వా ప్రజ్వలితామివ,
స్నుషాస్తా ధృతరాష్ట్రస్య నాతిప్రమనసోఽభవన్" 52-32 అని ధృత

రాష్ట్రుని కోడండ్రు ద్రోవది వృద్ధినిజూచి దుఃఖించిరని మూలమున నున్నది. ఇందలి "పరామృద్ధి" మను మాటలను నన్నయ క్రింది పద్య మున నాలంకారికముగాఁ బెంచి ద్రౌపదీ సౌందర్యముయొక్క పరా కాష్ఠను బ్రదర్శించెను.

అఖిలలావణ్య పుంజంబు నబ్జభవుఁడు, మెలఁతగా దీనియందు
నిర్మించె నొక్కొ
కాని నాఁడిట్టికాంతి యేకాంతలందు, నేలలేదని సామర్ష హృదయ
లై రి. ౨-160

xi "ద్రౌపద్యాః ప్రేక్షమాణాయాః సవ్యమూరు మదర్శయత్" 63-12 అను మూలమందలి వాక్యము ననువదించుచు నన్నయ "అమ్ముదితన్ విభీత హరిణాక్షిఁ గలాపవిభాసి కేశ భారమ్మున నొప్పుదాని" అని యమూలకములైన విశేషణములను గల్పించి వ్రాసెను.

(ఈ.) నన్నయ క్రమమునం దాసక్తికలవాఁడు. అన్నదమ్ములయు దిక్పాలాదులయుఁ బేర్లు చెప్పు సందర్భముననను ఇతర సందర్భములందును మూలమున క్రమము విడిచివేయఁబడుచుండును. నన్నయ యట్టి చోట్లఁ దప్పక క్రమమును పాటించుచుండును. మూలమున విదురుఁడు ధృతరాష్ట్రునకు పాండవు లరణ్యమునకేగిన విధముతెల్పిన పిమ్మట దుశ్శకునము లుప్పతిల్లెననీ తెల్పినట్లున్నది. నన్నయ వానిని పాండవులు గజపురమును విడిచి యరుగు నప్పుడే వర్ణించెను (2-299). ఈ క్రమమే యుచితతరముగా నున్నది.

(ఉ.) **అన్యథాకరణములు :** కొన్ని కథాంశములను భావములను నన్నయ తన కుచితమని తోఁచిన విధముగా మార్చి వ్రాసెను.

i మయుఁడు తన ప్రాణములు రక్షించిన యర్జునున కేదైనఁ బ్రత్యుప కారము చేయఁదలంచి "మీకిష్టమైన దానిని నిర్మింతును. పనుపుఁ"డని మొదట నర్జును నడిగి యాతని ప్రేరణచేఁ దరువాతఁ గృష్ణునిగూడ నడిగియుండెను. కృష్ణుఁడు ముహూర్తకాల మాలోచించి (ముహూర్త మివ సంధ్యాత్వా) ధర్మజునకు సభ నిర్మింపుమని యాదేశించినట్లు మూలమున నున్నది. నన్నయ "కృష్ణుఁడు పెద్దయుం బ్రొద్దు విచా

రించి మయుని కిట్లనియె"నని వ్రాసియుండెను. ఇచ్చటఁ గృష్ణుఁడు చెప్పునది అసామాన్యమగు విషయమగుటచే నాతఁ డెక్కువసే పాలోచించె ననుటయే యుక్తముగా నున్నది.

ii సహదేవుఁడు దక్షిణ దిగ్విజయము చేసిన సందర్భమున మాహిష్మతీపురమున నగ్ని పారదారికుఁడయి దండితుఁడైన వృత్తాంతము చెప్పఁబడినది. అగ్ని మాహిష్మతీ పురమున బ్రాహ్మణరూపముతో సంచరించుటకుఁ గారణ మేమో మూలమునఁగానరాదు. అచ్చటిసందర్భమును జూచిన నందు కాతని పారదారికత్వమే కారణమని తోఁచును. నన్నయ "జాతవేదుండు విప్రుండయి వేదాధ్యయనంబు చేయుచు మాహిష్మతీపురముననుండి ప్రమాదవశంబునం బారదారికుం డయ్యె"నని యాతఁడు వేదాధ్యయనాసక్తిచే మాహిష్మతి కరిగి యుండెననియుఁ బ్రమాదవశమునఁ బారదారికుం డయ్యెననియు సూచించెను. ఇది యా కాలమున నగ్నియంతవానికిఁ గూడ వేషము గఱపఁ జాలు మహా పండితులు మాహిష్మతీనగరమున నుండిరనియు, ధీమంతులకుఁ గూడ నొక్కొక్కప్పుడు ప్రమాదము సహజమనియు సూచించుచున్నది. మూలమున నా పట్టణమందలి స్త్రీలు స్వైరిణులై యుండవచ్చునని యగ్నియే వరమిచ్చినట్లున్నది. నన్నయ యగ్ని తత్పురనృపతి కాతఁడు కోరిన వరమిచ్చి "ఇప్పురంబు నింతు లెంతయు మనోజ రాగిణులు కావున వీరల స్వైరిణీవృత్తి యెల్లకాలము సహింపవలె"నని యడిగెననియు నాఁటంగోలె మాహిష్మతీపుర స్త్రీలకు స్వైరిణీత్వంబు నిర్దోష మయ్యెననియుఁ గల్పించెను.

ii. ద్యూతారంభమునకు ముందు మూలమున శకునియే ధర్మజునితో జూద మారంభించుటకు సమయమైనదని చెప్పినట్లున్నది. నన్నయ దుర్యోధనుఁడు ధర్మజుని ద్యూతార్థమై యాహ్వానించినట్లు వ్రాసెను.

iii. బృహద్రథుని భార్యలు తమకు శరీర శకలము లుదయింపఁగనే యుద్విగ్నలై వానిని విడిచివైచిరని మూలమునం దున్నది. నన్నయ కేవల భయమునే కాక వారి లజ్జనుగూడ వర్ణించుట యెక్కువ యౌచిత్యవంతముగా నున్నది.

iv. గిరివ్రజము చుట్టును గల యైదు పర్వతములును "రక్షంతీవాభిసంహత్య సంహతాంగా గిరివ్రజమ్" 19-3 అని సంహతాంగములై గిరివ్రజమును రక్షించుచున్నట్లున్నవని మూలమందుండ నన్నయ యవి "శూరభటులు వోలెఁ గాచి చుట్టును నుండు" నని చెప్పి వానిని శూరభటులతోఁ బోల్చుట రమణీయముగా నున్నది.

v. భీమ జరాసంధులు పోరు సందర్భమున మూలమందు జరాసంధుఁడు బలిరాక్షసుఁడు శక్రునివలె భీముని దాఁకె నని చెప్పఁబడియున్నది. బలియే యింద్రు నోడించిన కారణమున నీ యుపమాన ముచితముగా లేదని నన్నయ మార్చి "సింహ గజేంద్రములట్లు, వజ్ర పర్వతముల యట్లు, ఘోరతరవాసవవృత్రుల యట్లు" నిద్దఱును బోరిరని వ్రాసి యుండెను.

i. ద్యూతమునకు ధర్మజుని గొనివచ్చుటకై యరిగిన విదురుఁ డాతనికిఁ గుశల ప్రశ్నాంతరము ధృతరాష్ట్రుఁడు చెప్పిన పలుకు లన్నియు మరలఁ జెప్పినట్లు మూలమునం దున్నది. విదురునకు ద్యూత మభిమతము కాకపోవుటచే నన్నయ యా వివరములన్నియు విడిచి "కుశలం బడిగి నిజాగమన ప్రయోజనం బెఱింగించె" నని యా విషయము నంతను వ్యంగ్యముగా సూచించి విడిచిపెట్టెను.

(ఉ) మూలమున నచ్చటచ్చటఁ జెదరియుండు వ్యక్తుల గుణ గణములను నన్నయ వారిని ప్రవేశపెట్టునప్పుడు ముందే తెలుపుచుండును. ఈ పద్ధతి వలన వారి స్వరూప స్వభావములను గూర్చి పాఠకుల కొక యభిప్రాయము ముందే కలుగుట కవకాశము కల్గును. కృష్ణుఁడు ధర్మజునకు జరాసంధుని విషయమును జెప్పు సందర్భమున హంసడిభకు లాతనికి దక్షిణ వామ భుజములై వర్తిల్లుదురని తెల్పుచు వా "రనిర్జేయులు పరస్పర స్నేహాయత్త సుచిత్తు లతని యాప్తు"లని వారి ప్రధాన గుణము వర్ణించెను. తరువాత వారు మరణించుటకా పరస్పర స్నేహాయత్తచిత్తతయే కారణమైనది.

(ఋ) నన్నయ తాను రచించిన భారతభాగము నందాయా సందర్భములలో ననేక సూక్తులను జొప్పించియుండెను. వీనిలోఁ బెక్కు మూలకము

లైనట్టిసే. సాధారణముగా నిట్టివాని నతఁ డర్థ భావములందు స్వయం సంపూర్ణములైన ప్రత్యేక పద్యములుగా వ్రాయుచుండును. వానిని సందర్భానుగుణముగా మన మెచ్చటనైన వాడుకొనవచ్చును. (౧-93 ; ౨-202)

(ఋూ) యథా తథానువాదములు : నన్నయ మూల శ్లోకములను యథా తథముగా ననువదించిన పట్లును గొన్ని గలవు.

i. అగ్నిహోత్రఫలా వేదా దత్తభుక్త ఫలం ధనం
రతి పుత్త్రి ఫలా దారాః శీలవృత్తఫలం శ్రుతమ్ 5-101

దారసంగ్రహంబు ధరణీశ! రతిపుత్త్రి, ఫలము శీలవృత్తఫలము శ్రుతము
దత్త భుక్త ఫలము ధనము వేదము లగ్ని, హోత్రఫలము లనియునొగి
తెలుంగు ౧-51

ii. తావుభౌ సహితౌ వీరౌ జరాసంధశ్చ వీర్యవాన్
త్రయస్త్రయాణాం లోకానాం పర్యాప్తా ఇతి మే మతిః 13-37

భూమీశ ! హంసడిభకులు, నా మగధాధీశ్వరుండు న మ్మువ్వురును
ద్దామ భుజవీర్య సంపద,తో మూఁడు జగములు నోపుదురు సాధింపన్
౧-114

iii. అలోప్యపిహ్యారి రత్యన్తం వర్ధమాన పరాక్రమః
వల్మీకోమూలజ ఇవ గ్రసతే వృక్ష మంతికాత్ 50-24

అల్పుఁడయ్యు మనుజుఁ డతి పరాక్రమమునఁ, జేర్మి తరతరంబు
పెరుఁగుచున్న
వాఁడు మ్రానిమొదలి వల్మీకమా మ్రానిఁ, జెఱుచు
నట్లు నడఁగి చెఱుచుఁబగఱ ౧-44

(ఌ) సభాపర్వమునందుఁ గల వృత్తాంతములలో శిశుపాలవధ వృత్తాంతము చాల ముఖ్యమైనది. సంస్కృతమున మాఘమహాకవి శిశుపాలవధ మహాకావ్యమును రచించెను. నన్నయ దానిని దప్పక చదివియుండును. అతని రచనలో నొంకు రెండుచోట్ల మాఘ కావ్యానుసరణము కూడ గోచరించును. మాఘకావ్యము నారదుఁడు శ్రీకృష్ణుని కడ కరుగుటతో నారం

ఖించును. ఆ సందర్భమునందు "పతత్పతంగ ప్రతిమ స్తపోనిధిః" అని నారదునకు విశేషణ మొకటి వాడఁబడినది. ఈ భావము సంస్కృత భారతమున లేదు, నన్నయ మాఘ కావ్యభాగము ననుసరించియే 'నీరజమిత్రుఁడేల ధరణీగతుఁడయ్యెడు నొక్కొ-యంచు విస్మేరమనస్కులై జనులు మెచ్చి నిజద్యుతి చూచుచుండఁగా' నారదుఁ డేగుదెంచె నని వర్ణించియుండెను.

సంస్కృతకావ్యభాగములను వలెఁ గన్నడమందలి పంపభారతములోని భాగములను గూడ నన్నయ యనుసరించినపట్లు కొన్ని కలవు. ఈ క్రింది పద్యములు నన్నయ పై పంపభాగవతమునకుఁ గల ప్రభావమును సూచించు చున్నవి.

"సకలక్ష్మాచర ఖేచరాంచిత మహామాణిక్య గాణిక్య హస్తి"
పం. ఆది. 8-136

మదమాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సంపదలు
స. ౧-13

కురువృద్ధం కులవృద్ధ.. పంప. 6-44
కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవు లనేకుల్ స. ౨-233

ఈ విధముగా నన్నయ సంస్కృత భారతమునందలి కథనే యనుసరించినను దనకుఁ బూర్వముండిన సంస్కృత కర్ణాట కావ్యములనుండి కూడఁ గొన్ని భావములు గ్రహించియు, సందర్భోచితముగా నూత్నకల్పనలు : వించియు, ననుచితములని తోఁచిన యంశములను బరిహరించియుఁ, గొన్ని వర్ణనలు పెంచియుఁ, గొన్ని తగ్గించియు నాంధ్రభారతమును సర్వాంగ సుందరముగా వెలయించెను. అందుచేతనే యది యనువాదప్రాయమయ్యు స్వతంత్ర గ్రంథమువలెనే శోభిల్లుచు నన్నయ ప్రతిభా విశేషమును వేయి విధముల వెల్లడి చేయుచున్నది.

వస్తుసంవిధానము, కథాకథనము:- అగ్నిభయమునుండి రక్షితుఁడైన మయుఁ డపూర్వమైన సభను నిర్మించియిచ్చుట ఆది సభాపర్వములకును జూదమున నోడిన పాండవులు వనమున కరుగుట సభారణ్య పర్వములకును

గల సంబంధమును జక్కగా వ్యక్తము చేయుచున్నవి. సభాస్థితుఁడైన తన్ను జూచుట కరుదెంచిన మునులు నర్హరీతిఁ బూజించి వారివలన ధర్మకథలు వినుచుఁ దమ్ములతో సుఖమున్న ధర్మజుని గాంచుటకై యొక్కనాఁడు నారదుఁ డరుదెంచి యాతనిఁ బెక్కు రాజనీతి విషయములనుగూర్చి ప్రశ్నించెను. ఈ భాగము ప్రశ్నరూపమున నున్నను నారదుఁడు ధర్మజునకు రాజనీతి ధర్మములను కర్తవ్యమును బోధించినట్లే యున్నది. రామాయణమున భరతుఁడు తన్నుఁ జూడ నరుదెంచినప్పుడు రాముఁ డాతని రాజ్య పరిపాలనమునకు సంబంధించిన పెక్కు ప్రశ్నలడిగియుండెను. ఆ సర్గమునకు కచ్చిత్సర్గ యని పేరు. ఇచ్చట నారదుఁ డడిగిన ప్రశ్నలు రాముఁ డడిగిన యా ప్రశ్నలను దలంపునకుఁ దెచ్చుచున్నవి. ఇచ్చట వ్రాసిన ముప్పది పద్యములలో నన్నయ రాజనీతిని జక్కగ వ్యక్తము చేసియున్నాఁడు. అవగ్రహ భయము కలుగకుండఁ జెఱువులను జల పరిపూర్ణగా నుంచుట, హీనులగు కర్షకులకు ధాన్య బీజములను, వణిజులకు శతైకవృద్ధిగా ఋణములను నొసంగుట, వికలాంగులను అసహాయులను దయతోఁ గాపాడుట, ధనధాన్య బాణ శరాశసనములను జలఘాసరసేంధనాదులను, యంత్రములను, యోధవీరులను, సమకూర్చి దుర్గములను సురక్షితము లొనరించుట మున్నగు నాధునిక సమస్యలుకూడ నందు గోచరించుట గమనింపఁదగిన విషయము. ఈ రాజనీతి సంగ్రహ మయ్యును సకల ముఖ్యవిషయములను స్పృశించుచుఁ గ్రొత్తగా రాజ్యపాలనము నారంభించిన ధర్మజున కొక విధమైన హెచ్చరికయై మిక్కిలి యుచితముగా నున్నది.

దుర్యోధనునికిఁ బాండవులయెడ నీర్ష్యా ద్వేషములను గలిగించినది మయ సభావైభవము. దాని యపూర్వత్వమును అమానుషత్వమును నిరతిశయ సౌందర్య శాలిత్వమును బ్రదర్శించుటకే దిక్పాల సభావర్ణనము కావింపఁ బడినది, "ఇట్టిసభ నెచ్చటనైనఁ జూచితిరా" యని ధర్మజుఁడు నారదు నడుగ నతఁడు మానవలోకేశ్వరుల సభలుకాని ఇంద్రయమ వరుణ కుబేర పంకజాసనుల సభలుకాని దానికి సరిగావని చెప్పెను. ఈ విషయము మయసభ యెంత యతిలోకమైనదో యది దుర్యోధనుని కెల యంత యీర్ష్య కలిగించెనో తెలుపుచున్నది. మఱియు సభావర్ణన సందర్భమున నారదుఁడు హరిశ్చంద్రుఁ డింద్రసభలో నున్నట్లును పాండురాజాదులు యమసభలో

మున్నట్లును వివరించెను. ధర్మరాజు హరిశ్చంద్రుఁ డొక్కఁడే యింద్రసభ నుండుటకును ఇతర రాజులు యమసభ నుండుటకును గారణ మేమని యడిగెను నారదుఁడు హరిశ్చంద్రునికి రాజసూయ యాగాచరణము వలనఁ గలిగిన మాహాత్మ్యముతెలిపి,పాండురాజుకోరికకూడ నెఱింగించెను. పితృభక్తితత్పరుఁడైన యుధిష్ఠిరునకు రాజసూయయాగము చేయవలెనను కోరిక జనించెను. రాజసూయ మతివైభవోపేతముగా జరిగెను ఇది దుర్యోధనుని యీర్ష్యను ద్విగుణీకృత మొనరించెను. ఈ విధముగా సభావర్ణనము రాజసూయ యాగాచరణమునకును, రాజసూయయాగము దుర్యోధనుని యీర్ష్యకును దద్ద్వారా ద్యూతమునకును హేతువులైనవి.

రాజసూయయాగ మొనరింపఁ దలఁచినరాజు సమ్రాట్టై యుండవలయును. ఇతర రాజులందఱు నాతనికి లోఁబడి కప్పముకట్టుట కంగీకరింపవలయును. ఆ కాలపు రాజులలో జరాసంధుఁ డతి బలశాలియై శిశుపాలుఁడు సేనాపతియు హంసడిభకులు వామదక్షిణ భుజములవలె సర్వ సాధన సమర్థులు నయి తన్ను గొల్చుచుండ క్షత్రియుల నెల్లర జయించి యజయ్యుఁడై యుండెను. అతఁడు మహిలోని రాజుల నందఱఁ బట్టితెచ్చి నిత్యమొక్కొకని నూనరివలె వధించి బలిచేయుచు భైరవపూజ యొనర్చుచుండెను. కృష్ణుఁడు కంసుని జంపినప్పటినుండియు నతఁడు తన కల్లుఁడగుటచే జరాసంధుఁడు కూఁతు ప్రేరణచేఁ గృష్ణుని కనేకవిధముల నుపద్రవ మొనరించుచుండెను. అతఁడొకప్పుడు హంసడిభకులతో మధురంపై దండెత్తెను. యదువృష్ణి భోజాంధక వీరు లాతని నెదిరించి యుద్ధము కావించిరి కాని జయింపఁ జాలకపోయిరి. తరువాత వారుపాయ బలమున హంసడిభకులొండొరుల మరణవార్త విని మరణించున ట్లొనరింప జరాసంధుఁ డసహాయుఁడై మగధపురమునకుఁ దిరిగిపోయెను. అతనితోడి వైరము బలవంతమగుటచే యాదవులు మధురలో నుండఁజాలక కుశస్థలమునకు వచ్చి రైవతక పర్వతమున గొప్ప దుర్గములు నిర్మించుకొని సుఖముగాఁ గాలము గడుపుచుండిరి. కృష్ణు నంత వానికిఁ గూడ నసాధ్యుఁడైన యా జరాసంధు నెట్లో జయించినఁగాని ధర్మరాజునకు రాజసూయ యాగాచరణార్హత కలుగదు. అఁదుచేతనే కృష్ణుఁ డతనిఁ జంపినపిమ్మటనే ధర్మజున కురుతర సామ్రాజ్య వైభవము సుస్థిరముగఁ జేకూరుననియు, నప్పుడు రాజసూయయాగము

చేయుట సాధ్యమగుననియుఁ బలికెను. తరువాత నతఁడు ధర్మజు నొప్పించి భీమార్జునులతో నరిగి, భీమునిచే జరాసంధుని జంపించెను. జరాసంధ వధ వలన మూఁడు ఘనలాభములు చేకూరెను. ఒకటి ధర్మజుఁడు రాజసూయ యాగ మొనరించుట కానుకూల్య మేర్పడెను. రెండు బలవద్వైరి వినాశముచేఁ గృష్ణునకును యాదవులకును మనస్సంతాపము తొలఁగెను. జరాసంధునిచే బంధితులైన రాజులెల్లరును విమోక్షితులై ధర్మజునియెడఁ గృతజ్ఞులై యుండుట సంభవించెను

జరాసంధ వధానంతరము భీమార్జున నకుల సహదేవు లపార చతురంగ బలసమేతులై నలుదెసల కరిగి యాయా దిక్కులనున్న రాజులచే నసంఖ్యాతములైన ధనవస్తు వాహన నివహములు గొనివచ్చిరి. దీనివలన రాజసూయమునకుఁ గావలసిన ధనసంపదలు చేకూరుటయేకాక ధర్మజుని సార్వభౌమత్వముకూడసుప్రతిష్ఠిత మయ్యెను అప్పుడుమంత్రులుదిగ్విజయ లబ్ధవైభవసమృద్ధిని వర్ణించి "యవనీశులెల్ల నీ యనుజవీర్య విజితులయి త్వదీయ శాసనస్థు లయిరి జగతీశ! యిదియ నీ యజ్ఞకార్యమునకు నవసరం"బని హెచ్చరించిరి తరువాత ధర్మరాజు రాజసూయ యాగదీక్షితుఁ డయ్యెను.

జరాసంధ వధ వలెనే శిశుపాలవధయు మిక్కిలి ముఖ్యమైనది. శిశుపాలుఁడు సామాన్యుండు కాఁడు. అతఁడు తొల్లిటి జన్మములందు హిరణ్యకశిపుఁడును, రావణుఁడునై శ్రీమన్నారాయణునితో వైరము సాధించిన వాఁడు, శ్రీమన్నారాయణుఁడు నరసింహ రామావతారములెత్తి వారిని సంహరించెను. అతఁడు శ్రీకృష్ణావతారముఁ దాల్చుటకుఁగల ప్రయోజనములలో శిశుపాల వధయు నొకటి. శిశుపాలునితల్లి సాత్వతి శ్రీకృష్ణునకు మేనత్త. ఆమె తన కుమారుని కాతనివలన మరణము కలుగునని యెఱింగి యతఁ డొనరించు శతాపరాధములు సైపుమని ప్రార్థించెను. కృష్ణుఁ డామె కట్లే చేసెదనని వాగ్దానమొసంగి శతాపరాధములు సైరించి, రాజసూయ యాగ సందర్భమున శిశుపాలుఁడు గర్వితుఁడై తన్ను నిందించిన సమయమునఁ జక్రముచే నాతని కంఠము ఖండించెను. దానితో నర్ఘ్యవిషయమున నుప్పతిల్లిన వివాదము చల్లారెను. రాజసూయము నిర్విఘ్నముగాఁ బూర్తి యయ్యెను. శ్రీకృష్ణుఁ డవతారమూర్తియై చేయవలసిన మహాకార్యములలో నొకటి నెఱవేఱెను.

ధృతరాష్ట్రుఁడు కొడుకు మేని కార్శ్య వైవర్ణ్యములు తెలిసికొని దుఃఖితుఁడై "ఏమి కొఱఁత యయ్యె. రాజ్యభోగ సుఖపరాఙ్ముఖత్వముఁ బొందనేల" యని యడిగినప్పుడు దుర్యోధనుఁడు రాజసూయ వైభవమును వివరముగా వర్ణించి ధర్మరాజుతో జూదమాడుట కనుజ్ఞ యిమ్మని వేఁడుకొనెను. ధృతరాష్ట్రుఁడు విదురు నడిగి యాతని యనుమతము వడసి వర్తింతమని పలికెను. ధర్మపరాయణుఁడైన విదురుఁడు కలహకారణమైన ద్యూతమున కంగీకరింపఁడని దుర్యోధనుఁ డెఱుంగును. అందుచే నతఁడు "దీనికొడఁబడు మొడఁబడవేని సర్వభక్షుచేత భక్షితుండ నగుదు" నని మొండి పట్టు పట్టెను. అప్పుడు ధృతరాష్ట్రుఁడు వేవురు శిల్పాచార్యులచే రమ్యముగా నొకసభ నిర్మింపఁజేసి యందు జూదమాడుటకు ధర్మజుని దోడ్కొని రమ్మని విదురుని బంపెను. విదురుఁడు భీష్మునికంతయు నెఱిఁగించి యది యపకర్మమని వెడలక యుండిపోయెను. తరువాత ధృతరాష్ట్రుఁ డెన్నివిధములఁ జెప్పినను వినక దుర్యోధనుఁడు ద్యూతార్థమై ధర్మజుఁ బిలువఁ బంపుమని మరల వేఁడుకొనెను. ధృతరాష్ట్రుఁ డెట్టకేల కొడంబడి విదురుని రావించి ద్యూతమునకై ధర్మజుని గొనిరమ్మని పంపెను. విదురుఁ డనిష్టముగనే యరిగి ద్యూతమునకు ధర్మజుని గొనివచ్చెను. మయసభనుగూర్చి యీర్ష్యాళువై సంతపించుచున్న దుర్యోధను ననుకయించుటకై ధృతరాష్ట్రుఁడు శిల్పాచార్యుల రావించి నిర్మింపఁజేసిన సభ దుర్యోధనుని యీసును దగ్గింపఁజాలక పోవుట యటుంప జూదమాడుటకును, దుశ్శాసనుఁడు ద్రౌపది వలువ లొల్చి యామె నవమానించుటకును, పునర్ద్యూతమునకును నెలవై దారుణమైన పరిణామమునకు దారి తీసెను.

ధృతరాష్ట్రుఁడు ద్రౌపదీ పరాభవ వృత్తాంతమును, భీమసేనుని భీషణ ప్రతిజ్ఞను, ఉత్పాతములు పుట్టుటను విని, దుర్యోధనుని మందలించి, ద్రౌపది కామె కోరిన వరము లొసంగెను. పిమ్మట నాతఁడు ధర్మజుని రావించి స్వరాజ్యము గ్రహించి యెప్పటియట్ల యేలుకొనుమని యింద్రప్రస్థమునకుఁ బంపెను. ఇది పునర్ద్యూతమునకును, శకుని యందపూర్వమైన పణము నేర్పఱుచుటకును గారణమయ్యెను. పునర్ద్యూతమున నోడి యా నియమము ననుసరించి ధర్మజుఁడు భార్యానుజులతో నడవికిఁ బోవలసివచ్చెను. అడవికేగు సమయమున భీమార్జుననకులసహదేవులు భయంకరములైన శపథములు గావించిరి.

పాండవులు హస్తినాపురము విడిచి వెడలిన తరువాతఁగూడ సంజయుఁడును విదురుఁడును దుఃఖితుఁడైన ధృతరాష్ట్రు నోదార్చి పాండవులఁ బిలిచించి వారి రాజ్యము వారికీవలసినదని యుపదేశించిరి. ధృతరాష్ట్రుఁడా పలుకులు వినియు విననియట్లుపేక్షించి యూరకుండెను. సభాపర్వమున నీ విధముగా నన్నయ కార్యకారణ సంబంధముతోఁ గూడియుండునట్లుగా వస్తుసంవిధానము గావించి దానిని సహృదయ హృదయానంద సంధాయకము నొనరించెను.

కథాకథనము : నన్నయ తన కవిత్వమునందలి గుణములలోఁ బ్రసన్న కథాకలితార్థ యుక్తి యొకటి యని చెప్పెను. ప్రసన్నమనఁగాఁ బ్రసాద గుణముతోఁ గూడినది. "బుధులచేఁజెప్పఁబడకయు సుఖ శబ్దార్థ సంయోగమువలన శబ్దముగాని యర్థముగాని ప్రతీయమానమగుట ప్రసాద మనఁబడు" నని భరతుఁడు ప్రసాదగుణమును నిర్వచించెను. ప్రసాదగుణము శబ్దార్థములు రెండింటికిని సంబంధించియుండుననియు ఝటితివ్యవభాసకత్వమే దాని ప్రధాన లక్షణమనియు నతని యభిప్రాయము. దీనినిబట్టి ప్రయోజన రహితములైన సందర్భములను బునరుక్తులను నుజ్జగించుచు విన్నంత మాత్రమున నందలి తత్త్వమును స్ఫురింపఁ జేయుటయే కథను బ్రసన్నముగా నొనరించుట యని చెప్పవచ్చును. నన్నయ ప్రధాన కథ యందును ఉపాఖ్యానము లందునుగూడఁ బ్రసన్నతను గల్గించుటకుఁ బ్రయత్నించియుండెను.

దుర్యోధనుఁడు ద్రౌపదిని సభకుఁగొనిరమ్మని ప్రాతికామిని బంపినప్పుడామె యతనిని "కింను పూర్వం పరాజైషీ రాత్మానం మాంను భారత"అని ధర్మరాజు నడిగిరమ్మనెను. అతఁడు సభ కరిగి ద్రౌపదీవాక్యము నెఱింగించెను. ధర్మరాజు గతసత్త్వునివోలె నిశ్చేష్టుఁడై యూరకుండెను. దుర్యోధనుఁడు "ద్రౌపది స్వయముగనే యా ప్రశ్న నడుగవచ్చును. ఆమెను సభకుఁగొనిర"మ్మని ప్రాతికామిని మరలఁ బంపెను. ప్రాతికామి ద్రౌపది కడకేగి యా విషయము తెల్పెను. ద్రౌపది "విధివిధాన మిట్లున్నది కాఁబోలును. దైవమే నన్ను రక్షించు" నని భావించి యూరకుండెను. తరువాత ధర్మరాజు ద్రౌపదికడ కొక దూతను బంపెననియు (ద్రౌపద్యాస్స మ్మతం దూతం ప్రాహిణోత్) ద్రౌపది యేకవస్త్రయు నధోనీవియునై యేడ్చుచు సభ కరుదెంచి మామముందు నిల్చెననియు మూలమున నున్నది.

దుర్యోధనుఁడు ప్రాతికామితో "ఇహైవేతాఽమానయ ప్రాతికామిన్ ప్రత్యక్ష మస్యాః కురవో బ్రువన్తు (60–16)" అని ప్రాతికామిని మరలఁ బంపెను. ప్రాతికామి ద్రౌపదీకోపభీతుఁడై యట్లు చేయుటకు జంకుచుండుట యెఱింగి దుర్యోధనుఁడు ద్రౌపదిని సభకుఁ గొనిరమ్మని దుశ్శాసను నాజ్ఞాపించెను. ద్రౌపది భీతయై స్త్రీలున్నకడకుఁ బరువెత్తఁగా దుశ్శాసనుఁ డామెను వెంటనంటి కేశములు పట్టుకొని సభ కీడ్చుకొనివచ్చెను.

పై వృత్తాంతమును బట్టి ధర్మజుఁడు దూతను బంపఁగా ద్రౌపది యేడ్చుచు సభ కరుదెంచెనని తెలియుచున్నది. అప్పుడు దుర్యోధనుఁడు ద్రౌపదిని సభకుఁ గొనిరమ్మని ప్రాతికామిని మరలఁ బంపుటకును, అతఁడు భయపడుచుండఁగా దుశ్శాసను నామెను గొనిరమ్మని యాజ్ఞాపించుటకును అవసరములేదు. నన్నయ ధర్మజుఁడు ద్రౌపదికడకు దూతను బంపిన వృత్తాంతమును విడిచిపైచి యామె రెండవమాఱు తనదగ్గఱకు వచ్చిన ప్రాతికామి వెంటనే సభ కరుదెంచెననియు, దుర్యోధను నానతిపై దుశ్శాసనుఁ డామెను కేశాకర్షణమున సభ కీడ్చుకొని వచ్చెననియు రచించి పునరుక్తి పరిహరణ పూర్వకముగాఁ గథకుఁ బ్రసన్నత గలిగించెను.

ధృతరాష్ట్రుఁడు దుర్యోధనుని సంతాపమును విని శిల్పాచార్యులను రావించి రమ్యమైన సభ నిర్మింపఁజేసెను. తరువాత నతఁడందు ద్యూత మాడుటకై ధర్మజుని గొనిరమ్మని విదురుని నియోగించెను. ఇచ్చట మూలమున

> ఇత్యుక్తో విదురో ధీమాన్ నైత దస్తీతి చింతయన్
> ఆపగేయం మహాప్రాజ్ఞ మభ్యగచ్ఛ త్సుదుఃఖితః 45–58

అని విదురుఁ డుభీష్మునికడ కరిగెనని చెప్పఁబడినది. తరువాత 46 వ అధ్యాయమున కథ వేఱుత్రోవ త్రొక్కుచున్నది. విదురుఁడు భీష్మునికడకేగి యేమి చెప్పెనో యేమి చేసెనో యందు వివరింపఁబడి యుండలేదు. జనమేజయుఁడు ద్యూత వృత్తాంతము చెప్పుమనఁగా వైశంపాయనుఁడు చెప్పఁ దొడంగెను. ధృతరాష్ట్రుఁడు విదురు నభిప్రాయము నెఱింగి ద్యూతము మానుమని దుర్యోధనుని కుపదేశించెను. దుర్యోధనుఁడు రాజసూయ వైభవమునఁ దనకు జరిగిన యవమానమును మూఁడధ్యాయములలో (47, 48, 49)

వివరించెను. ధృతరాష్ట్రుఁ డాతని ననునయించుటకై యత్నించెను కాని లాభము లేకపోయెను. దుర్యోధనుఁడు శకుని ప్రేరితుఁడై ద్యూతప్రసంగము మరలఁదెచ్చెను ధృతరాష్ట్రుఁడు విదురునితో నాలోచించి నిశ్చయించెదనని చెప్పెను. విదురుఁడు ద్యూతమున కంగీకరింపఁడని తెలిసినవాఁ డగుటచే దుర్యోధనుఁడు పట్టుపట్టెను. ధృతరాష్ట్రుఁడు సభను నిర్మింపఁజేసి సుహృద్ద్యూతార్థమై ధర్మజుని గొనిరమ్మని విదురు నాజ్ఞాపించెను విదురుఁడు ద్యూతము తనకు సమ్మతము కాదని తెల్పియు ధృతరాష్ట్రుని బలవంతముచే నరిగి ధర్మజుని దీసికొని వచ్చెను.

నన్నయ రచనలోఁగూడ నీ సందర్భమునఁ గొంత పునరుక్తి లేకపోలేదు కాని యాతఁడు కొన్ని యసందర్భములను దొలఁగించుటకును గొన్ని యంశములను సమర్థించుటకును యత్నించెను. విదురుఁడు భీష్మునికడకరిగిన సందర్భమున నన్నయ "ఆతండును నాపగేయుని కంతయు నెఱింగించి యిది యపకర్మంబనుచునుండె" నని యాతఁ డాకార్యమునందే మగ్నుఁడై యుండినట్లు సూచించెను. ధృతరాష్ట్రుని యుపదేశముచే దుర్యోధనుఁడు ద్యూతవ్యవసాయమునుండి మరలునేమోయని యాతఁడు కొంతసేపు నిరీక్షించుచుండెను గాఁబోలును కాని యాతఁడనుకొనినట్లు జరుగలేదు. దుర్యోధనుఁడు ద్యూతమునకై ధర్మనందనుని దప్పక రావింపవలయునని పట్టుపట్టెను. ధృతరాష్ట్రుఁడు చేయునదిలేక భీష్మునికడ నిరీక్షించుచున్న విదురుని బిలిచి ధర్మజుని గొనిరమ్మని నియోగించెను మూలమున "విదురునితో నాలోచించి కార్యనిశ్చయ మొనరించెదనని" ధృతరాష్ట్రుఁడు రెండుమార్లు చెప్పినట్లున్నది. అట్లే సభా నిర్మాణ ప్రసంగముకూడ నందు రెండుమార్లు చెప్పఁబడినది. నన్నయ యీ పునరుక్తులను దొలఁగించెను. ధృతరాష్ట్రుఁడు తాను నిర్మింపఁజేసిన సభ దుర్యోధనునికిఁజూపి, జూదమువలని దోషము లెఱిఁగించి యా సభయందధికములైన దక్షిణలిచ్చి యిష్టమైన యజ్ఞ మాచరింపుమని యాతని ననునయించెను. దుర్యోధనుఁడు ధర్మజునితో జూదమాడఁ గలుగుటయే నాకు యజ్ఞమని పలికి ధృతరాష్ట్రుఁడు నిర్మింపఁజేసిన సభకును ధర్మరాజు సభకును గల వ్యత్యాసము తెల్పుటకోయనఁ దాను జూచిన సభ వైభవమును వర్ణింప మొదలుపెట్టెను. దానినిచ్చట మరల వర్ణించుట కీ విధముగా నన్నయ యొక హేతువును ప్రదర్శించెను.

ధృతరాష్ట్రుఁడు ద్రౌపదికిఁ గోరినవరము లొసంగి, యామె ధర్మజ్ఞతకు సంతసిల్లి, ధర్మరాజునకు మరల రాజ్యము నేలుకొమ్మని సమర్పించెను. నన్నయ ఈ సందర్భమున "దానినంతయు భీమసేనుండు విని" సతి కారణమునఁ దమకు రాజ్యము ప్రాప్తమగుట తలంచి మిక్కిలి కోపించెను. ధర్మజుఁడాతని ననునయించి యనుజ భార్యాసహితుఁడై యింద్రప్రస్థపురమున కరిగెను. నన్నయ ఈ సందర్భముననే "దుశ్శాసనుచేత నంత వృత్తాంతంబును విని దుర్యోధనుఁడు" కర్ణ శకుని సైంధవులతో మరల నాలోచించుటకు మొదలుపెట్టెనని వ్రాసియుండెను. పై రెండు సందర్భములందును ప్రయోగింపఁ బడిన 'విని' యను పదముచే వరరాజ్య ప్రదానకార్యము భీమ దుర్యోధనుల పరోక్షమున జరిగెనని వ్యక్తమగుచున్నది. ఆ సమయమున వారు సమక్షముననే యుండినచో నది యట్లు జరిగి యుండకపోయెడిది. ఈ విధముగా నన్నయ కొన్నిచోట్లఁ గథా భాగముల నుచితపద ప్రయోగముచే ధ్వనింపఁ జేయుచుండును.

జరాసంధ జనన వధ వృత్తాంతము, శిశుపాల జనన వృత్తాంతము, అగ్ని పారదారికుఁడైన వృత్తాంతము, వృద్ధహంస వృత్తాంతము, విరోచన సుధన్వుల వృత్తాంతము అనునవి సభాపర్వమునఁ గల యుపకథలు. ఇందు మొదటి రెండును భారతకథతో సన్నిహిత సంబంధము కలిగినట్టివే. మిగిలిన మూఁడును నతి స్వల్ప పరిమాణము గలవి. నన్నయ వాని నాయా సందర్భములం దతి సంగ్రహముగను రమణీయముగను జెప్పియుండెను.

ధర్మరాజు రాజసూయ యాగాచరణాభిలాష నెఱింగించి తన్నందు నియోగింపఁ గృష్ణుని వేడుకొన నతఁడు ధర్మరాజు రాజసూయయాగము చేయుటకు సర్వవిధముల నర్హుఁడని తెలిపి యందలి క్లేశముకూడ వెల్లడించుటకై జరాసంధుని యసాధారణ బల సామర్థ్యములను వివరించెను. ఆ సందర్భమున కృష్ణుఁ డతఁడు మధురపై దండెత్తి వచ్చుటయు హంసడిభకుల మరణముచే నా యాపద తాత్కాలికముగాఁ గడచినను వానితోడి వైరము బలవంత మగుటచేఁ దాము మధుర నుండఁజాలక కుశస్థలమున కరుదెంచుటయు నెఱింగించెను. ధర్మజున కది యాశ్చర్యము కలిగించుటచే నతఁడు జరాసంధున కట్టి యజేయ భుజ విక్రమాధిక్య మెట్లుకలిగెనో తెల్పుమని కృష్ణు నడిగెను. కృష్ణుఁ డాతని జనన వృత్తాంతమును, వరప్రాప్తియు, బల

సామర్థ్యములును విశదీరించెను. బృహద్రథుఁడు చండకౌశికుఁడిచ్చిన చూత ఫలమును దన యిరువురు భార్యలకు సమముగా విభజించి పెట్టెను. వారి కర్ధార్ధ శరీరభాగములతో మనుజశకలము లుదయించుట కదియే కారణము, జర మెదలుచున్న వ్రయ్యాలదిమి రెండిటిని గూడఁ బట్టఁగనే యవి యొండొంటితోఁ జక్కగా నంటుకొని రెండు నొక్కఁడయ్యెను. జర యను రాక్షసిచే సంధింపఁబడినవాఁ డగుటచే రాజాతనికి జరాసంధుఁడని పేరు పెట్టెను. అతఁడు పెరిఁగి పెద్దయైనపిమ్మట చండకౌశికుఁడు బృహద్రథు ప్రాసాదమున కరుదెంచి బాలుని జూచి సంతోషించి యాతఁడు శివుని సన్నిహితుఁ జేసికొనుననియు, దివ్యాస్త్రము లతని దేహమును భేదింపఁ జాలవనియు,నతఁడు కుమారునంతియ శక్తిసంపన్నుఁడగుననియు వచించెను ఆయుధ యుద్ధమున నాతని నెవ్వరును జయింపజాలరని శివుఁడు వరమొసంగెను. అందుచేతనే కృష్ణుడు మల్లయుద్ధమున భీమునిచే నాతనిఁ జంపించెను. "ఏ యాయుధంబున నెమ్మెయిఁ బోరంగఁ నిష్టమయ్యెది యుత్సహింపుఁ" డని జరాసంధుఁడు పలుక కృష్ణుఁ "డొక్కనితోఁ బల్వు రుద్ధతులయి పూని యుద్ధంబుసేయుట యుచితమగునె... మా మువ్వురిలో నొక్కరుని మహా బలాఢ్యుఁ గోరికొనుము. వాఁడు ఘోరాజిలో నిన్ను మొనసి మల్లయుద్ధమున జయించు" నని సమాధానమిచ్చెను. భీముఁడు జరాసంధునితో యుద్ధ మొనరించుచుండఁ గృష్ణుఁడు "భీముని అయ్యనిలదేవు బలంబును నీ బలంబు భాసురముగ మాకుఁజూపు"మని హెచ్చరించెను. అంత భీముఁ డనిలదేవునిఁ దలఁచి తత్ప్రసాదమున నధికసత్త్వ సమేతుఁడై జరాసంధుని వధించెను. అనవసర వర్ణనలు కాని, అనావశ్యక వివరములుకాని లేకుండ నన్నయ జరాసంధుని వృత్తాంతమును హృద్యముగా సాగించెను.

శిశుపాలుఁడు కృష్ణుని నిందించుటతో నాగక భీష్మునిఁ గూడ రూక్షాక్షర వచనముల నాక్షేపించుచుండ భీముఁ డాగ్రహావిష్టుఁడై శిశుపాల నిర్మూలనాభీల సంరంభము ప్రదర్శించెను. అప్పుడు భీష్ముఁ డాతనివారించి శిశుపాల జనన వృత్తాంతము నెఱింగించెను, శిశుపాలుఁడు చతుర్భుజలలాలు నేత్రములతోఁబుట్టి రాసభరవముతో నేడ్చుచుండ జననీజనకులు భయవిస్మయాధీన మనస్కులై కలఁత నొందుచున్న సమయమున నశరీరవాణి "యెవ్వరేని వీనినెత్తి కొనుడు మిగిలియున్న బాహుయుగళంబుఁగన్నును నడఁగు

వీని కతఁడ యంతకుం"డని పలికెను. కృష్ణుఁడు బలరామునితోఁగూడ మేనత్త యగు సాత్వతిని జూడనరుగ నామె శిశుపాలుని వారిరువురిచేతికి నెత్తికొన నిచ్చెను. కృష్ణుఁ డెత్తుకొనఁగనే యాతని మిక్కిలి చేతులును మిక్కిలి కన్నును అడఁగెను. అప్పుడు సాత్వతి కృష్ణునివలనఁ దన సుతునికి మరణ మగునని యెఱిఁగి యతని శతాపరాధములు సైఁపవలెనని ప్రార్థించెను. కృష్ణుఁ డట్లే వాగ్దానము చేసెను. శిశుపాలుఁడు కృష్ణునిచేతనే నిహతుఁ డగుననియు నన్యుల కప్రతిహతుఁడనియుఁ దెల్పుటకై భీష్ముఁ డీ వృత్తాంతమును భీముని కెఱింగించెను. నన్నయ రచించిన శిశుపాలవధ వృత్తాంతము మనోహరము లైన యుక్తిప్రత్యుక్తులతోఁ గూడి సరసమై శ్రీకృష్ణుని పరమేశ్వరత్వమును వ్యక్త మొనరించుచున్నది.

శిశుపాలుఁడు భీష్ము సధిక్షేపించుచు ధర్మమార్గమున వర్తిల్లుఁడని పక్షులనెల్ల శిక్షించుచు వాని యండముల భక్షించి వానిచే వధింపఁబడిన వృద్ధహంసకథ వివరించెను ఆ హంసవలెనే భీష్ముఁడుకూడ ధర్మశిక్ష కావించుచుఁ గౌరవుల కాపద యాపాదించుచుండెనని తెల్పుటకై అతఁడీ కథను జెప్పెను. ధర్మశిక్షా నటనము హంస భీష్ములయందలి సమానధర్మము. దుర్యోధను నానతిచేఁ దన్ను సభకుఁ గొనిపోవచ్చిన ప్రాతికామిని ద్రౌపది "మున్ను దనోడ్డిటువడి మఱినన్ను నోటువడియెనో నన్ను మునోడ్డిటువడి విభుఁడు గ్రననఁ దనోడ్డిటువడియెనో" తెల్పుమని ప్రశ్నించెను తరువాత నామె ప్రాతికామి వెంటనే సభకరుదెంచెను. దుశ్శాసనుఁ డామెను కేశాకర్షణమున సభలోని కీడ్చితెచ్చెను. పాండవులు చేయునదిలేక దుఃఖించుచుండిరి. అప్పుడు వికర్ణుఁడు ద్రౌపదీ ప్రశ్నమును జర్చించి యామె యధర్మవిజిత యని నిర్ణయించెను. కర్ణుఁ డాతని యభిప్రాయమును బ్రత్యాఖ్యానించెను. దుర్యోధనుఁడు ద్రౌపదీ పాండవుల వస్త్రము లపహరింపుమని దుశ్శాసనుని నియోగించెను. దుశ్శాసనుఁడు ద్రౌపదీ వస్త్రాపహరణము కావింపఁ బూని యట్లు చేయలేక లజ్జితుఁడై యూరకుఁడెను. భీముఁడు భీషణప్రతిజ్ఞ కావించెను. సభ్యులు ధృతరాష్ట్రులను అతని సుతులను నిందించుచు వృద్ధరాజులు ద్రౌపదీ వాక్యములు విచారింపక యుపేక్షించిరని చింతించుచుండిరి. అప్పుడు విదురుఁడు కలిగించుకొని వికర్ణుని ధర్మనిర్ణయమును బ్రశంసించి ధర్మసందేహము తీర్పనినాఁడు సభ్యు లనృత దోషమునం దర్ధమొందుదురనియు ధర్మ మెఱిఁ

గియు లాభలోభ పక్షపాతబుద్ధి నొందుగాఁ జెప్పిన ననృత దోష ఫలము పూర్తిగాఁ బొందుదురనియుఁ దెల్పి దానికిఁ బ్రమాణముగా విరోచనసుధన్వుల వృత్తాంత మెఱిఁగించెను. ఈ కథలో కశ్యపుఁడు ప్రహ్లాదునికి ధర్మ మధర్మ విద్ధమై సభకు వచ్చిన దానిఁ దీర్పని సభ్యులు ధర్మవిద్ధు లగుదురనియు, వా రధర్మము నాపనిచో నాయధర్మమునం దొక్కపాదము సభ్యులను, ఒక్కపాదము భూపతిని, దక్కినది కర్తను బొందుననియు. నధర్మము విధ్యుక్త మైనచో నొక్క కర్తనే పొందుననియుఁ జెప్పి ధర్మముతప్పక చెప్ప వలయునని వక్కాణించెను. ఈ విషయమును సభ్యుల దృష్టికిఁ దెచ్చుటకే విదురుఁ డీ కథ నెఱిఁగించెను. అతఁడట్లు చెప్పిన పిమ్మటఁగూడ దుర్యోధన భయమున సభ్యులెవ్వరును బలుకరైరి. భీష్ముఁడు మాత్రము దుఃఖితయైన ద్రౌపదిని జూచి యామె ప్రశ్న కొక్క యుధిష్ఠిరుఁడే యుత్తరము చెప్ప వలయుననియు ధర్మసూక్ష్మత యెవ్వరికైన నెఱుఁగ గహనమనియుఁ దెల్పి యూరకుండెను.

అగ్ని పారదారికుఁడైన కథ సహదేవుఁడు దక్షిణ దిగ్విజయ యాత్ర కరిగినప్పుడు చెప్పఁబడినది. అతఁడు మాహిష్మతీపురముపై విడిసినప్పు డగ్ని సహదేవుని సేనపై నెగసెనని వైశంపాయనుఁడు తెలుప విని జనమే జయుఁ డగ్ని యట్లు చేయుటకుఁ గారణమేమని యడిగెను. అతఁడు మాహి ష్మతీ విభునకు నగ్ని వరమిచ్చిన వృత్తాంతము తెలిపెను. సహదేవుఁడు మాహిష్మతిపై దండెత్తుటకు రాజసూయ యాగాచరణమే కారణము కాని పరరాజ్యాక్రమణౌద్ధత్యము కారణము కాదు. యాగము దేవతలకును ముఖ్యముగా నగ్నికిని బ్రీతికారణమైనది అట్టియెడ నగ్ని సహదేవుని సేన నాక్రమించి యాగమునకు విఘ్నము కలిగింపనెంచుట యాశ్చర్యకరముగాఁ దోఁచును. ఈ యాశ్చర్యమే జనమేజయునిచే నట్లు ప్రశ్నింపఁజేసినది. సహ దేవుఁ డగ్నిని స్తుతించునప్పుడు "యజ్ఞంబులును నీవ హవ్యవాహ! ధర్మ నిత్యుండైన ధర్మజు కావించు క్రతువు భవత్ప్రీతికరముగాదె. దానికి విఘ్నంబు దలఁచుట ధర్మమె" యని పలుకుటయు నీ విషయమునే సూచించు చున్నది. సహదేవ ప్రార్థితుఁడై యగ్ని సేనలకుఁ దనవలన భయములేకుండఁ జేసెను. అప్పు డాతఁడు మాహిష్మతీవిభుని కిచ్చిన వరము మోఘము కాలేదా యను ప్రశ్న యుదయించును. మాహిష్మతీవిభుఁ డగ్ని వర మడుగు మన్నపుడు

ఇప్పురంబు జయింపంగ నెవ్వరేని, వత్తురుద్ధతులయి శత్రువరులు వారు
దర్పమేది నీచేత నిర్దగ్ధులై వి,హీనులగునట్లుగా వరమిమ్ము నాకు

అని యడిగెను. ఇప్పుడు వచ్చిన శత్రువు లుద్ధతులై వచ్చినవారు గారు. యాగాచరణాంగముగా వచ్చినవారు. అందుచే నగ్ని యొనర్చిన కార్యమున వరభంగదోషము లేదు.

వర్ణనలు : నన్నయ వర్ణ్యమునకు సంబంధించిన వివిధాంశములను సంపూర్ణముగా వివరించి దాని సమగ్ర స్వరూపమును బఠితలకు సాక్షాత్కరింపఁజేయును. అతని వర్ణనలు నాతిదీర్ఘములయ్యు సమగ్రములై మిక్కిలి యుదాత్తములును గంభీరములునై విలసిల్లుచుండును. మయుఁడు నిర్మించిన సభయందలి మణిమయములైన దూలములను, కొలనులను, యంత్రములను, వనములను, దాని ప్రమాణమును, విభూతిని అతఁడు చక్కగా వర్ణించెను. దిక్పాలురయు బ్రహ్మయొక్కయు సభలను వర్ణించు నప్పుడాతఁడు వాని మణిమయత్వమును, విభూతిని, ప్రభావమును, ప్రమాణమును, అందుండు జనులను, బరివారమును సమగ్రముగా వివరించెను. ఇంద్రుఁడు దివిజోత్తములు గొలువ శచీసమేతుఁడై "వరాప్సరోంగనాయత విలసత్కటాక్ష కుసుమార్చిత సుందర వక్త్రి చంద్రుఁడై" కొలువుండు ననియు, బ్రహ్మసభ "ఈ వియత్తలమను కంబ మొక్కటియ తాల్పఁగ సుస్థిరమై నిజప్రభావలి శశివారిజమిత్రులమండలములను వెలిఁగించుచుండు" ననియుఁ, గుబేరుని "సభ కనకమయతరులతాలంకృతమయి తటిల్లతా విచిత్ర శరదంబుదంబు ననుకరించు" ననియు, వరుణుని సభయందు సకల సముద్ర సరిత్సరసీదీర్ఘికాదులును దిగ్ధాత్రీధాత్రీధరములును దేహవంతములై వచ్చి కొల్చుచుండు ననియు నాతఁడు చేసిన వర్ణన మాయా సభలయుఁ దత్పాలకులయు స్వరూపములను బ్రత్యక్షము కావించుచున్నది.

జరాసంధుఁడు భీమునితో మల్లయుద్ధమున కేగునప్పుడు వెండ్రుకలు పాచి ముడిచి గంటెసంగఁ దాల్చెనని చెప్పుట నన్నయ నిశిత పరిశీలనమును వెల్లడిచేయుచున్నది. అది మల్లయుద్ధ మగుటచే నాతఁడు మహోగ్రాయస పరిఘాయిత కఠినాయత భుజ దండ దారుణాఘాతములను మాత్రమే వర్ణించెను. భీముఁడు జరాసంధుని ముక్కునను, వాతను, గర్ణరంధ్రములను రక్తధార లొలుక శతవారములు వీచె ననుట మిక్కిలి సహజముగానున్నది,

నన్నయ భీమపార్థనకులసహదేవుల చతుర్దిగ్విజయములను వర్ణించుచు నానాఁటి భారతదేశ భౌగోళిక స్వరూపమును, దేశములయుఁ దద్విభులయు నామములను జక్కఁగా వివరించెను. ఆ సోదరులు గొనివచ్చిన ధనవర్గమును దెల్పుచు మంత్రులు దానిని మేరుశైలముతోడను, కుబేరుని నిధులతోడను కల్పవృక్షముతోడను బోల్చుట తత్సమృద్ధిని వేయి విధముల వెల్లడి చేయుచున్నది.

రాజసూయయాగమునకు వచ్చిన వివిధదేశ భూపాలురను, యజ్ఞపరికరములను, ఋత్విగాదులను, వేదనాదములను వర్ణించి నన్నయ యా సందర్భమున యజ్ఞవాతావరణమును గల్పించెను. ఆ సమయమున వేదాశీర్వాద వాదిత్రసనినాదము లన్యనాదము జనులకు వినఁబడకుండఁ జెలంగెనని చెప్పుట యా నాదముల సర్వతోముఖత్వమును వెల్లడించుచున్నది. నన్నయ రాజసూయయాగముయొక్క మహావైభవమును దానుగాఁ జెప్పక ద్వితీయాశ్వాసమున దుర్యోధనుఁడు తండ్రితోఁ దన మనస్తాపమును వివరించునప్పు డాతనిచేఁ జెప్పించెను అతఁ డఖిలజలధివలయితక్షోణిలో సఖ్య సంబంధములఁ జేసి చక్రధరుఁడును ద్రుపదుఁడును దప్పఁ బాండవుల కరిపెట్టని రాజు లెవ్వరును లేరనియు, శైలకాననద్వీప విశాలమైన వసుమతీ చక్రమంతయు వారికి వశమయ్యెననియు, ధర్మపుత్త్రు గృహము సర్వరత్నాకరైక ప్రశస్త రత్నపుంజముల కాస్పదమై యుండెననియుఁ, బాండవుల విభవ మాఖండల విభవముకంటెను గడు మిక్కిలియై పెరిఁగె ననియు వివరించెను మఱియు నాతఁ డేయే రాజు లేయే కానుక లొసంగిరో, యెంత యన్నదానము జరిగెనో, ద్రౌపది యెట్లు వర్తించెనో, ధర్మజుఁ డెట్లు బ్రాహ్మణాదుల గౌరవించెనో కన్నులకుఁ గట్టినట్లు వర్ణించెను.

ద్యూతమున ధర్మజుఁ డొక్కొక్క యొడ్డున నేమేమియొడ్డి యోడెనో నన్నయ విశదముగా వర్ణించెను. ద్రౌపదీ వస్త్రాపహరణానంతరమును, పాండవులు వనమున కరుగునప్పుడును నన్నయ వర్ణించిన యుత్పాతములు విలక్షణములై భవిష్యన్మహాసంగ్రామమును గౌరవులకుఁ గలుగనున్న యరిష్టమును సూచించుచున్నవి.

విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ బాండవు లడవికిఁ బోయిన తీరు చెప్పు సందర్భమున నన్నయ వ్రాసిన సీసము వారి యాకారచేష్టల నత్యంత విశద

ముగా వర్ణించుచున్నది. వానికి విదురుఁడు కావించిన వివరణముకూడ విపులమును విస్పష్టమునై యున్నది.

ఈ విధముగా సభాపర్వమున నన్నయ కావించిన వర్ణనలెల్ల నుదాత్తములును, సహజములును, రమణీయములునై, కథాగమనమున కడ్డము కలిగింపక పాఠకుల హృదయముల కానందము కలిగించుచున్నవి. ఇందు ప్రకృతినిగాని సూర్యోదయ చంద్రోదయాదులనుగాని, స్త్రీలనుగాని వర్ణింపవలసిన యక్కఱ నన్నయకుఁ గలుగలేదు.

రసపోషణము : నన్నయ నిగ్రహవంతుఁడు. అతఁడెచ్చటను భావములను బొంగి పొరలునట్లుగా వర్ణింపఁడు. భావనిగ్రహ మాతని రచనలో సర్వత్ర గోచరించు చుండును. ఎట్టి యెడరు దొడరి నప్పుడైన నాతని పాత్రలు గాంభీర్యమును విడువక నిగ్రహముతో వర్తించుచుండును. దుశ్శాసనుఁడు కేశములు పట్టుకొని సభకీడ్చుకొనివచ్చినప్పుడు ద్రౌపదియు, వస్త్రాపహరణ సమయమున ధర్మజార్జునులును వర్తించిన తెఱంగిందుకు నిదర్శనము.

భారతము బహు విస్తృతమైన గ్రంథము. పలు విధములైన కథోపాఖ్యానములందు వర్ణింపఁ బడియుండుటచే నది నానా రసాశ్రయమై యుండును. ఇందలి అంగిరసము శాంతము. కవి దీనికి విరోధముకాని న్యూనతకాని కలుగకుండునట్లుగా నంగ రసములను వర్ణింపవలయును. అంగ రసములనే విపులముగా వర్ణించిన నంగిరసమునకుఁ బుష్టి తగ్గిపోవును. "విరోధిన స్తు రసస్య అంగిరసాపేక్షయా కించిన్న్యూనతా సంపాదనీయా. న్యూనోహ్యంగభూతోఽంగినం బలీయాంసం బాధితుం న శక్నుయా దిత్యాశయః" అని ధ్వన్యాలోకమును దద్వ్యాఖ్యయు నుడువుచున్నవి. ఈ విషయమును బాగుగా నెఱింగిన వాఁడగుటచే నన్నయ యంగిరసమున కెక్కడను భంగము కలుగకుండ నంగరసములను బోషించియున్నాఁడు.

దుశ్శాసనుఁడు తన్ను సభలోని కీడ్చుకొని వచ్చినప్పుడు ద్రౌపది కోప లజ్జాపరవశయయి చేయునదిలేక తుదకు భీతయై కృష్ణుని దలంచెను. ఈ సన్నివేశము భక్తిరస ప్రకటమున కెంతో యనువైనది. ఇచ్చట భక్తిరస ప్రచురములైన పద్యము లెన్నో గుప్పించుటకు వీలున్నను నన్నయ ''కోమలి కృష్ణుఁ దలంచె భీతయై" యని యొక్క వాక్యము చెప్పి యూరకుండెను.

శిశుపాలుఁడు కృష్ణు నాక్షేపించు సందర్భమున సహదేవుఁడు క్రుద్ధుఁడై కృష్ణున కర్ఘ్య మిచ్చుట కొడంబడక దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకముపై నిడియెద నని పల్కుచు సభలోఁ జరణమెత్తెను. దుర్యోధనుఁడు ద్రౌపదిని దన యూరుతలము నెక్కరమ్మని సన్నచేసిన సందర్భమునఁ గౌరవ కురంగ మృగేంద్రుఁడైన భీముఁ డల్కమై నాతని నాజి భగ్నోరువు నొనర్తునని శపథము చేసియుండెను. ఇట్లే వస్త్రాపహరణ సందర్భమున నతఁడు దుశ్శాసను వధించి యాతని రొమ్ము నెత్తురు నాస్వాదించెద నని పల్కెను. ఈ ఘట్టము లన్నియు రౌద్ర రసమును విస్తృతముగా వర్ణించుటకు వీలైన పట్లు. నన్నయ యట్లు చేయక వానిని సూచ్యములు గావించి విడిచివైచెను.

సభాపర్వమున వీర కరుణాద్భుత రౌద్రరసము లాయా ఘట్టము లందుఁ జక్కగాఁ బోషింపఁబడినవి. వీరమునకు స్థాయి యుత్సాహము. నారదవచన ప్రేరితుఁడై ధర్మజుఁడు పితృప్రీత్యర్థమై రాజసూయ మొనర్ప నుత్సాహముచూపు సందర్భమున ధర్మవీరమున్నది. భీమార్జునాదుల దిగ్జైత్రయాత్రను వర్ణించు సందర్భమున యుద్ధవీరము పోషింపఁ బడినది. ద్యూత పునర్ద్యూత ఘట్టములందు ధర్మజు నెట్లైన నోడించి రాజ్య మపహరింపవలె నను నుత్సాహము శకుని దుర్యోధనులం దధికముగా గోచరించును. అచ్చట పోషితమైన వీరముకూడ యుద్ధవీరమునందే యంతర్భవించును. భీముఁడు జరాసంధుని వధించు సందర్భమున రౌద్రము గోచరించును. ద్రౌపదిని దుశ్శాసనుఁడు సభకీడ్చుకొనివచ్చినప్పుడు భీముఁ డామెను జూచి దుఃఖితుఁడై ధర్మజుని బాహుదాహము చేయవలెనని కోపించి పల్కినప్పుడు రౌద్రాభాస మున్నది. భీమార్జునాదులు వనగమనసమయమునఁ గ్రుద్ధులై శపథము లొనరించు సందర్భము రౌద్ర రసమయమై యున్నది. దుశ్శాసనాకృష్టయై ద్రౌపది సభకరుదెంచి భీతయై కృష్ణుఁ దలంచునప్పుడు భయానకరసము ద్యోతిత మగుచున్నది. నారదుఁడు దిక్పాలవిధాతృల సభలను వర్ణించు సందర్భ మద్భుతావహమై యున్నది. మయసభలో దుర్యోధనుఁడు సంవృత ద్వారమును వివృతమనియు వివృతమును సంవృతమనియు, నిర్జలప్రదేశమును సజలమనియు సజలప్రదేశమును నిర్జలమనియు భ్రాంతిపడి యవమానమునకు గుఱియైనప్పుడు హాస్యచ్ఛాయలు గోచరించుచున్నవి. పాండవులు ద్రౌపది

తోఁగూడ నడవి కరుగునప్పుడు కుంతి విలపించు ఘట్టము కరుణరస నిర్భరమై యున్నది. విదురుఁడు పాండవులు వనమున కేగిన తీరు ధృతరాష్ట్రునకు వర్ణించునప్పుడుకూడఁ గరుణరసము ద్యోతితమగుచున్నది.

పాత్రపోషణము : నన్నయ పాత్రపోషణమునఁ గృతహస్తుఁడు. అతఁడు సర్వపాత్రల స్వభావమును లెస్సగా నూహించిన వాఁడగుటచే వానిని సుస్పష్టరేఖలతోఁ దీర్చిదిద్దుచుండును. గాంభీర్యౌదాత్త్యము లాతని పాత్రలయందలి సామాన్య లక్షణములు. ధృతరాష్ట్రుఁడు ధర్మజ్ఞుఁడయ్యును సుతవశంగత వర్తనుఁడు. ద్యూతము కలహకారణమని యాతఁడెఱుంగును. అయ్యును దుర్యోధనుని ప్రీతికై యాతఁడు ద్యూతక్రీడ కనుమతియొసంగ వలసివచ్చెను. సభలో ద్రౌపదికి జరిగిన యన్యాయమును నిరోధింపకుండు టకుఁగూడ నాతని సుతప్రీతియే కారణము. ద్రౌపదిని బిల్చి వరము లిచ్చు టయుఁ బాండవులకు రాజ్యమును సమర్పించుటయు నాతనికిఁగల బంధు ప్రజాభిప్రాయ భీతిని బాండవులందంతర్గతమైన ప్రేమను సూచించుచున్నవి. సభాపర్వమున దుర్యోధనుని యీర్ష్యాళుతయు నభిమానధనత్వమును దుష్ట తయుఁ జక్కగా వర్ణింపఁబడినవి. దుర్యోధన దుశ్శాసన కర్ణ శకునులకు దుష్టచతుష్టయ మను ప్రతీతి కల్గించిన కథాభాగము సభాపర్వమునందే యున్నది. దుర్యోధనునికి ద్యూతమునందభినివేశము కలిగించి మాయా కౌశలముచే ధర్మజు నోడించుట శకునియొక్కయు, నీర్ష్యాళువై తండ్రిని ద్యూతమున కంగీకరింపఁజేసి సభలో ద్రౌపది నవమానింప యత్నించుట దుర్యోధనుని యొక్కయు, 'ఇదిసేయగాదని మది విచారింపక' ద్రౌపది పుట్టములొల్వఁబూనుట దుశ్శాసనుని యొక్కయు, ద్రౌపదిని విగతవస్త్ర నొనర్చి సభకుఁ దెచ్చినను ధర్మవిరోధములేదని పల్కుట కర్ణునియొక్కయు దౌష్ట్యమును వేయివిధముల విశదీకరించుచున్నవి. నన్నయ ధర్మజుని ధర్మ పరాయణత్వమును, అర్జున నకుల సహదేవుల యగ్రజాశయానుగుణవర్తన మును, భీముని యమాయిక కోపమును, ద్రౌపది భక్తిపాతివ్రత్యాభిజాత్య ధర్మజ్ఞతా గృహిణీత్వములను జక్కగా వ్యక్తము చేసెను. భారత కథలో నధర్మము జరిగినప్పుడెల్ల జంకక ధృతరాష్ట్రి దుర్యోధనాదుల కట్లు చేయ రాదని ధైర్యముతోఁ జెప్ప సాహసించినవాఁడు విదురుఁడొక్కఁడే. ఇది యాతని ధర్మపరాయణతను సూచించుచున్నది. ధృతరాష్ట్రుని కాతని

ధర్మజ్ఞతపై నమితమైన ప్రత్యయమున్నది కుంతికి గొడుకులపైని కోడలిపైని గలప్రీతి యతిమాత్రమైనది. సభాపర్వమున శ్రీకృష్ణుని భక్తపరాధీనతను, పాండవప్రీతిని, దుష్టశిక్షణ సామర్థ్యమును నన్నయ లెస్సగా వెల్లడించెను. ద్రౌపదికి సభలో నవమానము కలుగకుండఁ గాపాడినవాఁడా సుజనత్రాణపరాయణుఁడే. భీమునిచే జరాసంధుని వధింపఁజేయుటయు, శిశుపాలుని స్వయముగా సంహరించుటయు నాతని దుష్టనిగ్రహణ దక్షతకు నిదర్శనములు. ధర్మజుని రాజసూయము నిర్విఘ్నముగా సాగిపోవుట కాతఁడు రక్షకుఁడై యుండుటయే కారణము. సభాపర్వమున శిశుపాల జరాసంధుల యౌద్ధత్యమును, సాత్వతీపుత్త్రి ప్రేమయు, మయుని కృతజ్ఞతయు, నారదుని కలహాశనత్వమును, ప్రహ్లాదుని ధర్మపరాయణతయు, సంజయ భీష్ముల ధర్మపక్షపాతమును నిపుణముగా సూచింపఁబడినవి.

నన్నయ పాత్రలను బ్రవేశపెట్టునప్పుడే యుచిత విశేషణములచే వారి శీలములను సంగ్రహముగాఁ జెప్పివేయుచుండును "అతిదర్పోద్ధతుఁడు మహోద్భుత భూరిబలుండు చేదిభూపతి" (స. 1-110) "పాలిత దుర్నయుండు శిశుపాలుఁడు బాలుఁడు" (స-2-22) "ఖలుఁడు బృహద్రథాత్మజుఁడు గర్వితుఁడు" (స-౧-118) "ఆయత భుజవీర్యులు, మాయాయోధులు, హంసడిభకులనువార లనిర్జేయులు పరస్పర స్నేహాయత్త సుచిత్తులు" (స-౧-111) "ధర్మతనూజుండు ధర్మువు తప్పిన ధరణీతలంబెల్లఁ దల్లడిల్లు" (స-2-224) "అనుపమ దైవయోగహతుఁడయ్యె నవశ్యము ధర్మసంపదం దనరున కాని ధర్మజుఁడు ధన్యుఁడు ధర్మపథంబుఁ దప్పఁ ద్రొక్కునె" (స-2-2!8,)(దుశ్శాసనుఁడు) భృశకోపనుఁడు, దుర్మదుఁడు, "విచారవిదూరు సుయోధనున్ – ఇమ్మనుజాధమున్ గుణవిహీను – మానధనాఢ్యుఁడైన భూపతి",. "వాసవాత్మజుఁ బంపు మిప్పుడ వాఁడు ధర్మవిదుండు (స-2-180); "పుత్రవత్సలుండు విచిత్రవీర్యాత్మజుఁడార్యుండు (స-2-157); ధర్మాధర్మవిదుండైన విదురుని కిది సమ్మతంబుగాదు (స-2-137); "ధీరమతి విదురుతోడ విచారింతము వాఁడు నయవిశారదుఁడు కళాపారగుఁడు, దీర్ఘదర్శి, యపారహితారంభుఁ డుభయపక్షంబులకున్ (స-2-`24) "పరమ పతివ్రతన్ సభఁ దపస్విని బాండవధర్మపత్ని ధర్మరత నయోనిజం" (స-2-255) "అఖిల లావణ్యపుంజంబు సజ్జభవుఁడు మెలతగా దీనియందు నిర్మించె నొక్కొ (స-2-160) మున్నగున విందుకుఁ దార్కాణములు,

సభావర్ణన సందర్భమున నన్నయ ధర్మజ దుర్యోధనుల శీలములను ప్రతియోగ దృష్టితోఁ జక్కఁగా నిర్దేశించెను. దుర్యోధనుఁడు శకునితోఁ దన శరీర కార్శ్యమునకుఁ గారణముఁ దెల్పుచు

భావిపురాతనాద్యతన పాండవలక్ష్ములు పొండ వేయు ల
క్ష్మీవిభవంబుతోడ నుపమింప సమంబులుగా వశేషరా
జావళిలోన నత్యధికులైన సపత్నుల పేర్మిఁ జూచియేఁ
జూవె సహింపనోపక కృశుండ వివర్ణుఁడనైతి నెంతయున్ ౨-114

అని తనయసహనమును వెల్లడించెను. దుర్యోధనుని ప్రీతికై ధృతరాష్ట్రుఁడు నిర్మింపఁజేసిన సభనుజూచి ధర్మరాజు "లక్ష్మీధరమూర్తి యెంతయునుమెచ్చె మనంబునఁ దద్విభూతికిన్" (౨-162). ఈ రెండు సందర్భములను బరిశీలించి చూచినచో ధర్మజ దుర్యోదనుల శీలములందలి తారతమ్యము విస్పష్టము కాఁజాలును.

నన్నయ లోకజ్ఞత - మనస్తత్త్వ పరిశీలనము : నారదుఁడు సభాగతుఁడైన ధర్మజుని జూచి నరుదెంచి రాజనీతికి సంబంధించిన విషయము లడిగి తెలిసికొనెను. ఈ సందర్భమున నన్నయ వ్రాసిన పద్యములలోఁ గొన్ని యాతని స్వకపోల కల్పితములే అవియును సంస్కృత భారతమునుండి యాతఁ డనువదించిన రాజనీతికి సంబంధించిన పద్యములును అతని లోకజ్ఞతకు నిదర్శనములుగా నున్నవి.

జర బాలక శరీర శకలములు రెండిటిని గూడఁబట్టఁగనే యవి రెండు నొక్కటయ్యెననియు నప్పు డేర్పడిన బాలకుఁ డేడ్చెననియు నా యేడ్పువిని యంతిపురమునందలి ముదుసలియవ్వ లెల్ల రరుదెంచి మహా హర్షముతో వాని నెత్తుకొనిరనియు నన్నయ రచించినతీరు చాల సహజముగా నున్నది. రాణులు తమకు జనించిన దేహశకలములను సిగ్గున దాదులచే వెలపలఁ బాఱవేయించిరి. తరువాతఁ గొంత సేపటికి శిశువు నేడ్పు వినిపించెను. ఆ శక లములే సజీవములై యక్లేడ్చుచుండె నేమోయని యంతిపురమందలి ముదు సలియవ్వ లరుదెంచి వాని నెత్తుకొనిరి. ఇది ముదుసలియవ్వల మనస్తత్త్వ మున కెంతయు ననుగుణముగా నున్నది.

శకుని దుర్యోధనుని మనస్తాపమునకుఁ గారణ మెఱిఁగి యాతని ధృత రాష్ట్రునొద్దకుఁ గొనిపోయి యతని శరీరకార్శ్య వైవర్ణ్యములు వర్ణించి చెప్పెను ధృతరాష్ట్రుఁడంత నదరిపడి కొడుకు నొడలంటి చూచెనని నన్నయ వ్రాయుట యాతని నిశితలోక పరిశీలనమునకుఁ దార్కాణము. అంధులైన వృద్ధులు తమకుఁ బ్రీతి పాత్రులైన వారియెడ సరిగా నిట్లే వర్తింతురు.

ద్రౌపది ప్రాతికామివెంట సభకరిగి కురువృద్ధు సమీపమున నుండెను. దుర్యోధనుఁడు దుశ్శాసనుని బిలిచి ద్రౌపదిని దోడ్కొనిరమ్మని పంపెను. నిర్దయాత్ముఁడును పాప నిరతుండునైన దుశ్శాసనుఁడింక వచ్చునని యెఱిఁగి ద్రౌపది భీతయై గాంధారి యొద్దకు నరిగెను. ఇట్లు వ్రాయుట నన్నయ మన స్తత్త్వ పరిశీలనమునకు నిదర్శనము. నిజమునకా సందర్భమున దుశ్శాసను నరికట్టఁగలవారు గాంధారితప్ప మఱెవ్వరును లేరు. అదియునుగాక గౌర వమునకు భంగము వాటిల్లునేమోయని భయము కల్గినప్పుడు స్త్రీలు వృద్ధ స్త్రీల పజ్జకరిగి తమ మానగౌరవముల రక్షించుకొన నెంచుట మిక్కిలి సహజము.

దుశ్శాసనుఁడు ద్రౌపది కట్టినవలువలు విడ్చునప్పుడు "ఉడుగక యొలు వంగఁబడియు మున్నపనీతమైన తద్వస్త్రంబు నట్టి వలువ లలితాంగి జఘన మండలమునఁ బాయక యొప్పుచు" నుండెనని నన్నయ రచించెను. ఒకేరక మైన వస్త్రము మరల మరల నుత్పన్న మగుచున్నయెడల నగ్నత భాసింపదు. ఇచ్చట పాయక అను శబ్దముయొక్క ప్రయోగము సాభిప్రాయము. అది అవ్యవధికముగా మఱొక వస్త్రము వచ్చుచుండెనను విషయమును సూచించుచు నన్నయ లోకజ్ఞతను వెల్లడించు చున్నది.

ధర్మరాజు జూదమాడుటకు ద్రౌపదితోడను అనుజులతోడను హస్తినా పురమున కరిగినపుడు గాంధారి కోడండ్రెల్లరును ద్రౌపదినిఁజూచి 'అఖిల లావణ్యపుంజంబు నజ్జభవుఁడు మెలఁతగా దీనియందు నిర్మించె నొక్కొ కాని నాఁడట్టికాంతి యేకాంతలందు నేలలేదని సామర్షహృదయులై'రని నన్నయ వ్రాసియుండెను. ఇది స్త్రీ సహజమైన మాత్సర్యముతోపాటు వారు ద్రౌప దినిగూర్చి తమతమ భర్తలతో నేమేమియో చెప్పియుందురనియు. ద్రౌప దికిఁ దరువాత సభలో జరిగిన యవమానమున కదియు నొక కారణమై యుండుననియు ధ్వనింపఁ జేయుచున్నది.

పై విషయములన్నియు నన్నయ లోకజ్ఞతను వెల్లడించుచు నవతారికలో నాతఁడు తన్నుగూర్చి వాడిన లోకజ్ఞుఁడను విశేషణమును సార్థక మొనరించుచున్నవి.

నన్నయ శైలి: నన్నయకుఁ బూర్వమాతని కాదర్శములు కాఁదగిన తెలుఁగుకావ్యము లేవియును లేవు. అందుచేఁ గన్నడకవుల కావ్యములును సంస్కృత కావ్యములును ఆతని కొజ్జబంతు లయ్యెను. కన్నడమున నంతకుఁ బూర్వము రచింపబడిన కావ్యములు తత్సమ బహుళములై మార్గపద్ధతిని రచింపఁబడి యుండెను. వాని ననుసరించి నన్నయయుఁ దన రచనలోఁ దత్సమ పదములను సంస్కృత సమాసములను ఎక్కువగా వాడియుండెను. తెలుఁగున నప్పటికుండిన పదసంపద యతి పరిమితమై యుండుటయు నందు కొక కారణము. నన్నయ సంస్కృత సమాసముల నెక్కువగా వాడినను వానిలోఁ గ్లిష్టత లేశమైన నుండదు. అవి ప్రసాదగుణముతో నిండారి యుండును. పాండిత్య ప్రకటనమునకై యాతఁడు మాఱుమూల పదముల నెచ్చటను వాడఁడు. తెలుఁగు వాఙ్మయమున నన్నయవలె సుందర పదబంధ మెలుగను శ్లిష్టాన్వయములుగాను సమాసములను వాడిన కవుల సంఖ్య చాల తక్కువ. సమాస ఘటితములైన యాతని పద్యములు కొన్ని ధ్వని గంభీరములై వేదబుక్కులవలె ధ్వనించుచుండును.

నన్నయ రచనమునఁ గొన్నిచోట్ల సంస్కృత వాక్యయోజన గోచరించును. అతఁడు సంస్కృతమునవోలె విశేష్యములను విశేషణములకు ముందును వెనుకను గూడ వాడుచుండును. విశేషణ విశేష్యములకు నడుమ నొక్కొక్కప్పు డితరపదముల వ్యవధానము సైతము గోచరించుచుండును.

> పరమ పతివ్రతన్ సభఁ దపస్విని(బాండవ ధర్మపత్ని ధ
> ర్మరత నయోనిజన్ 2-255

> కురుపతికిన్ యుధిష్ఠిరునకున్ సకలక్షితిపాల సేవ్యసు
> స్థిర విభవాభిరామునకు ౧-5

సంస్కృతమునవలె యత్తదర్థక శబ్దముల ప్రయోగములతోఁ గూడిన వాక్యము లాతని రచనలోఁ బెక్కుచోట్లఁ గానిపించును

ఎందేని సర్వభూతేశుండు సృజియించె సచరాచరములైన జగములెల్ల
అట్టి బిందుసరమునందున ౧-9

ధర్మువెఱిఁగి దాని . . .

సభల నెవ్వఁడేని సభ్యుఁడై పలుకువాఁ డనృత దోషఫలము
ననుభవించు ౨-238

నన్నయ రచనమునఁ గర్మణి ప్రయోగము లచ్చటచ్చటఁ గన్పించును.
ఉడుగక యొలువఁగఁబడియు మున్నపనీతమైన వస్త్రంబు నట్టి వలువ ౨-23

వినఁగఁ జూడఁబడ వెవ్వరిచేన్ ౨-139

పరసంపద చేకొనఁగఁ బడునేని ౨-142

నన్నయ తరువాతి కవుల కావ్యములలో నిట్టిప్రయోగము లంతగాఁ గానిపింపవు.

నన్నయ దాలంకారికమైన రచన. అతని యలంకారము లన్నియు ధారాళముగా నప్రయత్నముగా సమకూడినట్టివే. ఉపమ, రూపకము, ఉత్ప్రేక్ష, అర్థాంతరన్యాసము, స్వభావోక్తి మున్నగు నలంకారము లాతని రచనలో నధికముగాఁ గనిపించును.

నీరజమిత్రుఁ డేల ధరణీగతుఁ డయ్యెడునొక్కొ ౧-23 ఉత్ప్రేక్ష
వరాప్సరోంగనాయత విలసత్కటాక్ష కుసుమార్చిత సుందర
వక్త్ర చంద్రుఁడై ౧-64 రూపకము

అవనితలంబు వ్రస్సెనో హిమాచలశృంగము వ్రయ్యలయ్యెనో
౧-213 ఉత్ప్రేక్ష

మానధనాఢ్యుఁడైన భూపతి సహియింప నోపునె సపత్నుల
వృద్ధియు నాత్మహానియున్ ౧-93 అర్థాంతర

అన్న! సహదేవ నీవును, నన్నలతో నరిగెదయ్య యట యడవులకీ
వున్నను సుతులందఱు నిం, దున్నట్టుల నాకుఁ జిత్తమూఱడి
యుండున్ ౨-288

అనునది యలంతి యలంతి పదములతోడను స్వభావోక్తితోడను గూడి కుంతి శోకమును గాఢముగా వ్యక్తము చేయుచున్నది నన్నయ సమయోచితములు భావస్ఫోరకములు నైన యుపమానములను బెక్కుచోట్ల వాడి యుండెను.

> అయునయహీనుఁడొఁ సవిత్రునట్లు విఖండిత పక్షతిద్వయుం
> డయిన ఖగేంద్రునట్లు ౧-161
>
> పోరి రూర్జితభుజదర్ప మేర్పడఁగ సింహగజేంద్రములట్లు వజ్ర
> పర్వతములయట్లు ఘోరతరవాసవవృత్రుల యట్లు నిద్దఱున్
> ౧-206
>
> నెట్టన ధర్మనందనుండు నిన్నవలంబముచేసి యోడతోఁ
> గట్టిన యోడవోలె గతగౌరవుఁడై కడుదూలె ౨-40
> బూతువొగడినట్లు పొగడెదు ౨-43

చండకౌశికుఁడు జరాసంధుని బలసామర్థ్యములను వర్ణించు నప్పుడును ౧-158 మంత్రులు ధర్మజుని వైభవమును వర్ణించు నప్పుడును (౧-273) నన్నయ వాడిన వచనములంవలి యుపమానము లర్థగంభీరములును, ఔచిత్య శోభితములునై మిక్కిలి మనోహరములుగా నున్నవి.

నన్నయ రచనమున నందందు శబ్దాలంకారములుకూడ గోచరించు చున్నవి. ఇందు వృత్త్యనుప్రాసముల సంఖ్య హెచ్చు.

> "సటాసముత్పాటన కుపిత కుంజర వైరియుంబోలెఁ గడు
> నలిగి కుటిల భ్రుకుటి ఘటితనిటలుం డగుచు" ౧—194

ఇందు టకారముతోఁగూడిన వృత్త్యనుప్రాసము జరాసంధుఁడు పండ్లు పటపట కొఱుకుచున్నాఁడాయను భావమును గలిగించుచు నతని క్రోధమును జక్కగా వ్యక్తము చేయుచున్నది. నన్నయ రచనమున నంత్యానుప్రాసము లెచ్చటను గానరావు కాని కొన్ని వర్ణనాత్మకములైన పద్యములలో దాని, దాని అనుపదములతో ముగియు విశేషణములు పెక్కు కాన వచ్చుచున్నవి.

ఉరుతర హర్మ్య మాలికలనొప్పు గిరివ్రజమన్పురంబు గాం
చిరి నవ సౌరభ ప్రసవ చిత్రవనావళి గల్గుదాని, నె
వ్వరికి దురాసదంబులగు వజ్రమయోన్నత వప్రచారు గో
పురముల దాని నయ్యలకం బోలెడుదాని మహార్థసంపదన్ ౧-174

ఈ క్రింది పద్యమున నరిష్టశబ్దమునకుంగల రెండర్థములను బురస్కరించుకొని నన్నయ చక్కని అర్థచమత్కారమును గల్పించియున్నాడు.

ధృతరాష్ట్రజునకుం బుట్టెనరిష్టమని రిష్టమునం దమలోనన్ ౨-253

ద్రౌపదీ పరాభవ సమయమున నుత్పాతము లుదయించినపుడు కృప విదుర శాంతనవు లిట్లనియుండిరి. మూలమున నీ సందర్భమున నమంగళము తొలంగి స్వస్తియగుంగాక యని వారనినట్లున్నది. నన్నయ స్వస్తి శబ్దమునకు బదు లరిష్ట శబ్దమును వాడియుండెను. అరిష్టశబ్దమునకు మేలు-కీడు అను రెండర్థములు నున్నవి. నిజమున కిచ్చట కీడనునదే వారి యభిప్రాయమైనను మేలను మూలార్థముకూడ స్ఫురించుచున్నది.

నన్నయ కొన్నిచోట్ల శబ్దములను సాభిప్రాయముగా వాడుచుండును. అట్టియెడ నా శబ్దములు పరివృత్తిని సహింపవు.

వాతసుతుండు వీచె...తృణఖండ సముండగుచుండ మాగధున్
౨-209

తృణఖండ సముండైన మాగధుని వాయుసూనుండు వీచెనని స్ఫురింపం జేయుటకై నన్నయ వాతసుతుండను శబ్దమును సాభిప్రాయముగా వాడియుండెను.

దీని కొండంబడు మొడంబడవేని నేండ యీక్షణమ సర్వభక్షుచేత భక్షితుండ నగుదు. ౨-126

ఇది దుర్యోధనుండు ధృతరాష్ట్రునితో నన్నమాట. మానవుని దహించు సందర్భము కావున నగ్నికి సర్వభక్ష శబ్దమిచ్చట సాభిప్రాయమై యలరారుచున్నది.

కొన్నిచోట్ల నన్నయ వాడుచుండు పదములు సందర్భోచితములును బరమౌచిత్య భాసితములునై యొప్పారుచుండును.

ప్రాతికామి తన్ను సభలోనికిఁ గొనిపోవుటకై వచ్చినపుడు ద్రౌపది యాతనిఁజూచి

"మున్ను దనోడ్డుటువడి...... గ్రన్నఁదనోడ్డుటువడియెనో యన్న నా కెఱుఁగఁజెప్పుము"

అని "అన్న" యని సంబోధించుట యా సందర్భమున కెంతయుఁ దగి నిష్కరుణునికైన జాలి పుట్టించునదిగా నున్నది.

పాండవు లడవికేగునపుడు కుంతి సహదేవుని జూచి
"అన్న! సహదేవ నీవును నన్నలతో నరిగెదయ్య 2-288

అని 'అన్న' యను శబ్దమును వాడుట యామె కాతనియెడఁగల వాత్సల్యమును లెస్సగా సూచించుచున్నది. ఇట్లే భీష్ముఁడు ద్రౌపదితో "అవ్వా! నీ ప్రశ్నఁబునకు నుత్తరం బయ్యుధిష్ఠిరుఁడు సెప్పవలయు" 2-245 నని అవ్వా అని సంబోధించుట యత్యంతవాత్సల్యసూచకమై యున్నది.

సభాపర్వమున దుర్యోధనుఁడు రెండుసార్లే ధర్మరాజుతోఁ బ్రత్యక్షముగా మాటాడియుండెను. ఆ రెండుసార్లు ఆతఁడతనిని 'అనఘ' అనియే సంబోధించి యుండెను.

అనఘ ! మామామ శకునీ మాకై కడంగి 2-174
అనఘ ! సుహృద్ద్యూతం బిందొనరింతము 2-164

నన్నయ పదప్రయోగము రసానుగుణమై యుండును. వీర రౌద్ర సందర్భములం దతఁ డోజోభరితమైన శైలిని, కరుణ శృంగారాదులందు మాధుర్య ప్రసాదభరితమైన శైలిని వాడుచుండును. భీముఁడు ప్రతిజ్ఞలు చేసిన పద్యములను, కుంతి పాండవ వనగమన సందర్భమున దుఃఖించునప్పటి పద్యములను బరిశీలించిన నీ విషయము తేటతెల్లమగును.

నన్నయ తన రచనలో నక్షరరమ్యత యుండునని తెల్పియుండెను, అక్షరరమ్యత యనఁగా, సర్వ సందర్భములందు లలిత మధుర శబ్దములను

మాత్రమే వాడుటకాదు. రసోచితముగా శబ్దములను వాడినప్పుడే యక్షర రమ్యత యేర్పడుచుండును. ఆ రమ్యత రససంబధియే కాని కేవలపద ప్రయోగ సంబంధికాదు.

నన్నయ రచనయందు ధారాశుద్ధి సర్వతోముఖముగా గోచరించు చుండును. ఆతని పద్యము లెక్కడను గుంటువడక నిరర్గళగమన సౌందర్య ముతో సాగిపోవుచుండును. అందుచేతనే ఎఱ్ఱన "నన్నయభట్ట కుంజరం బెన్న నిరంకుశోక్తిఁగతి నెయ్యెడఁ గ్రాలుట ప్రస్తుతించెద"నని యాతనిఁ గుంజర ముతోఁ బోల్చియుండెను. "మదమాతంగ తురంగకాంచన" (2-18) "రయ విచలత్తురంగమ తరంగములన్" (2.33) "ప్రకటితకోపవేగమున" (2-51) "కనకోర్వీధరసానుసార" (2-297) మున్నగు పద్యము లిందుకు దృష్టాంత ములు.

సాధారణముగాఁగావ్యమునందలి శైలి కథనశైలి,వర్ణనశైలి, సంవాద శైలి యని మూఁడు తెఱఁగులుగా నుండును. నన్నయది ప్రధానముగాఁ గథన శైలి. అతఁడు పెక్కుచోట్లఁ గథకుఁడు కథను జెప్పునట్లుగాఁ దటస్థుఁడై కథ లను చెప్పుకొనిపోవుచుండును. అతఁడు వర్ణన సంవాదశైలులను బ్రయోగిం చిన భాగములును లేకపోలేదు సభావర్ణనాదుల సందర్భమున వర్ణనశైలియు, శిశుపాలవధ ఘట్టమున సంవాదశైలియు గోచరించుచున్నవి. శిశుపాల వధ ఘట్టము పాత్రల యుక్తి ప్రత్యుక్తులతోఁగూడి దృశ్యకావ్య భాగమువలె సాగిపోయినది.

నన్నయ ప్రధానముగా మార్గ కవితా సంప్రదాయమునే యనుసరించి నను దేశీయ వృత్తములను దేశీయములు జాతీయములునైన పలుకుబళ్ళను బలుచోట్ల వాడియుండెను. సీస గీత మధ్యాక్కరాదుల ప్రయోగ మాతని దేశీయ వృత్తాభిమానమునకు నిదర్శనము. ఈ క్రింది ప్రయోగము లాతని జాతీయపద ప్రయోగ కౌశలమును సూచించును.

ప్రీతి నెత్తికొనియెన్ మహినెత్తిన పుణ్యుఁడున్నతిన్ 1-102

ఇతనికిఁ గూర్తురేని ధనమిత్తురభీష్టములైన కార్యముల్

మతినొనరింతు రిష్టుఁడని మంతురుగాక 2-10

ఇమ్ముదివెట్టి పీనిఁ బరమేశ్వరుగాఁగొనియాడె ౨-39
పొగడుచునున్న నీ నాలుకయొక్కఁ డయ్యు వ్రయ్యవలయు నూఱు
వ్రయ్యలుగాఁగ నట్లయినఁగాని చాలవతనిఁ బొగడ ౨-41

నన్నయ అరణ్యపర్వమందలి కొన్ని ఆశ్వాసముల యంతములందు రమ్యరమణీయ పదములను వాడినట్లే సభాపర్వ ప్రథమాశ్వాసాంతమున "అని వైశంపాయనోక్త కథ రసోత్కటముగ" అని రసోత్కట పదమును వాడి యుండెను. ఈ పదముల ప్రయోగ మాతఁడు తన రచనను రమణీయముగను రసోత్కటముగను జేయవలెనని యుద్దేశించినట్లు స్పష్టము చేయుచున్నది. "ప్రసన్న కథా కలితార్థయుక్తి" అను సమాసముకూడ నాతని రసదృష్టిని వ్యక్తము చేయుచున్నది. ప్రసాదగుణము సర్వరస సమర్పకమైన గుణమగు టయే యిందుకుఁ గారణము. తెలుఁగున పద్యరచనకువలెనే గద్యరచనకును నన్నయ ఆద్యుఁడని చెప్పవచ్చును. అతని వచనములు ధారాళములై, వర్ణన సందర్భములందు దీర్ఘసంస్కృత సమాస భూయిష్ఠములై, నాతిదీర్ఘములై యతిమనోహరములుగా నుండును. ద్రౌపది ధర్మవిజితయా అధర్మవిజితయా యను సందర్భమున వికర్ణుఁడును కర్ణుఁడును బల్కినపల్కులు హేతువాద పూర్వకములై వాది ప్రతివాదుల పక్షము లవలంబించి న్యాయవాదులొనర్చు వాదములవలె నున్నవి. నన్నయ గద్యపద్యముల వాడు సందర్భమున విచక్షణత ప్రదర్శించుచుండును. నీరసములు, విషయప్రధానములు, నామాది కథనప్రయోజనములునగు నంశముల నాతఁడు సాధారణముగా వచనము ననే చెప్పుచుండును. గద్యమునందైనను బద్యమునందైనను గాంభీర్యము, ధారాశుద్ధి, అన్వయసౌలభ్యము, అర్థవైశద్యము అనునవి నన్నయ శైలి యందలి ప్రధానలక్షణములు.

నన్నయ భాషాఛందఃప్రయోగము: సంస్కృత పదములను దెనుఁగున వాడు విధానము నిశ్చయించి, తనకుఁ బూర్వము శాసనములందును జన వ్యవహారమునందును గల తెలుఁగు పదముల రూపమును స్థిరపఱిచి యాంధ్ర భాషకు రూపసౌష్ఠవమును బదవిస్తృతిని గలిగించుటద్వారా మహాకావ్యోప యోగ్యతను జేకూర్చినవాఁడు నన్నయయే అందుచేతనే యతనికి వాగను శాసనుఁడను సార్థకమైన బిరుద మేర్పడినది. అతని సభాపర్వమునఁ గనవచ్చు భాషాప్రయోగవిశేషములలోముఖ్యమైనవానినిమాత్రమిచ్చుటఁ బ్రదర్శింతును.

1. అమ్ముని ప్రవరు పృథూత్సంగతలముపై వడిఁబడియెన్ ౧-42
ఇచ్చట ముని ప్రవరు అను సంస్కృత సమాసమున రేఫయుక్త సంయుక్తాక్షరమైన ప్ర అనుదానికి ముందున్న ని అనునక్షరము లఘువుగానే యున్నది.

2. అను, విను, కను అను తద్ధర్మ విశేషణముల తుదియుకారము వైకల్పికముగా లోపించును. గిరివ్రజమన్పురంబు ౧-172. ఇచ్చట పకారమునకు సరళాదేశమురాని కతమున ఉ లోపింపఁగా మిగిలిన రూపమందలి తుది నకారము ద్రుతముకాదని తెలియుచున్నది.

3. చనుధాతువునకు ప్రథమపురుష తద్ధర్మైక పచనరూపము చనును. చివరి ను ప్రత్యయము ద్రుతమగుటచే లోపింపవచ్చును. నన్నయ ధాతువునందలి ను లోని ఉకారమునకుఁగూడ లోపము కలిగించినాఁడు.
విప్రసతికి సూాఋ వేఁడజన్వరములు ౨-263 (వేఁడజనును)

4. అచ్చుపరమగునపు డేని యందలి తుది యిత్వమునకు లోపము వైకల్పికము.
ఎందే నిట్టి సభ చూచియెఱుంగుదురే ౧-57
పక్షమున ఎందేని నిట్టి సభ
నన్నయ నేని యను హలాది పదమునుగూడ వాడియుండెను.
నీవునుజూచి తట్టి సభనేని వినంబడదేయుగంబులన్ ౨-95

5. చోరభయవర్జితముగా ధారుణి వాలింతె, ౨-41 ఇచ్చట తత్సమము మీఁది తత్సమ పరుషమునకు (పకారమునకు) గసడద వాదేశము కలిగినది.

6. నలుశబ్దమునకుఁ గ్రొత్తశబ్దమునకువలెనే తొలియచ్చు మీఁది వర్ణములకు లోపమును మీఁది హల్లునకు ద్విత్వమును గలుగును.
చిత్రరథుఁడనువాఁడు నన్నూఱు గంధర్వహయంబులనిచ్చె ౨-113

7. నీవు మూర్ఖవు శిశుపాల (2-21) మూర్ఖశబ్దమున డుజ్లోపము
బలిమిఁగొనిన ధనము పదివేలు లొట్టియల్ 2-567

నన్నయ ఎదంత రూపములనుగాక యియాంత రూపములనే వాడి యున్నాఁడు. దీనినిబట్టి యివియే ప్రాచీనతరములుగాఁదోచును.

9. రాహుపర్వంబు గాకయ భానుఁబట్టె 2-298

రాహుశబ్దము వు వర్ణకహితముగా వాడఁబడినది.

10. ఋత్విజుండని విచారించి పూజించితే, 2-11 నన్నయ భారతమున ఋత్విక్కు అను రూపములేదు.

11. సదంబు 2-15 సదస్సను రూపము నన్నయ వాడలేదు.

12. శూరులెందు నీయట్టిరే. 2-236. అట్టి + వారు-తచ్ఛబ్ద వకారమునకు లోపము చేయఁబడినది.

13. సుందరి నా కోడంద్రురయం దభ్యర్చితవు నీవ 2-257

కోడండ్రు + రు. బహువచనముపై బహువచన ప్రత్యయము.

14. తృతీయాచతుర్థ్యర్థములందు నన్నయ మై, పొంటె అను ప్రత్యయము లను వాడియున్నాఁడు.

పూవులుఁజందనంబుఁ జనునె బలిమిమైఁగొనితాల్ప 1-151
కార్య సంప్రయోగము పొంటెన్ 1-26

అనఘ మామామ శకుని నాకై కడంగి (2-172) అని నన్నయ చతుర్థ్యర్థమున కై అను ప్రత్యయము వాడినాఁడు కాని యది కు + అయి (ఐ) అను వాని కలయికవలన నేర్పడినది. పైప్రయోగమున అ కునుకై లోని ఐకిని యతివేయఁబడినది. నన్నయ తదర్థమను దానినిగూడఁజతుర్థ్యర్థమున వాడియున్నాఁడు.

నీతదర్థంబులై నిఖిలవేదంబులు వర్ధిల్లు (1-253)

నీ కొఱకై యని యర్థము. తదర్థంబులై అని బహువచనాంతముగా వాడఁబడుటచే నది యప్పుడప్పుడే ప్రత్యయత్వమును బొందుచుండె

నని తోఁచును. నాతదర్థ మాచరింపుము బ్రహ్మచర్యవ్రతంబు (అర. 1-275) అను ప్రయోగమీ యభిప్రాయమును స్థిరపఱుచుచున్నది.

15. అతని పుట్టిన విధమెట్టుచెప్పు 1-'383 కర్తృపదప్రథమకు షష్ఠి

16. లో అను ప్రత్యయము మీఁద సప్తమీ విభక్తి ప్రత్యయములైన అందు, న అనునవి చేరుచున్నవి.

జంభకుండను వాని భూరిబలుని పుత్త్రుఁ బోరిలోన నొడిచి 1-246

17. నన్నయ భారతమున మొదలిటి యనియే కాని మొదటి అను ప్రయోగము కానరాదు. మొదలిటి సంపదలతో సమూలంబ చెడున్ 2-202

18. ఏవగింపక చేకొనుం డిదె యెల్లయందును ధర్మసద్భావ మొక్కని 2-236. ఇచ్చట అందు సప్తమీ విభక్తి ప్రత్యయముగాఁ గాక స్థల వాచకముగా వాడఁబడినట్లు తోఁచుచున్నది.

19. భవత్పునర్దర్శన మయ్యెడమరుగుండని 2-283 కేతన దీవన కెడమయుఁ గాతయుఁ గావుతయు నగునని తెల్పెను, వ్రాఁత ప్రతులలో ఎడమనురూపమే కనవచ్చుచున్నది. తరువాత నది ఎడుగా మాఱినది.

20. ఆయుధంబులున్నవలనికి దృష్టులు సలుపుచు 2-250 సలుపుచుననఁగాఁ బ్రసరింపఁజేయుచు నని యర్థము.

21. ధీరమతి విదురుతోడ విచారింతము 2-124 ఇచ్చట విశేషణము తృతీయకుఁ బ్రథమ వాడఁబడినది.

24. పదునాలుగు వేలు గజంబులన్ 2-111. పదివేవురు విప్రుల కొప్ప 1-14. సంఖ్యా విశేషణములు ముందువాడఁబడుటచే వాని ద్వితీయా షష్ఠులకుఁ బ్రథమ వాడఁబడినది.

25. దెప్పరములు పల్కఁగాఁదగునె 2-255 దెప్పరములు దెప్పరపు మాటలు. విశేషణము విశేష్యలక్షకమైనది.

26. తమ్ములు దానును బాదచారియై 2-94. ఆత్మార్థ మభిహిత మగు టచేఁ దల్లింగ సంఖ్యాభిధాయి వచనము విశేషణమున కైనది.

27. అనఘ వినఁగవేడ్కయైనయదియు ౧-352 ఇచ్చటసముచ్చయార్థకము లేకున్నను అర్థమునకు భంగము కలుగదు.

ఛందస్సు : కన్నడ కవులు సంస్కృతమునందలి మత్తేభ శార్దూలాది వృత్తములను గ్రహించి యందుఁ దమ భాషకు సహజమైన ప్రాసనియమమును జేర్చి కావ్యములందు వాడుకొని యుండిరి. కొన్నిచోట్ల వారు సంస్కృత వృత్తముల పేర్లు మార్చి వానికిఁ గ్రొత్త పేర్లు పెట్టియుండిరి. నన్నయయుఁ గన్నడ కవులవలె సంస్కృతమునుండి వృత్తములు గ్రహించి వాని యందుఁ దెలుఁగు ఛందమునకనుగుణముగా యతిప్రాసలను జేర్చి రచన కావించి యుండెను. అతఁడు వారివలె మానిన్యాదివృత్తముల పేర్లు మార్చక వానిని సంస్కృతమునందలి పేర్లతోనే వ్యవహరించి యుండెను.

నన్నయ సభాపర్వమున 45 సీసపద్యములు వాడెను. అవి అన్నియు నాటవెలఁదులతోనే కూడియున్నవి. సీస గీతములందలి యతి, ప్రాస యతులను బట్టి సీసములను 16 రకములుగా వింగడింపవచ్చును వానిలో నన్నయ 13 భేదములను మాత్రమే వాడి యుండెను.

సీస పాదములందు యతి, ప్రాసలును గీత పాదములందు ప్రాస,యతులును; సీసపాదములందు ప్రాస, యతులును గీత పాదములందు ప్రాసయు; సీసపాదములందు ప్రాస, యతులును గీత పాదములందు యతి, ప్రాసలును గల మూడు భేదములను అతఁడు వాడి యుండలేదు.

సభా పర్వమున రెండు మధ్యాక్కర లున్నవి. నన్నయకుఁ బూర్వమందలి బెజవాడ శాసనమందలి మధ్యాక్కరలలో యతి పంచమ గణము మొదట వేయఁబడినది. దాని ననుసరించి నన్నయ కూడ నచ్చటనే యతి పాటించియున్నాఁడు. ఎఱ్ఱన చతుర్థగణాదినియతి వేసియున్నాఁడు. లాక్షణికు లందఱును ఎఱ్ఱన పద్ధతినే యాదరించియున్నారు. యతి విషయమున నీ మార్పు బహుశః నన్నయ ఎఱ్ఱనల నడిమికాలమునఁ గలిగియుండును.నన్నయ సభాపర్వమున 4 తరలలను, 5 మత్త కోకిలలను, 1 తరువోజను, 1 మాలినిని

1 రథోద్ధత వృత్తమును,1 అంబురుహ వృత్తమును 2 ఉత్సాహములను వాడి యుండెను. మిగిలిన వన్నియు సామాన్య వృత్తములే. పై వానిలో నంబురుహము ప్రథమాశ్వాసాంతమునను, రథోద్ధతోత్సాహములు ద్వితీయాశ్వాసాంతమునను గలవు. నన్నయ సాధ్యమైనంత వఱకు వృత్తౌచిత్యమును బాటించినట్లు గోచరించును. అతఁడు వీర రౌద్రరసములను సూచించుటకు మత్తేభ శార్దూలములను వర్ణన, కథాకథన, వ్యక్తి స్థలవస్తు నామ ప్రకటనములకు సీసమును, సంభాషణ సందర్భములందు వేగ గమనము గల తరలామత్తకోకిలలను వాడుచుండును. కందము నాతఁడాశ్వాసాంతములందును, నీతి ధర్మ కథనమునకును వినియోగించుచుండును.

ఋకారమునకు క ష ల కు సంబంధించిన యే యక్షరముతో నైన యతిమైత్రి పాటింపవచ్చును. కాని నన్నయ కకారమునకు సంబంధించిన యక్షరముతోడనే యతి వేయుచుండును (౧-138 ; ౧-161). అతఁడు తద్భవ వ్యాజ విశ్రమములను గాని, విశేష వళులనుగాని, మవర్ణము వర్ణ విరామములనుగాని వాడియుండలేదు రకారము రెండవ హల్లుగా నుండు సంయుక్తాక్షరములలో పై హల్లునకును, పూర్వాంగముగా నుండు సంయుక్తాక్షరములలో క్రింది హల్లునకును నన్నయ సాధారణముగా యతి పాటించుచుండును.

భాషా విషయమునఁ గాని ఛందోవిషయమునఁ గాని యాంధ్ర కవుల కాతని ప్రయోగములు శిరోధార్యములు అందుచేతనే అప్పకవి

ఆమూఁడు పర్వములలో
నామాన్యుఁడు నుడువు తెలుఁగు లరసికొని కృతుల్
దాము రచించిరి తిక్కను
ధీమణి మొదలైన తొంటి తెనుఁగు కవీంద్రుల్ (అప్పక. 47

అని నుడివి యున్నాఁడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ఆంధ్ర మహాభారతమును సంశోధించి సవిమర్శకమైన ప్రతిని ప్రకటించుచున్నారు. నేనీ సంపుటమున వారి ప్రతి యందలి పాఠములనే గ్రహించితిని. పాఠాంతరములు మేల్త

రములుగా గోచరించిన యెడ రెండు మూఁడు చోట్ల వానిని గ్రహించి వారి పాఠములను అకారాదిసూచికలో సూచించియుంటిని. వారికి నాకృతజ్ఞతా వందనములు.

ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమివా రాంధ్ర భాషాసారస్వతముల కమూల్యాలంకారమును, సర్వాంధ్ర జనతా నిరంతరారాధ్యమునైన కవిత్ర యమువారి భారతమును పండ్రెండు సంపుటములుగాఁ బ్రచురించి యందఱికి నందుపాటులో నుండునట్లగ్గువ ధర కందఁ జేయఁజూచుట మిక్కిలి యభినంద నీయము. ప్రయోజనవంతమైన యీ పవిత్ర కార్యమున సభాపర్వ పరిష్కరణమునకు నన్ను నియోగించి యాపుణ్యమున భాగస్వామిగా నొన రించిన ఆం. ప్ర. సా. అకాడమి అధ్యక్ష కార్యదర్శులకును, యాజమాన్య సంఘ సభ్యులకును నా కృతజ్ఞతా నమస్కారము లర్పించుచున్నాను.

2—8—70
హైదరాబాదు,

దివాకర్ల వేంకటావధాని.

విషయసూచిక

సభాపర్వము - ప్రథమాశ్వాసము

సభాపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము — ప్రథమాశ్వాసము

శ్రీదయితోరస్స్థల, విమ
లాదిత్యాత్మజ, నిరంతరానందమతీ,
కోదండపార్థ, నిఖిలధ
రాదేవస్తుత్య, రాజరాజనరేంద్రా! 1

మయుం డొక్క సభను నిర్మించి ధర్మజున కిచ్చుట

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు ధర్మతనయునొద్ద వాసుదేవసహితుం డయి యున్న యర్జునున కతిప్రీతిం గృతాంజలి యయి మయుం డి ట్లనియె. 2

క. ఘనముగఁ బ్రాణము రక్షిం, చినయుపకారికిఁ బ్రియంబు సేయుదు నన నే
ర్తునె యైనను నీకుఁ బ్రియం, బనఘా చేయంగ నిష్ట మైనది నాకున్. 3

వ. ఏను దానవవిశ్వకర్మ ననేకవిధశిల్పకలాకుశలుండ మీ కిష్టంబయినదాని నిర్మించెదం బనుపుం డనిన నర్జునుం డచ్యుతుమొగంబు చూచి యతని నెద్ది యేని నొక్క యపూర్వం బయినదాని నిర్మింప నియోగింపు మనినఁ గృష్ణుండు పెద్దయుం బ్రొద్దు విచారించి మయున కి ట్లనియె. 4

చ. కురుపతికిన్ యుధిష్ఠిరునకున్ సకలక్షితిపాలసేవ్యసు
స్థిరవిభవాభిరామున కతిప్రమదంబుగ రత్నరాజిసుం
దర మగుదాని నొక్క సభ ధాత్రి కపూర్వముగా నొనర్చి చె
చ్చెరఁ గొని రమ్ము నీ దయినశిల్పకలాకుశలత్వ మేర్పడన్. 5

వ. అనిన వాసుదేవునకు మయుం డి ట్లనియె 6

ఉ. ఇమ్మనుజేంద్రుఁ డింద్రదనుజేంద్రులకంటె మహావిలాససౌ
ఖ్యమ్ములఁ బెద్ద యిద్ధరణిఁ గావున నీతని పేర్మికిం దగన్
నెమ్మి నొనర్చెదన్ సభ మణిప్రభ నొప్పఁగ దేవతావిమా
నమ్ములు నిట్టివే యని జనమ్ములు దానిన మెచ్చి చూడఁగన్. 7

వ. తొల్లి వృషపర్వుం డను దానవేంద్రున కొక్కసభ నిర్మింప సమకట్టి వివిధ రత్నమయంబులయిన యుపకరణంబు లొడఁగూర్చి బిందుసరం బనుకొలన సంగ్రహించినవాఁడ నయ్యుపకరణంబుల దాని విచిత్రంబుగా రచియించి తెచ్చి ధర్మరాజున కిచ్చెద మఱియును భౌమాదిత్యుం డనురాజర్షిచేత నిహితంబయి సకలశత్రుఘాతిని యైనదాని భీమసేనున కొక్కగదను, దారుణం బయిన దివ్య ఘోషంబు గలుగు దేవదత్తం బనుశంఖం బర్జునునకును నిచ్చెద నని చెప్పి ధర్మరాజుచేత సత్కృతుం డై మయుం డరిగె నంత నిట నారాయణుండును బాండవుల వీడ్కొని పితృదర్శనలాలసుం డై ద్వారవతీపురంబున కరిగె నట మయుండును బూర్వోత్తరదిశాభిముఖుం డై పోయి కైలాసంబు నుత్తరంబున మైనాకశైలంబునందు హిరణ్యశృంగంబున. 8

సీ. ఎం దేని సర్వభూతేశుండు సృజియించె సచరాచరము లైనజగము లెల్ల
గంగఁ బ్రత్యక్షంబు గావింప నెం దేనిఁ గృతవాసుఁ డయ్యె భగీరథుండు
నలినసంభవనరనారాయణస్థాణువాసవప్రభృతిగీర్వాణముఖ్యు
లెం దేనిఁ గ్రతువు లనేకయుగంబులఁ జేసిరి రత్నవిచిత్రవితత
ఆ. చైత్యములు మహావిశాలహిరణ్మయ, యూపతతులు నోలి నొప్పుచుండ
నట్టిబిందుసరమునం దున్న వివిధర,త్నోపకరణచయము లొనరఁగొనియె.

క. దేవబ్రాహ్మణులకు నా,నావిధపూజనలఁ దర్పణము సేసి ధరి
త్రీవనిత కపూర్వశ్రీఁ, గావింపఁ దొడంగె మయుఁడు గడు రమ్యముగాన్.

క. విమలమణిమయము లగుదూ,లములం గంబముల, గోడలను, వేదులఁ గు
ట్టిమములఁ, జుట్టినప్రాకా,రములను గర మొప్పుచుండ రచియించెసభన్.

వ. మఱియును, 12

సీ. సురుచిరహరినీలకిరణజలంబులఁ బద్మరాగారుణపద్మములను,
రాజితరాజీవరాజహంసావళి, నిర్మలసౌవర్ణకూర్మములను,
గమనీయవైదూర్యకుముదంబులను, వజ్రమీనమౌక్తికనవఫేనములను,
మరకతశైవలోత్కరముల విలసిల్లఁ గొల నని సన్మణిస్థలము చూచి
ఆ. పలుఁగురాలకుడ్యములరుచుల్ గప్పిన,జలము లున్నయెడలు వెలయఁజూచి
యనుపస్థలంబు లని జను లెఱుఁగక, యుండునట్లుగా మయుండు సేసె.

వ. మఱియు సకలజనమనోహరంబు లైన నానావిధయంత్రంబులును ననవరత కుసుమ ఫలభరితంబు లైనతరువనంబులును వికచకమలకుముదాభిరామంబు లైనజలాశయంబులును వివిధవిచిత్రపతాకావలంబితతోరణవిటంకప్రదేశంబులునుం గలిగి దశకిష్కుసహస్రప్రమాణవృత్తాయతంబును సహస్రకరప్రభా ప్రసరవిస్తార విభూతియును వివిధరత్నవిభవాభిశోభితంబునుం గా నపూర్వ సభాభవనంబు నందుఁ బదునాలుగునెలలు నిర్మించి దాని నెనిమిదివేల రాక్షస కింకరుల మహాకాయుల మహాజవసత్త్వసంపన్నుల నంతరిక్షచరులం బనిచి మోపించికొని వచ్చి ధర్మరాజున కిచ్చి గదయును శంఖంబును భీమార్జునుల కిచ్చి ధర్మరాజుచేత సంత్కృతుం డయి మయుం డరిగిన. 14

ఉ. వీరుఁడు ధర్మజుండు పదివేవురు విప్రుల కొప్పఁ బాయసా
హారము భక్తిఁ బెట్టి మఱి యందఱకుం జెఱు వేయునేసి వి
స్తారయశుండు ధేనువుల ధర్మవిధిన్ మణిముద్రికాద్యలం
కారదుకూలపుష్పఫలగంధయుతంబుగ నిచ్చి లీలతోన్. 15

వ. అనుజసహితుం డయి దైవజ్ఞదత్తశుభముహూర్తంబున ధౌమ్యాదిభూసురాశీర్వాదపుణ్యాహనాదంబు లెసంగ సభాప్రవేశంబు సేసి యంత. 16

ఉ. మంచిగ భూరిభూసురసమాజము నెల్లను భక్తితోడఁ బూ
జించి, యభీష్టదానములు సేసి ధనార్థులఁ దన్పి, దిక్కులన్
నించె యశంబు, బంధులకు నెయ్యురకున్ హృదయప్రియంబు గా
వించె, విభూతి యేర్పడఁ బవిత్రుఁడు ధర్మసుతుండు నెమ్మితోన్. 17

వ. తదవసరంబున 18

మ. మదమాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సం
పద లోలిం గొని వచ్చి యిచ్చి ముద మొప్పం గాంచి సేవించి ర
య్యుదయాస్తాచల సేతుశీతనగమధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణప్రతాపోదయున్. 19

వ. మఱియును. 20

సీ. సుబల మార్కండేయ శునక మౌంజాయన మాండవ్య శాండిల్య మందపాల
బక దాల్భ్య రైభ్యక భాలుకి జతుకర్ణ గౌతమ కౌశిక కణ్వ కుత్స
సావర్ణి పర్ణాద సత్య గోపతి గోపవేష మైత్రేయ పవిత్రపాణి
ఘటజాను కాత్రేయ కఠ కలాప సుమిత్ర హారీత తిత్తిరి యాజ్ఞవల్క్య
ఆ. వాయుభక్ష భార్గవ వ్యాస జైమిని, శుక సుమంతు పైల సువ్రతాదు
లయినమునులు నేము నరిగితి మెంతయు, రమ్యమయిన ధర్మరాజుసభకు.

వ. అమ్మహామునులనెల్ల నతిభక్తిం బూజించి లబ్ధాశీర్వచనుం డై ధర్మ
తనయుండు వారలవలన ధర్మకథలు వినుచుఁ దమ్ములుం దాను సుఖం
బుండునంత నొక్కనాఁడు. 22

నారదుఁడు పాండవుల యొద్దకు వచ్చుట

ఉ. నీరజమిత్రుఁ డేల ధరణీగతుఁ డయ్యెడునొక్కొ యంచు వి
స్మేరమనస్కులై జనులు మెచ్చి నిజద్యుతి చూచుచుండఁగా
నారదుఁ డేఁగుదెంచె గగనంబున నుండి సురేంద్రమందిర
స్ఫారవిలాసహాసి యగుపార్థగృహంబునకుం బ్రియంబునన్. 23

క. తనపిఱుఁద ధర్మసంబో,ధనవాంఛను వచ్చు దేవతాఖచరమహా
మునివరులఁ దపనమార్గం,బునఁ గ్రమ్మఱఁ బంచెబ్రహ్మపుత్త్రుఁడు నెమ్మిన్.

వ. పర్వత పారిజాత రైవత సుముఖు లనుమహామునులతో నిట్లు వచ్చిన
నారదమహామునికిం బ్రత్యుద్గతుం డయి ధర్మరాజు దమ్ములుం దాను
నమస్కరించి తోడ్కొని తెచ్చి యున్నతాసనంబున నునిచి యడుగులు

గడిగి యర్ఘ్య పాద్యాదివిధులం బూజించిన వారలకుశలం బడిగి నార
దుండు రాజనీతివిషయంబుల నయ్యుధిష్ఠిరు నిట్లని యడిగె. 25

నారదుఁడు ధర్మరాజును రాజనీతి విషయములం గొన్నిఁటి నడుగుట

సీ. మీవంశమున నరదేవోత్తముల దైన సద్ధర్మమార్గంబు సలుపు దయ్య,
ధర్మవిదుండవై ధర్మార్థకామంబు లొండొంటి బాధింపకుండ నుచిత
కాలవిభక్తముల్ గా లీల సేవింతె ధర్మువునంద చిత్తంబు నిలిపి,
యిమ్ముల నపరరాత్రమ్ములం దెప్పుడుఁ జింతింతె నిజబుద్ధిఁ జేయఁ దగిన

ఆ. రాజకృత్యములఁ, దిరంబుగా నిఖలని, యోగవృత్తులందు యోగ్యు లయిన
వారిఁ గరము గారవమ్మునఁ బంచితె, నీవు వారి దయిన నేర్పెఱింగి. 26

క. అనఘుల శాస్త్రవిధిజ్ఞుల, ననురక్తులఁ బితృపితామహక్రమమున వ
చ్చినవిప్రుల మంత్రులఁ గా, నొనరించితె కార్యసంప్రయోగము
పొంకెన్. 27

క. రాజునకు విజయమూలము, రాజితమంత్రంబు సుస్థిరంబుగ దానిన్
రాజాన్వయ! రక్షింతె ధ,రాజనులకుఁ గర్ణగోచరము గాకుండన్. 28

క. ధీరుఁడు ధర్మాధర్మవి,శారదుఁడు బహుశ్రుతుండు సముచితుఁడు వా
ణీరమణీశ్రితవదనస,రోరుహుఁ డనఁ జనునె నీ పురోహితుఁ డధిపా! 29

క. జనవర! నీయజ్ఞములం, దనవరతనియుక్తుఁ డయినయాజ్ఞికుఁడు ప్రయో
గనిపుణుఁ డై యేమఱ కుం,డునె నిజకృత్యముల నెప్పుడును సమబుద్ధిన్.

క. నానావిధరణవిజయమ, హానిపుణు లవార్యవీర్యు లనఁ దగువారిన్
సేనాధ్యక్షులఁ జేసితె, నీనమ్మినవారి మాననీయుల హితులన్! 31

చ. కడుఁ జనువాఁడు నై పురుషకారియు దక్షుఁడు నైనమంత్రి పెం
పడరఁగ రాజపుత్త్రుల మహాధనవంతులఁ జేసి వారితో
నొడఁబడి పక్ష మేర్పడఁగ నుండఁడుగా, ధన మెట్టి వారికిం
గడుకొని చేయకుండునె జగన్నుత గర్వము దుర్విమోహమున్. 32

క. క్షితినాథ! శాస్త్రదృష్టి, ప్రతిభను దివ్యాంతరిక్షభౌమోత్పాత
ప్రతికారు లగుచు సన్మా,నితు లయి వర్తింతురయ్య నీదైవజ్ఞుల్. 33

క. అనిశము సేవింతురె నిన్ననఘా! యష్టాంగ మైనయాయుర్వేదం
బున దక్షు లైనవైద్యులు, ఘనముగ ననురక్తులై జగద్ధితబుద్ధిన్. 34

క. సారమతిఁ జేసి మానస, శారీరరుజావలులకు సతతంబుఁ బ్రతీ
కారములు సేయు చుండుదె, యారఁగ వృద్ధోపసేవ నౌషధసేవన్. 35

క. ఉపధాశుద్ధులఁ జూప, వ్యపగతబుద్ధుల, వినీతివర్తుల, సములన్,
సుపరీక్ష నియోగించితె, నిపుణుల నర్థార్జనాదినృపకార్యములన్. 36

ఉ. ఉత్తమమధ్యమాధమనియోగ్యత బుద్ధి నెఱింగి వారి న
య్యుత్తమమధ్యమాధమనియోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ! భృత్యకోటికి ననూనముగాఁ దగుజీవితంబు లా
యత్తము సేసి యిత్తె దయ నయ్యయి కాలము దప్పకుండఁగన్. 37

క. తమతమకనియెడుతఱి జీతము గానక నవయుభటులదౌర్గత్యవిషా
దము లేలినవాని కవశ్యము నెగ్గొనరించు నకఁడు శక్రుం డైనన్. 38

క. కులపుత్త్రులైనసద్భృత్యులకును సత్కార మర్థితోఁ జేయుదె వా
రలు నీప్రస్తవమున నిమ్ములఁ గృతము దలంచి ప్రాణములు
విడుతు రనిన్. 39

క. అనఘా! నీప్రస్తవమున, నని నీల్గిన వీరభటుల యనుపోష్యుల నె
ల్లను బ్రోతె, భోజనాచ్ఛాదనముల వారలకు నెమ్మి దఱుఁగక
యుండన్. 40

క. ధనలుబ్ధుల, మ్రుచ్చులఁ, గ్రూరపనివారలఁ బగఱవలనివారల ధృతి చా
లనివారల, దుర్జనులం, బనుపవుగా రాజకార్యభారము దాల్పన్. 41

క. చోరభయవర్జితముగా, ధారుణిఁ బాలింతె యధికధనలోభమునం
జోరుల రక్షింపరుగా, వారలచే ధనము గొని భవద్భృత్యవరుల్. 42

క. ధరణీనాథ! భవద్భుజ, పరిపాలిత యైనవసుధఁ బరిపూర్ణములై
కర మొప్పుచున్నె చెఱువులు, ధరణి కవగ్రహభయంబు దనుకక
యుండన్. 43

క. హీను లగు కర్షకులకును, భూనుత! ధాన్యంబు బీజములు, వణిజులకున్
మానుగ శతైకవృద్ధి న, నూనముగా ఋణము లిత్తె యుత్తమబుద్ధిన్. 44

క. పంగుల మూకాంధుల వికలాంగులను నబాంధవుల దయం బ్రోతె భయా
ర్తుం గడిఁదిశత్రునైనను, సంగరరంగమునఁ గాతె శరణం బనినన్. 45

క. కృత మెఱిఁగి కర్త నుత్తమ, మతుల సభల సంస్తుతించి మఱవక తగుస
త్కృతి సేయుదె కృత మెఱిఁగెడు, పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించున్.

సీ. ఆయంబునందు నా లవభాగ మొండె మూఁడవభాగ మొండె నం దర్ధ మొండె
గాని మిక్కిలి సేయఁ గాదు వ్యయం బని యవధరించితె బుద్ధి నవనినాథ!
యాయుధాగారధనాధ్యక్ష్యములయందు వరవాజివారణావళులయందు
బండారములయందుఁ బరమవిశ్వాసుల భక్తుల దక్షులఁ బంచితయ్య

ఆ. గురుల వృద్ధశిల్పివరవణిగ్బాంధవ, జనుల నాశ్రితులను సాధుజనులఁ
గరుణఁ బేదఱికము వొరయకుండఁగఁ బ్రోతె, సకలజనులు నిన్ను
సంస్తుతింప. 47

క. వలయు నమాత్యులుఁ, జుట్టంబులు, మూలబలంబు రాజపుత్త్రులు, విద్వాం
సులు, బలసి యుండ నిచ్చలుఁ, గొలువుండుదె లోక మెల్లఁ
గొనియాడంగన్. 48

క. పరికించుచు బాహ్యాభ్యంతరజనములవలన సంతతము నిజరక్షా
పరుఁడ వయి పరమహీశుల, చరితము వీక్షింతె నిపుణచరనేత్రములన్. 49

క. వెలయఁగ విద్వజ్జనముఖ్యులతోడ నశేషధర్మకుశలుఁడ వయి యి
మ్ముల లోకవ్యవహార, మ్ములు దయఁ బరికింతె నిత్యమును సమబుద్ధిన్. 50

ఆ. వార్తయంద జగము వర్తిల్లుచున్నది, యదియు లేనినాఁడ యఖిల జనులు
నంధకారమగ్నులగుదురు గావున, వార్త నిర్వహింప వలయుఁ బతికి.

ఆ. దారసంగ్రహంబు ధరణీశ! రతిపుత్త్రఫలము, శీలవృత్తఫలము శ్రుతము
దత్తభుక్తఫలము ధనము, వేదము లగ్ని, హోత్రఫలము లనియు నొగి
నెఱుంగు. 52

చ. బహుధనధాన్యసంగ్రహము బాణశరాసనయోధవీరసం
గ్రహము నిరంతరాంతరుదకంబులు ఘాసరసేంధసౌఘసం
గ్రహము ననేకయంత్రములుఁ గల్గి యసాధ్యము లై ద్విషద్భయా
వహ లగు చుండ నొప్పునె భవత్పరిరక్ష్యము లైనదుర్గముల్. 53

చ. వదలక బుద్ధి నంతరరివర్గము నోర్చి జితేంద్రియుండ వై
మొదలన దేశకాలబలముల్ మఱి దైవబలంబుఁ గల్గి భూ
విదితబలుండ వై యహితవీరుల నోర్వఁగ నుత్సహింతె దు
ర్మదమలినాంధ చిత్తులఁ బ్రమత్తుల నింద్రియనిర్జితాత్ములన్. 54

తే. కడిఁది రిపులపైఁ బోవంగఁ గడఁగియున్న
నీకు ముందఱఁ జని రిపునృపులయందుఁ
దగిలి సామాద్యుపాయంబు లొగిన సంప్ర
యోగమునఁ జేసి వర్తిల్లుచున్నె చెపుమ. 55

వ. మఱియు నాస్తిక్యం, బనృతంబు, ప్రమాదం, బాలస్యం, బనర్థజ్ఞులతోడి చింతనంబు, క్రోధంబు, దీర్ఘచింత, దీర్ఘసూత్రత, యెఱుకగలవారి నెఱుంగమి, యర్థంబులయం దనర్థకచింత, నిశ్చితకార్యంబులు సేయమి, మంత్రంబుల రక్షింపమి, శుభంబులఁ బ్రయోగింపమి, విషయంబులం దగులుట యనం బరఁగిన పదునాలుగు రాజదోషంబులఁ బరిహరింతె యని యడిగిన నారదునకు ధర్మరా జిట్లనియె. 56

ఇట్టిసభ యెచ్చటనైన చూచితిరా యని ధర్మజుండు నారదు నడుగుట

తే. నాయథాశక్తిఁ జేసి యన్యాయపథముఁ, బరిహరించి మహాత్ములచరితలందు
బుద్ధినిలిపి మీయుపదేశమున శుభంబు,లయినవాని ననుష్ఠింతుఁ
బ్రియముతోడ. 57

వ. అని కృతాంజలి యయి మునీంద్రా! యీత్రిలోకంబులయందును మీ చూడనివి లేవెందే నిట్టియపూర్వం బైనసభ చూచి యెఱుంగుదురే యని మయనిర్మితం బయినసభ చూపినం జూచి విస్మితుం డయి నారదుండు ధర్మరాజున కిట్లనియె. 58

క. భూనాథ! యిది యపూర్వ మ,మానుషము, విచిత్రరత్నమయ మిట్టిసభన్
మానవలోకేశ్వరులం, దే నెన్నఁడుఁ జూచి వినియు నెఱుఁగ ధరిత్రిన్. 59

క. సురపతి యమ వరుణ ధనే, శ్వర కమలాసనులదివ్యసభ లెల్ల నరే
శ్వర! చూచితి నవి దీనికి, సరిగా వత్యంతవిభవ సౌందర్యములన్. 60

వ. అనిన విని యవి యెట్టివి వాని విన వలతు నానతిం డని లోకపాల సభా విభవ శ్రవణప్రభూతకుతూహల చేతస్కుండై యడిగిన ధర్మరాజునకు నారదుం డిట్లనియె 61

ఇంద్రసభావర్ణనము

క. శతమఖుసభ శుభరత్నాం, చితకాంచనరచిత మతివిచిత్రము లోక
త్రితయాఖిలలక్ష్మీసం,శ్రిత మలవియె దానిఁ బొగడ శేషునకయినన్. 62

వ. అదియును నూఱుయోజనంబుల వెడల్పును నూటయేఁబదియోజనంబుల నిడుపును నేనుయోజనంబుల తనర్పునుం గలిగి వైహాయసం బయి కామగమనం బయి వ్యపేతశీతాతపం బయి సకలకాలకుసుమఫలభరితపాదప వనసంకీర్ణసరోవరవిరాజితం బయి తపఃప్రభావంబున నమరేంద్రుచేత నిర్మితం బయి కరం బొప్పుచుండు నట్టి సభయందు. 63

చ. అతుల విభూతితో మణిమయాభరణద్యుతు లొప్పఁగా శత
క్రతుఁడు శచీసమేతుఁ డయి కాంచనచారువిమానమాలికా
గతదివిజోత్తముల్ గొలువఁగాఁ గొలు వుండు వరాప్సరోంగనా
యతవిలసత్కటాక్షకుసుమార్చితసుందరవక్త్రిచంద్రుఁ డై. 64

వ. మఱియును. 65

సీ. వదలక యేలినవానిప్రస్తవమునఁ బోరిలో నీల్గినవీరభటులుఁ
దమ కులధర్మముల్ దప్పక సలిపిన గృహమేధులను జగన్మహితకీర్తిఁ
బరఁగినధన్యులుఁ బరహిత వ్రతులైనపురుషులు దుర్గ్రామరణశోక
భయబుభుక్షార్తిపిపాసావ్యపేతులై కొలుతురు సురరాజు నొలసి యర్థ
ఆ. ధర్మకామములు సదక్షిణక్రతువులు, శ్రీవిలాసములు విశేషయజ్ఞ
వాహమంత్రతతులు వచ్చి సేవింతురు,మూర్తిమంతులగుచు ముదముతోడ.

వ. మఱియు శుక్రబృహస్పతులు నగ్నీషోములు నాశ్వినులును విశ్వదేవతలును ధాతయు విధాతయు హరిశ్చంద్రుం డనురాజర్షియు సురేంద్రసభ నుండుదురు.

యమసభావర్ణనము

క. ధర్మసభ లోకధర్మా,ధర్మవివేకాస్పదంబు తైజసము లస
ద్భర్మమణితతుల దానిన్, నిర్మించెను విశ్వకర్మ నిపుణత యొప్పన్. 68

వ. అది శతయోజనవిస్తారాయామరమణీయంబును గామగామియును సూర్యతేజోనిభశుభతేజంబును సర్వసుఖసంపాదనంబు నయి చూడ నొప్పుచుండు నట్టిసభయం దగస్తిమతంగాదిసిద్ధమునులును బితృదేవతలును గాల కింకరులును మూర్తిమంతు లైనకాలచక్రక్రతుదక్షిణదిగ్దేవతలును నుగ్రతపంబులును గృతవీర్య జనమేజయ జనక బ్రహ్మదత్త పృషదశ్వ శంతను వైన్య భూరిద్యుమ్నేంద్రద్యుమ్న మన్మథ మధుకం రోవరిచరులును మీజనకుం డయిన పాండుమహారాజును నాదిగాఁ గలయనేక రాజఋషులు నుందురు వీరిచేత ననవరతంబు సేవితుం డయి యమరాజు సమస్తజీవుల శుభాశుభ కర్మంబు లారయు చుండు. 69

వరుణసభావర్ణనము

త. వరుణుసభ సర్వలోకో,త్తర ముజ్జ్వలమణిమయము సితప్రభ మతిసుం
దర మందుండును వరుణుఁడు, వరుణానీసహితుఁ డై ధ్రువం బగు
మహిమన్. 70

వ. అది యమరాజుసభ యంతియ విస్తారాయామరామణీయకంబులును గామగామిత్వంబును గలిగి విలసిల్లు జలస్తంభంబు సేసి జలంబులలో నుండి విశ్వకర్మ దాని రమణీయంబుగా రచియించె. 71

సీ. అందు సుఖాసీనుఁ డైన యవ్వరుణేంద్రు నంబుధుల్ నాల్గును నధికభక్తిఁ
గాళింది నర్మద గంగ గోదావరి విదిశ విపాశ కావేరి కృష్ణ
వేణి సరస్వతి పెన్న యైరావతి యనఁగఁ బ్రసిద్ధంబు లయిననదులు
సరసీ తటాక నిర్ఝర దీర్ఘి కాదులు దిక్కులు నఖిలధాత్రీధరములు

ఆ. వసుమతియును దేహవంతంబు లై వచ్చి, మకర కూర్మశింశుమార సింహ
శరభ సామజాదిజలచరస్థలచర, తతులతోడ సంతతంబుఁ గొలుచు. 72

వ. మఱియు వాసుక్యైరావతాదినాగరాజులును, బ్రహ్లాద విరోచన బలి
నరక నముచి విప్రచిత్తి కాలకంఠ కైటభ ఘటోదర దశగ్రీవ విశ్వరూప
విరూపాక్షాదు లయినదైత్యదానవవరులును వరుణు సేవించు చుండుదురు.

కుబేరసభావర్ణనము

క. ధనదుసభ ఇంద్రసభతో, నెన యగుచు మహావిభూతి నెంతయు నొప్పుం
దనదివ్యశక్తి నాతం, డొనరఁగ నిర్మించె దాని నుత్తమమణులన్. 74

వ. అదియును నూఱుయోజనంబుల నిడుపును డెబ్బదియోజనంబుల వెడ
ల్పునుం గలిగి సితప్రభం బయి గగనచరం బయి కనకమయతరులతాలం
కృతం బయి తటిల్లతావిచిత్రశరదంబుదంబు ననుకరించు చుండు. 75

క. అందుఁ గుబేరుఁడు పరమా,నందంబున నుండు ధర్మనందన! విలస
న్మందార పారిజాతక, నందనమందానిలాభినందితుఁ డగుచున్. 76

వ. అతని ననవరతంబును నరకిన్నరనాము లైనగంధర్వులును, వరాహకర్ణ
గజకర్ణ మాణిభద్ర హేమనేత్ర విభీషణ పింగళక ప్రవాళకాదు లయిన
యక్షులును, నలకూబరుండును, నూర్వశీ తిలోత్తమా ఘృతాచీ మేనకా
విభావరీ రంభా ప్రభృతులయిన యప్సరసలును సేవింతు రే సెప్పుడు
ననేకదేవర్షి గణంబులతో నరిగి చూచు చుండుదు. 77

ఉ. వానికి నెయ్యుఁ డై యమరవంద్యపదాంబుజుఁ డంబికాబృహ
త్పీనపయోధరాగ్ర పరిపీడితవక్షుఁడు భూషణీకృతా
హీనుఁ డశేషలోకగురుఁ డీశ్వరుఁ డెప్పుడు నంద యుండు నా
నానిశితాయుధాయుతసనాథమహాద్భుతభూతకోటితోన్. 78

బ్రహ్మసభావర్ణనము

వ. ఏను దొల్లి మనుష్యలోకంబునం గొండొక కాలం బున్న నాకడకు
సూర్యుండు వచ్చి పితామహుసభ వర్ణించినఁ దద్దర్శనకుతూహలుండ నయి
యాదిత్యుతోడన యరిగి యక్కమలగర్భుసభం జూచితి. 79

చ. దళితవిరోధి ! యిట్టి దని దానితెఱం గెఱుఁగంగ బ్రహ్మకుం
గొలఁదియె తా నవాఙ్మనసగోచర మద్భుతరూప మీవియ
త్తల మనుకంబ మొక్కటియ తాల్పఁగ సుస్థిర మై నిజప్రభా
వలి వెలిఁగించు చుండు శశివారిజమిత్రుల మండలంబులన్. 80

వ. అం దనేకవిధజీవరాసుల సృజియించుచు సధికతపస్స్వలతపఃఫలంబులు విధించుచు విశ్వకర్త లైన మన్వత్రి మరీచి భృగు భరద్వాజ దక్ష వసిష్ఠ వాలఖిల్య పులస్త్య పులహక్రతు కశ్యప గౌత మాంగిరః ప్రచేతసులును, చంద్రాదిత్య గ్రహనక్షత్రగణంబులును, దేవగణంబులును, వసురుద్రసిద్ధ సాధ్యులును, ప్రజావంతులైన పంచాశత్సహస్రమునులును, నూర్ధ్వరేతసు లయిన యష్టాశీతిసహస్ర మునులును, నాశ్వినులును, విశ్వదేవతలును, విశ్వకర్మయుం, బితృదేవతలునుం దన్నుం బరివేష్టించి యుండ ధర్మార్థ కామమోక్షంబులును, శబ్దస్పర్శరూపరసగంధంబులును, దప శ్శమ దమం బులును, ధృతి స్మృతి మేధా బుద్ధి క్షమా కీర్తులును, సంకల్పవికల్ప ప్రణవంబులును, క్షణ లవ త్రుటి కాష్ఠా ముహూర్తాహోరాత్ర పక్ష మాస ఋతు సంవత్సర యుగాత్మకం బైనకాలచక్రంబును, ఋగ్యజు స్సామాథర్వణవేద వేదాంగంబులును, బురాణేతిహాసంబులును, బహు ప్రకార భాషలును, సమస్తవిద్యలును, మూర్తిమంతంబు లై కొలువ సరస్వతీ సమేతుం డై పరమానందంబునం బరమేష్ఠి పద్మాసనంబున నుండు నని లోకపాలురసభలను బ్రహ్మసభను వర్ణించిన నారదునకు ధర్మరా జిట్లనియె. 81

హరిశ్చంద్రుమాహాత్మ్యము

మధ్యాక్కర. పరమధర్మాత్మకుఁ డయినపాండుభూపతిఁదొట్టి సకల
ధరణీశు లెల్ల యముసభ నుండంగఁ దా నేమిపుణ్యా
చరితఁ బ్రవర్తిల్లెనయ్యా దేవేంద్రసభ హరిశ్చంద్రుఁ
డురుతరమహిమతో దేవపూజ్యుఁ డై యుండఁగఁ గనియె. 82

వ. అని యడిగిన ధర్మరాజునకు హరిశ్చంద్రుమహిమాతిశయంబు నారదుం డిట్లని చెప్పె. 83

ఉ. దీపితసత్యసంధుఁడు ధృతిస్స్మృతిధర్మపరాయణుం డయో
ధ్యాపురనాయకుండు జలజాప్తకులైకవిభూషణుండు వి
ద్యాపరమార్థవేది శరదబ్జసముజ్జ్వలకీర్తిచంద్రికా
స్నాపితసర్వలోకుఁడు త్రిశంకునరేంద్రసుపుత్త్రుఁ డున్నతిన్. 84

సీ. జయశీలుఁ డయి హరిశ్చంద్రుండు దొల్లి సప్తద్వీపములఁ దనబాహుశక్తిఁ
జేసి జయించి నిశ్శేషితశత్రుఁడై ధారుణిలోఁ గలధరణిపతుల
నిజశాసనంబున నిలిపి నిత్యం బైన మహిమతో సకలసామ్రాజ్య మొప్ప
రాజసూయంబు తిరంబుగా నొనరించి తనరి యథోచితదక్షిణలకు

ఆ. నేనుమడుఁగు లర్థ మిచ్చి యాజకులఁ బూజించి భక్తితో విశిష్టవిప్ర
జనుల కభిమతార్థసంప్రదానంబులఁ దృప్తి సేసె వంశదీపకుండు. 85

క. ఉరుతరధనసంతర్పిత, ధరణీసురు లతని నతిముదంబున దీవిం
చిరి రాజులందు లోకో, త్తరతేజోధర్మయుక్తిఁ దనరుమ యనుచున్. 86

వ. వాఁడును బ్రాహ్మణవచనంబునం జేసి యెల్లరాజులకు నధికుండయి రాజ
సూయ మహాయజ్ఞ కరణంబునం జేసి దేవేంద్రుసాలోక్యంబు వడసె నట్టి
హరిశ్చంద్రు మహిమాతిశయంబు రాజసూయనిమిత్తంబున నయినదిగా
నెఱిఁగి రాజలోకంబుతో వైవస్వతసభ నుండుభవజ్జనకుండు పాండురాజు
నాతో ని ట్లనియె. 87

నారదుఁడు పాండురాజు వచనంబులు ధర్మజుని కెఱింగించుట

క. జనపతులు రాజసూయం, బొనరించినవారు శక్రునొద్దను సురపూ
జన లొందు చుండుదురు కోరినకోర్కులు వడయుచును హరిశ్చంద్రు
క్రియన్. 88

చ. గొనకొని మర్త్యలోకమునకుం జని సన్మునినాథ ! యిందు నా
[1]యునికియు రాజసూయముఖ మున్నతిఁ జేసినధన్యు లింద్రునం
దునికియు నాతనూజున కనూనయశోనిధి యైనధర్మనం
దనునకుఁ జెప్పి వాని నుచితస్థితిఁ బన్పుఁడు దానిఁ జేయఁగన్. 89

1. యునికిని

చ. అనుపమశక్తిమంతులు మదాత్మజు లేవురు దేవతావరం
బున నుదయించి యున్నకృతపుణ్యులు వారలలోన నగ్రజుం
డనఘుఁడు రాజసూయము మహామతిఁ జేయఁగ నోపు శత్రుసూ
దనుఁ డయి సార్వభౌముఁ డయి తమ్ముల బాహుబలంబు పెంపునన్. 90

వ. అట్లేని నాకు నస్మత్పితృపితామహనివహంబుతోడ నాకాధిపలోక సుఖావాప్తియగు ననిన నప్పాండురాజువచనంబు నీ కెఱింగించువేడుక నిట వచ్చితి. 91

క. న్యాయమున రాజసూయము, సేయుము నీపితృగణంబుఁ జెచ్చెర నధిక
శ్రీయుత ! సురగణపూజ్యులఁ, జేయుము శక్రుసభ నుండఁ జేయుము
వారిన్. 92

వ. దిగ్విజయోపార్జితంబు లయినధనంబుల బ్రాహ్మణ సంతర్పణంబును ధర్మ మార్గంబునం జాతుర్వర్ణ్యాశ్రమ రక్షణంబునుం జేసి సామ్రాజ్యంబు పూజ్యంబై యొప్పం బ్రకాశింపుము మఱి రాజసూయంబు బహు విఘ్నంబు బ్రహ్మరాక్షసులు దాని రంధ్రంబ రోయుచుండుదు రదియును నిర్విఘ్నంబున సమాప్తం బయ్యెనేని నిఖిలప్రజాప్రళయకారణం బయిన రణం బగు నని చెప్పి నారదుం డరిగినఁ దమ్ములం జూచి ధర్మతన యుండు ధౌమ్య ద్వైపాయన సుహృద్బాంధవ మంత్రిసమక్షంబున నిట్లనియె. 93

ధర్మరాజు నారదవచనప్రబోధితుండై రాజసూయయజ్ఞంబు సేయుటకు నాలోచించుట

క. పితృసంకల్పము సేయఁగ, సుతుల కవశ్యమును వలయు సుతజన్మఫలం
బతిముదమునఁ బితృవరులకు, హిత మొనరించుటయ కాదె యెంతయు
భక్తిన్ 94

క. పరలోకనిలయు లగుమీ, గురులకు దీనన హితం బగున్ లోకభయం
కరసంగరమున్ను గాల్తాం,తరమున నగు నని విరించితనయుఁడు
సెప్పెన్. 95

క. పితృగణహితార్థముగ సత్క్రితు వొనరింపంగ బుద్ధి గలదు ప్రజానం
హృతి తత్క్రితువున నగు నని, మతి నాశంకయును గలదు మానుగ
నాకున్. 96

వ. ఏమి సేయుదు నని డోలాయమానమానసుం డయి యున్నధర్మరాజు
నకు ధౌమ్యప్రభృతు లి ట్లనిరి. 97

ఉ. చేయుము రాజసూయ మెడ సేయక దానఁజేసి దోషముల్
వాయు నిలేశ! భూప్రజకుఁ బార్థివు లెల్ల భవత్ప్రతాపని
ర్జేయులు, సర్వసంపదలు చేకొనఁగాఁ దటి యయ్యెఁ, గౌరవా
మ్నాయలలామ! నీ కెనయె మానవనాథులు మానుషంబునన్. 98

వ. అనిన వారలవచనంబుల కనుగుణంబుగా ననుజానుమతుం డయి ధర్మ
రాజు రాజసూయంబు సేయ సమకట్టి దీని నిర్విఘ్నంబున నిర్వహించుట
కనాదినిధనుం డాదిపురుషుండు పురుషోత్తముండు పుండరీకాక్షుం డజుం
డయ్యును జగద్ధితార్థంబుగా మర్త్యంబున జనియించినయమ్మహాత్ముండు
వాసుదేవుండ యొపుంగాని యన్యుల కశక్యం బని యప్పుడ యాప్త
చరులం బిలువం బనిచి. 99

క. అనిలజవాశ్వంబులఁ బూనినయరదం బెక్కి ధారుణీధరు మధుసూ
దనుఁ దోడ్తెం డని ముదమునఁ, బనిచి తదాగమన కాంక్షఁ బార్థివుఁ
డుండెన్. 100

కృష్ణుఁ డింద్రప్రస్థపురంబునకు వచ్చుట

వ. అయ్యుధిష్ఠిరు సందేశంబున దాశార్హుండును దద్దర్శనోత్సుకుం డయి
ద్వారవతి గదలి యతిత్వరితగతిం జని నిరంతర ప్రయాణంబుల నింద్ర
ప్రస్థపురంబునకు వచ్చి. 101

ఉ. కుంతికి ధర్మనందనునకున్ వినయంబున మ్రొక్కి, భీము ధీ
మంతునిఁ గౌఁగిలించుకొని, మధ్యమపాండవు మాద్రిపుత్త్రులన్
సంతతభక్తినమ్రులఁ బ్రసాదనయోత్కటదృష్టిఁ జూచి తా
నెంతయుఁ బ్రీతి నెత్తికొనియెన్ మహి నెత్తినపుణ్యుఁ డున్నతిన్. 102

వ. తదనంతరంబ ధర్మతనయుండు. 103

క. పరమాసనమున నునిచి య,పరిమితహర్షంబుతో సపర్యావిధులన్
గురుఁ బూజించినవిధమునఁ గురువృషభుఁ డశేషలోకగురుఁ బూజించెన్.

క. ఏమఱక జనులయోగ, క్షేమంబుల నడపు చున్నకృష్ణునియోగ
క్షేమంబు లడిగి యపుడు మ,హాముదమున ధర్మసుతుఁడు హరి
కిట్లనియెన్. 105

క. ధ్యేయుఁడవు సకలలోక, స్థేయుండవు, నమ్రులకు విధేయుఁడవు, నయో
పాయజ్ఞుఁడ, విజ్జగముల, నీయెఱుఁగనియదియుఁ గలదె నీరజనాభా!

వ. అయినను నాయర్థిత్వంబునం జేసి నీ కెఱింగించెద. 107

సీ. పాండుమహీపతిపనిఁ జేసి నారదముని వచ్చి వీరెల్ల వినుచు నుండ
రాజసూయంబు తిరంబుగాఁ జేసి నీ పితృపితామహులకు హితము సేయు
మని పంచె నన్ను నెయ్యముననో, నాకట్టిబలము సామర్థ్యంబుఁ గలుగు
తెఱఁగి
పంచెనో, తత్క్రతుప్రారంభమున కొడంబడితి వీ రిందఱుఁ గడఁగి దీని

ఆ. నిత్యసత్యవచననిపుణనిర్మలబుద్ధి, నిర్ణయించి పనుప నీనియోగ
కాంక్ష నున్నవాఁడఁ గమలాక్ష! యనిన ధ,ర్మాత్మజునకు నిట్లు లనియెఁ
జక్రి. 108

కృష్ణుఁడు ధర్మరాజునకు జరాసంధుని సామర్థ్యము నెఱింగించుట

క. కురువృషభ! సర్వగుణముల, సురుచిరతేజమున రాజసూయాఖ్యమహా
ధ్వరమునకు నీవ యర్హుఁడ, వరిసూదనశౌర్యు లయినయనుజుల
బలిమిన్. 109

వ. తొల్లి జమదగ్నిసుతుం డయినరామునిచేత ధాత్రి యపగతక్షత్త్రిం బయిన
నంతనుండి యైలవంశంబును నిక్ష్వాకువంశంబును దక్కఁ దక్కినక్షత్త్రియ
వంశంబు లెల్లం గృత్రిమంబులు గాని విమలమకుటార్హంబులుగా వీరెండు
వంశంబులవలన నేకోత్తరశతవంశంబు లయ్యె మఱి యయాతిభోజ

వంశంబుల వలనం జతుర్దశవంశంబు లయ్యె నిట్టి సకలక్షత్త్రియంబులెల్ల
జయించి జరాసంధుం డున్నవాఁడు వాని సామర్థ్యంబు చెప్ప నశక్యంబు.

క. అతిదర్పోద్ధతుఁడు మహా,ద్భుతభూరిబలుండు చేదిభూపతి సేనా
పతియయి శిశుపాలుఁడు సం,తతమును నాతనిన కొలుచుఁ దద్దయు
భక్తిన్. 111

క. ఆయతభుజవీర్యులు మా,యాయోధులు హంసడిభకు లను వార లని
ర్జేయులు పరస్పరస్నే,హాయత్తసుచిత్తు లతనియాప్తు లధీశా! 112

వ. అయ్యిద్దఱును గౌశికచిత్రసేను లనునామంబులతో మహాసేనాన్వితులై
వానికి వామదక్షిణభుజంబులుంబోలె సర్వసాధనసమర్థు లయి వర్తిల్లుదురు
మఱియు వరుణు నంతియబలవంతుండు పశ్చిమదిఙ్మహీపతి భగదత్తుం డను
వాఁడు పాండురాజ సఖుం డగుటం జేసి నీకు మనంబున భక్తుండయ్యు
భయంబున జరాసంధునకు వాక్కర్మంబులం బని సేయు చుండుఁ జేది
పతులలోనఁ బురుషోత్తముండును నంగవంగపుండ్ర కిరాతపతులలోనఁ
బౌండ్రకవాసుదేవుండును మదీయనామంబులుదాల్చి జరాసంధుం గొలు
తురు ప్రాగ్దక్షిణదిగ్భాగముల రాజులు పురుజితుండును గరూశ కలభ
నకుల సంకర్షణ సూపహిత మనోదత్త[1] చక్రసాల్వేయ యవనులును వానిన
సేవింతు రుదీచ్యు లయినయష్టాదశక్షత్త్రికులంబులవారును నుత్తర[2]
పాంచాలశూరసేన పుష్కరపుళింద కళింగ కుంతి మత్స్యదేశంబుల రాజు
లెల్లను దద్భయంబునఁ దమతమదేశంబుల విడిచియున్న వారలు
మఱియును. 113

ఉ. ఘోరరణంబులోన నధికుం గృతబంధుజనాపకారు నే
దారుణలీలఁ గంసు నతిదర్పితుఁ జంపుటఁ జేసి యమ్మహా
క్రూరుఁడు కంసుభార్య దనకూఁతురు గావున దానిసంతత
ప్రేరణ నా కుపద్రవముఁ బెక్కువిధంబులఁ జేసె నీసునన్. 114

క. భూమీశ! హంసడిభకులు, నామగధాధీశ్వరుండు నమ్మువ్వురు ను
ద్దామభుజవీర్యసంపద,తో మూఁడుజగములు నోపుదురు సాధింపన్. 115

1. ముర దంతవక్త్ర 2. సర్వ

వ. ఆ జరాసంధుండును నాయుధనిహతులు గాని హంసడిభకులతోవచ్చి మధు
రపై విడిసిన నతివీరు లయిన యదు వృష్ణి భోజాంధకవరు లష్టాదశ
సహస్రరథ వ్రాతంబులతో నేమును సమకట్టి మహాయుద్ధంబు సేయుచు
వాని నెట్లును జయింపరాకున్న నుపాయంబున హంసుండు సమరనిహతుం
డయ్యెనని డిభకునకుం జెప్పంబంచిన నప్పలుకులు నిక్కువంబ కావగచి.

చ. అనవరతంబు నిష్టుఁ డగుహంసుఁడు లేనిజగంబులోనిజీ
వన మది యేల నా కనుచు వారినిమగ్నశరీరుఁ డై క్షణం
బున డిభకుండు మృత్యుగతిఁ బొందె ఘనంబుగ దాని నక్కడన్
విని మృతుఁ డయ్యె హంసుఁ డతివీరుఁడు తద్గతసౌహృదంబునన్. 117

వ. అట్లు కౌశికచిత్రసేనులు పరలోకగతు లయిన నసహాయుం డై జరా
సంధుండు మగిడి మగధపురంబునకుం జనియె నేమును వానితోడివైరంబు
బలవంతంబైన నమ్మధుర నుండ నొల్లక కుశస్థలంబునకు వచ్చి రైవతక
పర్వతంబున ఘనంబుగా దుర్గంబు నిర్మించుకొని భవదాశ్రయంబున
సుఖంబున్నవారము. 118

చ. ఖలుఁడు బృహద్రథాత్మజుఁడు గర్వితుఁ డై మహిలోనిరాజులం
బెలుకుఱఁ బట్టి తెచ్చి చెఱఁ బెట్టి గిరివ్రజ మన్పురంబులోఁ
జొలయక నిత్య మొక్కొకని సూనరివోలె వధించి నేమమున్
బలిమియు నేర్పడం గడఁగి భైరవపూజ యొనర్చు నుగ్రుఁ డై. 119

క. ధరణీశ! వానిఁ జంపుడు, నురుతరసామ్రాజ్యవిభవ మున్నతితో సు
స్థిర మగు నీకును మఱిభాసురముగ సమకూరు రాజసూయము సేయన్.

సీ. రక్షణంబున భగీరథుఁడు జయంబున నయ్యౌవనాశ్వుండు నత్యుదగ్ర
బాహుబలంబున భరతుండు తపమునఁ గార్తవీర్యుండును గరముబుద్ధి
నమ్మరుత్తుండును నఖిలసామ్రాజ్యంబుఁ బడసిరి తొల్లి భూపాల యిప్పు
డిన్నిగుణంబులు నెన్నంగఁ గలవు నీకిదియేమి దుర్లభ మిద్ధరాత్మఁ

ఆ. డెంతబలియుఁడయ్యు నెంతగర్వితుఁడయ్యుఁ దనకఠోరదుష్ప్రతాపమునను
విగతవిభవుఁ డగు వివేకవిహీనుల, కైన లక్ష్మి సుచిర మగునె యెందు.

భీమసేనార్జునులు ధర్మరాజున కుత్సాహంబు గల్గించుట

వ. అనిన విని భీమసేనుండు ధర్మరాజున కి ట్లనియె. 122

క. ఆరంభరహితుఁ బొందునె, యారయ సంపదలు హీనుఁ డయ్యును బురుషుం
డారంభశీలుఁ డయి యక్కృతారంభుల నోర్చు నెంతయధికుల నయినన్.

క. కడు నధికుతోడఁ దొడరినఁ, బొడిచిన నొడిచినను బురుషుపురుషగుణం బే
ర్పడుఁగాక హీను నొడుచుట, కడిఁదియె పౌరుషము దానఁ గలుగునె
చెపుమా. 124

క. ఈహరికరుణయు నర్జును, సాహాయ్యముఁ గలుగ నీప్రసాదమున జగ
ద్ద్రోహి జరాసంధు మహాసాహసు వధియింతు నుగ్రసంగ్రామమునన్.

తే. అనఘ! యేము మువ్వురము మూఁడగ్నులట్లు, నీమహాయజ్ఞ కార్యంబు
నిర్వహింతు
మాజరాసంధపశువున నఖిలశస్త్ర, వాహుతులఁజేసి తృప్తుల మగుచుబలిమి

వ. అనిన భీమసేను విక్రమవచనంబుల కనుగుణంబుగా నర్జునుం డి ట్లనియె.

ఉ. భూభుజులన్ జయింపుము విభూతి నొనర్పుము రాజసూయమున్
నాభుజవీర్యవిక్రమగుణంబులకుం దగు చున్న యీధను
ర్లాభము దివ్యబాణరథలాభము శోభిత మైన యీసభా
లాభము నొందుపాట సఫలత్వముఁ బొందునె కౌరవేశ్వరా! 128

క. [1]కలరూపగుణద్రవ్యం,బులు విక్రమవంతునందు భూవిదితములై
నిలుచు, నవిక్రమునకు నవి, గలిగియు లేని క్రియ నప్రకాశంబులగున్.

వ. మఱియు రాజసూయమహాధ్వరంబు కారణంబుగాఁ బరాక్రమంబున జరాసంధు వధియించి నిఖిలక్షత్త్రియనిగ్రహమోక్షణంబు సేయునంత కంటె మిక్కిలి యశోధర్మంబు లొం డెవ్వి యనిన భీమార్జునుల పలుకు లకు సంతసిల్లి నారాయణుం డి ట్లనియె. 130

క. వెలయ విధిదృష్ట నయమున, వలయుఁ బరాక్రమము సేయ వసుధేశ్వర! య
గ్గల మగుబుద్ధియుఁగడఁకయుఁ,గలపురుషుల కిదియ మావెకర్తవ్యమిలన్,

1. కులరూప

క. కావున మేము ముప్పురముఁ గ్రమంబునం బరాక్రమించి జరాసంధు డాసి
నదీప్రవాహంబులు వృక్షోన్మూలనంబు సేయునట్లు క్రమంబున వాని
నిర్మూలితుం జేసెద మద్దురాత్ముండు ఘాతంబులయుం దంతరాత్మయుం
బోలెఁ దన యంతరం బెఱుంగక యేకాంతశీలుఁడై సుఖం బనుభవించుటం
జేసి వాని యంతికంబున కరుగుట యశ్రమం బనిన నారాయణునకు
ధర్మరా జిట్లనియె. 132

క. దనుజాహిత! నీ కాహవమున నెదిరి మహోగ్రదహనమునఁ బడియును గా
లనిమిడుతవోలె నతికో, పనుఁడు జరాసంధుఁ డెట్లు బ్రదుకఁగ నేర్చెన్.

క. అట్టియతిదారుణత్వము, నట్టియజేయభుజవిక్రమాధిక్యము వాఁ
డెట్టిక్రియఁ బడసె నాతని, పుట్టినవిధ మెట్లు చెప్పు పొలుపుగ నాకున్ 134

వ. అని యడిగిన ధర్మరాజునకుఁ గృష్ణుం డిట్లనియె. 135

సీ. అతిసమర్థుండు బృహద్రథుం డనువాఁడు మగధాధినాథుఁ డున్మార్గదూరుఁ
డక్షౌహిణీత్రితయంబుబలంబునఁ బరుల నోడించిన బలిమికాఁడు
కాశిరాజనువాని గాదిలికూఁతులఁ గవలవారల నతికాంతిమతుల
నమరంగఁ బెండ్లియై యనుపమ ప్రీతి నయ్యిరువురయందు భోగేచ్ఛ సలిపి

తే. యందపత్యంబు వడయుదు నని తలంచి, విప్రమునిదేవపూజల వివిధవిధులఁ
బుత్త్రకామేష్టులను నొందుపుణ్యకర్మ, యుక్తులను జేసి పడయంగ నోప
కలసి. 136

వ. పుత్త్రుఁడు లేనివిభవంబు లన్నియు నేల యని నిర్వేదించి పత్నీద్వయ
సమేతుండయి వనంబున కరిగి. 137

ఉ. ఆవిపినాంతరంబున నిరంతరనిష్ఠ ననంత మోక్షకాం
క్షావిధి నొక్క బాలసహకారమహీజముక్రింద నుజ్జ్వల
త్పావకతేజుఁడై తపము పాయక చేయుచు నున్న ధన్యుఁ గా
ఢీవతుఁ గాంచె గౌతము నకిల్బిషమానసుఁ జండకౌశికున్. 138

క. ధరణీశ్వరుఁ డమ్మునివరుఁ, బురాతనమునిన్, నిరాశుఁ, బుణ్యాత్ము, నిరం
తరకృతనియమసపర్యా, వరివస్యుం డగుచు భక్తి వదలక కొలిచెన్. 139

వ. ఇట్లుపాస్యమానుం డయి చండకౌశికుండు బృహద్రథునకు మెచ్చి నీ కిష్టంబు చెప్పు మిచ్చెద ననిన వినయవినమితోత్తమాంగుం డయి వాఁ డి ట్లనియె. 140

ఉ. సంతత మైనసర్వసుఖసంపద గల్గియు దానికిం దగన్
సంతతి లేమిఁ జేసి యది సర్వము హేయము కాఁ దలంచి ని
శ్చింతుఁడ నై ధృతిం దపము సేయఁగ వచ్చితిఁ బుత్త్రజన్మ మై
నంతన యేను మీదయఁ గృతార్థతఁ బొందుదు సన్మునీశ్వరా. 141

వ. అనినం గరుణించి మునివరుండు పరమధ్యానముకుళితనయనుం డై యున్నంత. 142

క. పవనవిధూతము శుకచం, చువిలూనముఁ గాక యొక్క చూతఫలం బ
య్యవనిజమువలన నమ్ముని, ప్రవరుపృథూత్సంగతలము పై వడిఁబడియెన్.

వ. దానిం బుచ్చికొని యభిమంత్రించి చండకౌశికుండు బృహద్రథున కిచ్చి యీ ఫలంబువలన నీకొక్కపుత్త్రుం డుద్భవిల్లు నని చెప్పిన నాతండును గృతార్థుం డై క్రమ్మఱ నిజపురంబునకు వచ్చి తనయిద్దఱుభార్యలకు నప్పండు సమంబుగా విభాగించి పెట్టినం దత్ఫలోపభోగంబున నయ్యిద్దఱు గర్భిణు లయినఁ బదియగు మాసంబున నొక్కనాఁటిరాత్రియందు వారలకు.

క. ఒక్కొకకన్నును జెవియును,
జెక్కును, జను, బొడ్డు, మూఁపుఁ, జెలు వగుచేయున్
బ్రక్కయుఁ, గుఱువును, గాలును
నక్కజముగ మనుజశకలమై యుదయించెన్. 145

క. అమ్మానిసివ్రయ్యలు గని, యమ్ముదితలు వెఱచి వీని నాత్మజుఁ డని నే
య్యొమ్మున నెట్టులు చూపుదు, మిమ్మనుజేశ్వరున కనుచు నెంతయు లజ్జన్.

వ. వీని నెవ్వరును నెఱుంగకుండ వెలుపల వైచి రం డని తమదాదులం బంచిన వార లారెండువ్రయ్యలుం గొనిపోయి రాజగృహద్వారతోరణసమీపంబునఁ జదుకంబునొద్ద నొక్కచోట వైచిన నచ్చదుకంబున నుండెడు రాక్షసి జరయనునది వాని బలియ కా వగచి పఱతెంచి. 147

అ. ఎత్తికొని చనంగ నిమ్మగునట్లుగా, మొదలు చున్నవ్రయ్య లదిమి రెంటిఁ
గూడఁబట్టె నవియుఁగూడి యొండొంటితోఁ, జక్క నంటి రెండు
నొక్కఁడయ్యె. 148

క. ఆరాక్షసి కెత్తికొనన్, భారముగా వజ్రకఠినబంధురతనుఁడై
ధీరుఁడు బాలకుఁ డేడ్చె మ,హారవమున దానిచేతు లాడకయుండన్. 149

వ. అబ్బాలకురోదనధ్వని విని యంతిపురంబున నున్న ముదుసలియవ్వ లెల్లం బఱతెంచి మహాహర్షంబుతో వాని నెత్తికొని రట్టి సంభ్రమంబెఱింగి బృహద్రథుండు వచ్చి తేజోధికుం డయి తామ్రతలముష్టిం దనముఖపద్మంబునం బెట్టికొని దిక్కులు సెలంగ నేడ్చు చున్నకొడుకుం జూచి కృతార్థీకృతలోచనుండయ్యె నట్టి యవసరంబున నారాక్షసి కామరూపిణి గావున మనుష్యస్త్రీరూపధారిణి యయి యమ్మగధరాజున కిట్లనియె. 150

తే. ఏను జరయను రాక్షసి నిప్పురంబు,చదుకమునఁ బాయకుండుదుసంతతంబు
నీకు నిష్టంబు సేయంగ నెమ్మితోడఁ, గోరు చుండుదు నది సమకూరె నేఁడు

వ. నీయిద్దఱుదేవులకు నుద్భవిల్లిన యిమ్మనుష్యశకలంబులు రెండును నీదాదులు దెచ్చి యిచ్చదుకంబునొద్ద నొక్కచో వైచి పోయిన నేను వానిం గూడఁ బట్టుదు నప్పుడు వజ్రఘనఘటితకఠినశరీరుం డై యిక్కుమారుండు మేరుగిరి శృంగంబునుంబోలె నా కెత్తికొన నశక్యుం డయ్యె వీని నొప్పగొను మనిన విని బృహద్రథుండు ముదితహృదయుం డయి దాని కిట్లనియె. 152

ఉ. ఇచ్చకు వచ్చుపూజనల నెంతయు సంతస మంది తొల్లి నా
కిచ్చె మునీశ్వరుండు దయ నిత్తనయున్ మఱి యిప్డు నెమ్మితో
నిచ్చితి వీవు రాక్షసివె యిక్కుల మెల్లను నుద్ధరింపఁగా
వచ్చినపుణ్యదేవతవు వారిరుహాయతచారులోచనా! 153

వ. అని దాని నతిప్రీతిం బూజించి కొడుకు నెత్తికొని దేవీద్వయంబునకు నిచ్చి జరయనురాక్షసిచేత సంధింపంబడినవాఁడు గావున జరాసంధుం డను పే రిడి పురం బస్టశోభనంబు సేయించి యారాక్షసి కేఁటేఁట మహోత్సవంబుం జేయించుచుం గొడుకు నతిగౌరవంబునం బెంచిన. 154

క. ఈహితవిధానముల లో, కాహితదుస్సహనతేజుఁ డయి వాఁడు మహో
త్సాహముతో వర్ధిల్లె ఘృ, తాహుతులఁ బ్రవృద్ధి నొందు నగ్నియ
పోలెన్. 155

జరాసంధునియొద్దకుఁ జండకౌశికుండు వచ్చుట

వ. ఇట్లు జరాసంధుండు పెరుఁగుచున్నఁ గొండొకకాలంబునకు నొక్కనాఁడు చండకౌశికుం డందులకు వచ్చిన నతిముదంబుతోఁ బుత్త్రకళత్ర మిత్ర భృత్యామాత్యసహితుం డయి బృహద్రథుం డెదురువోయి యమ్మునీంద్రునకు నమస్కరించి తోడ్కొని వచ్చి యుచితాసనంబున నునిచి యడుగులు గడిగి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి తనరాజ్యంబుతోడ సర్వస్వంబును నివేదించి కొడుకుం జూపినం జూచి సంతసిల్లి మునివరుం డి ట్లనియె. 156

క. జర యను రాక్షసి నీకుం, గర ముపకారంబు సేసె ఘనముగ దీనిన్
ధరణీశ ! యే నెఱింగితి, నిరుపమనిరతిశయయోగనిష్ఠితబుద్ధిన్. 157

వ. ఇక్కుమారుండు కుమారునంతియశ_క్తిసంపన్నుం డయి త్రిపురాంతకు నంతక హారుం బరమేశ్వరుం దనకు సన్నిహితుం జేయు నెంతబలవంతు లయ్యును వైరి వీరులు వీనిం దాఁకి యగ్నిఁ దాఁకిన శలభంబులుంబోలె నడంగుదురు గరుడునిగతి[1] నన్యవిహంగంబు లనుగమింప నోపనియట్లు మానవులు వీని వీర్యంబు ననుగమింప నోపరు తేజస్వులలోన నాదిత్యుండు వెలుంగునట్లు వీఁడు మూర్ధాభిషి_క్తులలోన మిగిలి వెలుంగు నదీరయంబులు మహాపర్వతంబుల భేదింప నోపనియట్లు దివ్యాస్త్రంబులు వీనిదేహంబు భేదింప నోపవు సముద్రంబు మహానదులం జేకొనునట్లు వీఁడు పరమహీపతులసంపదలు చేకొను నని జరాసంధు సామర్థ్యంబు చెప్పి చండకౌశికుం డరిగిన. 158

క. తనయుని నభినవయౌవను, ననుపము నభిషి_క్తుఁ జేసి యవనీభర మా
తనిఁ బూన్చి సభార్యుం డయి, యనఘ తపోవనమునకు బృహద్రథుఁ
డరిగెన్. 159

వ. ఆజరాసంధుండును నాయుధనిహతులుగాని హంసడిభకులు దనకు సహాయులుగా నపరాజితం బయినపరాక్రమంబునం బరచక్రపతుల భంజించుచు. 160

1. గరుడని

చ. అయనవిహీనుఁ డౌసవితృనట్లు విఖండితపక్షతిద్వయుం
డయినఖగేంద్రునట్లు మఱి హంసుఁడు నాడిభకుండు నంతక
క్షయగతు లైన నిప్డు గతగర్వమునన్ మగధేశ్వరుండు ని
శ్చయమతి నున్నవాఁడు నిజసంక్షయకాలవిశంకితాత్ముఁ డై. 161

ఉ. అమ్మగధేశు నుగ్రబలు నాయుధయుద్ధమునన్ జయింపఁగా
నిమ్మహి నోప రెవ్వరు నుమేశ్వరుఁ డట్టివరమ్ము వానికిన్
నెమ్మిన యిచ్చెఁ గావున వినీతుఁడు వాయుసుతుండు మల్లయు
ద్ధమ్మున నోర్చు నాతని నుదగ్రమహాభుజశక్తి యేర్పడన్. 162

క. బలిమిమెయిఁ బార్థురక్షా, బలమును, బవనసుతుబాహుబలమును నాని
ర్మలనీతిబలము నీకుం, గలుగ నసాధ్యంబు గలదె కౌరవనాథా! 163

చ. తడయక యేఁగి నీతిబలదర్పము లొప్పఁగ వాని డాసి క
వ్వడియును నేను భీముఁడు నవశ్యముఁ బోర బృహద్రథాత్మజుం
గడిఁదిరిపున్ జయింతుము జగన్నుత! న న్నెద నమ్ముదేని యి
ల్లడ యిడు భీము నర్జును నలంఘ్యబలాఢ్యుల నావశంబునన్. 164

వ. అని నిశ్చయించి పలికిననారాయణుని విజయశ్రీవిభాసితముఖు లైన
భీమార్జునులం జూచి సంతుష్టాంతరంగుం డయి ధర్మతనయుం డి ట్లనియె.

చ. ప్రియహితసత్యవాక్య యరిభీషణ కృష్ణ భవన్నిదేశసం
శ్రయమున నున్న మా కధికశత్రుజయం బగు టేమి పెద్ద ని
శ్చయముగ నింక మోక్షితుల సర్వమహీశులు నిమ్మహాధ్వర
క్రియయును సిద్ధిఁ బొందెన యకిల్బిషకీర్తి వెలుంగు చుండఁగన్. 166

క. ధరణీధర, సర్వగుణా, కర, కరుణానిలయ, సర్వకార్యైకధురం
ధర, నినుఁ బడసిన మాకును, హరివిక్రమ పడయరానియవియుం గలవే?

వ. అని సంతసిల్లి మఱియు నాత్మగతంబున. 168

క. నయనములు నాకుఁ బవనజ, నయవిజయులు మనము కమలనాభుఁడు వీరిం
బ్రియహితులఁ బాసి నిమిషం, బయినను నెట్లుండ నేర్తు నవిచేష్టుఁడనై.

వ. అయినను నా హృదయంబు గరంబు హృద్యం బగుచున్నయది కృష్ణార్జు
నులం దలంచినవారికి శ్రీవిజయంబు లగు ననిన నమ్మహాత్ములఁ దనకు

సహాయులఁగాఁబడసినభీమసేనునకు శ్రీవిజయంబు లగుట యేమిసందేహం
బని నిశ్చయించి మీకుఁ గార్యసిద్ధి [1] యయ్యెడ మరుగుం డని పంచిన.

క. ఘోరరిపుఁ జంప నరిగెడు, వీరుల వార్ష్ణేయపాండవేయుల సింహా
కారులఁ జూచి మనంబున, ధీరుఁడు ముద మందె నయ్యుధిష్ఠిరుఁ డంతన్.

కృష్ణ భీమ పార్థులు జరాసంధుఁ జంపఁ బోవుట

వ. కృష్ణభీమపార్థులు కృతకస్నాతకు లయి చని యేకపర్వతప్రభవంబు లైన
కాలకూట శోణగండకీ సదానీర లను నేఱుల లంఘించి సరయూనదియునుం
బూర్వ కోసల మిథిలాదేశంబులును గంగయుం గడచి పూర్వాభిముఖు
లయి నిత్య ప్రయాణంబుల నమ్మగధదేశంబు సొచ్చి గోరథం బను
పర్వతం బెక్కి. 172

చ. ఉరుతరహర్మ్యమాలికల నొప్పు గిరివ్రజ మన్పురంబుఁ గాం
చిరి నవసౌరభప్రసవచిత్రవనావళి గల్గుదాని నె
వ్వరికి దురాసదంబు లగువజ్రమయోన్నతవప్రచారుగో
పురములదాని, నయ్యలకఁ బోలెడుదాని మహార్థసంపదన్. 173

వ. కని దానియపూర్వరామణీయకసమృద్ధి కచ్చెరువడి యచ్యుతుండు భీమా
ర్జునుల కి ట్లనియె. 174

క. గోరథమును ఋషభము వై, హారము ఋషిగిరియుఁ జైత్యకాద్రియు ననఁగా
భూరిగిరు లేను దీనికి, శూరభటులువోలెఁ గాచి చుట్టును నుండున్. 175

వ. దాననచేసి యిప్పురంబు గిరివ్రజంబు నాఁ బరఁగె నిందుఁ దొల్లి గౌతముం
డౌశీనరి యనుశూద్రయందుఁ గాక్షీవాదుల సృజియించె నట్టిగౌతమాను
గ్రహంబునను నీదుర్గబలంబుననుం జేసి యిమ్మాగధుల నెవ్వరును జయింప
నోపరనుచుఁ దద్ద్వారంబునం బురంబు సొర నొల్లక చైత్యకగిరిశృంగం
బున కరిగి యందున్న మూఁడుభేరులం జూపి తొల్లింటిమాగధులు మాను
షాదం బను ఋషభంబు వధియించి దానిచర్మంబున వీని నిర్మించి రివి
యిప్పురంబు వింతవారు చొచ్చునప్పు డమ్మునిశక్తిం జేసి మ్రోయు ననిన.

1. యయ్యెడు

ఉ. దారుణవజ్రచారుభుజదండములన్ బలవద్విచారగం
భీరులు ధీరు లాతుణమ భేరులు మూఁటిని వ్రచ్చి చైత్యక
స్ఫారనితంబదేశమును భగ్నము సేసి గిరివ్రజంబు న
ద్వారమునందుఁ జొచ్చి రతిదర్పితు లాయదుకౌరవోత్తముల్. 177

క. ఘోరాకారులు మాలా, కారగృహంబులకు గంధికగృహంబునకుం
దా రరిగి మువ్వురు బలా,త్కారంబునఁ గొనిరి పుష్పగంధము లొప్పన్.

వ. అందు మాల్యాలంకృతమౌళులుఁ జందనాగరురూషితహస్తులు విస్మయ
మాన మగధనిరీక్ష్యమాణులు నయి రాజమార్గంబు గదియం జని యనవర
తంబును బ్రాహ్మణులకు సుప్రవేశం బగు చున్నజరాసంధుమందిరంబు
గోవాసంబు హిమవత్సింహంబులు సొచ్చునట్లు యాదవపాండవసింహం
బులు సొచ్చిన. 179

జరాసంధుఁడు కృష్ణభీమసేనార్జునుల కెదురువచ్చుట

ఆ. అర్ధరాత్రమయిన నభ్యాగతద్విజ, స్నాతకులకు నెదురు చని కరంబు
భక్తిఁ బూజ లిచ్చు పరమవ్రతుం డప్డు, డెదురు వచ్చి వారి కిష్ట మెసఁగ

క. ధీయుతుఁడయి మధుపర్కము, సేయఁగ సమకట్టి దానిఁ జేకొననిమహా
పాయులగర్వంబు నఖి, ప్రాయంబు నెఱింగి మగధపతి యి ట్లనియెన్.

తే. స్నాతకులరేని పూవులుఁ, జందనంబుఁ
జనునె బలిమిమైఁ గొని తాల్పఁ జైత్యకాద్రి
తటము మీ రిట్లు వ్రచ్చి దోర్దర్ప మెసఁగఁ,
జులుక నద్వారమునఁ బ్రోలు సొరఁగ నగునె. 182

వ మఱియు నాకావించినమధుపర్కంబు ప్రతిగ్రహింప నొల్లమి యిది యేమి
మీరలు వేషధారుల కావలయు మీవేషంబున బ్రాహ్మణత్వంబును మహా
సత్త్వ దీర్ఘ బాహుపృథులవక్షో లక్షణంబుల క్షత్త్రియత్వంబును బ్రకా
శించుచున్నయవి యనిన వానికి నారాయణుం డి ట్లనియె. 183

క. స్నాతకులు పుణ్యకర్మస, నాతను లగు చున్న బ్రాహ్మణక్షత్త్రియ,వి
డ్జాతులయందును క్షత్త్రియ, జాతిస్నాతకుల మేము జనవినుతమతిన్.

వ. ద్వారంబున మిత్రనివాసంబును నద్వారంబున నమిత్రనివాసంబును జొచ్చుట యిది బాహువీర్యసంపన్ను లయినక్షత్రియులకుం గర్తవ్యంబు మఱి గంధమాల్యంబులయందు లక్ష్మి యుండుం గావున బలాత్కారంబున గంధమాల్యంబులు గొంటిమి నీయందుల మాకు నొండుకార్యంబు గలుగుటం జేసి నీ యిచ్చు నర్ఘ్యంబు గొన నొల్ల మనిన జరాసంధుం డిట్లనియె. 185

ఆ. మీరు నాకు నేను మీకు నెన్నండు ము, న్నహిత మాచరించినదియు లేదు
మీకు నేల నే నమిత్రుండ నైతి ని, రాగసుండ సద్గుణాన్వితుండ. 186

క. సురమునివరులకు వసుధా, మరులకు భక్తుండ నుత్తమక్షత్రికులా
చరితుండ ననిన ధరణీ, ధరుఁ డమ్మగధేశ్వరునకుఁ దానిట్లనియెన్. 187

క. కులరక్షార్థ మఖిలనృప, కులోద్వహునియోగమున నకుంఠితశత్రు
ప్రళయవిధాయుల మయి యిం దులకున్ వచ్చితిమి దుష్టదూషణబుద్ధిన్.

సీ. కడఁగి యత్యుత్తమక్షత్రియ చరితంబునందు వర్తిల్లుదు నంటి జనుల
కెవ్వరి కెన్నండు నెగ్గొనరింప నే నంటి సత్క్షత్రియు లవని నొరులు
నీయట్లు గ్రూరులై నృపతులఁ జెఱఁబెట్టి పశువరించుచుఁ బశుపతి నుమేశు
వరదుఁ బూజించినవారును గలరె ము న్నింతకు నగ్గలం బెద్ది యెగ్గు

ఆ. కారణంబు లేక దారుణుఁడయి[1] సాధు, హింస సేయుకుజనుఁ డెల్లవారి
కప్రియుండ కాక యప్రియలక్షణం, బొండు గలదె తలఁప నుత్తములకు.

వ. నిర్దయుండై సవర్ణుండు నిర్దోషు లైనసవర్ణుల వధియించునంతకంటె మిక్కిలి పాతకం బొం డెద్ది నీయట్టి పాపకర్ముల నుపేక్షించిన నఖిలధర్మరక్షణక్షముల మైన మమ్ముఁ దత్పాపంబు వొందు నని పాపభయంబున నిన్ను నిగ్రహింప వచ్చితిమి నాకంటె నధికుం డైన క్షత్రియుండు లేఁడని గర్వించి యొరుల నవమానించి పలుక వలదు. 190

క. అవినీతు లయి మహాత్ముల, కవమానము సేసి మును జయద్రథ దంభో
ద్భవ కార్తవీర్యు లనువా, రవజితు లయి రొరులచే మహాబలు లయ్యున్

తరలము. అతులవిక్రమసంపదన్ రణయజ్ఞదీక్షితు లై రిపు
ప్రతతి నోర్చినవీరు లుగ్రతపంబు సేసినవారు స

---
1. దారుణంబగు

ద్గతికిఁ బోదురు గాక యి ట్లపకారదారుణవృత్తి ను
ద్ధతిని భైరవపూజ సేసిన దాన సద్గతి గల్గునే? 192

తరలము. చెడక నావచనంబు సేయుము చెచ్చెరన్ ధరణీశులన్
విడిచి పుచ్చుము యేను గృష్ణుఁడ, వీఁడు భీముఁడు, వాఁడు గ
వ్వడి, భవత్కృతదారుణం బనువహ్ని యార్పఁగ నున్నయ
క్కడిఁవీదిరులు వీర లిద్దఱు గర్వితుల్ కురుసింహముల్. 193

క. కడుఁగ్రూరుఁడ వయి నృపతుల, విడువనినాఁ డాజిఁబాండవేయులునీయు
క్కడఁచి భుజశక్తి యేర్పడ, విడిపింతురు గడిమి నిఖిలవిషయాధిపులన్.

వ. అనిన విని జరాసంధుండు సటాసముత్పాటనకుపితకుంజరివైరియుం
బోలెఁ గడు నలిగి పటుకుటిలభ్రుకుటిఘటితనిటలుం డగుచుఁ బురుషోత్తమున
కి ట్లనియె. 195

క. అమితపరాక్రమమున నా,క్రమించి పరనృపుల నోర్చి గర్వించుట దో
సమె, యిది సత్క్షత్త్రియధర్మమ యే నెప్పుడుఁ బరాక్రమవ్రతుఁడ నిలన్.

క. దేవార్థముగాఁ దెచ్చిన, యీవసుధాధిపుల నేల యే విడుతుఁ బ్రతా
పావజితరిపుఁడఁ గావున, నీ వెఱుఁగవె తొల్లి ధారుణీధర! నన్నున్. 197

జరాసంధుఁడు యుద్ధమునకు భీముని గోరుకొనుట

సీ. సమకట్టి సైన్యంబు సైన్యంబుతో నొండెఁ దొడరి మీమువ్వురతోడ నొండె
నిద్దఱతో నొండె నెక్కటి యొక్కనితో నొండెఁ బొడిచెద దోర్బలమున
నేయాయుధంబున నెమ్మెయిఁబోరంగ నిష్టమయ్యెది యుత్సహింపుఁడనిన
నొక్కనిలోఁ బల్వు రుద్ధతు లయి పూనియుద్ధంబు సేయుట యుచితమగునె

ఆ. యధికబాహుబలుల మయినమామువ్వుర,యందునొక్కరునిమహాబలాఢ్యుఁ
గోరికొనుము వాఁడు ఘోరాజిలో నిన్ను, మొనసి మల్లయుద్ధమున జయించు

క. అనినమురవైరిపలుకులు, విని బార్హద్రథుఁడు భూరివీర్యు మరున్నం
దనుఁ గోరికొనియె నీతం, డని నెన యగు నాకు ననుచు నతిదర్పితుఁడై.

వ. ఇట్లు జరాసంధుండు భీమసేనుతో మల్లయుద్ధంబు సేయ నిశ్చయించి తన తనయు సహదేవుని రాజ్యంబున కభిషిక్తుం జేసి పురోహితకృతస్వస్త్యయ నుండై. 200

ఆ. బలియుఁ డపుడు వెంట్రుకలు పాచిముడిచి గం, టెసఁగఁ దాల్చి వీరరసిక వృత్తి
నుద్ధతుండు మల్ల యుద్ధప్రసాధనం, బమర నిలిచె వేడ్క నమితబలుఁడు.

వ. భీమసేనుండును వానికి నక్కజంబుగా మల్లయుద్ధసన్నద్ధుం డయి బ్రతి భటించి నిలిచె నంత. 202

భీమసేన జరాసంధుల మల్లయుద్ధము

మ. సమసత్త్వాతిశయుల్ వృకోదర జరాసంధుల్ మహోద్యత్పరా
క్రమ మొప్పం గడు నగ్గి యొండొరులఁ జుల్కం దాఁకి రన్యోన్యదు
ర్దమదోర్దండపటుప్రహారజనితధ్వానంబు బ్రహ్మాండభాం
డము నిండన్ లయకాలదండధర చండక్షోభమో నా జనుల్. 203

క. కర్షితరిపు లన్యోన్యా, కర్షణసంకర్షణాపకర్షణముల సా
మర్షు లయి పెనఁగి రాహవ, హర్షంబునఁ బవనసుతబృహద్రథపుత్త్రుల్.

క. వ్యాయామకర్కశస్థిర, కాయులయుద్ధము భయానకం బయ్యె మహో
గ్రాయసపరిఘాయితకఠి, నాయతభుజదండదారుణాఘాతములన్. 205

చ. అతులబలుల్ పరస్పరజయార్థులు పార్థివపుంగవుల్ మరు
త్సుతమగధేశ్వరుల్ సమరశూరులు దారుణలీలఁ బోరి రూ
ర్జితభుజదర్ప మేర్పడఁగ సింహగజేంద్రములట్లు వజ్రప
ర్వతములయట్లు ఘోరతరవాసవవృత్రులయట్లు నిద్దఱున్. 206

వ. ఇట్లు కార్తికమాసంబునం బ్రథమదివసంబునం దొడంగి భీమజరాసంధు లెడయుడుగక యొండొరులం బట్టియుఁ గిట్టియు నడిచియుం బొడిచియుఁ దాఁచియుం ద్రోచియు మహాయుద్ధంబు సేయుచుం ద్రయోదశినాఁ డిద్దఱుం గిట్టి మల్ల యుద్ధకౌశలం బేర్పడం బెనంగునెడఁ జతుర్దశినాఁటి

రాత్రియందు జరాసంధు నతిశ్రాంతభావం బుపలక్షించి యధోక్షజుండు భీమున కిట్లనియె, 207

భీముఁడు జరాసంధుని సంహరించుట

చ. విరహితసత్త్వుఁ డయ్యెఁ బ్రతివీరుఁడు వీని నశేషధారుణీ
శ్వరనికరాపరాధు నతిసాహసికున్ వధియించి నీభుజ
స్థిరత యెలర్ప నయ్యనిలదేవుబలంబును నీ బలంబు భా
సురముగ మాకుఁ జూపుము విశుద్ధయశోనిధి, మారుతాత్మజా! 208

వ. అని ప్రబోధించిన ననిలతనయుం డనిలదేవునిం దలంచి తత్ప్రసాదంబున నధిక సత్త్వసమేతుఁ డై. 209

ఉ. ఆతనిఁబట్టి యెత్తి నిహతాహితవీరుఁడు వానిముక్కునన్
వాతను గర్ణరంధ్రముల వారక శోణితధార లొల్కఁగా
వాతసుతుండు వీచె శతవారము లుద్ధతచండవాతసం
ఘాతవివర్తమానతృణఖండసముం డగు చుండ మాగధున్. 210

వ. మఱియును. 211

క. వెఱచఱవఁ బట్టికొని వడిఁ, జఱచి జరాసంధుసంధిసంధులయెమ్ముల్
విఱిచి వధియించి యార్చెను, వఱలఁగ భీముండు భువనవలయం బదరన్.

చ. అవనితలంబు వ్రస్సెనొ హిమాచలశృంగము వ్రయ్య లయ్యెనో
శ్రవణవిదారణం బయినశబ్దము దా నిది యేమియొక్కొ భై
రవ మయి విన్చె నంచును బురంబునవారు భయంబు నొంది రం
దువిదలగర్భముల్ గలఁగె నుక్కడఁగెన్ మగధేశుసైన్యముల్. 213

వ. ఇట్లు భీమసేనుండు జరాసంధుఁ జంపి వానివధియించుట జగద్విదితంబుగాఁ దదీయ గృహద్వారతోరణసమీపంబునం దత్కళేబరంబు వైచిన నది సర్వజనభయంకరం బయి యుండె నంత నాదిత్యోదయంబున. 214

సహదేవునభిషిక్తుఁగావించి కృష్ణుఁడు భీమార్జునులతో నింద్రప్రస్థమున కరుగుట

సీ. గరుడధ్వజుం డప్డు కరుణాసమేతుఁ డై యమ్మాగధుల కెల్ల నభయమిచ్చి
మొగి జరాసంధుచేనిగృహీతు లయి యున్నపృథివీపతుల విడిపించి చెఱలు

మోక్షితు లైనసర్వక్షత్త్రియులచేత సంశుద్ధరత్నపుంజములఁ జేసి
పూజితుం డయి తనతేజంబు వెలుఁగంగ సహదేవు నజ్జరాసంధతనయు

ఆ. నోడ కుండు మని తదున్నతరాజ్యంబు, నందు నిలిపి హృదయహారివివిధ
రత్నరాజిసుందరం బైనమగధేశు,రథముఁ దేరఁ బనిచె రమణతోడ. 215

వ. తొల్లి తారకాసురసంగ్రామంబున నింద్రారూఢం బయినదాని నింద్రు
వలన వసువనురాజు వడసె వానివలన బృహద్రథుండు వడసె నని తద్దివ్య
రథప్రభావంబు సెప్పుచు భీమార్జునసమేతుం డయి యారథం బెక్కి
చక్రధరుం డఖిలరాజ చక్రంబుతో నింద్రప్రస్థగమనోన్ముఖుం డై గరుడునిం
దలంచుడుఁ దత్క్షణంబ. 216

క. అనలప్రభాభిశోభిత, ఘనతరతనుదీప్తు లొప్పఁగా వచ్చి వడిన్
వినతాతనయుఁడు వినయా, వనతోరుశిరస్కుఁ డయ్యె వనజాక్షునకున్.

వ. ఇట్లు వచ్చినవైనతేయు నతిప్రీతిం దద్దివ్యరథసారథ్యంబునందు నియోగించి
(యతఁడు తేరు గడప) మనోవాయువేగంబునం గృష్ణభీమవిజయు లింద్ర
ప్రస్థపురంబు ప్రవేశించి రంత. 218

మ. జననంతాసకరున్ మహోద్ధతు జరాసంధున్ హరిప్రేరణం
బున భంజించెఁ బ్రభంజనాత్మజుఁడు భూభుగ్వీరులం దన్నిరో
ధననిర్ముక్తులఁ జేసె నింకఁ జతురంతక్షోణికిన్ ధర్మనం
దను సామ్రాజ్యము పూజ్య మయ్యె నని మోదం బంది రుర్వీజనుల్.219

క. ఆయుధనిహతుఁడు గాని య,జేయు జరాసంధు భీమసేనుఁడు విజయ
శ్రీయొసఁగ నోర్చెఁ గా క,త్యాయతభుజశక్తి నొరులకలవియె యంచున్.

క. పురజను లాశ్చర్యంబునఁ, గర మనురాగమునఁ బరమకౌతుకమునఁ జూ
చిరి బోరన వచ్చి వృకో,దరదామోదరసురేంద్రతనయులఁ బ్రీతిన్. 221

వ. కృష్ణభీమవిజయు లిట్లు విజయవిభాసితు లయి వచ్చి ధర్మరాజునకు
మ్రొక్కి జరాసంధుబంధనంబువలనం దమచేత మోక్షితులైనమహీపతుల
నెల్లం జూపిన. 222

క. సవినయనతోత్తమాంగుల, నవనీశుల నందఱను యథార్హప్రియగౌ
రవమునఁ బూజించి కురుప్రవరుఁడు తద్దేశములకుఁ బరువడిఁ బంచెన్.

కృష్ణుఁడు ద్వారకానగరమున కరుగుట

వ. నారాయణుండును ధర్మరాజు వీడ్కొని తద్దివ్యరథారూఢుం డయి
ద్వారవతీ పురంబున కరిగె నంత నిక్కడ. 224

చ. భరతకులైకభూషణుఁడు భాసురతేజుఁడు ధర్మనందనుం
డురుభుజవిక్రమంబున జయోన్నతిఁ బొల్పఁగ వీరు లోకపా
లుర యని భీముఁ బార్థు నకులున్ సహదేవునిఁ బంచెఁ దూర్పును
త్తరమును బశ్చిమంబు మఱి దక్షిణమున్ వరుసన్ జయింపఁగన్. 225

వ. ఇట్లు పంచిన నలువురు నపారచతురంగబలసమేతులై నాలుగుసముద్రం
బులపై నడచునపూర్వసముద్రంబులుంబోలె నాలుగుదిక్కులపై నడచి
రనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 226

క. నరనుతు లయ్యేదిక్కుల, కరిగి మహీపతులచేత నరి గొని ధనముల్
దెరలఁగ దెచ్చినమార్గముఁ, బరువడి నెఱిఁగింపు నాకుఁబరమమునీంద్రా!

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 228

అర్జునుం డుత్తరదిగ్విజయంబు సేయుట

సీ. అగ్నిదత్తంబైనయద్దివ్యరథ మెక్కి గాండీవధరుఁ డతిఘర్మసమయ
ఘర్మాంశుఁడునుబోలెఁ గౌబేరదిగ్విజయార్థ ముగ్రప్రతాపాగ్ని వెలుఁగఁ
జని పుళిందావనీశ్వరు నోర్చిప్రతివింధ్యుఁ డనువాని నోడించి యక్రమమున
మఱి యఖిలద్వీపమండలేశుల నెల్ల వశవిధేయులఁ జేసి వారు దన్ను

ఆ. భక్తిఁగొలిచి రాఁగఁ బ్రాగ్జ్యోతిషంబుపై,విడిసెఁ దత్పురమునవిభుఁడనంత
బలముతోడఁ బన్ని భగదత్తుఁ డేతెంచి,విజయుఁ దాఁకె సమరవిజయకాంక్ష.

వ. ఇట్లు శబరసాగరానూపవాసు లైనయోధవీరులతోఁ బన్ని భగదత్తుండు
పార్థుతో నెనిమిదిదివసంబులు మహాయుద్ధంబు సేసి తదీయబాణభగ్న
బలుం డై పార్థున కి ట్లనియె. 230

క. ఏ నింద్రసఖుఁడ నీవును, భూనాథ ! సురాధినాథపుత్త్రుండవు నీ
తోనని సేయుట యుచితమె, యే నోడితిఁ జెప్పు మెద్ది యిష్టము నీకున్.

వ. దానిన చేయుదు ననిన భగదత్తునకుఁ బార్థుం డిట్లనియె, 232

క. కురువిభుఁడు రాజసూయా, ధ్వర మొనరింపంగడంగె ధర్మజుఁడు నిరం
తరధర్మశీలుఁ డాతని, కరి వెట్టుము రమ్ము ప్రీతి నమ్మఖమునకున్. 233

వ. అని యాభగదత్తుచేత నపరిమితధనరాసులు గొని ధనదదిశాభిముఖుం డయి ధనంజయుం డరిగి. 234

క. అతులచతురంగసేనా, యుతుఁ డంతర్గిరి బహిర్గిరోపగిరులభూ
పతుల నని నోర్చి శౌర్యో, న్నతిఁ గొనియెను వారిచేత నానాధనముల్ 235

వ. మఱియు నులూకదేశాధిపతి యగుబృహంతునిఁ బరాజితుం జేసి, యుత్తరోలూక వామదేవ మోదాపుర సుదామ సుసంకులంబు లనుదేశంబులరాజుల జయించి, దేవప్రస్థంబున సేనాబిందు నోడించి, విష్వగశ్వుం డనురాజు విక్రమం బడంచి, పార్వతేయుల గర్వం బుడిపి, బర్బర శబర తురుష్కపతుల వశగతులం జేసి, మాళవ పౌండ్ర కాశ్మీర త్రిగర్త లోహిత సుధన్వ గాంధార కాంభోజ కోసల పతులచేత విచిత్రరత్న కాంచన వస్తువాహనవివహంబులు గొని, చిత్రాయుధరక్షితం బైనసింహపురంబు మథించి, సింహాసనాసీను లయిన వనచరదస్యుల వశ్యులం జేసి, శ్వేతపర్వతం బతిక్రమించి, యటచని కాంభోజకటకుం డనురాజుచేతం బూజితుండై, హాటకదేశంబున మానసం బనుకొలన ఋషికుల్యంబుచు జూచి, యందుల రాజులచేత నపరిమితపదార్థంబులం దిత్తిరి కల్మాషమండూకాఖ్యమయూర హంసశుక సవర్ణంబు లైనహయంబులం బర్వతనిభంబు లైన యిభంబులం గొని (హేమకూటనిషధాచలంబులు గడచి, గంధర్వనగరంబులు గెలిచి, శతసహస్రయోజనాయతంబయి, శుద్ధసువర్ణమయంబయి, తేజోరాశియయిన మేరుమహీధరంబు నాలోకించి, జంబూమహావృక్షంబును జంబూమహానదియునుం జూచి, తత్తీరంబున మేరువునకుం బ్రదక్షిణంబుగాఁ జని, గంధమాదన పర్వతం బతిక్రమించి, తద్దిశాధిపతు లైనసిద్ధవిద్యాధరచారణగంధర్వులచేత నానావిచిత్రవస్తువాహనంబులు గొని, మాల్యవన్నీలపర్వతంబులు గడచి) యుత్తరకురుదేశములకుం జని హరివాసం బనుపురంబుపై విడిసిన,

సీ. తద్ద్వారపాలకుల్ దారుణాకారు లపారబలాఢ్యులు పార్థుకడకుఁ
జనుదెంచి సురరాజసన్నిభు నాతనిఁ జూచి యచ్చెరువడి శూరు లెంధు

నీయట్టి రే కురునృపవీర! పర్యాప్తమయ్యె నీవిజయవీర్యాతిశయము
వసుమతీనాథు లెవ్వరు నిట్లు బలిమిమై నిట వచ్చిరే తొల్లి యేయుగముల

ఆ. నున్నతప్రతాప! యుత్తరకురుభూము, లంద్రు జనులు వీని నవనిచరుల
కవి యగోచరంబు లిందు సాధించియె,ద్దియును గొనఁగ లేదు తివిరి నీకు 237

వ. అయినను నీవచనంబు సేయంగలవారము మమ్ముఁ బనుపు మనిన వారికి
నర్జునుం డిట్లనియె. 238

తే. రాజసూయాధ్వరము ధర్మరాజు సేయ, నుత్సహించినవాఁడు తదుత్స
వమున
కిందు మీయందుఁ గలవస్తు వెద్దియైన, నమ్మహీనాథుసామ్రాజ్యమతిశయిల్ల

వ. అనిన నయ్యుత్తరకురుభూములరాజు లెల్ల నర్జునున కతిప్రీతచిత్తులయి
యమూల్యంబు లైన యపరిమితదివ్యరత్నాభరణంబులు దెచ్చి యిచ్చిన.

తరలము. తరణి సన్నిభు ధర్మపుత్త్రు నుదారతేజము పర్వభా
స్వరసుసంపదఁ బాకశాసనిశాసనంబున నిట్టు లు
త్తరకురూత్తముఁ దొట్టి యుత్తరధారుణీశులు వశ్యులై
కరధనంబులు దెచ్చి యిచ్చిరి గౌరవంబున ధన్యులై. 241

భీమసేనుండు పూర్వదిగ్విజయంబు సేయుట

వ. అట భీమసేనుండునుం బరచక్రమర్దనం బయినబలచక్రంబుతోఁ బూర్వ
దిక్కునకుం జని పాంచాలపతిచేత సత్కృతుం డయి విదేహరాజు జనకుం
డనువాని జయించి దశార్ణపతి యయినసుధన్వుతో మహాయుద్ధంబు సేసి
తత్పరాక్రమంబునకు మెచ్చి వానిం దనకు సేనాపతిం జేసికొని యశ్వమే
ధేశ్వరుండయినరోచమాను ననుజసహితుఁ బరాజితుం జేసి చేదివిషయంబు
నకుం జనిన 242

చ. అతని నతిప్రతాపు ననిలాత్మజుఁ గానఁగ వచ్చి చేదిభూ
పతి శిశుపాలుఁ డెంతయును భక్తిపరుండయి రాజసూయ ము
న్నతి నొనరింప నున్న యమనందనుయత్న మెఱింగి రత్నశో
భితధనరాసు లిచ్చెఁ గడుఁ బ్రీతిసమన్వితుఁడై ముదంబునన్. 243

వ. భీమసేనుండును శిశుపాలుపురంబునం గొన్నిదినంబు లుండి పూర్వదిక్కున కరిగి పుళిందపురంబున సుకుమార సుమిత్రులం గుమారవిషయంబున శ్రేణిమంతునిం గోసలదేశంబున బృహద్బలు నయోధ్యాపురంబున దీర్ఘప్రజ్ఞునిఁ గాశీరాజును సుపార్శ్వుని రాజపతి యైన సుధన్వుని మత్స్యమలదపతులను గర్ణాట దక్షిణమల్లులను మర్దించి వారిచేత నపరిమితధనంబు గొని, మగధపతి యయిన జరాసంధతనయు సహదేవు నాశ్వాసించి, హిమవత్పర్వతపార్శ్వంబునం జలోద్భవం బను దేశంబును భల్లాటదేశంబును జయించి, యింద్ర పర్వతసమీపంబునం గిరాతపతుల నేడ్వురను శర్మక వర్మకులను జంద్రసేన సముద్రసేనులను గర్ణవత్సపతులను బుండ్రపతినిం బౌండ్రకవాసుదేవుని వశగతులం జేసి

ఉత్సాహము. అతులశౌర్యుఁ, డనిలతనయుఁ డమితవాహినీపదా
హతి ధరిత్రి దలర నిట్లు లరిగి పూరదిఙ్మహీ
పతులచేత రత్నరజతభర్మతతులఁ గొనియె భూ
నుతయశుండు వేలు వేల నూలు కోట్లసంఖ్యలన్. 244

సహదేవుండు దక్షిణదిగ్విజయంబు సేయుట

వ. అట సహదేవుండు దక్షిణదిక్కున కరిగి సుమిత్ర శూరసేన దంతవక్త్ర యవనులను గోశృంగగిరినివాసులను జయించి కుంతిభోజుచేతం బ్రియపూర్వకంబున సత్కృతుండయి. 246

ఆ. జలజనాభుపగతు జంభకుం డనువాని, ఘూరిబలునిపుత్త్రుఁ బోరిలోన
నొడిచి వానిచేత నుత్తమగజహయ,రత్నతతులు గొని పరాక్రమమున 247

వ. నర్మదాసమీపంబున నవంతిపతుల విందానువిందుల మందదర్పులం జేసి చని మాహిష్మతీపురంబుపయి విడిసిన. 248

క. వీరుఁడు తత్పురవిభుఁ డు, గ్రారివిమర్దనుఁడు నీలుఁ డనువాఁడు మహా
దారుణబలుఁడై సమర, ప్రారంభాత్యుగ్రుఁ డయ్యెఁ బాండవుతోడన్.

వ అంత. 250

క. దరికొని దహనుం డెగసెను, వరుసను సహదేవుసకలవాహినిమాద్య
త్కరులపయి దురగములపయి, ఘరరథములపయిఁ బదాతివర్గములపయిన్

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 252

ఆ. కడఁగి యనలుఁ డేమికారణంబున సహ, దేవు సేనపయి నతిప్రచండ
శిఖలు గప్పె దీనిఁ జెప్పు మేర్పడ నాకు, ననఘ! వినఁగ వేడ్క
యైనయదియు. 253

వ. అనిన వైశంపాయనుం డిట్లని చెప్పెఁ దొల్లి నీలువంశంబున నిషధుం డను రాజు రాజ్యంబున జాతవేదుండు విప్రుం డయి వేదాధ్యయనంబు సేయుచు మాహిష్మతీ పురంబున నుండి ప్రమాదవశంబునం బారదారికుం డయిన నెఱింగి రాజనియోగులు వానిం బట్టికొనిపోయి రాజసమక్షంబున శాస్త్ర విహితదండంబు దండింపంబోయిన. 254

క అవమానదుఃఖితుండయి, పొవయుచు రోషానలంబు పోఁడిమి వెలుఁగం
బవనసఖుఁ డుగ్రకణములు, నెవయఁగఁ దనపొడపు చూఁపె నిషధునిప్రోలన్

వ. వాఁడును గడుభీతుం డయి యగ్నిదేవునకు నమస్కరించి మహాపురుషా! నాయజ్ఞానంబు సహింపవలయు నని ముకుళితకరకమలుం డయిన వానికి వైశ్వానరుండు ప్రసన్నుం డయి నీకోరినవరం బిచ్చెద వేఁడు మనిన వాఁడిట్లనియె. 256

తే. ఇప్పురంబు జయింపంగ నెవ్వరేని, వత్తు రుద్ధతు లయి శత్రువరులు వారు
దర్ప మేది నీచేత నిర్దగ్ధులై వి,హీను లవునట్లుగా వర మిమ్ము నాకు. 257

వ. అనిన నారాజునకు నగ్నిదేవుం డభిమతం బయినవరం బిచ్చి మఱినీవు నాకుం బ్రతిప్రియంబు సేయు మిప్పురంబునింతు లెంతయు మనోజరాగిణులు గావున వీరలస్వైరిణీవృత్తి యెల్లకాలంబు సహింప వలయు నని యడిగిన నాఁటంగోలె మాహిష్మతీపురంబుస్త్రీలకు స్వైరిణీత్వంబు నిర్దోషం బయ్యె నగ్నిదేవుండును నప్పురంబుపై వచ్చినవారల నెల్ల దగ్ధసైన్యులం జేయుచు దాని రక్షించు చుంటంజేసి పరరాష్ట్రపతు లగ్నిభయంబున నప్పురంబు పరిహరింతు రదికారణంబుగా నట్లు సహదేవుసైన్యం బెల్ల నగ్నిపరీతం బయినం జూచి సంచలింపక సహదేవుండు శుచియై వార్చి దర్భశయనంబున శయనించి యగ్ని సూక్తంబుల నగ్నిభట్టారకు నిట్లని స్తుతించె. 258

సీ. నీతదర్థంబులై నిఖిలవేదంబులు వర్తిల్లు లోకపావనము లగుచుఁ
బావనంబులలోనఁ బావనుండవు నీవ యజ్ఞంబులును నీవ హవ్యవాహ !
ధర్మనిత్యుం డైన ధర్మజు కావించు క్రతువు భవత్ప్రీతికరము గాదె
దానికి విఘ్నంబు దలఁచుట ధర్మువె వరద, వైశ్వానర, వాయుమిత్ర

ఆ. యనిన నగ్నిదేవుఁ డతనికి సంప్రీతుఁ, డయి తదీయసేన కగ్నిభయముఁ
బాచె దాని నెఱిఁగి భక్తుఁడై నీలుండు, కౌరవేంద్రుననుజుఁ గాన వచ్చి,

సహదేవుఁడు దక్షిణ దిఙ్మహీపతులచేఁ గప్పంబులు గొనుట

క. దేవప్రభావుఁ డగుసహ, దేవునకు హయద్విపేంద్రదివ్యాంబరనా
నావిధరత్నమయాభర, ణావలి లలిఁ దెచ్చియిచ్చె నధిక ప్రీతిన్. 260

వ. ఇట్లు మాహిష్మతీపురంబు సాధించి నీలుచేత నరిగొని సహదేవుండు దక్షిణ దిక్కునకరిగి సౌరాష్ట్ర దేశంబున నుండి రుక్మి భీష్మక శూర్పారక దండక పతులచేత దూతముఖంబున నసంఖ్యాత ధనంబులుగొని సాగరద్వీపనివాసు లైన నిషాదులం బురుషాదుల నేకపాదులం గాలముఖులం గర్ణప్రావరణుల నరరాక్షస యోనుల రామశైల కోలశైల తామ్రద్వీప సంజయంతీపుర నివాసులను వశగతులం జేసి. 261

క. తాళవన పాండ్య కేరళ, కాళింగ ద్రవిడ యవన కరహాటకభూ
పాలకుల నోడిచి దక్షిణ, వేలావనభూములందు విడిసి కడంకన్. 262

వ. ఇట్లు సేతుబంధనసమీపంబున విడిసి సహదేవుండు ఘటోత్కచుం దలంచుడు వాఁడును దక్షణంబ వచ్చి దండప్రణామంబు సేసి ముకుళిత హస్తుండయి పనియేమి యనుటయు నీవు విభీషణు కడకుం జని యుపాయనంబు గొనిరమ్మని పంచిన వాఁడును గగనమార్గంబున లంకకుం జని రాక్షసేంద్రుం డగు విభీషణుం గాంచి శ్రీకృష్ణసహాయుం డగుధర్మరాజు రాజసూయారంభంబును దత్కారణంబున భీమార్జున నకుల సహదేవులు దిగ్విజయార్థం బరుగుటయు వారలలోన దక్షిణదిశకుం జనుదెంచినసహదేవు శాసనంబునం దాను దూతయై వచ్చుటయుఁ దన పేరు భీమసేనపుత్త్రుం డైన ఘటోత్కచుం డగుటయు విన్నవించి.

వ. కురువిభురాజసూయమునకున్ ధన మిచ్చిరి రాజులెల్లనా
దరమునఁ బ్రీతిసేయునది దానును దప్పక యంచు లంక క
చ్చెరువుగఁ బుచ్చె దూతలఁ బ్రసిద్ధిగ నంత విభీషణుండు చె
చ్చెర సహదేవుశాసనము చేకొని సేసెఁ గరంబు నెమ్మితోన్. 263

మ. పరఁగన్ దక్షిణదిఙ్మహీపతులచేఁ బౌలస్త్యుచే నిట్లు దు
ర్ధరశక్తిన్ సహదేవుఁ డర్థములు రత్నవ్రాతముల్ చందనా
గురుకాష్ఠాదులు గప్పముల్ గొనియెఁ బెక్కుల్ పేర్మితో నుర్వరా
మరలక్ష్మీకరుఁ డైనధర్మసుతుసామ్రాజ్యంబు పూజ్యంబుగన్. 264

నకులుఁడు పశ్చిమదిగ్విజయంబు సేయుట

క. నకులుఁడు పశ్చిమదిక్కున, కకుటిలశౌర్యంబు మెఱయ నరిగి యరాతి
ప్రకరభయానక సేనా, ధికుఁ డయి నిజతేజ మెల్లదిక్కుల వెలుఁగన్. 265

ఉ. యోధులసింహనాదము మదోత్కటవారణబృంహితంబు వే
గాధికవాజిహేషితమహారవమున్ రథనేమి ఘోషమున్
బాధితకర్ణరంధ్రమయి పర్వె దిగంతము లెల్ల మ్రోయ నం
భోధిరవంబపోలెఁ గురుపుంగవునచ్చతురంగవాహినిన్ 266

వ. ఇట్లు మాద్రేయుండు రౌద్రాకారంబునఁ గసిమసంగి మహాసేనాన్వితుం
డయియరిగి మహాసేనరక్షితం బైన మహితకవిషయంబున దత్తక మయూ
రకాది శూద్రులతోఁ గయ్యంబు చేసి మరు మాళవ బర్బర కర్బరశై రీషక

చ. కురువిభురాజసూయమునకున్ ధన మిచ్చిరి రాజు లెల్ల దే[1]
వరయును బ్రీతి సేయునది వస్తుధన ప్రకరంబు లిచ్చిను
స్థిరతరధర్మ ధుర్య! యని చెప్పినయంత విభీషణుండు చె
చ్చెర సహదేవుశాసనము చేకొని యప్డు గరంబు నెమ్మితోన్.

క. పంచశతరాక్షసులచేఁ, గాంచనమయపమ్మి (తాళ) యూపఘనవరరత్నో
దంచితభూషాంబరములు, చంచద్గతి నొసఁగి పనిచె సహదేవునకున్.

అధికపాఠము.

1. నాదరమునఁ బ్రీతిసేయునది దానును దప్పక యంచులంకక
చ్చెరువుగఁ బుచ్చెదూతలఁ బ్రసిద్ధిగనంత.........చేకొని చేసెఁ

దాశార్ణదేశంబుల రాజుల జయించి పుష్కరారణ్యనివాసు లైన యాభీర గణంబులను సరస్వతీ సింధుకులాశ్రితు లైనగ్రామణీయులను బంచనదా మరపర్వతనివాసులను వశగతులం జేసికొని వాసుదేవునకు నిజాగమనం జెఱింగించి పుచ్చి. 267

సీ. శాకలపురమందు శల్యు మద్రేశ్వరుఁ దమ మేనమామ నుత్తమగుణాఢ్యుఁ
గానంగ నరిగి సత్కారపూర్వకముగా వస్తువాహనములు వానిచేతఁ
గొని పశ్చిమాంబుధికుక్షినివాసులఁ బరమదారుణుల బర్బర కిరాత
వీరుల నోడించి విభుఁ డిటు వరుణేంద్రపాలితదిఙ్మహీపతులచేత

ఆ. బలిమిఁ గొనినధనము పదివేలు లొట్టియల్, పెఱిఁగి రాఁగ వైరిభీకరుండు
వచ్చె నకులుఁ డమితవాహినీపదహతిఁ, దల్లడిల్లు చుండ ధరణితలము. 268

వ. ఇట్లు భీమార్జుననకులసహదేవులు పరాక్రమంబున దిగ్విజయంబు సేసి చతురుదధిపరీతమహీతలంబునం గలరాజులచేత నసంఖ్యాతధనవస్తువాహన నివహంబులు గొని వచ్చివేఱువేఱ ధర్మరాజునకుం జూపి యిచ్చిన. 269

క. ఉరుగుణవిశుద్ధరత్నౌ, త్కరనానాధనసమృద్ధిఁ గడు నధికుండై
కురువృషభుఁడు గీడ్పఱిచెను, వరుణధనేశ్వరుల [1]విభవవైభవయుక్తిన్. 270

రాజసూయము సేయుమని ధర్మజున కతనియాప్తులు సెప్పుట

వ. మఱియు ధర్మోపార్జితరక్షిత ప్రవర్ధితం బయినమహాధనవర్గంబుఁ జూచి పాత్ర ప్రతిపాదనంబు నియోగింప నమకట్టి రాజసూయాధ్వరారంభ సుస్థిరనివేశితబుద్ధియైయున్న యయ్యుధిష్ఠిరునభిప్రాయంబున కనుగుణం బుగా నాప్తమంత్రు లిట్లనిరి. 271

సీ. కురువీర! నీధర్మపరిపాలనంబున నీగుణసంపద నీవిశుద్ధ
చారిత్రమునఁ జేసి ధారుణీప్రజకెల్ల నభివృద్ధి యయ్యె నెయ్యంబుతోడ
రాజవంచకులయు రాజవల్లభులయుఁ దస్కరులయుబాధ దఱిఁగె రుజయు
[2]బగయును భయమును వగయును వెఱపును నాదిగాఁ గలయెగ్గు
లడఁగెఁ బుడమి

---

1. దైన వైభవయుక్తిన్.
2. వహ్నియు భయమును వఱపును గఱపును.

ఆ. నర్థులోలిఁ బెరిఁగె నవనీశు లెల్ల నీ, యనుజవీర్యవిజితు లయి త్వదీయ
శాసనస్థు లయిరి జగతీశ! యిదియ నీ, యజ్ఞ కార్యమునకు నవసరంబు.

వ. మఱియు నపరిమితపదార్థరత్న రజత సువర్ణపరిపూర్ణం బయి మహామేరు
శైలంబు సన్నిహితం బైనయట్లు యక్షేశ్వరునక్షయనిధులు ప్రత్యక్షం
బైనయట్లు భాండాగారంబు సమృద్ధం బైనయది ఘృతలవణతైలతండుల
ధాన్యాది సమస్త వస్తువిస్తృతం బయి కోష్ఠాగారంబు సకలసంకల్పసిద్ధి
కరం బై కల్పద్రుమంబు ననుకరించు చున్నయది వేదంబు లన్నియు
మూర్తిమంతంబు లయినయట్లు మహాయాజ్ఞికు లయినమహీసురవరులు
నీయభ్యుదయంబు గోరుచున్న వారు గావున రాజసూయాధ్వరం బెడసే
యక చేయు మని పలుకుచున్న యవసరంబున. 273

కృష్ణుఁడు ద్వారకనుండి వచ్చుట

క. ద్వారవతినుండి జగదా, ధారుఁడు గృష్ణుండు వచ్చి ధర్మజు ధర్మ
ప్రారంభనిత్యు నుత్తము, భూరిధనంబులను రత్నములఁ బూజించెన్. 274

వ. ధర్మరాజును జగదర్చితుం డయినయచ్యుతు నర్ఘ్యాదివిధులం బూజించి
తమ్ములయు ధౌమ్యద్వైపాయనాదులయు ఋత్విజులయు నాప్తమంత్రు
లయు సమక్షంబున నధోక్షజున కిట్లనియె. 275

మత్తకోకిలము. ధారుణీధర, ధర్మతత్వనిధాన, దానవదర్పసం
హార, వారిజనాభ, బంధుజనానురంజనకారి, నీ
కారణంబునఁ జేసి మాకు జగంబునం గలభూపతుల్
భూరివిక్రమవశ్యు లైరి విభుత్వ మేర్పడుచుండఁగాన్. 276

క. క్షితిపతులవలన సముపా, ర్జిత మైనధనంబుకోలఁదిఁ జెప్పఁగ వాచ
స్పతికి నశక్యము దీనిం, బ్రతిపాదింపంగ వలయుఁ బాత్రవశమునన్. 277

వ. దేవముఖం బయినయగ్ని దేవుముఖంబున విధ్యుక్తంబుగా వేల్చి దేవతర్ప
ణంబును యథోచితదక్షిణల నభీష్టదానంబుల మహీదేవతర్పణంబునుం
జేయవలయుం గావున నీ కిష్టం బయినయజ్ఞంబు చేయించి నాకును
లోకంబులకుం బ్రియంబుసేయు మొండె నన్ను రాజసూయాధ్వరవిధా
నంబునందు నియోగించి యనుగ్రహింపు మనిన యుధిష్ఠిరునకు నారా
యణుం డిట్లనియె 278

ఉ. పూజ్యుఁడ వెల్ల వంశముల భూపతులందును ధర్మనిర్మల
ప్రాజ్యవిభూతి నద్ద్విజపాలకునట్టిఁడ నీక యొప్పె సా
మ్రాజ్యము దైవసంపదయు మానుషసంపద పేర్మి కావునన్
యాజ్యుఁడ విప్డు నీవ భరతాన్వయభూషణ! ధర్మనందనా! 279

క. పంపం దగుఁ దగ దని శం, కింపక నీ కిష్ట మయినకృత్యముల నియో
గింపుము నన్ను భవద్గుణ, సంపత్ప్రీణుల సమస్తజనుల జనేశా! 280

చ. అనిన నుపేంద్రుదువాక్య మనునయ్యమృతంబునఁ జేసి ధర్మనం
దనుఁడు ముదంబు నొంది విదితంబుగ నాకు మనోరథంబు లె
ల్లను సమకూరె నిప్డు సఫలత్వము వొందె ధనాగమంబు లం
చును నెడ నిశ్చయించె మధుసూదనదేవుననుగ్రహంబునన్. 281

ధర్మరాజు రాజసూయంబు సేయ నారంభించుట

వ. ఇట్లు నారాయణదేవుచేత ననుజ్ఞాతుం డయి తమ్ములయు ధౌమ్యద్వైపా
యనాదులయు ననుమతంబున ధర్మరాజు రాజసూయంబు సేయ నుపక్ర
మించి సహదేవుం జూచి నీవు ధౌమ్యోపదిష్టంబు లయినయజ్ఞోపకరణ
ద్రవ్యంబులు దేర నింద్రసేనప్రముఖులను నర్జునుసారథి యయిన రుక్మను
సమర్పించి యజ్ఞాయతనంబున నానాదేశాగతు లైనరాజులకు సన్నివేశం
బులు సేయించి నిఖిల మహీతలంబునం గలబ్రాహ్మణక్షత్రియాదుల
నెల్ల రాఁ బనుపు మని పంచిన నతండును దద్వాక్యానంతరంబున నింద్ర
సేనాదుల ననేకశిల్పివరుల నియోగించి. 282

సీ. శాస్త్రోపదిష్టప్రశస్త ప్రమాణలక్షణముల యజ్ఞోపకరణతతుల
యజ్ఞాయతనమున నతిరమణీయంబు లయి యుండ నొనరించి యందు సర్వ
సంభారములు నించి సకలదిక్కుల హరిప్రస్థంబుచుట్టు నపారభూరి
బహువిధాగారముల్ ప్రమదవనంబుల వాపుల దీర్ఘికావలుల వెలసి

ఆ. యాజ్యతైలతండులాదినానావస్తు, పూరితంబు లయి విభూతి దనర
జననుతుండు సేసె సహదేవుఁ [1]డపరభూ, తలముఁ బోలి యొప్పెఁ దత్పు
రంబు. 283

1. డమరభూధరము

వ. మఱియు సహదేవానుశాసనంబునఁ బుత్త్రమిత్రభార్యాసమేతులై విరాట ద్రుపద శిశుపాల గాంధారరాజులును బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును శకసాల్వబృహద్బల చంద్రసేన సముద్రసేన కుంతిభోజ పౌండ్రకవాసుదేవులును వసుదేవ బలదేవ ప్రద్యుమ్న శూరసేనాది యదు వృష్ణి భోజాంధకవరులును వంగ వంగ కళింగ కాశ్మీర కాంభోజ గౌడాంధ్ర సింహళ కేరళ కుంతల ద్రవిడ మరు యవనపతులును పార్వతేయులును సాగరానూపవాసులును నాదిగాఁ జతుస్సముద్రముద్రితవసుంధరాచక్రంబునం గల రాజచక్రంబును సమగ్ర వేదవేదాంగవిదులైనయగ్రజన్ములును స్వకర్మనిరతు లయిన వైశ్య శూద్రులును వచ్చి యథా పరికల్పితసన్నివేశంబుల నుండి రంత ధర్మపుత్త్రుండు భీష్మాదులం దోడ్కొని తేర గజపురంబునకు నకులుం బంచిన. 234

రాజసూయంబునకు భీష్మాదు లరుదెంచుట

క. అనుపమధనరాసులు గొను, చును ననురాగమున రాజసూయమఖాలో
కనకౌతూహలపరు లయి, చనుదెంచిరి భీష్ముఁ దొట్టి సద్బంధుజనుల్.

వ. ఇట్లు వచ్చిన భీష్మ ధృతరాష్ట్ర విదుర ద్రోణ కృపాశ్వత్థామ సోమదత్త కర్ణ భూరిశ్రవ శ్శల్య శకుని సైంధవ దుర్యోధన దుశ్శాసన వికర్ణాదుల నెల్లం బ్రియసత్కారంబులం బూజించి వారలతో ధర్మరా జిట్లనియె.

ఆ. మీయనుగ్రహమునఁ జేయంగఁ గడఁగితి, నిమ్మహాధ్వరంబు నెమ్మితోడ
దీని నిందఱును ననూనంబుగాఁ బూని, పెంపు మెఱసి నిర్వహింప వలయు.

వ. అని వారలయనుగ్రహంబు వడసి హిరణ్యరజతరత్న దక్షిణాదాన విషయంబులందుఁ గృపాచార్యునిఁ, గృతాకృతపరిజ్ఞానంబునందు భీష్మద్రోణులను, సకలవస్తువ్యయంబునందు విదురుని, నానాదేశాగతులైనరాజులు దెచ్చి యిచ్చిన యుపాయనంబులు గైకొన దుర్యోధనుని, భక్ష్యభోజ్యాది వినియోగంబునందు దుశ్శాసనుని నియోగించి. 288

ధర్మజుఁడు యజ్ఞాయతనము ప్రవేశించుట

క. ప్రాజ్ఞుఁడు విశేషధర్మవి, ధిజ్ఞుఁడు ధర్మజుఁడు యజ్ఞదీక్షితుఁ డయి వి
ప్రజ్ఞాతిపరివృతుం డయి, యజ్ఞాయతనమున కరిగె నధికవిభూతిన్. 289

ఉ. సమ్మద మంది చూచిరి భృశంబుగ భూజను లెల్ల బ్రహ్మతే
జమ్మును రాజతేజమును సద్బహుభూషణ రత్నరాజితే
జమ్మును విస్తరించుచు నిజద్యుతి యొప్పఁగ మూర్తమైనధ
ర్మమ్మునుబోలె నున్న గుణమండితు దీక్షితు ధర్మనందనున్. 290

క. బ్రహ్మవిదు లయిననిఖిల, బ్రాహ్మణ సత్తములచేతఁ బరివేష్టితుఁ డై
బ్రహ్మణ్యుఁ డొప్పెఁ గురుపతి, బ్రహ్మర్షిపరీతుఁ డయిన బ్రహ్మయ
పోలెన్. 291

క. వేదనినాదము నాశీ, ర్వాదనినాదము ననేకవాదిత్ర మహా
నాదంబుఁ జెలఁగె నన్యని, నాదంబు జనంబులకు వినంబడ కుండన్. 292

వ. అంత ననంతవేదమూర్తు లైనపైలధౌమ్యులు హోతలుగా యాజ్ఞ
వల్క్యుం డధ్వర్యుండుగా ద్వైపాయనుండు బ్రహ్మగా సుసాముం డుద్గా
తగా వీరలపుత్త్రశిష్యగణంబులు క్రమంబున మైత్రావరుణుండును నచ్ఛా
వాకుండును గ్రావస్తుతుండును బ్రతిప్రస్థాతయు నేష్టయు నున్నేతయు
బ్రాహ్మణాచ్ఛంసియు నాగ్నీధ్రుండును బోతయుఁ బ్రస్తోతయుఁ బ్రతి
హర్తయు సుబ్రహ్మణ్యుండునుంగా నారదాదిబ్రహ్మర్షులు సదస్యులుగా
భీష్మాదిరాజర్షులు సహాయులుగా సర్వక్రియాసమగ్రం బయి షడంగసమృ
ద్ధం బయి సంపూర్ణదక్షిణాసనాథం బయి సకలధన ధాన్యసమన్వితం బయి
జగన్నాథరక్షితం బయి సకలజనానందకరం బయి రాజసూయం బతిరమ
ణీయం బయిన. 293

సీ. అమ్మహామఖమునం దగ్నిముఖంబున విపులమంత్రాహుతివితతిఁ జేసి
సకలదేవతలును, సంపూర్ణ దక్షిణా దానోత్సవంబుల ధరణిసురులు,
సముచితసత్కారశతసహస్రంబుల నఖిలరాజన్యులు, నభిమతాన్న
దానంబు పెంపున ధరణీజనంబులుఁ దద్దయుఁ దృప్తు లై ధర్మచరితు

ఆ. ననఘు ధర్మతనయు ననుజసమన్వితు, సంస్తుతించి రధిక సమ్మదమున
నని కురుప్రభునకు నట్లు వైశంపాయ, నోక్త మైనకథ రసోత్కటముగ.

ఆశ్వాసాంతము

క. భూరిగుణరత్నభూషణ, నారాయణమూర్తి రాజనారాయణ కం
ఠీరవవిక్రమ శారద, నీరదనీహార[1]హారనిభశుభకీర్తీ. 295

అంబురుహావృత్తము:—

రాజకులోత్తమ రాజమనోహర రాజసూరిసభాంతర
భాజితసద్గుణ పార్థివశేఖర పార్థసన్నిభ బాంధవాం
భోజవనద్యుమణీ మణికాంచనపుంజభూషితభూమరు
ద్రాజసమాజ పరాక్రమరాఘవ రాజరాజనరేశ్వరా. 296

గద్యము. ఇది సకలసుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతం బయిన శ్రీ మహాభారతంబునందు సభాపర్వంబున ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ గింకర దర్శనంబును నారదువలన లోకపాలురసభాశ్రవణంబును రాజసూయ మహాధ్వరారంభంబును జరాసంధవధయు గిరివ్రజనిరుద్ధు లయిన రాజులం గృష్ణుండు విడిపించుటయు దిగ్విజయంబును రాజసూయంబు నన్నది ప్రథమాశ్వాసము.

శ్రీమదాంధ్ర
మహాభారతము
సభాపర్వము – ద్వితీయాశ్వాసము

శ్రీరమణీప్రియ, ధర్మవి
శారద, వీరావతార, సౌజన్యగుణా
ధార, భువనైకసుందర,
వీర శ్రీరమ్య, బుధవివేక నిధానా.

ధర్మజుండు కృష్ణున కర్ఘ్యం బిచ్చుట

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు రాజసూయమహో
త్సవంబు నొప్పను ధర్మరాజు ధర్మనిత్యతయును స్తుతియించి నారదుం
డాసదంబున సకలరాజసమూహంబును రాజలోకంబులో మనుష్యసామా
న్యుం డయియున్న జగన్మాన్యు జనార్దనుం జూచి తొల్లి బ్రహ్మాదిసురగణ
ప్రార్థితుం డయి యఖిల మహీభారావతరణార్థంబు నారాయణుండు
యదువంశంబున నుదయించుటయు నయ్యాయిక్షత్త్రియకులంబుల సుర
దైత్యదానవయక్ష రాక్షసగంధర్వాదులయంశావతారంబులుం దలంచి భవి
ష్యద్భారతరణంబునకు సంహృష్టహృదయుం డయి యుండునంత. 2

క. శాంతనవుఁడు భీష్ముండు ప్ర, శాంతుఁడు దత్క్రతువు సూచి సంతుష్టుం డై
యంతకతనూజునకు ధృతి,మంతున కత్యంతధర్మమతి కి ట్లనియెన్. 3

మత్తకోకిలము. స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుఁడున్
భూతలేశుఁడు సంయుజుండును బూజనీయులు వీరిలోఁ
బ్రీతి నెవ్వఁడు సద్గుణంబులఁ బెద్ద యట్టిమహాత్ము వి
ఖ్యాతుఁ బూజితుఁ జేయు మొక్కనిఁ గౌరవాన్వయవర్ధనా. 4

వ. అనిన నట్టివాఁ డెవ్వండు నా కెఱిఁగింపు మనిన ధర్మరాజునకు భీష్ముం డిట్లనియె. 5

సీ. రోదసీకుహరంబు రుచిరాంశుతతిఁ జేసి యర్కుండు వెలిఁగించునట్టు లమృత
సందోహనిష్యందచంద్రికఁ జేసి శీతాంశుఁ డానందించునట్లు సకల
జనులకుఁ దనదైనసదమలద్యుతిఁ జేసి తనరంగఁ దేజంబుఁ దనుపుఁ దాన
చేయుచు నున్నసత్సేవ్యుండు పుండరీకాక్షుండు కృష్ణుఁ డనాదినిధనుఁ

ఆ. డబ్జనాభుఁ డుండ నర్ఘ్యంబునకు నిందు, నర్హు లొరులు గలరె యజ్ఞపురుషు
నఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు, మధిప! యదియ చూవె యజ్ఞఫలము. 6

వ. *అనిన భీష్మువచనంబున నప్పుడు సహదేవోపనీతం బయినయర్ఘ్యం బర్హణీయుండయిన వాసుదేవునకు శాస్త్రదృష్టవిధానంబున ధర్మతనయుం డిచ్చిన దానిం జూచి సహింపక శిశుపాలుం డుపాలంభనపరుం డయి యధోక్షజు నాక్షేపించుచు ధర్మరాజున కిట్లనియె. 7

---

* అనుచు ధర్మతనయుం జూచి యీ భూతేశ్వరుండు తొల్లి యజ్ఞవరాహమూర్తి. హిరణ్యాక్షు వధియించి దంష్ట్రాగ్రంబున ధాత్రీతలం బెత్తె. నరసింహరూపంబున నాదిదైత్యు హిరణ్యకశిపు కరనఖంబుల వ్రచ్చి ప్రహ్లాదుం గాచె. అదితికిం గశ్యపునకు వామనుం డై జన్మించి త్రివిక్రముండై బలీంద్రు బంధించె. భృగువంశంబునఁ బరశురాముం డయి జన్మించి కార్తవీర్యుం డాదిగాఁగల సకల క్షత్త్రకులంబు నిఃక్షత్త్రంబుగాఁ జేసె. రవికులంబున దశరథుం డను రాజునకు శ్రీరామభద్రుండై యవతరించి రావణకుంభకర్ణాది రాక్షసవీరుల సంహరించి యిప్పుడు బ్రహ్మాదిసురమునిగణ ప్రార్థితుండై భూభారనివారణంబు సేయ యదువంశంబున నుద్భవించి జన్మించినది యాదిగా నొనరించిన దివ్యలీలలు చెప్ప మహోద్భుతంబులు. వినుము. పూతనాప్రాణంబులు గొనియె. శకటంబు విఱుగఁ దన్నె. మద్దుల నున్మూలించె. గోవృషంబులఁ గూల్చె. గోవర్ధనశైలం బెత్తి గోవులం గాచె. కేశిదనుజుం గీటడఁగించె. కంసప్రాణాపహారుం డై దుష్టనిగ్రహశిష్టపరిపాలనపరుం డైన యాదినారాయణుం డీ కృష్ణుం డయ్యర్ఘ్యంబున కర్హుం డనిన.

శిశుపాలుండు ధర్మరాజు నాక్షేపించుట

మ. అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయుదు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే. 8

చ. కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము ధర్మబాహ్యు ని
న్నొడఁబడ నిష్టుఁ డై కఱపి యుత్తము లుండఁగ వాసుదేవుఁ డ
జ్ఞడునకుఁ బూజ యి మ్మని విచారవిదూరుఁడు భీష్ముఁ డెంతయున్
వెడఁగుఁదనంబునం బనిచె వృద్ధుఁబుద్ధులు సంచలింపవే. 9

చ. ఇతనికిఁ గూర్తు రేని ధన మిత్తు రభీష్టము లైనకార్యముల్
మతి నొనరింతు రిష్టుఁ డని మంతురుగాక మహాత్ము లైన భూ
పతులయు విప్రముఖ్యులసభన్ విధిదృష్టవిశిష్టపూజనా
యతికి ననర్హు నర్హుఁ డని యచ్యుతు నర్చితుఁ జేయఁ బాడియే. 10

సీ. ఈతని వృద్ధని యెఱిఁగి పూజించితే వసుదేవుఁ డుండంగ వసుమతీశ!
ఋత్విజుం డని విచారించి పూజించితే ద్వైపాయనుం డుండ ధర్మయుక్తి
యాచార్యుఁడని వినయమునఁ బూజించితే కృతమతుల్ ద్రోణుండుఁ
గృపుఁడు నుండ
భూనాథుఁ డనియెడుబుద్ధిఁ బూజించితే యాదవుల్ రాజులే యవనిమీఁదఁ

ఆ. బూజనీయు లైనపురుషులలోపల, నెవ్వఁడయ్యెఁ గృష్ణుఁ డిట్టు లేల
పూజ్యు లయినవారిఁ బూజింప నొల్లక, భీష్ము పనుపుఁ జేసి బేల వయితి.

చ. పురుషవిశేషవిత్తముఁడు పూజ్యుఁడు రాజులలోన నీయుధి
ష్ఠిరుఁ డని నీగుణాళి ప్రకటించి మనంబులలోన ధారుణీ
శ్వరులు భవన్మఖంబునకు వచ్చిన నిందఱ కివ్విధంబునం
బరఁగ నవజ్ఞ సేయు టిది పాడియె ధర్మువె ధర్మనందనా! 12

క. నీ వెఱుఁగక యిచ్చిన నిది, నా విషయమె యని మనంబునం దలఁపక ల
జ్జావిరహితుఁడయి యర్ఘ్యము,గోవిందుఁడు గొనియెఁ దనకుఁ గొను
టుచితంబే. 13

క. చనఁ బేడికి దారక్రియ,యును జెవిటికి మధురగీతియును జీఁకున క
త్యనుపమసురూపదర్శన,మును జేయుటఁ బోలుఁ గృష్ణుఁ బూజించు టిలన్.

ఉ. ఈయవనీశ్వరప్రవరు లిందఱు నిన్ను నగంగ నిట్లుగాఁ
జేయుదె ధర్మరా జనువిశేషసమాఖ్య నిరర్థకంబుగా
ధీయుత! యంచు ధర్మజ నదీసుత కృష్ణుల నెగ్గు లాడుచుం
బోయె సదంబు వెల్వడి సపుత్త్రిబలుం డయి చైద్యుఁ డల్కతోన్. 15

వ. ఆశిశుపాలుపిఱుందన చని ధర్మనందనుండు వానిం బ్రియవచనంబుల ననునయించుచు నిట్లనియె. 16

క. భూరిగుణోన్నతు లనఁ దగు, వారికి ధీరులకు ధరణి వల్లభులకు వా
క్పారుష్యము చన్నె మహా,దారుణ మది విషముకంటె దహనము కంటెన్. 17

ఉ. ఆదిజుఁ డైన బ్రహ్మయుదయంబున కాస్పద మైనవాఁడు వే
దాదిసమస్త వాఙ్మయములందుఁ బ్రశంసితుఁ డైనవాఁడు లో
కాది త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని యుక్తమ కా కిది యేమి దోసమే. 18

క. పరమార్థప్రతిభఁ దమో, హరు నచ్యుతు భీష్ముఁ డెఱిఁగిన ట్లెఱుఁగఁగ నీ
కరిది శిశుపాల! పెద్దల, చరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్.

క. గురుఁ డని సమస్తలోకో,త్తరుఁ డని నీకంటె వృద్ధతములైన నరే
శ్వరు లచ్యుతునర్చన నెడఁ, గర మభినందింప నీకుఁ గా దనఁ దగునే 20

వ. అని యా శిశుపాలుం బట్టువఱుచు చున్నంత ధర్మరాజునకు భీష్ముం డిట్లనియె. 21

భీష్ముఁడు శిశుపాలుని నిందించుట

ఉ. పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు వీని నేల భూ
పాలక! నీకుఁ బట్టువఱుపన్ మఱి ధర్మువెఱుంగ వీనికిం
బోలునె రాగకోపపరిభూతమనస్కున కల్పరాజ్యల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్తమహత్పరివాదశీలికిన్. 22

వ. అని ధర్మరాజును వారించి శిశుపాలుంజూచి భీష్ముం డిట్లనియె. 23

చ. అవినయబుద్ధి వై హరికి నర్ఘ్య మయోగ్యమ యంటి నీవు మూ
ర్ఖవు శిశుపాల యింకఁ బలుకన్ వలసెన్ సభలోన నున్న యీ
యవనిపు లెల్ల నాతనిదయం బరిముక్తులు వానిచేత నా
హవజితులుం దదీయశరణార్థులుఁ గా కొరు లయ్య చెప్పుమా. 24

తే. ఉత్తమజ్ఞానవృద్ధు నానుండె నేని, బాలుఁడయ్యును బూజ్యుఁడు బ్రాహ్మణుండు
క్షత్త్రియుఁడు పూజ్యుఁ డమితవిక్రమసమృద్ధి,నుర్విపతులలో నధికుఁడై యుండెనేని. 25

క ఈ రెండుకారణముల ము,రారాతియ యర్ఘ్యమునకు నర్హుఁడు జగదా
ధారుండు మాక కాదు స,దారాధ్యుఁడు విష్టపత్రయావాసులకున్. 26

క. వృద్ధు లొకలక్ష యున్నమ, బుద్ధియె యెవ్వరికి వారిఁ బూజింపంగా
నిద్ధరణీశులలో గుణ, వృద్ధని పూజించితిమి త్రివిక్రము భక్తిన్. 27

క. పూజితుల తృప్తు లగుదురు, భూజను లొరు లచ్యుతుండు పూజితుఁ డగుడుం
దేజమున జగత్త్రితయముఁ, బూజిత మయి తృప్తిఁ బొందుఁ బుణ్యసమృద్ధిన్. 28

సీ. బుద్ధియు మనమును బురుషుండు నవ్యక్త మగుచున్న ప్రకృతియు నంబరంబు
ధరణియు దరణియు దహనుండుఁ జంద్రుండు గాడ్పును దిక్కులుఁ గాలములును
దాన యై జంగమస్థావరాత్మక మైన సకలభూత ప్రపంచంబు నెల్లఁ
దనదివ్య శక్తిమైఁ దాల్చినసర్వాత్ము సర్వభూతేశ్వరు సర్వవంద్యు

ఆ. నధిక యోగనిష్ఠితాత్మకు లగుమహా,యోగివరులు తత్త్వయుక్తిఁ జేసి
యెఱిఁగినట్లు నీకు నెఱుఁగంగఁ బోలునే,యనుచు భీష్ముఁ డన్న యవసరమున.

చ. ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి మిచ్చిన దీనికిం దొడం
బడ మని దుర్జనత్వమునఁ బల్కెడువీరుల మస్తకంబుపై
నిడియెద నంచు దాఁ జరణ మెత్తె సభన్ సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదుల్ పలుక కుండిరి తద్దయు భీతచిత్తులై. 30

చ. చెలువుగఁ బుష్పవృష్టి గురిసెన్ సహదేవుపయిన్ దివంబునన్
వెలయఁగ సాధువాదములు వించె సభాసదు లెల్ల విస్మయా
కులితమనస్కులైరి తనకుంచెయుఁ గృష్ణమృగాజినంబునుం
బలుమఱు వీచుచుం గలహబంధుఁడు నారదుఁ డాడె వేడుకన్. 31

వ. అంత శిశుపాలు సేనాపతి సునీథుం డనువాఁ డతిరోషపరుషవచనుం
డగుచు స్వపక్షక్షత్త్రియులనెల్ల నొక్కంతం జేర్చికొని శిశుపాలు ననుమ
తంబున యుద్ధ సన్నద్ధుం డయి యున్న సమయంబున. 32

చ. రయవిచలత్తురంగమతరంగములన్ మదనాగనక్రసం
చయముల సంచలచ్చటులసైనికమత్స్యములన్ భయంకరం
బయి యదు వృష్ణి భోజ కుకురాంధక వాహినియుం గలంగె ని
ర్దయతరరోషమారుతనితాంతసమీరిత మై క్షణంబునన్. 33

వ. అట్టిసకలక్షత్త్రియక్షోభంబు సూచి భయసంభ్రమాక్రాంతహృదయుం
డయి ధర్మరాజు భీష్మున కిట్లనియె. 34

తరలము. ధరణిలోఁ గలరాజులెల్లను దారుణక్షయకాలసా
గరము లట్లు కలంగి రిప్డు మఖప్రయోగము విఘ్నముం
బొరయ కుండఁ బ్రజాపకారము పుట్ట కుండఁగ నీవు చె
చ్చెరఁ బితామహ! వీరి కిచ్చటఁ జిత్తశాంతి యొనర్పవే. 35

వ. అనిన ధర్మరాజునకు భీష్ముం డిట్లనియె. 36

క. నీ యజ్ఞమునకు విఘ్నము, సేయఁగ నోపుదురె యొరులు
జితదైత్యుఁడు నా
రాయణుఁడు యజ్ఞపురుషుఁడ, జేయపరాక్రముఁడు దీనిఁ జేకొని కావన్. 37

సీ. చైద్యున కై పూని సన్నద్ధు లై యున్న యీరాజు లిందఱు నీక్షణంబ
హరి యల్గి చూడుడు[1] నంతకక్షయమున కరిగెడువార ఘోరాహవమున
దమ ఘోషనందనుదర్పంబు నిప్పుడ యడఁగెడుఁ గడుఁబెక్కు
లయ్యుఁ గుక్క
లిభకుంభదళనమహిష్ఠనిష్ఠురనఖముఖుఁ డగుహరిమీఁద మొఱఁగి యేమి

ఆ. సేయ నోపుఁ గృష్ణు సింహపరాక్రము, నెఱుఁగ కున్న వారె యెల్లవారు
ననినభీష్ముపలుకు లవి కర్ణశూలంబు, లయినఁ జేదినాథుఁ డాగ్రహించి. 38

శిశుపాలుఁడు భీష్ముని దూలనాడుట

ఉ. ఇమ్ముదివెఱ్ఱి వీనిఁ బరమేశ్వరుఁగాఁ గొనియాడె ధర్మత
త్త్వమ్ములు పాండవేయులును దానును గాని యెఱుంగ రట్టె సా
మమ్మున నెల్లవారి నవమాన్యులఁ జేసె నమాన్యుఁ డంచు రూ
క్షమ్మున భీష్ముఁ జూచి బలగర్వితుఁ డి ట్లని పల్కె నల్కతోన్. 39

ఉ. నెట్టన ధర్మనందనుఁడు నిన్నవలంబము సేసి యోడతోఁ
గట్టిన యోడవోలె గతగౌరవుఁ డై కడుఁదూలెఁ గృష్ణుఁ జే
పట్టి బిభీషికల్ ధరణిపాలుర కిప్పుడు సూపి తెందు నీ
యట్టిదురాత్ములుం గలరె యంత యధీరులె ధారుణీపతుల్. 40

సీ. పూతనాఘాతంబుఁ జేత నేతర మైన శకటంబుఁ ద్రోపును జరటనిహతి
వీఁకతోఁ గడుఁ బూచుమ్రాఁకులవిఱుపును వల్మీకమాత్రపర్వతము నెత్తి
కొని లావుగలఁడు వీఁ డన నేడుదివసంబు లునికియు వృషవధయును ననంగఁ
బమ్మినకృష్ణుబీరమ్ములు వొగడుచు నున్ననీనాలుక యొక్కఁడయ్యె

ఆ. వ్రయ్యవలయు నూఱువ్రయ్యలుగాఁగ న,ట్లయినఁగాని చాల వతనిఁబొగడ
నెల్లదాని నేన యెఱుఁగుదు నెందు వాఁ, డర్ఘ్యదానయోగ్యుఁ డయ్యెఁ
జెపుమ.

వ. స్త్రీలను గోబ్రాహ్మణులం గూడు వెట్టువారిని విశ్వసించినవారిని వధి
యించుట మహాపాతకం బని పెద్దలు సెప్పుదు రట్టివానియందు గోవిం
దుఁడు స్త్రీవధయును గోవధయునుం జేసె నీవునుం గడు ధర్మ వెఱింగిన

1. చూచిన

వాఁడ వయి వీని కర్ఘ్యం బిప్పించి తదియునుంగాక యన్యకామయయిన యంబ యనుకన్యక నపహరించి నీవు దెచ్చిన నెఱింగి నీ తమ్ముండు విచిత్ర వీర్యుండు ధర్మువెఱిఁగినవాఁడై దాని విడిచి పుచ్చె.

క. జననిందిత మయి నీయం, దనపత్యత యనునధర్మ మది యుండఁగ ధ
ర్మనివృత్తచరిత్రక! నీ, యనుశాసన మెట్లు నమ్మ నగు జనములకున్. 43

వ. తొల్లి సముద్రతీరంబున నుండి యొక్క వృద్ధహంస ధర్మాధర్మంబులు సెప్పుచు ధర్మమార్గంబున వర్తిల్లు చుండుఁ డని పక్షుల నెల్ల శిక్షించుచుఁ బ్రాణిహింస సేయక తపోవృత్తి నున్నదానికి సముద్రజలచరంబు లయిన పక్షులు రుచ్యంబు లగు భక్ష్యంబులు దెచ్చిపెట్టుచుం దత్సమీపంబునం దమతమ యండంబులనెల్ల నిక్షేపించి భక్షణార్థం బొక్కనాఁ డతిదూరం బరిగిన నిటయాహంసయు నయ్యండంబుల భక్షించిన దాని నొక్కపక్షి గని యా పక్షులకెల్లఁ జెప్పిన నవి దద్దయు దుఃఖించి యా యంచను వధి యించెం గావున నట్లు నీవు నధర్మ ప్రవృత్తుండ వై ధర్మశిక్ష సేయుచుఁ గౌరవుల కాపద యాపాదించుచున్నవాఁడవు. 44

క. విదితముగ నధికబలసం, పద నోర్చె నుపేంద్రుఁ డవనిపాలుర నంచున్
మదిఁ బొగడితి నా యెఱుఁగని, యదియె జనార్దను బలంబు నత్యున్నతియున్. 45

క. సకలక్షత్త్రభయంకరు, నకు జార్ఘ్రద్రథికి ననిమొనన్ మార్కొననో
పక వలియంబాఱఁడె యీ, ముకుందుఁడు భయాతిరేకమునఁ బదిమాఱుల్.

వ. అమ్మహాసత్త్వు జరాసంధుం బరమబ్రహ్మణ్యు బ్రాహ్మణవేషంబున భీమార్జునులం దోడుసేసికొని వధియించె నవి యొల్లఁ ద్రివిక్రముపరాక్రమంబులుగా నశ్రాంతవచనుండ వయి. 47

ఆ. బూతువొగడినట్లు వొగడెదు పొగడంగ, వలయునేని సుగుణవంతు లయిన
కర్ణశల్యు లాదిగాఁ గలవీరులఁ, బొగడు చుండ రాదె ప్రొద్దు వోక. 48

ఆ. అన్యకీర్తనంబు నన్యనిందయుఁ దన్నుఁ, బరఁగఁబొగడికోలుఁ బ్రబ్బికోలు
నాపగాతనూజ! యార్యవృత్తములు గా, వనిరి వీని నాద్యు లయిన మునులు. 49

వ. అని రూక్షాక్షరవచనంబుల నాక్షేపించుచున్న శిశుపాలుం జూచి సహింప నోపక భీమసేనుం డతి రౌద్రాకారంబున నలిగిన. 50

చ. ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ జయా
నకతరలీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యత మై త్రిశాఖ మై
భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటి త్రిమార్గగా
నుకృతిఁ బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్. 51

భీమునకు భీష్ముండు శిశుపాలుని వృత్తాంతంబు సెప్పుట

వ. ఇట్లు నిఖిలక్షత్త్రియత్రాసజననంబుగా నలిగి దంతసందష్టదారుణముఖుం డై శిశుపాలనిర్మూలనాభిలసంరంభంబున నున్న భీమసేను వారించి భీష్ముం డి ట్లని చెప్పె నిద్దురాత్ముండు తొల్లి చేదివంశంబున దమఘోషుం డను వానికి సాత్వతికిం జతుర్భుజ లలాటనేత్రంబులతో నుదయించి రాసభ రవంబున నేడ్చుచున్నం జూచి తల్లిదండ్రులు భయవిస్మయాధీనమనస్కు లయి యున్న వారికి నొక్క యశరీరభూతం బిట్లనియె. 52

ఆ. వీని నొరులు చంపఁగా నోప రెవ్వరు, నెవ్వరేని వీని నెత్తికొనుడు
మిగిలియున్నబాహులయుగళంబుఁ గన్నును,నడఁగు వీనికతఁడయంతకుండు.

వ. అనిన నయ్యశరీరివచనంబులు విని వార లాశ్చర్యమానసు లయి యా కుమారుం జూడ వచ్చినవారి కెల్ల నెత్తికొన నిచ్చుచున్నంత. 54

చ. అతిపృకృతస్వరూపధరుఁ డైనకుమారకుఁ బ్రీతితోడ సా
త్వతిఁ దమమేనయత్తను ముదంబునఁ జూడఁగఁ గోరి యద్భుత
ప్రతిభులు రామకేశవులు పన్నుగ నేఁగిరి చేదిధారుణీ
పతిపురి కొక్కనాఁ డఖలబాంధవ మంత్రి సుహృత్సమేతు లై. 55

వ. ఇట్లు వచ్చినరామకేశవులం బ్రియసత్కారంబులఁ బూజించి సాత్వతియు నబ్బాలు బలదేవుచేతికి నెత్తికొననిచ్చి తదనంతరంబ నారాయణుచేతికి నిచ్చిన.

క. అక్కొడుకు నబ్జనాభుం, డక్కజముగ నెత్తికొనుడు నందఱుఁజూడన్
గ్రక్కున నొక్కట నడఁగెను, మిక్కిలిచేతులును వానిమిక్కిలికన్నున్. 57

వ. దానిం జూచి సాత్వతి యద్భుతచిత్తయై యశరీరిపలుకు లప్పుడు దలంచి
తన పుత్త్రునకు మురవైరివలన మరణం బగుట యెఱింగి యతనికిట్లనియె.

క. కుపథప్రవృత్తుఁ డయి వీఁ, డపనయమున నీకనిష్టుఁ డయినను గరుణా
నిపుణుఁడ వై నీమఱఁదికి, నపరాధశతంబు సైఁపుమయ్య యుపేంద్రా! 59

వ. అని వీనితల్లి తొల్లి జగద్వల్లభుం డైనజనార్దనుం బ్రార్థించి తత్ప్రసా
దంబున వరంబు వడయుటం జేసి శతాపరాధంబులు నిండునంతకు వీఁ
డన్యులచేత నప్రతిహతుండు కృష్ణునిచేత నిహతుం డగు నది కార
ణంబుగా. 60

చ. ఇతనికి నిట్లు నన్నుఱక యెగ్గులు పల్కఁగఁ బోలెఁ గాక యు
ద్ధతమతి నన్య్యలీతనివిధంబునఁ బల్కు మదీయచాపని
ర్గతచటులోగ్రమార్గణనికాయపయోధి మునుంగ కిట్లు ద
ర్పితు లయి పోవనేర్తురె గభీరపరాక్రమ! మారుతాత్మజా! 61

వ. అని పలుకుచున్న భీష్మభీముల నతిక్రమించి శిశుపాలుండు జనార్దనున
కభిముఖుం డయి యిట్లనియె. 62

మ. అవమాన్యున్ సభలోన మాన్యుఁ డని సౌహార్దంబునం గౌరవ
స్థవిరప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదు లైనపాండవులు మోహాంధుండు భీష్ముండుఁ గే
శవ! నీవుం గడఁగుండు నాకు నెదురై సంగ్రామరంగంబునన్. 63

వ. అని శిశుపాలుండు గర్వించి పలికిన విని చక్రధరుఁ డఖిలరాజచక్రంబు విన
నిట్లనియె. 64

సీ. ప్రాగ్జ్యోతిషంబున భగదత్తుపయి నేము వోయిన నీతఁ డన్యాయవృత్తి
నిట బాలవృద్ధుల కెల్ల భయంబుగా ద్వారకాపురిఁ గాల్చె, వీరులైన
భోజరాజన్యులు పొలఁతులతోడ రైవతకాద్రిఁ గ్రీడాభిరతిఁ బ్రమత్తు
లయి యున్న వారల ననయుఁ డై వధియించె, దేవాభుఁడగు వసుదేవుచేయు

ఆ. నశ్వమేధమునకు నభ్యర్చితం బైన, హయము నపహరించి యజ్ఞమునకు
విఘ్న మాచరించె వీఁ డతిపాపుఁ డై, బభ్రుభార్యఁ దనకు భార్యఁ జేసె.

వ. మఱియు వాగ్విషయంబు లయినయపకారంబు లనేకంబులు సేసె మా
యత్త సాత్వతి నన్నుం బ్రార్థించుటం జేసి యిద్దురాత్ముండు సేసిన యప
రాధశతంబు సహించితి నిప్పుడు మీ రందఱు నెఱుంగ నాయం దకారణ
వ్యతిక్రమం బుపక్రమించి యత్యంతశత్రుం డయ్యె ననిన విని శిశుపాలుం
డతిపరుషవచనుం డగుచుఁ బురుషోత్తమున కి ట్లనియె. 66

క. నీకూర్మియు నీయలుకయు, నా కవి యేమిటికి దుర్గుణప్రియ! మొదలన్
నాకిచ్చిన యక్కన్యకఁ, జేకొని నీ కిట్లు వలుక సిగ్గును లేదే. 67

చక్రాయుధముచే శిశుపాలుండు చచ్చుట

చ. అని శిశుపాలుఁ డొండొకట నప్రియముల్ హరిఁ బల్కుచున్నచో
ననలశిఖాలి దూల దనుజాంతకచక్రము రాజచక్ర మె
ల్లను భయ మంద మూర్ధవికలంబుగ నప్పుడు సేసెఁ జేదినం
దనుతనువున్ బృహ ద్రుధిరధారలు జోరన మీఁది కొల్కఁగన్. 68

ఉ. ప్రల్లద మేది యిట్లు శిశుపాలుఁడు వజ్రహతాద్రితుల్యుఁడై
త్రెళ్ళుడు వానిదైన పృథు దేహము వెల్వడి తేజ మంబరం
బెల్ల వెలుంగ వచ్చి పరమేశ్వరుదేహము సొచ్చె విస్మయో
త్ఫుల్ల విశాలనేత్రు లయి భూపతు లెల్లను జూచు చుండఁగన్. 69

క. ఘనజాలము లేకయుఁ బెలు,చన పిడుగులతోడివృష్టి చైద్యునిపాతం
బునఁగురిసె సముద్రమహా, ద్రినికాయముతో ధరిత్రి దిర్దిరఁ దిరిగెన్. 70

క. జయజయనినాదమున న,వ్యయు నంబుజనాభు భువనవంద్యు నుపేంద్రుం
బ్రియమునఁ బొగడెడుజనముల, దయిన మహాధ్వనియుఁ జెలఁగె నతి
తుములంబై. 71

వ. అంత ననంతశయనుండు శిశుపాలు సంస్కరింపం బంచి వానికొడుకుం
జేది రాజ్యంబున కభిషిక్తుం జేసె నట్లు ప్రశాంతవిఘ్నంబయి సుఖారంభం

బయి ప్రభూతభక్ష్యాన్న ధనదానసనాథం బయి జగన్నాథరక్షితం బయి రాజసూయ మహాధ్వరంబు సమాప్తసంప్రయోగం బయిన.* 72

ఉ. దేవగురుద్విజప్రకరతృప్తికరున్ వరరాజసూయ య
జ్ఞావభృథాభిషేకవిమలాంగు విశుద్ధయశోనిధిన్ జగ
త్పావను ధర్మనందను సభాస్థితుఁజూచి ముదంబు చెంది రిం
ద్రావరజాదిమిత్రు లసహాత్వముఁ బొందిరి ధార్తరాష్ట్రులున్. 73

వ. ఇట్లు మహావిభూతితో నున్న ధర్మరాజునొద్దకు వచ్చి నానాదేశాగతు లయిన రాజు లిట్లనిరి. 74

మాలిని. జగదభినుతసామ్రాజ్యంబుతో నొప్పునీయ
త్యగణితగుణయుక్తం బైనధర్మ ప్రవృత్తిన్
మిగిలి వెలిఁగె నాజామీఢవంశంబు విద్వ
ద్గగనతపన! సర్వక్షత్త్రి వంశంబులందున్. 75

---

*దీనితర్వాత అధర్వణాచార్యులు చెప్పినవిగా ఈ రెండు పద్యములు కొన్ని వ్రాఁతప్రతులలోఁ గానవచ్చు చున్నవి:—

సీ. తడిసిన పచ్చనితడిచూడ్కులకుఁగొంతతోడలక్రొమ్మెఱుఁగులుతోడుసూప
కురులు వంకలు దీర్చి కురియువార్బిందువుల్ చనుదోయికిని వింత సరము గాఁగ
బొదిఁ బాసి యున్నక్రొవ్వెదఁ జక్కద్రోయుచో దోర్మూలరోచులు దొంగలింప
కజ్జలరేఖలఁ గరఁగిన తెలిగన్ను లంభోజదళ కాంతి నపహసింప
తే. రాజసూయావభృథమునఁదేజరిల్లు, ద్రుపదరాజతనూజాత విపులజఘన
తలము గనుఁగొని రాజకాంతాజనముల, మనము లాపోవమిని మగ మనము లయ్యె.

మ. ప్రణుతాశేష వసుంధరాధిప శిరస్స్రగ్గంధలుబ్ధ భ్రమత్
క్వణదభ్రభ్రమదృద్విరేఫగణఝుంకాబద్ధ సంబంధస
ద్రణవృత్తి ప్రథిత ప్రవర్తిత సమగ్రక్షత్త్ర సూయాధ్వర
క్షణ సింహాసన భాసితున్ దృఢధను శ్లోకానుజున్ ధర్మజున్.

వ. ఏము భవదీయరాజసూయమహోత్సవదర్శనంబునను భవత్కృతసత్కార
గౌరవంబుననుం జేసి కృతార్థుల మయితిమి మామా దేశంబులకుం
బోయెద మని చెప్పి వీడ్కొని చని రప్పుడు ధర్మరాజు వచనంబున భీష్మ
ధృతరాష్ట్రుల భీమసేనుండు యజ్ఞసేను నర్జునుండును సపుత్రకు లయిన
(కర్ణ)శల్య సుబలుల నకులుండును గృపద్రోణాశ్వత్థామల సహదేవుండును
విరాటభగదత్తుల ధృష్టద్యుమ్నుండునుం బార్వతేయులైన రాజుల సౌభద్ర
ద్రౌపదేయులును ననిచి రంత. 76

క. సతతధనదానములఁ బూ,జితు లయి తృప్తులయి గుణవిశిష్టమహీదే[1]
వతవరులు ధర్మసుతు మా,నితగుణు దీవించి చనిరి నిజగృహములకున్. 77

వ. నారాయణుండును బాండునందనుల నందఱం గ్రమంబున వీడ్కొని
ద్వారవతికిం బోవుచుండి ధర్మరాజున కిట్లనియె. 78

తే. సకలభూతసంఘంబు పర్జన్యుఁ బఱి,సమితి బహు ఫలవృక్షంబు
నమరు లింద్రు
ననిశమును నుపజీవించునట్లు బంధు,జనులు ని న్నుపజీవింప మనుము పేర్మి

వ. మఱియు నప్రమత్తుండ వయి నిఖిలప్రజారక్షణంబు సేయు మనినఁ గృష్ణు
నకు ధర్మరా జిట్లనియె. 80

ఉ. నీకరుణం గరంబు రమణీయతరం బయి సర్వవిఘ్న దూ
రీకృత మై సమాప్తి నొనరెన్ ధరణీధర! యిమ్మఖంబు భూ
లోకములోన నేను నృపలోక [2]నమస్కృతిఁ గీర్తిఁ బర్వితిన్
నాకులమున్ వెలింగె సుగుణంబుల కాస్పద మై పవిత్ర మై. 81

క. ద్వారవతినుండియును నిట, యారసి యుండునది దానవాంతక! లోకా
ధార! సమీపస్థుండవ, దూరంబున నుండియుం జతుర్భుజ! మాకున్. 82

వ. నిన్నుం బాసి నిమిషం బయిన నిర్వహింప నేర మని ధర్మరా జెట్టకేనియు
గరుడగమనుగమనంబున కొడంబడియె నంత. 83

1 దేవతలా ధర్మాత్మజు; దైవత.
2 నుతస్థిరకీర్తిఁ

చ. అనిలజవాశ్వయుక్త మయి హాటకరత్న విచిత్రతార్క్ష్యకే
తన మయి మేఘనాద మయి దారుకసారథి యైనదివ్యకాం
చనరథ మెక్కి యాక్షణమ సాత్వతకుంజరుఁ డేఁగె భక్తి నా
తని ననిచెన్ యుధిష్ఠిరుఁడు దమ్ములు దానును బాదచారి యై. 84

క. తగిలి విలోచనగోచర, మగునంతకు దృష్టి నినిపి యట హృదయం బి
మ్ముగఁ జొనిపి యెట్టకేనియు, మగిడిరి హరి ననిచి దీనమతిఁ బాండు
సుతుల్. 85

పాండవసభామహిమకు దుర్యోధనుండు లజ్జితుం డగుట

వ. అట దుర్యోధనుండు శకునియుం దానును సభావిభవంబుఁ జూచువేడుక నందుఁ గొన్నిదినంబు లుండి యొక్కనాఁడు దానియపూర్వరమణీయతకు విస్మితుఁడగుచు నయ్యైప్రదేశంబులం గ్రుమ్మరువాఁడు వివృతం బైనద్వారదేశంబు సంవృతంబుగావగచి చొరనొల్లక సంవృతం బైనదాని వివృతంబుగా వగచి చొరంబోయి లలాటఘట్టితగృహద్వారుం డయి సమప్రదేశం బున్నతంబుగా వగచి యెక్క సమకట్టి నీలాశ్మరశ్మిస్థగితం బైనవిమలమణిస్థలంబు జలాశయంబుగావగచి పరిధానం బెగఁద్రోచికొని స్ఫటికదీప్తిజాలపరివృతం బైనజలాశయంబు స్థలంబుగా వగచి కట్టిన పుట్టంబు దడియఁజొచ్చి క్రమ్మఱిన వానింజూచి పాంచాలియుఁ బాండు కుమారులును నగి రంత. 86

ఆ. దాని నెఱిఁగి ధర్మతనయుండు ధృతరాష్ట్ర,తనయునకు సమీరతనయుచేత
దివ్యవస్త్రములును దివ్యభూషణములు, నిచ్చి పుచ్చెఁ బ్రీతియేర్పడంగ. 87

వ. దుర్యోధనుం డట్లు సభాప్రలంభంబునకు లజ్జితుం డయి పాండవుల వీడ్కొని గజపురంబున కరిగి ధర్మరాజురాజసూయంబు దన కసూయాజననం బగుటయు సకలజనమనోనయనోత్సవం బయినతత్సభాలక్ష్మి దన మనోనయనంబుల కగ్ని[1]జ్వాలయై మహాదాహంబు సేయుటయు సంతప్తుం డై నిదాఘ దాహంబున నింకి తఱుఁగు నల్పజలాశయంబునుంబోలెఁ దర్దయుం దఱిఁగి. 88

1 జ్వాలయుంబోలె

క. కంచు గలపసిఁడి గాఁచినఁ, గంది వివర్ణ మయినట్లు కౌరవుకాయం
బొందఁగ వివర్ణమయి కడు, వందె మనస్తాపహవ్యవహదాహమునన్. 89

క. అవనీరాజ్యవ్యాపా,రవిహీనుం డయి సుహృన్నివ్వరంజనుఁ డై కౌ
రవపాంసనుండు పాప,వ్యవసాయమునందు బుద్ధి వదలక నిలిపెన్. 90

వ. ఇట్లు సకలసుఖోపభోగవిముఖుం డయి యెవ్వరితోడం బలుక కున్న
దుర్యోధనుం జూచి శకుని యిట్లనియె. 91

ఆ. ఇన్నిదినము లయ్యె నేటికి నాతోడ, నిభపురేశ! పలుక విట్టు లేల
నీముఖంబు దీర్ఘనిశ్వాసధూమసం, హతులఁ జేసి కలుష మయినయదియు.

క. నా కెఱిఁగింపుము దీని న,నేకాగ్రతఁ బొంద నేల యే నుండఁగ న
వ్యాకులభవత్ప్రితాపని, రాకృతులు ధరిత్రిలోనిరాజులు నీకున్. 93

వ. అంత సంతాపింప నేల యనిన నాశకునికి దుర్యోధనుం డి ట్లనియె. 94

దుర్యోధనుని దురాలోచనము

ఉ. నీవును జూచి తట్టిసభ నేని వినంబడ దేయుగంబులన్
భూవలయంబులో నది యపూర్వము సర్వమనోజ్ఞ మిష్టభో
గావహ మేక్రియం బడసె నయ్య మహాత్ముఁడు దాన నేమి సం
భావితభాగ్యుఁ డయ్యెను బ్రభాకరతేజుఁడు ధర్మజుం డిలన్. 95

చ. కడుభయ మంది వానికిఁ దగన్ మఱి వైశ్యులపోలె వశ్యులై
పుడమి నతిప్రసిద్ధు లగు భూపతు లెల్ల మహాధనావళుల్
దడయక తెచ్చి యిచ్చి కరదానము సేయుటఁ బార్థివత్వ మే
ర్పడియెఁ బృథాగ్రపుత్త్రునకుఁ బాండవతేజము పర్వె నెల్లచోన్. 96

ఉ. యాదవుచేతిచక్రము భయంకర మై శిశుపాలమస్తక
చ్ఛేదము సేసినం గడుఁ బ్రసిద్ధులు శూరులు నైనరాజు ల
య్యాదవుముందటన్ జయజయధ్వను లిచ్చిరి గాని వానికా
ర్యోదయ వృత్తి కట్టెదుర నోపర యెవ్వరు విక్రమింపఁగన్. 97

చ. అతులపరాక్రమార్జితము లైనధనంబుల పేర్మిఁజేసి యు
న్నత మగు చున్నపాండునరనాథతనూజులలక్ష్మి నా కస
మ్మత మయి సూ వెలింగె విను మాతుల! మానధనాఢ్యుఁ డైన భూ
పతి సహియింప నోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్. 98

వ. ఏమి సేయుదము పాండవులలక్ష్మి యెవ్విధంబున మన కపహరించి కొన
నగు ననిన దుర్యోధనునకు శకుని యిట్లనియె. 99

క. దీనికి ధృతరాష్ట్రునను, జ్ఞానము వడయుదును మనకు సమకూరు ధరి
త్రీనాథ! భవదభిప్రా,యానుగు నైశ్వర్యమతిశయంబుగఁ బ్రీతిన్. 100

వ. అని యప్పుడ శకుని దుర్యోధనుం దోడ్కొని ధృతరాష్ట్రునొద్దకుం జని
యాతని శరీరకార్శ్య వైవర్ణ్యంబులు సెప్పిన విని యదరిపడి ధృతరా
ష్ట్రుండు కొడుకు నొడలంటి చూచి కడు దుఃఖితుం డయి యి ట్లనియె.

సీ. కౌరవైశ్వర్యంబు గౌరవంబున సమర్పిత మయ్యె నీయంద పేర్మితోడ
ననుజులు మిత్రులు ననుచరులును నీకుఁ బ్రీతుల కాని యప్రియులు లేరు
వివిధోపభోగముల్ దివిజేశునకుఁ గల యట్టుల కలవు నీ కనుభవింప
సకలభూపతులుఁ బాయక భక్తియుక్తులై యొలసి నీ పనుపు
సేయుదురు పేర్మి

ఆ. నేమిగొఱఁత యయ్యె నిట్లు డయ్యను డను,చ్ఛాయ దఱఁగి యుండ
సకలధరణి
రాజ్యభోగసుఖపరాఙ్ముఖత్వముఁ బొంద, నేల నీకుఁ గురుకులేశ్వరుండ!

వ. అనిన విని ధృతరాష్ట్రునకు దుర్యోధనుం డిట్లనియె. 103

క. పాండవులవిభవ మదియా,ఖండలువిభవంబుకంటెఁ గడు మిక్కిలి యై
యొండొండ పెరిఁగి దిక్కులు,నిండెఁ దదీయ ప్రతాపనిర్మలరుచితోన్. 104

క. సామాన్యమె యుత్తరకురు,భూములు మొదలుగ సమస్తభూములువిజయ
శ్రీమహిమను సాధించె,ద్రి,ధామపరాక్రముఁడు శక్రతనయుఁడు
బలిమిన్. 105

తే. సఖ్యసంబంధములఁ జేసి చక్రధరుఁడు, ద్రుపదుఁడును దక్కఁ దక్కిన నృపతు లెల్ల
నరియుఁ బెట్టనివారు లే రఖిలజలధి, వలయితక్షోణిలోఁ బాండవులకుఁ బ్రీతి.

తే. శైలకాననద్వీపవిశాల మయిన, వసుమతీచక్ర మంతయు వారివశము
యేను నొకరాజసుతుఁడనై యెట్లు దీనిఁ, జూడనోపుదుఁ బ్రాభవశూన్యునట్లు.

తే. నన్ను రత్న పరిగ్రహణంబునందుఁ, బాండవుండు నియోగించెఁ బార్థివేంద్ర
సర్వత్నాకరైకప్రశస్తరత్న, పుంజముల కాస్పదము ధర్మపుత్త్రి గృహము. 108

తే. యజ్ఞదీక్షితుఁ డయిన ధర్మాత్మజునకు, గౌడకాంభోజపతు లనేకప్రకార
వర్ణకంబళములు శుకవర్ణ వాహ, నివహములుఁ దెచ్చి యిచ్చిరి నెమ్మితోడ. 109

ఉ. సాగర సారవారిరుహశౌక్తికమౌక్తికవిద్రుమద్రుమై
లాగురుచందనంబులు ప్రియంబున నిచ్చిరి తెచ్చి యున్నత
శ్రీగుణయుక్తిమైఁ బరఁగు సింహళ కేరళ చోళ పాండ్యదే
శాగతరాజపుత్త్రిలు మహాగుణశాలి కజాతవైరికిన్. 110

ఉ. మండితసూర్యరశ్మి రుచిమన్మణిహాటకచయంబుతోఁ గట
స్యంధిసుగంధిదానజలసంపద నొప్పెడువాని దేవకీ
నందనుఁ డిచ్చెఁ బ్రీతిఁ బదునాలుగువేలు గజంబులన్ జనా
నందనకీర్తి యైనయమనాథతనూజున కిష్టమిత్రుఁడై. 111

క. హరియును గిరీటియును నొం,డొరుల కభీష్టములు సలుపుచుండుదు రం ద
య్యిరువురు నేకాత్ములు జన,శరణ్యు లుత్తములు నిత్యసాంగత్యమునన్.

వ. మఱియు నయ్యుధిష్ఠిరున కనురక్తుం డయి విరాటుండు రెండువేల గజంబుల నిచ్చె ద్రుపదుండు వేయి గజంబులను బదివేల హయంబులను బదునాలుగువేలు విలాసినీజనంబులం బదివేలు దాసీగృహస్థుల నిచ్చెఁ గుకు

రోలూక కేకయ కాశ్మీర కాంభోజ గాంధార మద్ర ద్రవిడ మగధ మాళవ కళింగ గాంగ వంగ బంగాళ గౌడాంధ్ర కేరళ కోసలాది మహీపతులును బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును మరుకచ్ఛనివాసులును జేదిపతులును నాజానేయబాహ్లికహూణపారసీయదేశంబులం గలహాయంబులం బర్వతనిభంబు లైనయిభంబులను దివ్యాంబరాభరణభూషితంబు లయినయోషిత్సహస్రంబులను నపరిమితంబు లయిన యజావి గో మహిషంబులను హిరణ్య రత్న రజత కంబళాంబరాదుల నిచ్చిరి మఱియు మేరుమందరమధ్య కీచకవనవాసులైనకుళింద పారద బర్బర తురుష్క-కొంకణ కోంకణాధిపతులును వశగతులై హిమశైల రామశైల కురుదేశంబులైనకౌసుమక్షౌద్ర పాత్రంబులను దివ్యౌషధంబులను నింద్రనీలేంద్రగోపపిక చంద్ర మయూరకీరవర్ణ తురంగంబులను సౌవర్ణ కీటజ పట్టజాండజశయ్యలను నిశితదీర్ఘనిస్త్రింశంబులను మణికాంచన [1]ఖచిత గజదంతమయ శిబికాసనంబులను నిచ్చిరి వాసవసఖుం డయినగంధర్వపతి చిత్రరథుం డనువాఁడు నన్నూఱుగంధర్వ హయంబుల నిచ్చెఁ దుంబురుం డనుగంధర్వుండు నూఱుహయంబుల నిచ్చె. 113

ఉ. భావిపురాతనాద్యతనపార్థివలక్ష్ములు పాండవేయుల
క్ష్మీవిభవంబుతోడ నుపమింప సమంబులుగా వశేషరా
జావళిలోన నత్యధికులైనసపత్నులపేర్మిఁ జూచి యేఁ
జూవె సహింప నోపక కృశుండ వివర్ణుఁడ నైతి నెంతయున్. 114

ఆ. ఒక్కలక్షభూసురోత్తముల్ గుడిచిన, మొనసి తనకుఁ దాన మ్రోయుశంఖ
మొక్కనిమిషమేని యుడుగక మ్రోసె న,య్యధ్వరోత్సవంబు నన్నినాళ్ళు.

సీ. జన్నంబు చూడంగ సకలభూములనుండి వచ్చినరాజన్యవరుల నవని
సురులను వైశ్యుల శూద్రుల నాత్మీయబంధు సుహృ ద్వీర భట నియోగ
జనులను బేదల సాధుల నిత్యంబుఁ దాన పరీక్షించి తగ వెఱింగి
యన్నంబు దయఁబెట్టి యందఱుఁ గుడిచినఁ దనుమధ్య యర్ధరాత్రంబు
నపుడు.

ఆ. గాని కుడువ దట్టె కమలాక్షి ద్రౌపది, యదియుఁ గాక యమ్మహాధ్వరమున
నథముఁ డయ్యుఁ గడుఁ బ్రియంబున నభ్యర్చి,తుండ కాని వంచితుండు లేడు. 116

క. ధరణి హరిశ్చంద్రుఁడు భా,సురయశుఁ డయి చేసె రాజసూయం బదియున్
సరి గాదనియే వగతును, సురుచిరవిభవమునఁ బాండుసుతుయజ్ఞముతోన్.

వ. అట్టి రాజసూయాధ్వరంబున నవబృథసమయంబునందు బ్రహ్మర్షి రాజర్షి లోకపాల పరివృతుండయిన మహేంద్రుండునుంబోలె నున్న ధర్మతనయు నారదపారాశర్యాది మహామునిసమేతుం డయి ధౌమ్యుం డశేష తీర్థ జలంబుల నభిషిక్తుం జేసిన. 118

సీ. అభిషిక్తుఁ డయిన యయ్యమరాజసుతునకుసాత్యకి మౌక్తికచ్ఛత్ర మొప్పఁ
బట్టె భీముండును బార్థుండు మణిహేమదండచామరయుగధారు లయిరి
కమలనాభుండును గవలును ద్రుపదేశపుత్త్రిందు వేర్వేఱ భూమిపతుల
మూర్ధాభిషిక్తుల మ్రొక్కించు చుండిరి దర్పంబు వెలయంగ దానిఁజూచి
ఆ. యేను మొదలుగా మహీపతు లెల్లను, దీప్తి దఱిఁగి యుండఁ దివిరి మమ్ము
నగిరి కృష్ణపాండునందనద్రౌపదీ, సాత్యకులుఁ గరంబు సంతసమున. 119

వ. మరియు నయ్యుధిష్ఠిరుండు. 120

సీ. అనఘుఁ డై యెనుబదియెనిమిదివేవురు బ్రాహ్మణప్రవరుల బ్రహ్మవిదుల
వెలయంగ నల్లిండ్ల నిలిపి ప్రత్యేకంబ ముప్పంద్రు దాసుల నొప్ప నిచ్చి
ముదముతో రక్షించుఁ బదివేవు రుత్తమభూసురు లతనియగ్రాసనమునఁ
గలధౌతమయపాత్రములఁ బ్రతిదినమును గుడువను గట్టను దొడువఁ బూయ
ఆ. ననుభవింపఁ గలుగు టది యేమి పురుషార్థ, మయ్యు కష్టపురుషునట్టు లోరుల
పేర్మిఁ జూచుచుండఁ బెద్దయు నేనోప, ననినఁ బతికి నిట్లు లనియె శకుని.

క. భానుప్రభు లగుపాండుమ,హీనాథాత్మజులలక్ష్మి యెల్లను నీకున్
సే నపహరించి యిత్తు ధ,రానుత! మాయాదురోదరవ్యాజమునన్. 122

వ. ధర్మతనయుండు జూదంబునకుఁ బ్రియుండుగాని యందులయుక్కివం బెఱుంగం డే నక్షవిద్యయం దతిదక్షుండ నాతని నక్రమంబున నోడించి తదీయ రాజ్య విభూతి నీకిచ్చెద వగవ కుండు మని పలికిన శకునిపలుకులకు సంతసిల్లి దుర్యోధనుండు దండ్రిపాదంబులపయిం బడి మ్రొక్కి యీశకునిమతంబున కొడంబడవలయు ననినఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 123

క. ధీరమతి విదురుతోడ వి,చారింతము వాఁడు నయవిశారదుఁడు కళా
పారగుఁడు దీర్ఘదర్శి య,పారహితారంభుఁ డుభయపక్షంబులకున్. 124

వ. సురపతిగురుం డైనబృహస్పతి సేసిననీతిశాస్త్రరహస్యంబులం దెవ్వరికంటె విదురుం డెంతయు విశారదుం డాతనిబుద్ధిబలంబునను నాపగేయుబాహుబలంబుననుం జేసి యీ రాజ్యతంత్రంబు వర్తిల్లుచున్నయది గావున నవ్విదురానుమతంబున నెగడుట లగ్గగు ననిన దుర్యోధనుం డి ట్లనియె, 125

తే. పాండుపుత్త్రుల కెప్పుడుఁ బక్షపాతి, విదురుఁడని చెప్పఁ దొల్లియు విందు దీని
నెఱిఁగి వారించుఁగాకతఁ డేల శకుని, కైతవంబున కొడఁబడుఁ గౌరవేంద్ర!

తే దీని కొడఁబడు మొడఁబడ వేని నేఁడ, యీక్షణమ సర్వభక్షుచే భక్షితుండ
నగుదుఁ దెల్ల మేనన్నైనవగపుదక్కి, విదురుఁడును నీవు నుండుఁడు ముదముతోడ. 127

క. అని కడు నడలుగఁ బలికిన, విని ధృతరాష్ట్రుండు దుఃఖవివశాత్మకుఁ డ
య్యును నెదనది యుచితము గా,దని వగచుచు నాత్మజునకు నాహ్లాదముగన్. 128

వ. అప్పుడు వేవురుశిల్పాచార్యుల రావించి కనకరత్నఖచిత స్తంభసహస్రంబులను విచిత్రద్వారశతంబులను వివిధరత్నరుచిరప్రదేశంబులనుం జేసి రమ్యంబుగా నొక్కసభ నిర్మింపం బనిచి యొక్కనాఁ డేకాంతంబ విదురునకు

శకుని దుర్యోధనుల యభిప్రాయంబు చెప్పిన విని యతండు విస్మితుండై
కలి ద్వాపర సమీపంబగుటయు జూదం బఖిల ప్రజాక్షయకరం బగుటయు
నెఱింగి ధృతరాష్ట్రున కి ట్లనియె. 129

విదురుఁడు ధృతరాష్ట్రునితో జూద మాడఁ దగదని చెప్పుట

ఆ. ఇట్టి కార్యమునకు నే నవశ్యంబును, నొడఁబడంగ నోప నుక్కివమున
సుతులతోడ నేల సుతులకు భేదంబు, సేయఁ గడఁగి తిదియుఁ జెట్టయనక

తే. ఒలసి నీపుత్త్రు లెల్ల నొండొరులతోడ, నె ట్లొడంబడి యుండుదు రట్ల చేయ
వలయుఁ దమలోన జూదంబువాదునగుటఁ, గలహమూలంబ యెట్టి శాంతులకునైన. 131

వ. నీనేర్చువిధంబున శకునిదుర్యోధనులదుర్వ్యవసాయం బుడిగించి యిక్కురు
వంశంబు రక్షింపు మనిన విదురునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 132

ఉ. పుత్త్రుల కేల భేద మగు భూనుత! యేనును నీవు జాహ్నవీ
పుత్త్రుఁడు నుండఁగా నహితమున్ భయమున్ దొరకొన్నె నాకు నా
పుత్త్రులకుం బ్రసాదకృతబుద్ధులు పేల్పులు గాన దీనికిన్
మిత్త్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయ మంద నేటికిన్? 133

వ. వడి గల తురంగంబులం బూనినరథం బెక్కి యింద్రప్రస్థపురంబునకుం జని
యిందులకు ధర్మనందనుం దోడ్కొని రమ్మని విదురుం బంచిన నాతం
డును నాపగేయున కంతయు నెఱింగించి యిది యపకర్మంబను చుండె
నిట ధృతరాష్ట్రుండు దన నిర్మింపం బంచినసభ దుర్యోధనునకుం జూపి
యాతని కేకాంతంబున ని ట్లనియె. 134

క. జూద మిది యేల దీనను, భేదము మీలోనఁ బుట్టుఁ దెలుచన యుష్మ
ద్భేదమునఁజేసి యెగ్గు, ల్పాదిల్లు ధరిత్రిఁ బ్రజకు భయజననం బై. 135

ఉ. ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరానురా
గమ్మున నేలు చున్కి యిది కార్యము పాండవలక్ష్మి నీ కస

హ్యా మ్మన నేల వంచనఁ బరార్థపరిగ్రహబుద్ధిఁ జేసి పా
ప మ్మగుఁ బాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్. 136

వ. ధర్మాధర్మవిదుం డైన విదురున కిది సమ్మతంబు గాదు ధర్మజుధనసంపద కంటె నేను మడుంగులు నీకు ధనసంపద గలదు వానిచేసినయజ్ఞంబు కంటె విశేషంబుగా దక్షిణలిచ్చి నీకిష్టం బయినయజ్ఞంబు సేయుము నీకును భూలోకంబునంగల రాజు లెల్లం దమ సర్వస్వమ్ములుఁ దెచ్చి యిత్తు రనిన విని దుర్యోధనుండు దండ్రి కి ట్లనియె. 137

క. ఇమ్ముల ధర్మజుతోఁ జూ,ద మ్మాడఁగఁ గాన్ప నాకు ధరణీశ్వర! య
జ్ఞ మ్మదియ సమస్తైశ్వ,ర్యమ్ములు వడయఁగ నుపాయ మభిమతబుద్ధిన్.

క. మీ రిందుల కందఱుఁ జను, దేరఁగ నే నంద యుండితిని సభ చూడన్
ధారుణి నట్టియపూర్వస,భారచనలు వినఁగఁ జూడఁబడ వెవ్వరిచేన్. 139

వ. నిర్మలస్ఫటికశిలానిర్మితం బై శశిప్రకాశం బై వివిధరత్నప్రభాభాసురం బైన యాసభవిభవంబు చూచువేడుక నందుఁ గ్రుమ్మరువాఁడ హరినీలబద్ధస్నిగ్ధమణి స్థలంబునందు జలబుద్ధిం జేసి పరిధానోత్కర్షణంబు సేసి విమలశిలాతల బుద్ధి నుదకపరిపూర్ణం బయినవాపి సొచ్చి కట్టినపుట్టంబు దడియం ద్రెళ్ళిన నన్నుం జూచి వృకోదరుండు నగియె దానినంతయు నెఱింగి ధర్మరాజచోదితు లయిన కింకరులు నాకుం బరిధానంబులు దెచ్చి యిచ్చిరి మఱియు వివృతద్వారంబుఁ గవాటఘటితం బని చొర నొల్లక కవాటఘటితంబు వివృతంబుగా వగచి చొరంబోయి తత్కవాటస్ఫటికశిలాఘట్టితలలాటుండ నైన నన్నుం జూచి యనేక సహస్రవిలాసినీపరివృత యయి యున్న ద్రౌపది నగియె నంత నకుల సహదేవులు పఱతెంచి యిదె వాకిలి యిట వచ్చునది యని నన్నుం దోడ్కొని పోయి రట్టి సభాప్రలంభంబు నాకు హృదయశల్యం బయి యున్నది. 140

క. పెద్దలు హీనతఁ బొందిరి, తద్దయు హీనులు సమృద్ధిఁ దనరిరి నియమం
బెద్ది విధియోగమున కను, హృద్దరోన్నతులు సూచి యెట్లు సహింతున్.

క. పరమసుఖోపాయంబునఁ, బరసంపద చేకొనంగఁ బడు నేని నరే
శ్వర! యంతకంటె మిక్కిలి, పురుషార్థం బెద్ది యొండు భూనాథులకున్.

క. నముచి యనుదనుజుఁ డుగ్రతపము సేయుచు నున్న వాని బలమథనుఁడధ
ర్మమున వధియించె రిపుపక్షము నెమ్మెయినైనఁ జెఱుపఁగావలయునిలన్.

ఆ. అల్పుఁడయ్యు మనుజుఁ డతిపరాక్రమమున, పేర్మిఁ దరతరంబ పెరుఁగుచున్న
వాఁడు ద్రుమాని మొదలివల్మీక మాత్రమానిఁ, జెఱుచునట్లు గడఁగి చెఱుచుఁ బగఱ. 144

తే. అహితవృద్ధి యుపేక్షితం బగుడు నల్ప
మగుమహావ్యాధియునుబోలె నది యసాధ్య
మయి యుపేక్షకు నిర్మూలితాత్ముఁ జేయుఁ
గానఁ బాండవశ్రీ యుపేక్ష్యంబు గాదు. 145

వ. దాని నెవ్విధంబున నయిన నపహరింపవలయు నట్లు గానినాఁడు నా హృదయ తాపంబున కుపశమనంబు గా దనిన దుర్యోధనునకు శకుని యిట్లనియె. 146

సీ. నాగరథాశ్వసన్నాహ మొనర్పక యొడ్డనంబులు దీర్ప కుభయసైన్య
వీరులకరముల వివిధాయుధంబుల నన్యోన్యసంఘట్టనారవంబు
లెసఁగంగ సంగ్రామ మేర్పడఁజేయక యక్షముల్ దొలిచి యే నశ్రమమునఁ
బ్రతిపక్షతతులసంపదలు జయించి నీ కిచ్చెద వగవంగ నేల ధర్మ

ఆ రాజుఁ బ్రీతితోడ రావించి యతనితోఁ, గడఁగు జూద మాడఁ గౌరవేంద్ర
యొండుపాటఁ బాండవోన్నతి వేల్పులకయిన నపహరింప నలవిగాదు.

వ. అనిన ధృతరాష్ట్రుండు దాని కొడంబడ నొల్లక యేను విదురుశాసనంబున వర్తిల్లుచున్నవాఁడ నాతం డర్థానర్థవిదుండు సకలకార్యసమర్థుండు జూదంబున విగ్రహం బగు ననియె బలవంతులతోడివిగ్రహంబు పరిహరించుట లగ్గు నా వచనంబు ధర్మోపేతంబు దీని నతిక్రమించి యనుతాపంబు సేయక యిప్పుడు జూదం బుడిగి యెప్పటియట్ల యుండుట కార్యం బనిన విని దుర్యోధనుం డతని కిట్లనియె. 148

క. తనకార్య మొరుమతంబున, నొనరింపఁగ నేర నగునె యొరునిమతంబుం దనమతము నొకఁడు గా నో, పునె చెచ్చెర నిశ్చయింపఁ బోలునె దానిన్. 149

ఆ. విదురుమతము పాండవేయహితార్థంబు, వానిబుద్ధి నెగడ వలవ దన్య పక్షపాతబుద్ధిఁ బరఁగుచు నుండెడు, నట్టివాని నాప్తుఁ డనఁగ నగునె. 150

వ. జూదం బన్నది పురాణంబులయందును వినంబడు దీన దోషంబు లేదు సుహృద్ద్యూతంబున దేవతలు [1]దేవసాయుజ్యంబు వడయుదురు గాన దీనిం బ్రవర్తింప శకుని కానతిచ్చి యిందులకు ధర్మనందను రావింప వలయు ననిన ధృతరాష్ట్రుండు పెద్దయుం బ్రొద్దు చింతించి యెట్టకేనియు దాని కొడంబడి విదురుం బిలిపించి వాని కి ట్లనియె. 151

చ. అనుపమరత్నకాంచనచయాంచిత మీసభ దీని ధర్మనం
దనుఁ డనఘుండు దానుఁ దనదమ్ములు నిందుల కేఁగుదెంచి చూ
చినఁ గడు సంతసం బగు విశిష్టజనస్తుత! నీవు వానిఁ దో
డ్కొని చనుదెమ్ము భూసురసఖున్ బుధబంధుజనానురంజనున్. 152

వ. ఇట్టివిచిత్రరత్నసభావేదికాతలంబున నతండును దుర్యోధనుతోడం బ్రొద్దు వోక సుహృద్ద్యూతంబుఁ బ్రవర్తించు ననిన విని విదురుండు విషణ్ణహృదయుం డయి మాయాదురోదరంబు దురర్థంబుగాఁ జింతించి దీని నుడిగిన నుభయపక్షంబులకు ల గ్గగు నని పెక్కుమాఱులు వారించి. 153

విదురుఁడు ధర్మరాజుం దోడ్కొని వచ్చుట

క. అవిలంఘనీయ మీదు,ర్వ్యవసాయం బనుచు సత్యవచనుఁడు ధర్మా
ర్థవిదుం డప్పుడు ధృతరా,ష్ట్రవిధాతృనియోగమున కొడంబడి యంతన్.

క. ఇంద్రప్రస్థపురంబున, కింద్రగురుప్రతిభుఁ డరిగి యింద్రసమానుం జంద్రయశు ననుజసహితు న్నృ,పేంద్రుని ధర్మసుతుఁ గాంచె నెంతయుఁ బ్రీతిన్. 155

వ. అతనిచేత నభ్యర్చితుం డయి కుశలం బడిగి నిజాగమనప్రయోజనం బెఱింగించిన విని విదురునకు ధర్మతనయుం డి ట్లనియె. 156

1. ధర్మంబు

సీ. పుత్త్రవత్సలుఁడువిచిత్రవీర్యాత్మజుఁ డార్యుండు ధృతరాష్ట్రుఁ డాదరించి
నిన్ను నియోగించె నన్నుఁ దోడ్కొని తేర నీవును వచ్చితి నెమ్మితోడ
లాలితాపూర్వసభాలోకనంబునయందు జూదంబు కార్యంబె చెపుమ
జూదంబుకతమున భేదంబు గాకుండ నేరదు మాలోన నీనియోగ

ఆ. మనఘమాకలంఘ్యమయినట్లు ధృతరాష్ట్ర, పనుపు సేయనీకుఁబాడియదియ
యనుచువిధినియుక్తుఁడయి యప్డు విదురుతో, నేఁగ నిశ్చయించె
నిందుకులుఁడు.*

క. అనుజులు ద్రుపదాత్మజయును, ననుచరముఖ్యులును ధౌమ్యుఁడాదిగ విద్వ
జ్జనులును దోఁ జనుదేరఁగ, నినసన్నిభతేజుఁ డరిగె నిభపురమునకున్. 158

వ. అందు దుర్యోధనదుశ్శాసనాదిపుత్త్రశతంబుతో భీష్మశకుని సైంధవ కర్ణ గౌతమ ద్రోణాశ్వత్థామ సోమదత్త సమేతుండయి యున్నధృతరాష్ట్రునకు భానుమతీప్రభృతిస్నుషాపరివృతయయి తారకాపరివృత యయియున్న రోహిణియుంబోలెనున్న గాంధారీదేవికిఁ గురువృద్ధజనులకు నతివినయంబున ననుజసహితుండయి ధర్మతనయుండు మ్రొక్కె నంత ద్రుపదరాజ నందనయు గాంధారికి మ్రొక్కిన నక్కోమలిం జూచి గాంధారికోడండ్రెల్లను విస్మిత లయి.

* ఈసీసము తర్వాతఁ గొన్ని వ్రాఁతప్రతులలోఁ గల యధికపాఠము.

వ. ఇట్లు కృతనిశ్చయుండై ధర్మతనయుండు దివ్యాంబరాభరణ మాల్య గంధంబుల నలంకృతుండై ప్రయాణార్థంబు భూసురనికరంబునకు బహు రత్నసువర్ణంబులు దానంబు లిచ్చి మంగళ తూర్య నాదంబులును విప్రాశీర్వాదంబులును మాగధమంజులగానంబులును వందిజనవాక్య సంతానంబులును విలసిల్లుచుండ మందిరంబులు వెడలి యనేకమణిమయప్రభాభాసురంబైన కాంచనరథారోహణంబు చేసి కుంతీద్రౌపదులును దోడనచనుదేర నరిగి యన్నరనాథుండు నాగనగరప్రవేశంబు చేసి పౌరజననయనానందంబు సేయుచుం జని రాజగృహద్వారసమీపంబున.

క. పరమోదారుఁడు ధర్మజుఁ, డరదము డిగి చనియెఁ బ్రీతి ననుజులుదానున్
[1]సురుచిరవిభవస్ఫురణను, గురుతర మైనట్టికొలువు కూటంబునకున్.

1. సురవిభవస్ఫురణంబున.

తే. అఖిలలావణ్యపుంజంబు నబ్జభవుఁడు, మెలఁతగా దీనియందు నిర్మించెనొక్కొ
కానినాఁ డిట్టికాంతి యేకాంతలందు, నేల లేదని సామర్షహృదయ లయిరి.

వ ఇట్లు పాండవకౌరవు లతిప్రణయగౌరవంబున నద్దివసంబు సలిపి రంతఁ
బ్రభాతంబ. 161

ఉ ఆధృతరాష్ట్రు చేసిన యనర్ఘమణిప్రకరానుబద్ధశో
భాధృతి నొప్పుచున్న సభ పార్థివముఖ్యుఁడు ధర్మజుండు దు
ర్యోధనుఁ డర్థిఁ జూపఁగ సహోదరవీరులుఁ దానుఁజూచి ల
క్ష్మీధరమూర్తి యెంతయును మెచ్చె మనంబునఁ దద్విభూతికిన్. 162

వ అయ్యపూర్వసభామణికుట్టిమంబున నందఱు సుఖాసీను లయి యిష్టసంభాష
ణాదిక్రీడావసరంబున నున్నంత దుర్యోధనుండు యుధిష్ఠిరున కిట్లనియె

క. అనఘ! సుహృద్ద్యూతం బిం, దొనరింతము ప్రొద్దు వోకయును నగు జూదం
బునకుం బ్రియుఁడవు దక్షుఁడ, వన విందుము నిన్నుఁ బ్రీతి నక్షజ్ఞులచేన్. 164

వ. అనిన వానికి ధర్మతనయుం డిట్లనియె.

తే. క్షత్త్రనీతిక్రమంబులుగావుసూవె,నికృతియును జూదమును ధర్మనిత్యులైన
వారికిరెండు వర్జింపవలయు నెందుఁ,బాపవృత్తంబు జూదంబు పార్థివులకు.

ఆ. కుటిలమార్గులయినకుత్సితకితవుల, తోడఁ గడఁగి జూద మాడఁ జనదు
దానఁజేసి యర్థధర్మ వివర్జితు, లగుదు రెట్టివారు జగములోన. 167

వ. మఱియు మాయాద్యూతంబున జయించుట మహాపాతకం బనియును
ధర్మద్యూతంబున జయించుట ధర్మయుద్ధంబున జయించునంతియపుణ్యం
బనియును నసితు డయినదేవలుండు చెప్పె ననిన నయ్యుధిష్ఠిరునకు శకుని
యిట్లనియె.

క. ద్యూతకలాకుశలుండగు, నాతఁడు లోకజ్ఞుఁడును మహామతియును వి
ఖ్యాతుఁడు నగు సత్క్షత్త్రియ, నీతివిదుఁడు దగునె దాని నిందింపంగన్. 169

క. బలహీను లయినవారలు, బలవంతుల నోడుచునపుడు బహుమాయల న
చ్ఛలమునఁజేయుట యెందును,గలయదియ జయంబ కాదె కర్తవ్యమిలన్.

వ. జూదంబున కీ వోడు దేని యుడుగు మనిన నాతనికి ధర్మరా జిట్లనియె.

ధర్మరాజు శకునితో జూదం బాడుట

క. బలవద్ద్యూతార్థముగాఁ, బిలువంబడి మగుడ నగునె పెక్కులు పలుకుల్
పలుకంగ నేల యని య,త్యలఘుఁడు ధర్మజుఁడు జూద మాడఁ గడంగెన్.

వ. ఇట్లుజూదంబున నయ్యేడుదోసం బెఱింగియు దైవానుశాసనంబున ధర్మజుండు దాని కభిముఖుం డయి చందనకర్పూరకస్తూరీపరిషిక్తం బయిన ద్యూతరంగంబునందు ముందఱ గంధపుష్పార్చితంబు లయినయభిమతాక్షంబు లమర్చికొనియున్న సౌబల వివింశతి చిత్రసేన వికర్ణులం జూచి వీరిలో నెవ్వఁడు నాతోజూదం బాడెడువాఁడనిన నాతనికి దుర్యోధనుం డి ట్లనియె. 173

తే. అనఘ! మామామ శకుని నాకై కడంగి,జూద మాడెడి నీతోడఁగాదు నాక
యీతఁడొడ్డిన ధనరాసు లెవ్వియైనఁ,బోఁడిగా నీకు నీఁగలవాఁడ నేను. 174

వ. అని తనచేతియనర్ఘ రత్నకటకంబు లొడ్డిన నన్యులకయి యన్యులు జూదం బాడుట యెంతయు విషమం బనుచు ధర్మతనయుండు సాగరావర్తసంభవంబు లయినపరార్థ్యమణిహారంబు లొడ్డె నిట్లు సుహృద్ద్యూతంబు ప్రవర్తిల్లు నదియైన నచ్చోటికి వచ్చి భీష్మ ధృతరాష్ట్ర విదురకృపద్రోణాశ్వత్థామలు విచిత్రోచ్చాసనస్థు లయి దానిం జూచుచుం బ్రహృష్టహృదయులయి యుండిరంత. 175

తే. అభిమతాక్షముల్ దొల్చి మాయావిదుండు
సుబలరాజాత్మజుఁడు ధర్మసుతు జయించె
నొడుతు నే నింక నని వెండియును గడంగె
శకునితో జూద మాడ నా శశికులుండు. 176

వ. ఇట్లు యుధిష్ఠిరుండు బద్ధమత్సరుం డయి పెఱిగి యొండొండ యొడ్డుచు నిష్కసహస్రభరితానేకాయుతకుండమండితంబు లయిన సువర్ణభాండాగారంబులును, వజ్రవైదూర్యమరకతమౌక్తికనీలప్రవాళపద్మరాగాది వివిధశుద్ధవిపులరత్న పరిపూర్ణంబు లైనరత్నభాండాగారంబులుం, బ్రత్యే

కంబ పంచద్రోణకాంచన సంచితంబు లయినచతుశ్శతనిధులును మణికింకిణీ జాలాలంకృతంబు లయినయసంఖ్యాతహయయూధంబులును, జాతరూప వరూథంబులుం, గనక కక్ష్యాకుథసనాథంబు లయినమదాంధగంధసింధుర సందోహంబులుం, బరార్ధ్యరత్నభూషణభూషితంబు లయినయోషిత్స హస్రంబులును, ననుదినాతిథిజన భోజనపాత్రహస్తులయిన శతసహస్రపరి చారకులును నర్జుననకు జిత్రరథుం డిచ్చినగంధర్వహయంబులందొట్టి దుగ్ధపానశాలితండులఖాదనంబులం బెరుఁగుచున్న జాత్యశ్వా నేకాయుతం బులు, నజావి గోమహిష ఖర రాసభనివహంబులు నొక్కొక్క యెడ్డునన యెడ్డి యోటుపడినం జూచి విదురుండు ధృతరాష్ట్రునకు రహస్యంబున ని ట్లనియె. 177

క. ఖలుఁ డీదుర్యోధనుఁడె,గ్గులతోడన యుద్భవిల్లె గోమాయు రుతం
బులు వించె దుర్నిమిత్తం, బులు పెక్కులు వుట్టె వీనిపుట్టినవేళన్. 178

వ. తొల్లి యెన్నండును బాపంబుం బొరయని మహాభిష భీమసేన ప్రతీప శంతనుల కులంబు దుర్యోధను కారణంబునం బాపభూయిష్ఠంబుగా నున్న యది యొక్కని కారణంబునఁ గులంబున కెగ్గగు నేని వాని దూషించి కులంబురక్షించుట ధర్మం బని శుక్రుండు చెప్పెఁ గులరక్షణార్థం బంధక యాదవ వృష్ణివీరులు కృష్ణునియోగించి కులదూషకుం డైనకంసుని వధింపించిరి గావున. 179

మత్తకోకిలము. వాసవాత్మజుఁ బంపుమిప్పుడ వాఁడు ధర్మవిదుండు నీ
శాసనంబున నిగ్రహించు విచారదూరు సుయోధనున్
భూసతీశ్వర! దీన నీకులమున్ మహీప్రజయున్ గత
త్రాసవృత్తి సుఖంబు వొందుఁ బ్రధానవిగ్రహ మేటికిన్. 180

ఉ. ఇమ్మనుజాధమున్ గుణవిహీను బహిష్కృతుఁ జేసి ధర్మమా
ర్గమ్మునఁ గౌరవాన్వయముఁ గావుము పాండుతనూజులం బ్రతా
పమ్మెసఁగంగ నేలు మిది పథ్యము సు మ్మొకనక్క నిచ్చి సిం
హమ్ముల విల్చికో లుఱదె యన్యులె వారలు కౌరవేశ్వరా! 181

మధ్యాక్కర. అంగారములు గొనువేడ్కఁ బుష్పఫలావళీలలిత
తుంగద్రుమప్రకరంబుఁ గరుణావిదూరుఁడై కాల్చు
నంగారకారుఁ బోలంగ సమకట్టె నర్థలోభంబు
నం గురుకులహానికరుఁడు ధారుణీనాథ నీసుతుఁడు. 182

ఆ. అధికదర్పయుక్తమై బలీవర్దంబు, నగముదరి విదారణంబు సేయఁ
గాలు ద్రవ్వునట్లు గడుబలాఢ్యులతోడ, నేచి వీఁడు విగ్రహింపఁదొడఁగె. 183

వ. ఇంక నయిన నుపేక్షింపక యీ దుష్టద్యూతంబు వారింపు మనినఁ బుత్త్రి
స్నేహంబున నెద్దియుం జేయునది నేరక ధృతరాష్ట్రుండు మిన్నకుండె
నంత విదురుండు దుర్యోధనున కభిముఖుండై యిట్లనియె. 184

క. న్యాయంబు విడిచి సౌబలు, మాయాద్యూతమున శాపమతి వైభరతా
మ్నాయు లగుపాండవేయుల, శ్రీయిమ్మెయిఁ గొనిన నిన్నుఁ జీ యనరె
యొరుల్.

క. ధృతిమంతుల భుజవిక్రమ, జితశత్రులఁ బాండవేయసింహులను మదో
ద్ధతిమైఁ బరాజితులఁ జే,సితి వారల కిట్లు నికృతి సేయుట లగ్గే. 186

వ. అనిన విని విదురున కలిగి దుర్యోధనుం డిట్లనియె. 187

సీ. పరులగుణంబులు పలుకుచుఁ గీర్తింతు పక్షంబ పలుకుదు పాండవులకు
ధార్తరాష్ట్రుల సంతతంబు నిందింతువు కుడిచినచోటికిఁ గూర్చ వెపుదు
నుత్సంగతలమున నుగ్రవిషోరగం బున్నట్లు నీవు మా యొద్ద నునికి
పరులసంపద సుఖోపాయబలంబునఁ గొనుట భూపతులకు గుణము కాదె

ఆ. యడుగకయును గర్జమది యిష్టుఁడై చెప్పు, నతని కాడఁ దగిన
యదియనన్న
నిట్టునట్టు ననఁగ నేల నీయిమ్ముల, నుండు బుద్ధి సెప్పకుండు మాకు. 188

వ. అనిన విదురుం డిట్లనియె. 189

క. చెడఁ గలపువార చెలులుం, గడుకొని నీయట్టివారికర్జంబులు చె
ప్పెడువారుఁ గాక నీకున్, మడవక మాయట్టివారిమాటలుగొలఁదె. 190

తే. ప్రియము పలికెడువారిన పెద్దమెత్తు, రప్రియంబును బథ్యంబు నైన పలుకు
వినఁగ నొల్లరు గావున వేడ్క దానిఁ బలుక రెవ్వరు నుత్తమ ప్రతిభులయ్యు.

తే. మొదల నప్రియ మయ్యును దుదిఁ గరంబు
పథ్య మగుపల్కు ప్రియులందు బలిమి నైనఁ
బలుక వలయు మో మోడక యొలసి యట్టి
వాఁడు దగు సహాయుండు భూవల్లభునకు. 192

వ. ఏను సపుత్త్రికుం డైనవైచిత్రవీర్యుకార్యంబునకు హితుండనై నెగడుదు నట్టి న న్నన్యథాబుద్ధి నొల్లక పలికితి పాండవులతోడివిగ్రహంబు లగ్గు గాదని చెప్పి విదురుండు విగత వచనుం డై యుండె నంత శకుని ధర్మ నందనున కిట్లనియె, 193

ఉ. ఎల్లధనంబు నోటు వడితిందుకులేశ్వర ! యింక నొడ్డఁగా
మొల్లము నాకుఁ జూపు మని ముందట సారెలు ద్రోచి యాడఁగా
నొల్లక యున్న సౌబలున కున్నతచిత్తుఁడు ధారుణీతలం
బెల్లను నొడ్డి యోటు వడియెన్ బలవద్వ్యసనాభిభూతుఁడై. 194

వ. ఇట్లు దేవభోగబ్రాహ్మణవృత్తులు దక్కఁ దక్కినమహీతలంబును బ్రాహ్మణులు దక్క సర్వప్రకృతిజనులను రాజపుత్త్రుల నొక్కొక్కయొడ్డున నొడ్డి యోటువడి వెండియు. 195

ధర్మరాజు తమ్ములను ద్రౌపదిని జూదమునం దొడ్డి యోడుట

సీ. తమ్ముల నత్యంతధర్మసమేతుల నాయతబాహుల నాజిజయుల
నాదిత్యతేజుల నాదిభూపాలకచరితుల నభిమానసత్యరతుల
సహదేవ నకుల వాసవసుత భీములఁ గ్రమమున నలువురఁ గౌరవేంద్రుఁ
డొక్కొక్కయొడ్డున నొడ్డి తన్నును నొడ్డి యుక్కివంబున నప్పుడోటువడిన

ఆ. నతనిఁ జూచి శకుని యనియె నిట్లేల ని,న్నొడ్డి తధిప నీకు నొండుధనము
గలదు మఱచి తెట్లు కమలాక్షి పాంచాల, కన్య నీకు ధనముగాదె యనిన

చ. అలయక వెండియుం గడఁగి యక్షరతుం డయి ద్రౌపదిన్ మహో
త్పలదళచారునేత్రఁ గులభామఁ బణంబుగఁ జేసి యొడ్డి సౌ
బలఖలుచేత నోటు వడి పాండుసుతుం డుడిగెన్ ధనంబు ల
గ్గలముగ నొడ్డ లేమి గతగర్వమునం గడు దీనవక్త్రుఁడై. 197

సీ. ఆతనిఁ జూచి ద్రోణాచార్యకృపభీష్ము లవిరళస్వేదాంగు లగుచు వృద్ధ
జనులును దారు నిశ్శబ్దనిరంతరముఖు లై రి విదురుండు మొగము వాయ
నిడి తల వాంచి తన్నెఱుఁగక దుఃఖితుండై యుండెఁ దక్కిన యాసదస్యు
లందఱుఁ బ్రబలబాష్పాంబుధారాకులితాక్షు లై రత్యుచ్చమై పయోధి

ఆ. పటురవాభ మై సభాక్షోభ మయ్యె దు,శ్శాసనుండుఁ గర్ణసైంధవులును
నధికహర్షవికసితాస్యంబు లొప్ప నొం,డొరులఁ జూచి నగుచు
నుండి రపుడు. 198

వ. ధృతరాష్ట్రుండును నిది యేమి సభాక్షోభం బెవ్వ రెవ్వ రేవస్తువు లొడ్డి
రవి విదురు నడుగుచుండె నట్టి యవసరంబున దుర్యోధనుండు పాండ
వులం దనకు దాసులంగా నొడిచినవాఁ డై పెలిగి. 199

క. వరవుళ్లఁ గలసి తనయిలు, పరువడిఁ దుడువంగఁ గృష్ణఁ బనుచువగన్ భా
సురరాజ్యదర్ప మొప్ప వి,దురుఁ జెచ్చెరఁబంచె దానిఁ దోడ్కొని తేరన్.

క. దాని సహింపక విదురుం, డానరపతి కిట్టు లనియె నజ్ఞానులు నీ
తో నెన లే రొరులిట్లు మ,హానిష్ఠురవృత్తిఁ బనుప నగునే నన్నున్. 201

క. మదమలినమనస్కుఁ డరుం,తుదుఁడు నృశంసుఁ డనఁ బరఁగుదుర్జనునకు సం
పద లెడ లయ్యును నాతని, మొదలిటిసంపదలతో సమూలంబు చెడున్.

క. అవనీతలసామ్రాజ్యో,త్సవమునకును యోగ్య యైనసతి ద్రౌపది పాం
డవధర్మపత్ని నీ కం, తవమానము సేయ నేమి యనపాశ్రయయే. 203

తే. ఏల యాశీవిషంబుల నెఱిఁగి యెఱిఁగి, మూర్ఖవై యలిగించెదు
మొనసి యొరుల
ధనము నికృతిమైఁ గొనుటిది ధర్మువగునె, శకునిమతమునఁ బాపంబుఁ
జనునె చేయ.

వ. జూదంబున నెగ్గు వుట్టు దీన నయ్యేడుఫలంబు వేణుఫలంబునుంబోలె సహ
మూల వినాశంబునకు నిమిత్తం బగు ననిన దుర్యోధనుండు విదురుం
దూలనొదరి ప్రాతికామి యనువానిం బిలిచి యీవిదురుం డెప్పుడు నరి
ష్టంబ కాని పలుకండు పాండవులకు వెఱచు నీవు వోయి ద్రౌపదిం
దోడ్కొని రమ్మని పంపిన. 205

ప్రాతికామి ద్రౌపదిని సభకుఁ దోడ్కొనివచ్చుట

ఆ. అవనినాథుచేత నాజ్ఞాపితుం డయి, సూతనందనుండు ప్రాతికామి
పాండవాగ్రమహిషిపాలికిఁ జని భక్తి,వినతుఁ డగుచు నిట్టులనియె సతికి.

తరువోజ. ధనసంపదలు నిజధరణిరాజ్యంబుఁ దనయులం దమ్ముల
దన్నును నిన్నుఁ
దనర జూదం బాడి ధార్తరాష్ట్రులకు ధర్మతనూజుండు దా నోటువడియె
వనజాక్షి! కౌరవవరుపని నిన్ను వడిఁ దోడుకొని పోవ వచ్చితి నిపుడ
చనుదెమ్ము కౌరవేశ్వరుకడ కనిన జలజాయతాక్షి పాంచాలి యిట్లనియె.

ఆ. ఏయుగంబునందు నెట్టిదుష్కితవుండు, భార్య నొడ్డి యోటువడిన భర్త
గలఁడె యిది వినంగఁ గడునపూర్వం బయ్యె, నిట్లు సేయునొక్కొ
యిందుకులుఁడు.

తే. మున్ను దన్నోటువడి మఱినన్ను నోటు, వడియెనో నన్ను మున్నోటువడి
విభుండు
గ్రన్నఁ దన్నోటువడియెనో యన్న! నాకు, నెఱుఁగఁజెప్పుము దీని నీ
వెఱుఁగుదేని. 209

వ, ఎఱుంగవేని యక్కితవు నడిగి వచ్చి మఱి నన్నుం దోడ్కొనిపోవ నగు
నేని తోడ్కొని పొమ్మనినం బ్రాతికామి క్రమ్మఱి వచ్చి పాంచాలి పలు
కులు ధర్మరాజునకుం జెప్పిన దురోదరపరాజయదుఃఖితచేతస్కుండగుటం
జేసి యతఁడు వానికి నదత్తప్రతివచనుండైనఁ బ్రాతికామికి దుర్యోధనుం
డి ట్లనియె. 210

క. సందిగ్ధ మయినయర్థము, నిందఱసన్నిధిన యడిగి తింద తెఱుంగన్
సుందరిఁ బాంచాలేంద్రసు,తం దోడ్కొనిరమ్ము పొమ్ము తడయకయనినన్.

వ. వాఁడును ద్రౌపదిపాలికిం బోయి "దేవీ! నీయడిగినయర్థంబు నిర్ణయించు వా రయి సభ్యులు నిన్ను రాఁ బంచిరి ర"మ్మనిన దుర్యోధనుదుశ్చేష్టితంబునకు ధర్మరాజు సమ్మతంబునకు వెఱచి యక్కోమలి ప్రాతికామిపిఱుంద నేకవస్త్రయు నధోనీవియు నవిరళగళితనయనోదక బిందుసందోహ పరిపీడ్యమానపీనస్తన పరిధానాంతరయు నగుచు సభకుం జనుదెంచి కురువృద్ధు సమీపంబున నున్నంత ద్రౌపదిం జూడ నోపక లజ్జితు లయి దుఃఖాయమానమానసు లయి తలలు వాంచి యున్న పాండవులవైలక్ష్యం బుపలక్షించి సంతసిల్లి దుర్యోధనుండు దుశ్శాసనుం బిల్చి ప్రాతికామి వృకోదరునకు వెఱచు నీవు వోయి ద్రౌపదిం దోడ్కొనిరమ్మని పంచిన. 212

ఆ. నిర్దయాత్ముఁ బాపనిరతు దుశ్శాసనుఁ, బనుచు వెఱఁగి కృష్ణ పంకజాక్షి
గడుభయంబు నొంది గాంధారియొద్దకు, నరిగెఁ గడు [1]నడంగి యతిరయమున. 213

చ. తడయక కౌరవానుజుఁడు దానిపిఱుందన పాఱి యింక నె
క్కడ కరుగంగఁ బోలుఁ జులుకం జను దె మ్మిట సౌబలుండు ని
న్నొడిచె దురోదరంబునఁ గురూత్తమునర్థమ వైతి నిన్నునుం
బుడమిని దమ్ముఁ గోల్పడిరి పార్థి! భవత్పతు లైనపాండవుల్. 214

వ. అనుచు డాయ వచ్చిన నక్కోమలి రజస్వల నన్ను ముట్టకు మేకవస్త్ర నయి యున్నదాన గురుబంధుజనాధిష్ఠితం బైనసభకు నెట్లు రా నేర్తు ననిన నీ వేక వస్త్రవైతేమి విగతవస్త్ర వైతేమి ని న్నెట్లుం దోడ్కొని పోదు నని బలాత్కారంబున.

దుశ్శాసనుఁడు ద్రౌపదిని సభలోని కీడ్చి తెచ్చుట

ఉ. ఆవనజాననం గురుకులాపశదుండు గడంగి రాజసూ
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనము లైన శిరోజములం దెమల్చి పా
పావహుఁ డీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమ మంది చూడఁగన్. 216

వ. ఇట్లు వాతావధూతం బైనపతాకయుంబోలె దుశ్శాసనాపకృష్ట యై ద్రౌపది వికీర్ణ కేశయు వివర్ణవదనయు నై కర్ణదుర్యోధనశకుని సైంధవాది దుష్టభూయిష్ఠం బైనసభకు వచ్చి కోపలజ్జాపరవశ యయి, 217

1. వడంకి

చ. అనుపమదైవయోగహతుఁ డయ్యె నవశ్యము ధర్మసంపదం
దనరునకాక ధర్మజుఁడు ధన్యుఁడు ధర్మపథంబు తప్పఁ ద్రొ
క్కునె కురువృద్ధులార! భృశకోపనుఁ డీతఁడు నన్ను నేల దు
ర్జనుఁ డిట యీడ్చి తెచ్చె నవిచారపరుం డయి దుర్మదంబునన్. 218

చ. ఇది యుచితంబు గా దనక యిక్కురుముఖ్యులు సూచుచుండ దు
ర్మదుఁ డయి వీఁడు నన్ను నవమానితఁ జేసెడి సర్వధర్మసం
విదు లన నున్న యీభరతవీరులవంశము నేఁ డధర్మసం
పద నతినింద్య మయ్యెనని భామిని గృష్ణుఁ దలంచె భీత యై. 219

వ. ఇట్లు జగత్త్రియవిజయ భుజవీర్యసనాథు లైననాథులు గలిగియు ననా
థయుం బోలెఁ బాంచాల రాజపుత్త్రి భయార్తయై యాప్తజనశరణ్యుం
డైన జగన్నాథు జనార్దనుం దలంచుచుఁ గపటద్యూతమధుమదోన్మత్తుం
డయిన ధర్మపుత్త్రు నిమిత్తంబున నుద్గతం బయిన పాండవపరాజయదహ
నంబుఁ దన రూక్ష కటాక్షవీక్షణ వచనంబులఁ బ్రవర్తించుచున్నదానిఁ
జూచి దుఃఖితుండై భీమసేనుండు ధర్మరాజున కి ట్లనియె. 220

క. ధనకనకరత్న వరవాహనధరణీరాజ్యములును నాయుధములు మ
మ్మును నోటువడుట యుచితమ, యినసన్నిభ! వీనికెల్ల నీశుఁడ వగుటన్.

క. ద్రుపదతనూజం బణముగఁ, గపటద్యూతమునఁ జేయఁగాఁ దగునె జనా
ధిప! యిది దుష్టద్యూతము, నెపమునఁబరిభూతయయ్యె నిష్కరుణులచేన్

వ. శకునికైతవం బెఱింగియుం బాపద్యూతంబునఁ బ్రవర్తించి యధర్మప్రవృ
త్తుండ వయితి కావున భవద్బాహుదాహంబు సేయవలయు నని కోపించి
పలికినం బవనతనయునకు నర్జునుం డి ట్లనియె. 223

సీ. ధర్మతనూజుండు ధర్మువు దప్పిన ధరణీతలం బెల్లఁ దల్లడిల్లుఁ
దగిలి సుహృద్ద్యూత ధర్మయుద్ధములకుఁ బరులచేఁ బిలువంగఁబడి విభుండు
గడగక విముఖుండు గాఁ జన దని శుభక్షాత్త్రధర్మంబు లోకంబులందు
నిలిపెఁ దా నిది పతినేరమియే దైవ వైపరీత్యంబైన వనరఁ దగునె

ఆ. గురుల ధర్మపరులఁ గోపించి ధీరు లతిక్రమింతురే తదీయనిత్య
ధర్మగౌరవం బధార్మికు లగుచున్న, పరులచేతఁ జెఱుపఁబడియె నిట్లు.

వ. అనుచు దుఃఖితు లగుచున్న పాండవులను దుశ్శాసనాపకృష్ట యై సభాంత రంబున నున్న ద్రౌపదిం జూచి వికర్ణుం డన్యాయశ్రవణవికర్ణుఁడై మిన్న కున్న సభ్యుల కి ట్లనియె. 225

క. సముచితవృత్తు లగుబుద్ధిమంతులకు నిపుడు ద్రౌపదీప్రశ్న విచా
రము సేయవలయు నవిచారమునఁ బ్రవర్తిల్లు టది నరకహేతువగున్.

వ. ఇక్కురువృద్ధు లైనభీష్మధృతరాష్ట్రవిదురాదులును నాచార్యు లయిన ద్రోణకృపాదులుం బలుకరై రి యున్నసభాసదు లెల్లం గ్రామక్రోధా దులు దక్కి విచారించి చెప్పుం డనిన నెవ్వరుం బలుకకున్న నే నిందు ధర్మనిర్ణయంబు సేసెద నెల్లవారును వినుండు జూదంబును వేఁటయుఁ బానంబును బహుభక్షణాసక్తియు నను నాలుగు దుర్వ్యసనంబులం దగిలిన పురుషుండు ధర్మువుం దప్పి వర్తిల్లు నట్టివానికృత్యంబులు సేకొనందగవు కితవాహూతుండై వ్యసనవర్తియయి పరాజితుం డయిన పాండవాగ్ర జుండు పాండవుల కందఱకు సాధారణధనం బయినపాంచాలిఁ బణంబుఁ జేసెం గావున ద్రౌపది యధర్మవిజిత యక్కోమలి యేకవస్త్ర నిట దోడ్కొని తెచ్చుట యన్యాయం బనిన వికర్ణు పలుకుల కోడంబడక కర్ణుండు వాని కి ట్లనియె. 227

ఆ. ఎల్లవారు నెఱుఁగ నొల్లనిధర్మువు, బేల! నీకుఁ జెప్ప నేల వలసెఁ
జిఱుతవాని కింత తరుసంటిపలుకులు, సన్నె వృద్ధజనము లున్నచోట.

వ. నీవు ద్రౌపది నధర్మవిజిత యని పలికితి సభాసదు లెల్ల నెఱుంగ ధర్మజుండు దన సర్వస్వమ్ము నొడ్డి యోటువడినప్పుడిది వానికి వెలిగాదు గావున ధర్మవిజితయ యిట్లు గానినాఁడు పాండవు లిందఱును దీనివిజితఁగా నేల యొడంబడుదురు మఱియేకవస్త్రయై యున్న దీని సభకుం దోడ్కొని వచ్చుట ధర్మువు గా దంటి భార్యకు దైవవిహితుం డయిన భర్త యొక్క రుండ యిది యనేక భర్తృక గావున బంధకి యనంబడు నిట్టిదాని విగత వస్త్రం జేసి తెచ్చిన ధర్మవిరోధంబు లే దని కర్ణుండు వికర్ణువచనంబులకుం బ్రత్యాఖ్యానంబు సేసిన విని దుర్యోధనుండు దుశ్శాసనుం బిలిచి యి ప్పాండ వులయు ద్రౌపదియు వస్త్రంబు లపహరింపు మని పంచిన దాని నెఱింగి. 229

క. కితవవ్యవసాయపరా,జితు లగుటం జేసి బలిమిచెడి పాండుసుతుల్
ధృతిఁ దమపయిపుట్టము లా, యతకీర్తు లు మున్న పెట్టి యాసభనున్నన్.*

దుశ్శాసనుండు ద్రౌపది గట్టినపుట్టం బొలుచుట

సీ. ఇది సేయఁ గా దని మది విచారింపక సద్గర్హితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టినపుట్టంబు సభలోన విడ్చె నాశంక లేక,
యుడుగక యొలువంగఁ బడియు మున్నపనీత మైన తద్వస్త్రంబునట్టివలువ
లలితాంగిజఘనమండలమునఁ బాయక యొప్పుచు నున్న నయ్యువిదఁ జూచి

ఆ. సభ్యు లెల్ల నుదితసమ్మదు లయిరి దు, శ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మయిన నొలువంగ నోపక, యుడిగె లజ్జఁబొంది యుక్కుదక్కి.

వ. ఇట్లు భీమసేనుండు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు సేసినయవమా
నంబు సూచి కోపరక్తాంతనయనుం డగుచు నంతకాకారంబున దంత
సందష్టదారుణముఖుం డయి యెల్లవారును విన నిట్లనియె. 232

మ. కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవు లనేకుల్ సూచు చుండన్ మదో
ద్ధురుఁ డై ద్రౌపది నిట్లు సేసినఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘని
ర్ఝర ముర్వీపతి సూచు చుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్. 233

వ. ఇట్లు సేయనైతినేని పితృపితామహులగతికిం దప్పినవాఁడ నగుదు నని
నతని యతిమానుషం బయినమహావ్యవసాయంబున కద్భుతం బంది దిక్కులు
చూడక ధిక్ఛబ్దముఖరితముఖు లగుచు సభాజనులు తమలో సపుత్త్రికుం

---

* కొన్ని ప్రతులలో మున్న యధిక పాఠము ;

"క. ఏనింక నేమి సేయుదు, నీ నిర్దయుచేత కనుచు హృదయ మదర న
మ్మానిని వణఁకుచుఁ గృష్ణ ద, యానిధి గోవింద, కావు మను చున్నంతన్."

క. హాకృష్ణ! హాయదూద్వహా!, హా కేశవ! హాముకుంద! హాగోవిందా!
హాకమలనయన! హాహరి! హాకమలాహృదయలోల! హాగోపాలా!

వ. అని విష్ణుదేవు ప్రార్థనము చేసియున్నంత,

డయిన ధృతరాష్ట్రు నిందించుచు ద్రుపదరాజపుత్త్రివాక్యంబులు విచా
రింపక వృద్ధరాజు లుపేక్షించి రనుచుండి రంత నుద్యతబాహుం డయి
విదురుం డెల్లవారిని వారించి యి ట్లనియె. 234

క. సుమతులు పాంచాలీప్రశ్నమునర్థము నేర్పడన్ విచారింపుఁడు పా
పము వొందు ధర్మసందేహము దీర్పనినాఁడు సభ్యు లగు సజ్జనులన్. 235

మత్తకోకిలము. ఈవికర్ణుఁడు బాలుఁ డయ్యును నేర్పరించి యథావిధిన్
దేవమంత్రియపోలె ధర్మువుఁ దెల్పె నీతనిబుద్ధి మీ
రేవగింపక చేకొనుం డిది యెల్లయందును ధర్మ స
ద్భావ మెుక్కని కేర్పరింపఁగ బ్రహ్మకైనను బోలునే. 236

ఆ. సభకు వచ్చి ధర్మసందేహ మడిగిన, నెఱిఁగి చెప్పకుండిరేని సభ్యు
లనృతదోషఫలమునం దర్ధ మొందుదు,రనిరి ధర్మవేదులైన మునులు. 237

ఆ. ధర్మ మెఱిఁగి దానిఁ దా నొండుగా లాభ,లోభపక్షపాత లోలబుద్ధి
సభల నెవ్వఁ డేని సభ్యుఁడై పలుకువాఁ,డనృతదోషఫలము ననుభవించు. 238

విరోచన సుధన్వుల వృత్తాంతము

వ. ఈయర్థం బితిహాసంబులయందు వినంబడుఁ దొల్లి ప్రహ్లాదునికొడుకు విరోచ
నుండును నంగిరసుం డనువిప్రునికొడుకు సుధన్వుండును నొక్కకన్యాప్రతి
గ్రహనిమిత్తంబున నెల్లసుగుణంబుల నేనపెద్ద నేనపెద్దనని తమలోనిద్దఱును
ప్రాణంబు లొడ్డుగా నొడ్డి వివాదంబు సేసి ప్రహ్లాదుపాలికిం జని రందు
సుధన్వుండు ప్రహ్లాదున కి ట్లనియె. 239

తే. నీవు ధర్మవిదుండవు మా వివాద, మెఱిఁగి తీర్పు గుణశ్రేష్ఠుఁ డితఁడొ నేనొ
చెప్పు మన్యథాబుద్ధివై చెప్పితేని,మఘవుకులిశంబు వ్రచ్చు నీమస్తకంబు.

వ. అనినం బ్రహ్లాదుండు భయంపడి కశ్యపుకడకుం జని విరోచనసుధన్వులు
తన్ను వివాదనిర్ణయం బడిగినవిధంబును జెప్పిన విని వానికిం గశ్యపుం
డి ట్లనియె. 241

తే. సాక్షియును ధర్మదర్శియు [1]సాక్షిధర్మ,విధులు దప్పంగఁ జెప్పిననధమవృత్తి
వరుణపాశసహస్రంబు వానిఁగట్టి,పాయునేఁడేఁట నొక్కొకఁ డాయతముగ.

వ. ధర్మం బధర్మవిద్ధం బయి సభకు వచ్చిన దానిం దీర్పనిసభ్యు లధర్మవిద్ధులగుదురు మఱి సభ్యులు కామక్రోధంబులు విడిచి యధర్మంబు నాపనినాఁ డయ్యధర్మంబునం దొక్కపాదంబు సభ్యుల నొక్కపాదంబు భూపతిఁ దక్కినయది గర్తనుం బొందు సమంజసులైనసభ్యులచేత విధ్యుక్తంబయ్యేనేని నధర్మంబు కర్తనుం బొందుఁ గావున ధర్మంబు దప్పక చెప్పవలయు ననినం బ్రహ్లాదుండు ధర్మమతి యై విచారించి తనకొడుకుకంటె గుణశ్రేష్ఠుఁడుగా సుధన్వుం జెప్పినఁ బుత్రస్నేహంబు విడిచి ధర్మువు దప్పక చెప్పి తని ప్రహ్లాదుం బ్రశంసించి సుధన్వుం డరిగెఁ గావున మీరును ద్రౌపదీప్రశ్నంబునందు ధర్మబుద్ధి సేయుండని విదురుండు పలికిన దుర్యోధను భయంబున సభ్యులెవ్వరుం బలుక రయిరి ద్రౌపదియు నట్లు సకలక్షత్త్రియసమక్షంబున దుశ్శాసనుచేతం బరిభవింపంబడి దుఃఖితయయి. 243

సీ. అవ్విధంబున నొప్పి యాస్వయంవరమునాఁ డఖిలభూపతులచే నట్లు సూడఁ
బడి పాండవుల ధర్మపత్ని నై గోవిందుచెలియల నై వీనిచేత నిట్లు
పరిభూత నగుచు సభామధ్యమున మహీపతులచేఁ జూడంగఁబడితి నింత
వడుదునె యిపుడు నాపలుకుల కెవ్వరుఁ బ్రతివచనం బేల పలుకరైరి

ఆ. ధన్యులార! యే నదాసినే దాసినే, యెఱుఁగఁ జెప్పి పనుపుఁ డెల్లదాని
ననుచు వనరుచున్ననాపగాసుతుఁడు శాం,తనవుఁ డిట్టు లనియెఁ దానిఁజూచి.

వ. అవ్వా! నీ ప్రశ్నంబునకు నుత్తరం బయ్యుధిష్ఠిరుఁడు సెప్పవలయుఁ గాని నాఁడు ధర్మసూక్ష్మత యెవ్వరికిని నెఱుంగ గహనంబు. దీనిఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతు రని పలుకుచున్న యవసరంబున నక్కోమలిం జూచి నగుచు. 245

తే. తరుణి యేవురకంటె నొక్కరుఁడ భర్త,యగుట లగ్గు జూదంబున నాలినోటు
వడనివానిఁగాదఁగుభర్తఁబడయుమింక,ననుచు రాధేయుఁడుల్లసమాడెనంత.

---

1. సాక్ష్య విధులు దప్పఁగాదుర దప్పినను నధర్మయుక్తి;
సభలయందుఁదప్పుగాఁ జెప్పిరేని యధర్మవృత్తి.

ఉ. అమ్ముదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసికేశభా
రమ్మున నొప్పుదానిఁ దనరమ్యపృథూరుతలంబు నెక్కఁగా
రమ్మని సన్న సేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁ డష్టు దాని దూ
రమ్మునఁ జూచి కౌరవకురంగమృగేంద్రుఁడు భీముఁ డల్కతోన్. 247

క. లయసమయదండధరనిర్దయుఁడై ధరణీశు లెల్లఁ దనపలుకులు వి
స్మయసంభ్రమభయసంభృతు, లయి విను చుండంగ నిట్టు లనియెన్ సభలోన్.

ఉ. ధారుణిరాజ్యసంపదమదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చినయిద్దురాత్ము దు
ర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాతభ
గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్. 249

వ. అని సర్వజనభయానకక్రోధావేశవివశుం డయి యాయుధంబు లున్నవలనికి దృష్టులు సలుపుచు నగ్రజుమొగంబు సూచుచున్న భీమసేనునతిరౌద్రాకారంబు సూచి భీష్మవిదురద్రోణాదు లిది కోపంబున కవసరంబు గా దని యాతనిం బ్రశాంతచిత్తుం జేసి రంత.

క. ధృతరాష్ట్రునగ్నిహోత్రా, యతనంబున నఱచె వఱఁకు లగ్నులు శాంత
ద్యుతు లయ్యెఁ గౌరవస్త్రీ, తతిహృదయము లధికశోకతప్తము లయ్యెన్.

క. క్రూరాత్మకులై దుష్పద, వీరతు లగుధార్తరాష్ట్రవీరులశయ్యా
గారముల నెగసె నెంతయు, ఘోరంబుగఁ గాకఘూకఘూత్కారంబుల్.

క. అట్టి మహోత్పాతంబులు, పుట్టినఁ గృప విదుర కలశభూ శాంతనవుల్
నెట్టన ధృతరాష్ట్రజులకుఁ, బుట్టె నరిష్ట మని రిష్టమునఁ దమలోనన్. 253

వ. అంత నంతయు నెఱింగి గాంధారి విదురుం దోడ్కొని ధృతరాష్ట్రుకడకుఁ బోయి పాండవపరాజయంబును ద్రౌపదిపరిభవంబును దుర్నిమిత్తోత్పత్తియుం జెప్పిన విని ధృతరాష్ట్రుండు దుర్యోధనుం బిలిచి యిట్లనియె 254

చ. పరమపతివ్రతన్ సభఁ దపస్వినిఁ బాండవధర్మపత్ని ధ
ర్మరత నయోనిజం బ్రకృతిమానవభామినిఁ గాఁ దలంచి దె
ప్పరములు వల్కఁగాఁ దగునె బాల్యము నాదిగ దుష్టభావనం
బెరిఁగితి నీనిమిత్తమునఁ బెద్దయు దుఃఖితులైరి పాండవుల్. 255

వ. వారలవలన నీదురాగ్రహం బుడుగు మని కొడుకును భంగించి సకల బాంధవ హితంబు సేయం దలంచి ద్రౌపదిని రావించి శాంతవచనంబుల ని ట్లనియె. 256

ధృతరాష్ట్రుండు ద్రౌపది గోరినవరంబు లిచ్చుట

క. సుందరి! నాకోడండ్రుర.యం దభ్యర్చితవు నీవ యతిముదమున నీ
కొందఁగఁ బ్రియంబు సేసెద,నిందుముఖీ! వేఁడు మెద్ది యిష్టము నీకున్.267

వ. అనినం బాంచాలి యి ట్లనియె. 258

ఆ. కరుణతోడ నాకు వరము ప్రసాదింప, బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు, వలనఁ బాయవలయు
వసుమతీశ! 259

వ. అట్లయినం గురుకుమారులు గురువృద్ధజనలాలితుం డై పెరిఁగిన ప్రతి వింధ్యు దాసపుత్త్రుం డన కుండుదు రిదియ నా యిష్టం బనిన నిచ్చితి నింక రెండవ వరంబు వేఁడు మనిన ద్రౌపది యి ట్లనియె. 260

క. నెమ్మిని ధర్మజునలువురు, దమ్ములుఁ దమయాయుధముల దమవర్మవరూ
థమ్ములయుఁ దోడ సకలహి,తమ్ముగఁబాయంగవలయు దాస్యమువలనన్

వ. అనిన ధృతరాష్ట్రుండు నీకోరినవరం బిచ్చితి నింక మూఁడవవరంబు వేఁడు మనిన ద్రౌపది యి ట్లనియె. 262

ఆ. వైశ్యసతికి నొక్కవరము సత్క్షత్త్రియ,సతికి రెండు శూద్రసతికి మూఁడు
విప్రసతికి నూఱు వేఁడఁ జన్వరములు, గాన యింక వేఁడఁ గాదు నాకు.

వ. అనిన ధృతరాష్ట్రుండు కోడలిగుణంబులకు ధర్మం బెఱుంగుటకు సంతసిల్లి *యనుజసహితుం డయిన యుధిష్ఠిరు రావించి నీవు సర్వసంపదలు స్వరాజ్యంబును నొప్పుగొని యెప్పటియట్ల యింద్రప్రస్థపురంబున కరిగి సుఖంబుండుము నీకు ల గ్గయ్యెడు మని వెండియు. 264

---

*కొందఱు తాటాకులలో నున్నదనిచెప్పెడు నమూలమును సందర్భ శుద్ధిరహితమునునగు నధికగ్రంథము:-("వరంబు వేఁడం గాదేని నీకు మేలగు

తెఱం గెయ్యది చెప్పు మనుటయు ద్రౌపది యిట్లనియె వీరిలో నొక్కరు నాతో జూదం బాడ నియోగింపుం డనిన ధృతరాష్ట్రుండు శకునిం బిలిచి ద్రౌపదితో నొక్కయొడ్డొడ్డి యాడు మనిన నక్షంబులు దెచ్చి యిచ్చి నీకిష్టంబైన యొడ్డొడ్డుమనిన ద్రౌపదియును నత్యంత శుచిర్భూత యయి నీళ్లను నక్షంబులుఁ బుచ్చుకొని తమతండ్రు లగుమాద్రేయులం దలంచి నమస్కరించి నాకుఁ బ్రతికూలంబుగాక పాండవులను నన్నును గెలిపించి శత్రులం ద్రుంచువిధంబుగా నాకు ననుకూలురు గావలయు నని మ్రొక్కి యడ్డసారంబులు పుచ్చుకొని శకుని కిట్లనియె.

క. ఈసభ యెల్లను జూడఁగ, దాసత్వము సేయఁ గాని దాసత్వమునం
జేసి మీతోడఁబోరఁగ, గాసిల్లినచోట నేను గ్రమ్మఱఁ దివుతున్.

ఆ నీవ యోడితేని నిరతంబు నేవుర, దాసవృత్తి వాసి తద్ద యరుగు
నట్టు లొడ్డు నొడ్డి యాడంగఁగడఁగుమ, యనిన శకుని యిట్టులనియె మగుడ

ఆ. ఆడి యోడి పోవుడది ధర్మువే వారి, కనిన నాతి యిట్టులనియె నతని
కోప మదియు నిలుపఁ గొలఁదియే వాయుజు, గరుడిదాసితను గణంగినట్లు

వ. అనిన దుర్యోధనుండు ద్రౌపది పలికినయట్ల మాకోపంబులు వారి కోపంబులు నుడుప బ్రహ్మాదులకుం గొలఁది యగునె యదియ యొడ్డుగా నొడ్డి యాడు మనిన శకునియు నవుంగాకయని యొడ్డొడ్డిన నక్కోమలికి వరదులైన మాద్రేయులు ద్రౌపది గెల్చునట్లుగాఁ బడిన.

క. ఇంక నొకయొడ్డు వినుమా. శంకితదివ్యాంబరములు శరములు రథముల్
కంకటములు భూషణములు. నుంకొని నీ వొడ్డియాడు మున్నతమతివై.

క. అని యట్టు లొడ్డి యోడిన, మనమునఁ గౌరవులు వెఱచి మానుమ యనుచున్
వనిత గొనిన సారెలు గడు, ననయంబును గెల్వనిచ్చు నశ్రమలీలన్.

వ. అని వారించిరి ద్రౌపదియుం దనపురుషులకడకు వచ్చియున్నంత ధృతరాష్ట్రుం డనుజ సహితుం......

తే. నీవు నిత్యంబు వృద్ధోపసేవఁ జేసి, యెఱుఁగు దెల్లధర్మంబుల నెఱుక లేక
కడఁగి నీ కెగ్గు సేసె నాకొడుకు దీని, మఱచునది నీకు నేనొండ్లు గఱపనేల

క. మనమున వేరమిఁ దలఁపమి,యును సక్షమచిత్తుఁ డగుటయును గుణముల కై
కొనిదోషంబులు విడుచు,టయును నుత్తముఁ డయినపురుషు నుత్తమ గుణముల్.

వ. ఏను బుద్ధిలేక జూదం బుపేక్షించితి నల్పబుద్ధిసత్త్వం డయినవృద్ధు నన్నును మీతల్లియయిన గాంధారినిం దలంచి దుర్యోధనాదులు సేసిన దుర్నయంబులు సేకొన కుండునది సర్వశాస్త్రవిదుం డయినవిదురుండు మంత్రిగా సర్వధర్మవిదుండ వైన నీవు రక్షకుండవుగా నిక్కురుకులంబు నకు లగ్గగునని ధర్మరాజుఁ బాండురాజు రాజ్యంబునందు సమర్పించిన.

తరలము. తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రుల దైనభీ
కరపరస్పరకోపవేగము గ్రన్నఁ బాచి విపత్తిసా
గరనిద్ధమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని తద్దయుఁ బ్రీతితోన్. 268

సీ. దాని నంతయు భీమసేనుండు విని రాజ్యసంప్రాప్తి పాండవసత్తములకు
సతికారణంబున ధృతమయ్యె నను నింతకంటెను గష్టంబు గలదె యొండు
పేర్మి నపత్యంబుఁ గర్మంబు విద్యయు ననునవి తేజంబు లట్టె తగిన
పురుషున కెందును నిరతంబు మిక్కిలి తేజంబు కర్మంబు దీని విడిచి

ఆ. యలుకగాఁడె పురుషుఁడని కోపఘూర్ణిత. రక్తనేత్రుఁడై పరాక్రమమున
శత్రువరుల నుగ్రసంగరంబునఁజంపి, కుతలరాజ్యమెల్లఁ గొందుననుచు.

వ. మృగమధ్యంబున నున్న సింహంబునుంబోలె ననుజమధ్యంబున నున్న యాతనిం గరంబున వారించి ధర్మరాజు ధృతరాష్ట్రు శాసనంబునం దమ్ము లుం దానును ద్రౌపదీసహితంబు గాంచనరథారూఢుండై యింద్రప్రస్థపురం బున కరిగిన నిట దుశ్శాసనుచేత నంతవృత్తాంతంబును విని దుర్యోధనుండు కర్ణ శకుని సైంధవులతో విచారించి ధృతరాష్ట్రుపాలికింజని యిట్లనియె.

క. అహితుల నెల్లవిధంబుల, విహతులఁగాఁ జేయునది వివేక మని మరు
న్మహితుండు చెప్పెనిది మును, బృహస్పతి సురేశ్వరునకుఁ బ్రియహిత
బుద్ధిన్.

వ. అప్పాండవుల కెంతలగ్గు సేసియు నింక హితుల మయ్యెదమె యాశీవిషం
బుల నలిగించి కంఠసమీపంబున విడుచునట్లు వారల విడిచి పుచ్చి కర్జంబు
దప్పితిమి. 272

ఉ. భూవిదితప్రతాపపరిభూతవిపక్షుఁడు సవ్యసాచి గాం
డీవము గొన్న భీముఁడు వడిన్ గద గొన్నఁ గవల్ కృపాణచ
ర్మావరణాదిభాసిత మహోభుజవిక్రము లైన వారలన్
లావె రణంబులో మన కలంఘ్యబలాఢ్యుల నింక నోర్వఁగన్. 273

వ. కావున వారల మరల ననుద్యూతంబునఁ బరాజితులం గావించి విరళదేశ
నిర్వాసితులం జేయుట కార్యం బనినవిని ధృతరాష్ట్రుం డొడంబడి యప్పుడ
యనుద్యూతార్థంబు ధర్మనందనుం దోడితేరం బ్రాతికామిం బంచినం బితృ
నియోగంబును విధి నియోగంబు నతిక్రమింప నగునే యని. 274

క. నృపవరుఁ డనుజులుఁ దానును. ద్రుపద తనూజయుఁ బ్రియంబుతో
నరిగెనుహ
స్తిపురంబునకు నశేష, స్వపక్షజనహృదయములకు సంతాపముగన్.

వ. అం దెప్పటియట్ల ధృతరాష్ట్రి నిర్మితసభాసీను లై యున్నంత నభిమతా
క్షుం డైన శకునికితవుండు ధర్మరాజున కి ట్లనియె. 276

క. ధనసంపద రాజ్యంబున, దినకరతేజుండు మిమ్ము ధృతరాష్ట్రుఁడు పెం
పునఁ బూజించెం గావునఁ, జన దింకను వాని నొడ్డి సరిక్రీడింపన్. 277

వ. ఇది యపూర్వం బైనపణంబు దీని నొడ్డి యోటువడినవార లజినవల్కలం
బులు గట్టి వన్యమూలఫలాశను లై బ్రహ్మచర్యంబునం బన్రెండేండ్లు
వనవాసంబు సేసి పదుమూఁడగునేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబు
సేసి యం దెఱుంగంబడిరేని వెండియుం బన్రెండేండ్లు వనవాసంబు
నొక్కయేఁ డజ్ఞాతవాసంబుఁ జేయు చుండువా రిట్లొపుదేని జూదం
బాడుద మనిన ననుద్యూతార్థం బాహూతుండ నై మగుడ నగునే యని.

ధర్మరాజు శకునితో రెండవమాఱు జూదం బాడుట

క. ధర్మసుతుఁ డోడ్డి శకుని క, ధర్మస్థితి నోటువడియె దైవముచెయుదిన్
నిర్మిత మయినశుభాశుభ, కర్మఫలం బెట్లు దేహి గడవఁగ నేర్చున్. 279

వ. అంత ననుద్యూతపరాజితు లయినపాండవులు దమరాజ్యోపభోగంబులు విడిచి విప్రసుహృద్బాంధవజనానుగమ్యమాను లయి వనంబునకుంబోవ సమకట్టి భీష్మ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాచార్యుల నామంత్రించిన విదురుం డిట్లనియె.

క, వనవాసపరిక్లేశంబున కోపదు కుంతిదేవి భోజాత్మజ గా
వున నాగృహమున నుండెడు, ననవరతము భక్తితో మనభ్యర్చిత యై.

సీ. ధర్మజ్ఞుఁడవు నీవు పేర్మిఁ బరాక్రమఘనుఁడు భీముం డింద్రతనయుఁ డఖిల
యుద్ధవిశారదుం డిద్ధయశోనిధి నకులుఁ డర్థాఢ్యుండు ప్రకటబుద్ధి
నెంతయు సంయమవంతుఁడు సహదేవుఁ డధ్యాత్మవిద్యా నారాధ్యుఁ డెందు
ననఘుండు ధౌమ్యుండు సనుతార్థధర్మంబులందు విచక్షణ సుందరాంగి

ఆ. ద్రుపదతనయ యిట్లు విపులగుణాళి న. న్యోన్యహితుల రగుట నన్యు లుర్వి
నాదరింపఁగాక భేదింప నోపెడు, వారు గలరె మిమ్ము ధీరమతుల. 282

వ. మఱియుఁ గృష్ణద్వైపాయనుచేత శిక్షితులరు, నారదుచేత రక్షితులరు, మీకుం బురోహితుండు ధౌమ్యుండు, దైవమానుషసంపన్నులరుఁ, బల పరాక్రమంబులం జేసి రాజులను ధర్మచరితంబునం జేసి ఋషులును మహత్త్వంబునం జేసి కుబేర వాసవాదులను జయించినవారలరు, మిమ్ము భూమియు గాడ్పును జంద్రాదిత్యులు నెల్ల కాలము రక్షించుచు నుండెడు మెల్ల కార్యంబులయందును నప్రమత్తులరయి వర్తిల్లునది భవత్పునర్దర్శన మయ్యెడు, మరుగుం డని కఱపిన గురు వృద్ధానుమతంబునం దమతల్లి చరణంబులకు మ్రొక్కి నం గొడుకుల. 283

సీ. అధికలజ్జావనతాస్యుల నపగతాభరణాంబరుల ధర్మపరుల నజిన
వల్కలధారుల వరమునివేషులఁ బాండుకుమారుల భానునిభులఁ
జూచి దుఃఖిత యయి సుతులార! యిట్టిదుర్వ్యసనోపహతు లైనవారి మిమ్ముఁ
జూడక ముందఱ సురలోకమున కేఁగి పాండుభూపతి పుణ్యభాగి యయ్యె

తే. భక్తిఁ బతితోన పోవఁ దపంబు సేసె, మాద్రి యే నేల పోవక మందభాగ్య
నయితి నని విలాపించుచు నపుడు గుంతి, యేడ్చె దుఃఖితు లగుచుండ
నెల్ల వారు.

వ. మఱియును. 285

మత్తకోకిలము. వీర లిట్టు లనాథులై మునివృత్తి నుండెడివారె హా
ద్వారకాపురనాథ! కేశవ! దైత్యభేది! భవత్పదాం
భోరుహాశ్రితులైనవీరలఁ బూని కావక యుండఁగా
ధారుణీధర! నీకు ధర్మమె ధర్మనిర్మలమానసా!

తరలము. అమితసత్త్వులు ధర్మమూర్తు లహర్పతిప్రతిముల్ రిపు
ద్రుమహుతాశను లాపగేయుఁడు ద్రోణుఁడున్ విదురుండు గౌ
తముఁడు నుండఁగ ధర్మమార్గము దప్పఁ బాడియె పాండవో
త్తములు రాష్ట్రనిరాసయోగ్యులె ధార్తరాష్ట్రులవంచనన్. 287

క. అన్న సహదేవ! నీవును, నన్నలతో నరిగె దయ్య యట యడవుల కీ
వున్నను సుతు లందఱు నిం,దున్నట్టుల నాకుఁ జిత్త మూఱడి యుండున్.

వ. అనుచు శోకాక్రాంత యయి కుంతీదేవి దనకు వినయవినమితోత్తమాంగ
యయినపాంచాలిం జూచి బాష్పజలంబు లురుల ని ట్లనియె. 289

క. ధవళాక్షి! నీకతంబునఁ, బవిత్రమై ద్రుపదకులముఁ బాండుకులంబున్
భువనముల వెలిఁగె నీవు,ద్భవ మౌటను జొచ్చుటను శుభస్థితితోడన్. 290

ఆ. పురుషవృషభు లయినపురుషులతోడన, యరిగి పరమభక్తిఁ బరిచరింపఁ
బోవఁ గనుట నీవు పుణ్యంబు సేసితి, వంచు బ్రీతిఁ గౌఁగిలించుకొనియె.

వ. అని యిట్లు కోడలిం గొడుకులను దీవించి కుంతీదేవి విదురుగృహంబున
నుండె నంత.

ఆ. పతులపిఱుఁద మందగతి ముక్తకేశి యై, పోవుదాని ద్రుపదపుత్త్రిఁ జూచి
యంతఁ గౌరవేంద్రునంతిపురంబున, వారలెల్లఁ దలలు వాంచి రడలి.

ఆ. ధర్మతనయుపిలుపుఁ దమ్ములు నలువురు, నరుగుచుండి తత్సభాంతరమున
జనులు వినుచు నుండ సంభృతక్రోధులై, పలికి రధికపరుషభాషణముల. 294

క. సాహసమున మద్బాహుగ,దాహతి దుర్యోధనాదు లగురిపుల జగ
ద్ద్రోహులఁ జంపుదు నత్యు,గ్రాహవమున హరిహరాదు లడ్డం బైనన్.

ఆ. *దుష్టచిత్తుఁ డయినకష్టు దుర్యోధను, శిరము దన్ను వాఁడ ధరణిఁగూల్చి
హీనుఁడైన దుస్ససేనుని వధియించి, వేడిరక్త మాను వాఁడఁ గడఁగి. 296

మ. కనకోర్వీధరసానుసారరుచిమద్గాండీవనిర్ముక్తప
త్త్రినిపీతారుణవారిశేషముఁ బతత్త్రివ్రాతముల్ ద్రావున
య్యని నాతోఁడఁ జతుర్దశాబ్దమున మా కై పోరుకర్ణాదిదు
ర్జనసంఘంబుల మార్తురం దునుముదున్ సంగ్రామరంగంబునన్. 297

క. మాయాద్యూతంబునని, జ్జేయులఁగా మమ్ము నిట్లు సేసినఖలు న
న్యాయపరు శకుని నస్మ,త్ప్రాయక జితహస్తుఁ జేసి చంపుదు మాజిన్. 298

వ. అని భీమార్జుననకులసహదేవులును విజృంభించి కృతప్రతిజ్ఞులై రట్లు పాండవులు పరిత్యక్తవిభవు లయి నిజాయుధంబులు ధరించి గజపురంబు వెలువడి రంత.

సీ. ధృతరాష్ట్రవిభుని మందిరమున నఱచుచుఁ బఱచె గోమాయువుల్ పట్టపగల
యప్రదక్షిణముగా నయ్యె నుల్కాపాత మపమేఘ మైయున్న యంబరమున
విద్యుత్సహస్రముల్ విలసిల్లె మఱి రాహుపర్వంబు గాకయ భానుఁ బట్టె
భూకంప మయ్యె నప్పుడు సభాంతరమున పరులెల్ల వినుచుండ నారదుండు

ఆ. పలికె నద్భుతముగఁ బదునాలుగవయేఁడు. భారతాజి యగు నపారవీరు
లయిన పాండవులు జయంబందుదురు భీమ, మఘవసుతుల విక్రమమున ననుచు.

---

* ఈపద్యము పెక్కువ్రాఁతప్రతులలో లేదు.

వ. ధృతరాష్ట్రుండును దాని నంతయు విని కొడుకుల దుర్ణయంబుల నింక నెట్టియరిష్టంబులు పుట్టెడునో యనివగచుచు విదురుం బిలిచి ధౌమ్య ద్రౌపదీసహితులయిన పాండవు లెట్లువోయి రని యడిగిన నతనికి విదురుం డిట్లనియె. 301

విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ బాండవు లడవికిఁ బోయినరీతిని జెప్పుట

సీ. వదనసరోజంబు వస్త్రాంతమునఁగప్పికొని యేఁగె ధర్మనందనుఁడు మఱియు
భీమబాహులు రెండుఁ బెద్దలుగాఁ జాచి ఘనసత్త్వుఁ డమ్మరు త్తనయుఁ డరిగె
నిసుము చల్లుచు సమరేంద్రపుత్త్రుఁడు వోయె ధూరేణులిప్తశరీరుఁడగుచు
నకులుండు చనియె మానక లజ్జఁజేసి యధోవక్త్రుఁడై సహదేవుఁ డరిగె

ఆ. వివృతకేశభరము వ్రేలంగ ద్రౌపది,చనియె రౌద్రయామ్యసామగాన
ముఖరితాస్యుఁడగుచు మ్రోల ధౌమ్యుం డేఁగె, సకలజనులు శోక జలధిఁ దేల.

వ. అనిన నట్లేల వార లరిగి రని యడిగిన విదురుం డిట్లనియె. 303

క. నీ కొడుకు నికృతిఁ జేసి య,పాకృతరాజ్యుఁ డయి ధర్మపతి నిజరూపా
లోకనజనదాహభయ, వ్యాకులుఁడై చనియె దృష్టి వారించి వడిన్. 204

క. సమరమున బాహుబలదర్పము మెఱయం గంటి ననుచు బాహు లతివిశా
లములుగఁ జేయుచు నరిగెను, సమీరజుఁ డరాతిభీతిసంజననుం డై. 305

క. వెఱచఱవ నింతకంటెం, దఱుచుగ బాణంబు లేసి తడయక పగఱం
జెఱుతు నని యిసుముచల్లుచు, నుఱక ధనంజయుఁడు రణజయోన్నతుఁ డరిగెన్.

వ. మఱి దుఃఖానుభవంబున కనుచితం బైన తనసుందరరూపంబు సూచి జనులు దుఃఖింప కుండవలయు నని ధూళిధూసరితశరీరుం డై నకులుం డరిగె దీనం బైన తనయాననంబు సూచినవారికి నెల్ల నెగ్గగు నని యవనత వదనుం డయి సహదేవుం డరిగె. 307

చ. తడిసినయేకవస్త్రపరిధానముతోడ విముక్తకేశియై
తొడరుచు దుఃఖభావమున ద్రోవది వోయె మహాహవంబునం
బడిన నిజేశమిత్రసుతబంధుజనంబుల శోకవేదనం
గడుకొని యట్ల యేఁగుదురు కౌరవభామిను లవ్విధంబునన్. 308

క. భారతరణహతు లగుకురు, శూరుల పరలోకవిధులు సూచించి క్రియా
పారగుఁడు ధౌమ్యుఁ డరిగె వి,చారజ్ఞుఁడు రౌద్రయామ్యసామోద్గీతిన్.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు దుఃఖితుం డయి. 310

తరలము. సమరశూరులు పాండవుల్ జితశత్రు లున్నతచిత్తులు
త్తములు వారలతోడివైరము ధర్మయుక్తిఁ గరం బయు
క్తము ప్రజాక్షయ కారణం బని తద్దయున్ భయ మందుచున్
విమనుఁడై పడి యుండె హా యని వెచ్చ నూర్చుచు విన్నఁడై. 311

వ. అట్లు వగచు చున్న ధృతరాష్ట్రునకు సంజయుం డి ట్లనియె. 312

సీ. పాండుకుమారులఁ బరమధార్మికు లని వగవక రాష్ట్రంబువలనఁ బాపి
వసుపూర్ణ మైనయివ్వసుమతి సేకొంటి వసుధేశ! నీ కింక వగవ నేల
కలశజ విదుర గంగాసుత ప్రభృతులు వారింప వారింప వశము గాక
కర్ణగాంధారుల కఱపులు విని వారి కపకారి యయ్యె నీ యాత్మజుండు

ఆ. వగవ కధికు లయినవారితో వైరంబు సేసికొంటి కరము చెట్ట యనక
నీవు నీ సుతుండు నేర్తురు గా కొరు, లేమి సేయ నేర్తు రిందుకులుఁడ!

వ. అని సంజయుండు పలికిన విని విదురుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 314

తరలము. వగవ నేటికి నింకనైనను వారలం బిలిపించి యీ
జగతి నెప్పటియట్ల యేలుచు సంతసంబున నుండఁగా
జగదధీశ్వర! పంపు వంచన చన్నె యన్యుల సంపదల్
మిగిలి చేకొన నిట్లు సేసిన మెత్తురే మది నుత్తముల్. 315

ఆ. అనిన విదురుపలుకు లా ధృతరాష్ట్రుండు, వినియు విననియట్లు విపినవాస
గతులఁ బాండుసుతులఁ గ్రమ్మఱింపకయుపేక్షించెఁ బూర్వవిహిత
కిల్బిషమున.

వ. మఱియు ద్రోణుండు పాండవులకు నెయ్యుం డయ్యును దొల్లి యాజోప
యాజుల వరంబున నగ్నికుండంబున నుద్భవిల్లిన ద్రుపదాత్మజుండు ధృష్ట
ద్యుమ్నుండు పాండవసంబంధి యయి ప్రతివీరుం డగుట నాతనితోడనకు
సమరం బగు నని యెఱింగి పాండవానుగమనంబు సేయ నొల్లక గజపురం
బున ధృతరాష్ట్రునొద్దన యుండె నిట్లింద్రప్రస్థపురంబున నిరువదిమూఁ
డేఁడులు రాజ్యంబు సేసి పాండవులు పాపద్యూతపరాజితులయి. 317

క. వీరు లగుపాండుసుతులు మ,హారణ్యనివాసనిరతు లయి ధరణీబృం
దారకసహస్రములతోఁ. సారమతుల్ సనిరి నిత్యసత్యవ్రతులై. 318

క. అని యిట్లు సభాపర్వం,బునకథ జనమేజయునకు మొగి వైశంపా
యనుచెప్పినవిధ మంతయు, మనునిభశుభచరిత! నిత్యమహిమాతిశయా.

రథోద్ధతము. హారహీరధవళాంశునిర్మలో,దారకీర్తి రణదర్ప సద్గుణా
వైరివీరరసవైద్య మన్మథా,కార ధీర పరగండభైరవా. 320

క. కరుణావతార ధరణీ, సురవరసురభూజ రాజసుందర నయబం
ధుర ధర్మధురంధర మం,దరధైర్య సుహృన్నిధాన దానవినోదీ. 321

ఉత్సాహము, రాజవంశవార్ధిచంద్ర రాజదేవ నిత్యల
క్ష్మీజయాభిరామ ధర్మమిత్ర మిత్రవిద్వదం
భోజవనపయోజమిత్త్రి భూరికీర్తి కౌముదీ
రాజితత్రిలోక నిఖిలరాజ నిత్యపూజితా. 322

గద్యము. ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బయిన శ్రీమహాభార
తంబునందు సభాపర్వంబున నర్ఘ్యాభిహరణంబును శిశుపాలవధయును రాజ
సూయవిభూతికి దుఃఖితుం డై సభాస్ఖలితుం డై యున్న దుర్యోధనుం
జూచి ద్రౌపదీభీమసేనులు నగుటయు రాజసూయవిభూతి సూచి సహింపక
దుర్యోధనుండు జూదం బొనర్చుటయు నందు శకునికైతవంబున ధర్మరాజ
పరాజయంబును ద్యూతదుఃఖార్ణవమగ్ను లయినపాండవులం బాంచాలి
యుద్ధరించుటయుఁ బునర్ద్యూతపరాజితులయి పాండవులు వనవాసగతు
లగుటయు నన్నది సర్వంబును ద్వితీయాశ్వాసము.

సభాపర్వము సమాప్తము.

Murali
POWER PRESS
HYDERABAD